# ది రిలేషన్స్




శ్రీశ్రీశ్రీ గురువిశ్వస్ఫూర్తి

# ది రిలేషన్స్

రచన

## శ్రీశ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి


## స్ఫూర్తి పబ్లికేషన్స్

నెం. 8, సూర్య అపార్ట్‌మెంట్స్, కాంధారీ ప్రక్క సందు
రెవెన్యూ కాలనీ, విజయవాడ - 10.   ఫోన్: 6666677
Email : tiruviswa@gmail.com, Website : viswainfo.com

# వివరణము
## (The Specification)

The word 'relation' reveals the common meaning of the kinship (చుట్టరికం), the affinity (బంధుత్వం), the consanguinity (జ్ఞాతిత్వం/ రక్తసంబంధం) and the congnation (సజాతీయత)... కొన్ని జీవజాతులలో యీ సంబంధాలు ఒకమేరకు వున్నప్పటికీ... మానవ సమాజ రీతిలో వీటి స్పష్టత ఎక్కువగా వుంటుంది.

ప్రేమ (Love), ఆత్మీయత (Compassion), వాత్సల్యం (Affection), కామము (Concupiscense/Lust), మోహము (Fascination/Infatuation)... యిలా వీటి మంచి–చెడు, పర్యవసనాలు, వాటి స్వరూప స్వభావాలు ఎలావున్నా, మానవుల మధ్య సంబంధాలు, బంధాలకు యివి ముఖ్య కారణాలుగ వున్నాయి... ఇష్టం–అయిష్టం; అపేక్ష–ఉపేక్ష; అనురాగము–విరాగము; అనురక్తి–విరక్తి; ప్రేమ–పగ;... యిలా పరస్పర విరుద్ధ ద్వంద్వ పరిణామాలు... ముందుగా అనుకున్నా, అలా అనుకోకపోయినా... కొన్ని అనుకూల–వ్యతిరేక పరిస్థితులలో ఆయా సంబంధాల మధ్య సంభవిస్తూ వుండవచ్చు. అందుకు “ఊహలు”–వాస్తవాలు; అవసరాలు–అపోహలు; ప్రేమ–భ్రమ; వీటికి తోడు అప్పటి పరిసరాలు, పరిస్థితులు, మానసిక స్థితి–గతి హేతువులుగా పనిచేస్తాయి. కొన్ని సందర్భాలలో విషయం చిన్నదైనా, ఊహల అంచనాలతో దానిని వృద్ధి చేసుకోవడం బుద్ధిజీవులకు చెడ్డ రిమార్కే సుమా! కలహరహితంగా కలిసి సంభాషించుకుంటే కలవని మనసులు కొన్ని సమీపాని కొస్తాయి. అయితే అప్పటికి కావలసింది వ్యక్తిగత ‘యిగో’ను

కాసేపు తప్పించడమే!... ఆవేశరహిత ఆలోచన, ఆందోళనలేని అవగహన, తొట్రుపాటు, తొందరపాటులేని నిగ్రహ మనసుతో వాస్తవం కోసం వెయిట్ అండ్ సీ (Wait and see) తరహాలో యత్నిస్తే... రిలేషన్ విచ్ఛిన్నతను నిరోధించవచ్చు. పరస్పర నమ్మకం, విశ్వాసం, క్షమ (Patience), దమ (Fortitide), ప్రమ (True knowledge)... ఇవి వ్యక్తిత్వానికి అలంకారాలుగా వుండాలి.

పుట్టుక నుండి – వృద్ధాప్యం వరకూ వయసురీత్యా మానవ జీవితం వివిధ దశలను దాటుకుంటూ పోతుంది. కనుక, తత్సంబంధ రిలేషన్స్‌లో కూడా వాటి స్వరూప స్వభావాలు మారిపోతూవుంటాయి. ఇది ప్రకృతి ధర్మం; ధిక్కారానికి చోటు లేదు. వయస్సు మళ్ళినవారు ఎప్పటికప్పుడు యీ వాస్తవాన్ని గుర్తించి, గ్రహించి పరిస్థితులతో సర్దుకుపోవాలిగాని, వయస్సులో తమ గతం “ఘనత”తో యువతను విసిగించకూడదు. రిలేష్‌న్ పట్ల వారికి విరక్తిని కలిగించకూడదు...

అనుమానం – ఆవేదన నిత్యజీవిత వ్యక్తిగతమేకాదు. ప్రాంతీయంగా, దేశీయంగా,అంతర్జాతీయంగా దీని పరిధి వ్యాప్తమైవుంది. అందుకే, పేరుకు గ్లోబలైజేషన్ అంటున్నా... ప్రాంతాలు – దేశాల మధ్య సత్సంబంధాలు చిట్లిపోతున్నాయి, శతృత్వాలు సుస్థాపితమవుతున్నాయి... సాధారణంగా మనసు అనుమానానికి అమ్ముడుపోయినప్పుడు మనిషికి మిగిలేది

మనోవేదనే! దీని పరిణామం మనిషిని మృగ స్థాయికి చేర్చవచ్చు; విచక్షణ రహితంగా, వివేక శూన్యంగా ప్రవర్తించవచ్చు. ఏమైనా మనిషి మనసుకు పరికరమయ్యేకంటే... మనసును, బుద్ధిని తన స్వాధీనం చేసుకోగలిగినప్పుడు నిగ్రహత, నిశ్చలత జీవితానికి లభిస్తాయి. మాట పట్టుదల –మనసు బెట్టుసరికంటె, పట్టుగా సమస్యను మట్టం చేసుకోవాలనే దృఢ దీక్షతో, నిర్ణయంతో కృషి చేస్తే మనుష్యుల మధ్య రిలేషన్స్ దృఢంగా నిలిచి వుంటాయి.

'ఎటాచ్‌మెంట్' అనేది రిలేషన్‌కు కాస్త భిన్నమైనది. The immersion or the depth of the relationship may be the attachment. ఎటాచ్‌మెంట్ –డిటాచ్‌మెంట్ అనేవి ఎక్కువుగా వేదాంత ఉపన్యాసాలలో వినిపిస్తున్నా... వాటికి సంబంధించి ఊహాజనిత ఉదాహరణలు, వివరణలకంటే వాటి సాధ్యాసాధ్యాల నిర్మాణాత్మక విశ్లేషణ ఉపయుక్తంగా వుంటుంది. మ్యూచువల్ అండర్‌స్టాండింగ్... కో–ఆర్డినేట్, కో–ఆపరేషన్‌లు వ్యక్తిసంబంధ సమస్యలకైనా... అంతర్జాతీయ స్థాయిలోనైనా శాంతి సామరస్యతలకు యివి సహకరిస్తాయి; జాతి, మత, వ్యక్తిగత ద్వేషం కంటే ఇవి మానవత, మమత స్థాపనతో మానవజాతికి మేలు చేస్తాయి... If the mind of the moral sanctity operates aptly... any kind of relation would be in the elevation of the amiability and (the) reliability instead of the ambignity and malignity. కుటుంబ – సామాజిక రిలేషన్స్‌తో పాటు భౌతిక – ఆధ్యాత్మిక రిలేషన్‌గా జీవాత్మ (The mind of the

individual self) ను ధ్యానం ద్వారా అంతఃకరణ (intuition) తో సంబంధ సన్నిహితాన్ని యేర్పాటు చేసుకోవడం ద్వారా జీవిత సమన్వయతకు, సమగ్రతకు మార్గం వుంటుంది. The relation with the spiritual dignitiy may be a virtual way of life...

Thus, the vis of wisdom bestows the bliss of the supreme being/the supreme spirit... by means of achieving the absolute...

స్క్రిప్ట్‌గా నేనిచ్చిన దాన్ని పుస్తకంగా మీకందించే వారికి, అందుకు వారికి సహకరించినవారికి... ఆశీస్సులు...

**- విశ్వస్ఫూర్తి**

# నిశ్శబ్ద శబ్దచిత్రాలు

**పురాణపండ రంగనాథ్**

రచయిత మరియు జర్నలిస్ట్, విజయవాడ

ఆధునిక మానవుడి సంక్లిష్ట భావ సంఘర్షణలకు,అనుభవాలకు, సమస్యలకు, ఆచరణలో తలెత్తుతున్న సమన్వయ లోపానికీ మధ్య జరుగుతున్న నిత్య ఆలోచనల సమరానికి యీ 'రిలేషన్స్' నిశ్శబ్ద శబ్దచిత్రాలు! ఆలోచనలకి, నైతిక విలువలకు, సమాజంలో ఎదురయ్యే వాస్తవ విషయాలకు, ఆచరణ విలువల ఉల్బణానికీ మధ్య జరుగుతున్న నిరంతర మానసిక పోరాటాలకు యీ 'రిలేషన్స్' నిశ్శబ్ద శబ్దచిత్రాలు! మనలో, మన సమాజంలో అడుగడుగునా కనిపించే వైరుధ్యాలకు, వైరుధ్యాల మధ్య సమన్వయానికీ మధ్య సంఘటిల్లుతున్న ధర్మ, కర్మల కురుక్షేత్రానికి ఈ 'రిలేషన్స్' నిశ్శబ్ద శబ్దచిత్రాలు!

a a a

శృంగారానికి, సెక్స్‌కి, విశృంఖల లైంగిక ప్రవర్తనలకూ హద్దులు, నీతి నియమాలు పాటించని ఒక విచిత్ర మనో భూమికలో జరిగిన, జరుగుతున్న, జరిగే ఆలోచనా సంఘర్షణకు యివి నిశ్శబ్ద శబ్దచిత్రాలు. పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరి దశలు ఆధ్యాత్మికంగా, ఆధిదైవికంగా, ఆధిభౌతికంగా అభివ్యక్తమవుతున్నవి. అవి మన జీవితంలో అన్ని రంగాలకు వర్తిస్తాయి. భౌతిక జీవనానికి ఆలోచనా

రంగానికి సమాజ నియమాలకి వైయక్తిక. నియమాలకి, సమాజ మర్యాదలకి, కౌటుంబిక నియమాలకీ సంఘర్షణ అనివార్యంగా జరుగుతున్నది.

a a a

వివాహబంధం సున్నిత భావానుబంధం. అది తెంపుకోవలసి వచ్చినప్పుడు వినిపించని పుటుక్కు శబ్దంలాంటిదన్నమాట. ఆలోచించండి! అనివార్యమైన మార్పులో రాజీ ఎంతవరకూ అవసరమో పరికించండి. ఆత్మగా, దివ్యాత్మగా, ఆధ్యాత్మిక విశ్వాత్మగా ఎదగటం నేర్చుకోండి. అదే 'ది రిలేషన్స్' గీతాసార దృశ్యము.

a a a

ఆడది బ్రతికినంతకాలం మగవాడికి కాపురం చేస్తూనే ఉండాలా? వికారం మహర్షినైనా, రాజర్షినైనా రజోగుణంలోకి నెట్టి తమోగుణంలో వదిలేస్తుంది. ఈ త్రిగుణ భావ యాత్ర 'ది రిలేషన్స్'లో రెండవ శబ్దచిత్రం. న్యూనతా భావాన్ని వదిలి వినయ వివేకాలు, ఆత్మ విశ్వాసం, స్వతంత్ర భావం ప్రతి మనిషికీ అవసరమని ఆవిష్కరించే గొప్ప అనుభవ చిత్రం మూడవ ప్రకరణం. దాంపత్యంలోని లీగాల్టీ వెనుక వున్న ంతరార్థాన్ని, పగలు వంటిల్లు, రాత్రి పడకటిల్లు, మధ్యలో పిల్లల చాకిరీ – వీటి నుంచి విముక్తి లేదా! అనే స్వేఛా భావుక పావురానికి వెన్నెల రెక్క 'ది రిలేషన్స్' నాలుగవ పాఠం. ఆడవాళ్ళు మౌనంగా ఉండటం, మగవాళ్ళు కవ్వించటం

మామూలు విషయం. అది ఇప్పుడు రివర్స్‌లో వుంది అనే భావసంకుల సమరంలో సంఘర్షించండి. నా అసలు మీలో ఉంచి, మీ నకిలీని నేను తీసుకొన్నానేమో ఆలోచించండి. సమాధానం దొరుకుతుంది. ఆశలేని అభిలాష, స్వార్థం తెలియని తపన ఉంటే వాయుపుత్రుని హృదిలో రామ ప్రతిష్ట జరగదా! 'ది రిలేషన్స్' అయిదవ ప్రకరణం ఎంత హృదయ మర్మ స్పర్శి.

a a a

తెలియదు మనుషులకు ప్రేమ, తెలియును నరులకు స్వార్థం. పురుష రోషం, మగ తెగింపు ఇలాంటి కొత్త భావాల అంకురాలు ఆరో ప్రకరణం అందిస్తుంది. ఆడదానిగా నా భయం నాకుంటుంది. మనిద్దరి మధ్య సంతాన సంబంధం ఉంది కానీ సమాజ సమ్మతి లేదు కదా! ఈ ప్రశ్న కుంతి కాలం నుంచి, బైబిలు కాలం నుంచీ ఉన్నదే కదా! ఆలోచించండి. దేనికైనా డిఫెండింగ్ వాదన ఉంటుంది. లీగాలిటీ మాటెలాఉన్నా, మనిషికి అంతరాత్మ సాక్షిగా సమాజ నీతి ఉండాలని బోధిస్తుంది ఏడవ ప్రకరణం. సెక్స్ సుఖానికి సంసారిక బాధ్యతలను జోడించిన నాగరికత మార్గంలో గృహస్థ ధర్మం ఉండగా అనే సమాశ్వాసన ఇస్తుంది మథించండి. నమ్మకానికి కూడా ఎంతో కొంత నిజం ఉండాలి అనే బోధన ఎనిమిదవ ప్రకరణంలో చక్కగా చేసారు. "అక్కా! నీకు గుర్తుందా నీకూ నాకూ తినమని అమ్మ ఏదైనా పెడితే ముందుగానే

నావంతు నేను తినేస్తే, నీవంతులో సగం నాకు పెట్టేదానివి”. ఎంత అందమైన భావానుబంధం ఎనిమిదవ ‘రిలేషన్స్’ మనోస్పర్శి. తొమ్మిదవ దృశ్యం చిరంతనం నా భర్త పేదవాడు కావచ్చు కాని పిరికివాడు కాదు. తగిన ఉద్యోగం లేదు కానీ చాలా తెలివైనవాడు.

a a a

అలనాడు చార్వాకుడి దగ్గర నుంచి మధ్య యుగంలో ఉమర్ ఖయ్యాం, ఆధునిక శకంలో చలం, లతల స్వేచ్ఛా ప్రణయం, రాయప్రోలువారి అమలిన శృంగార భావాల వరకు, నేటి నవీన, ఆధునికానంతర భావజాలపు గారడీ అంతా ఈ నిశ్శబ్ద శబ్దచిత్రాల వెలుగు నీడలమయం. తెలివైన భార్య తెరచాపలాంటిది సంసార నావకు! కుటుంబ బాధ్యత ద్వారానే సమాజ బాధ్యత ఏర్పడుతుంది అని అనుభవ పూర్వకంగా బోధించే అక్షర దృశ్యం పదవ ప్రకరణం. మన ఊహల్లో ఉన్న ఇలాంటి ఎన్నో ఆలోచనల్ని, అనుభవాల్ని ఆవిష్కరించారు. వీటిని దృశ్య కావ్యాలు (నాటకం, సినిమా, టి.వి. ఎపిసోడ్‌లు) గా నిర్మిస్తే మరింత ప్రయోజనం ఉంటుందని నా ఆశంస. నాచేతే రాయిస్తారని పేరాశ... కాదు... నా అక్షరాల శ్వాస. శ్రీశ్రీశ్రీ పూజ్య పాద గురువిశ్వస్ఫూర్తిగారు యిటువంటి భావ సంపుటికి యింత ప్రాధాన్యం యిచ్చి ఇన్ని పుటలలో అంతగా యిది రాయాలా అనిపించే ఆలోచనా సంఘర్షణకు బీజం వేసేదే ఈ ‘ది రిలేషన్స్’. బంధాలు, భవబంధాలు,

భావానుబంధాలు ఇవన్నీ ఒక నిరంతర "రిరంస".

a a a

రిరంస...

ఇది చాలా మారుమూల పదం. ఎంతో గహనమైన, ఆర్ద్రమైన, బరువైన, గరిమార్థం గల పదం. పశుప్రవృత్తి వంటి కామ ప్రకోపం అర్ధం నుంచి ఆధ్యాత్మికోన్నతమైన, అత్యున్నత సున్నిత అన్వేషణాపరమైన, జిజ్ఞాసువైన మనిషి మెదడు పొరలలోని శూన్యావరణం (Cerebral Hemisperes) లో జరిగే నిత్య నిరంతర గవేషణకు, తృప్తి తనివిలేని అన్వేషణకు, తృప్తిగా తృప్తి అనిపించిన భావార్తికి, స్పర్శార్తికి, స్పర్శ అంచున నిలిచే ఒక అనూహ్య నిట్టూర్పునకు, ప్రతి అనుభవం మరల మరల కావాలనిపించే దాహానికి "రిరంస" అని పేరు. అంటే మనిషి భోగలాలసలో, అన్వేషణలో, స్పర్శానుభావాల పౌనఃపున్యపు అభివ్యక్తి రిరంస అన్నమాట.

a a a

ఎంత వైవిధ్యం
ఎంత వైరుధ్యం
ఎంత వైశిష్ట్యం

భౌతికం అంతా వైవిధ్యం, భావం అంతా వైరుధ్యం, భవానుబంధం అయిన భావానుబంధం అంతా వైశిష్ట్యం. అలాంటి అంశాల్ని గురు విశ్వస్ఫూర్తిగారు స్పర్శించటమా!

అన్న ప్రశ్నకు సమాధానంకోసం ఈ “ది రిలేషన్స్” చదివి తీరాలి. అనుభవించి తీరాలి, అనుభూతించి తీరాలి. స్పర్శల తీరం తాకాలి, తెలుగు భాషకు ఇంతటి సులభ అభివ్యక్తి శక్తి ఉందా?

హీలియం వాయువు వలె తేలికగా, యురేనియం వంటి భార భావజాలాన్ని ఎగురవేసే అద్భుత శక్తి, వేగం తెలుగు పదానికి ఉందని తెలుసుకొందుకైనా చదవాలి ఈ ‘ది రిలేషన్స్’. కేవలం చదవటమే కాదు అనుభూతించుకోగలగాలి. అనుభూతిని స్పర్శించుకోగలగాలి అప్పుడే ఈ నిశ్శబ్ద చిత్రాలకు దృశ్యమాన స్పర్శమాన భూమికలో త్రీ.డి.(ముక్కోలతల) ఎఫెక్ట్.

a a a

ఇంకా రాయటం నా వాచాలత్వమే అవుతుందేమో? ఇప్పటికే అదుపులేని భావావేశం, ‘ది రిలేషన్స్’ చేసిన స్పందన కోలాహలం నా లక్ష్మణ రేఖను దాటించాయేమో! అందరికీ వినయ వందనం.

‘ది రిలేషన్స్’ మన అంతరంగపు రివలేషన్స్. రివలేషన్స్ ధైర్యంగా మనం చెప్పుకోలేని క్ష (×) కిరణ సదృశ్య రియలైజేషన్స్ అంతే… అంతే… అంతే…

ఓం తత్సత్
20-10-2004
విజయవాడ

**పురాణపండ రంగనాథ్**
(రచయిత మరియు జర్నలిస్ట్)

# ‘ది రిలేషన్స్’ లో మనమంతా...

డా॥ దుగ్గరాజు శ్రీనివాసరావు
ఫ్రీ లాన్సర్

‘రిలేషన్స్’ మహా సున్నితమైనవి. స్త్రీ పురుషుల ‘రిలేషన్’ మరింత సున్నితమైనది.

స్త్రీ, పురుషుడు కలిసి బ్రతకలేరు... విడివిడిగా వుండలేరు. ఒకరికొకరు కావాలి... ఒకరు లేనిదే మరొకరికి విలువలేదు, సమాజంలో గౌరవం లేదు. దూరంగా వుందామనుకున్నా వీలులేని ఆకర్షణ ప్రకృతి సహజంగా వారి మధ్య వుంది. ఆ ఆకర్షణకు గురికాని వారి సంఖ్య చాలా అరుదు. అలాగని ప్రేమలో పడితే; పోటీ ఆధిపత్యం కోసం ఎత్తుగడలు. ప్రేమను అంగీకరించిన జంటలు ఎంత త్వరగా తమ ‘రిలేషన్’ శాశ్వతం చేసుకుందామా అనే తహతహ ఆ తరువాత ఎందుకు కలిసుంటున్నాము అని ఆ ‘రిలేషన్’ని తిట్టుకోవటం.

ఇదే ప్రస్థుత పరిస్థితి.
ఇదే నేటి లోకం పోకడ.

దీని వలన వచ్చే ఆపదలు అందరూ గమనించినా... ఆ సంగతి బయటకు వివరించి, పది మందికీ పంచి, పరిష్కారం సూచించే శక్తిమంతులు ఒకరో ఇద్దరో వుంటారు. అటువంటి మహా వ్యక్తి శ్రీశ్రీశ్రీ గురువిశ్వస్ఫూర్తిగారు.

అనేక వందల సంవత్సరాలుగా సాగుతున్న వివాహ వ్యవస్థకు విలువ లేదనే కొత్త వాదన మొదలవుతున్నది. ఇది నిజమా! ఇందుకు కారకులు ఎవరు! మరెవరో కాదు... మనమే... మన మనసులను సక్రమ మార్గంలో నడిపించుకోలేనందునే ఇటువంటి ఇబ్బందులు పడుతున్నాం కాబట్టి నేడు 'మ్యారేజ్ కౌన్సిలర్స్' అవసరం పెరిగింది. 'మ్యారేజ్ కౌన్సిలింగ్' ఒక పెద్ద లాభసాటి వృత్తి అయింది. అటువంటి 'కౌన్సిలర్' అవసరం రానివ్వని పుస్తకం 'ది రిలేషన్స్'

నేటి యువత గుర్తించాల్సిన అనేక అంశాలు యిందులో వున్నాయి. ఇందులో శ్రీ గురువిశ్వస్ఫూర్తిగారు వాడిన పదాలు బహు చిన్నవి. కాని వాటిలో వున్న అర్థాలు అద్భుతం. 'నేడు సంపాదనకు, సమర్ధతకు స్త్రీ, పురుష భేదం లేదు' అని ఒక చోట, 'భర్తకు భార్య కేవలం భోగ వస్తువే కాదు; బాధ్యత గల జీవిత భాగస్వామిని' అని చెప్పి యువకుల కళ్ళు తెరిపించారు.

స్త్రీ, పురుష సంబంధాలకు విశ్వాసం పునాది. ఆ విషయం మరిచిపోయి భార్యలను వేధించే భర్తల మీద ఆయన విసిరిన విసురు', నీతి తప్పి, వ్యక్తిత్వాన్ని వదులుకున్న ఆడది, తప్పు చేయాలనుకుంటే భర్తతో సహా ఆ పనిని ఆపలేరు... ఆ ధ్యాసే మనసులో లేని స్త్రీని ఎవరూ... ఏవిధంగానూ తప్పు చేయించలేరు! ఆడ మనసును ఇంత సూక్ష్మంగా, స్వచ్ఛంగా మునుపు ఎవరైనా చెప్పారా? అనే సందేహం 'ది రిలేషన్స్' చదువుతుంటే కలుగుతుంది.

స్త్రీ పురుషుల మధ్య వుండే అన్ని రకాల సంబంధాలను, అన్ని కోణాల నుండి అత్యంత నిశితంగా పరిశీలించి, వడకట్టి మనకందించిన అక్షర నీరాజనం 'ది రిలేషన్స్'. ఈ పుస్తకం చదివిన తర్వాత మన లోపం ఏమిటో మనకు తెలుస్తుంది. ఎక్కడ విఫలమయ్యామో అర్ధమవుతుంది. ఎందుకు విఫలమయ్యాయో తెలుస్తుంది. మీ జీవనాన్ని మీ కళ్ళ ముందు తెచ్చి నిలబెట్టి... ఇదుగో ఇలా వెళితే నీవు బాగుపడతావు, నీ సంసారం బాగుపడుతుంది. అని చెప్పారు శ్రీశ్రీశ్రీ గురువిశ్వస్ఫూర్తి గారు. అన్ని సంసారాలు సంతోషంతో వుంటే సమాజం సుఖంగా వుంటుంది. సమాజం సుఖంగా వుంటే దేశం సుభిక్షంగా వుంటుంది. దేశాలు సుభిక్షంగా వుంటే మనుషులంతా మనుషులులా వుండగలుగుతారు. అందుకే 'ది రిలేషన్స్' మానవ సంబంధాలలో ప్రపంచ శాంతి నెలకొల్పే మార్గదర్శి.

సంక్లిష్టమైన 'రిలేషన్స్' మీద అత్యంత సరళంగా రాయగలగటం గురు విశ్వస్ఫూర్తి గారి నేర్పు. ఇందులో బోధన లేదు కాని సందేశం వుంది. ఆ సందేశం ఎవరు ఎవరికి యిస్తున్నారు! ఒక్కొక్క పాత్ర ఒక్కొక్క వాస్తవం బయట పెడుతుంది. అవి చదువుతుంటే ఎక్కడో చదువుకున్నట్లు, ఎవరితోనో చూసినట్లు అనిపిస్తుంది. ఎందుకంటే 'రిలేషన్' విశ్వవ్యాప్త సమస్య... ఈ సమస్యకు శ్రీశ్రీశ్రీ గురువిశ్వస్ఫూర్తి గారు చూపిన 'ది రిలేషన్స్' పరిష్కారం కూడా సర్వజన ఆమోదం పొంది తీరుతుంది.

ప్రేమలో పడిన వారికి, ప్రేమ సఫలం చేసుకోలేకపోయిన వారికి, సంసారంలో నిరాశతో బ్రతుకుతున్న వారికి, ఘర్షణ పడుతున్న భార్య భర్తలకు, విడిపోదామనుకుంటున్న దంపతులలకు... ఇలా ఒక్కరేమిటి వయసు ఏదైనా, మానసిక స్థితి ఎటువంటిదైనా స్త్రీ, పురుషులందరరూ తప్పనిసరిగా చదవాల్సిన 'మాన్యువల్' ఈ 'ది రిలేషన్' పుస్తకం.

చదివి మనమంతా మన 'రిలేషన్'లోని వాస్తవాలను తెలుసుకునేందుకు చక్కని మార్గం 'ది రిలేషన్స్'. ఈ పుస్తకంతో శ్రీశ్రీశ్రీ గురువిశ్వస్ఫూర్తిగారితో మీ 'రిలేషన్' మేలు చేస్తుంది. అందులో సందేహం లేదు.

డా॥ దుగ్గరాజు శ్రీనివాసరావు
ఫ్రీ లాన్సర్

# "చేరింది ఏదైనా చెదరక తప్పదు
# కూడింది ఏదైనా విడిపోక తప్పదు"

**పైడిపాటి ఉమానాధశర్మ**
ఆంధ్రభాషోపన్యాసకులు
శారదా కళాశాల, విజయవాడ

కార్యకారణ సంబంధమైనది ఈ జగత్తు. సృష్టి అంతా ఒక దానితో ఒకటి సంబంధం కలదే. ఈ సంబంధాలకు అనుబంధాన్ని అనుసంధించి, అదే ఆనందమని అనుకుంటున్నాడు సగటు మానవుడు. కళ్ళకు కనపడే, శరీరానికి సరిపడే ఈ ఆనందానికి ఆవలవున్న అపరిమిత ఆనందానికి మార్గోపదేశం గావిస్తున్నారు శ్రీశ్రీశ్రీ గురువిశ్వస్ఫూర్తిగారు ఈ గ్రంథంలో. దీని కోసం నిత్యం మనతో వుండే పాత్రలను, వాటి "రిలేషన్స్"ను ప్రాతిపదికగా చేసుకున్నారు. అన్నకు, తమ్ముడికి,– భార్య, భర్తకు – ప్రేయసికి, ప్రేమికునకు – నీతిమాలిన స్త్రీకి, పురుషునికీ వుండే "రిలేషన్స్" – వాటిలో వారు కూరుకుపోతున్న తీరు సవివరంగా తెలియజేస్తూ, ఇక్కడి నుండి జీవిని – మనిషికి, మనసుకు, బుద్ధికి, ఆత్మకు, దివ్యాత్మకు, విశ్వాత్మకు వుండే "రిలేషన్" వైపుకు తీసికెళ్ళి నిజమైన ఆనందాన్ని రుచి చూపించారు ఈ రచనలో గురుదేవులు. వీరే ఒక చోట అంటారు. "నిజానికి పుట్టుక – చావు మధ్యగల జీవితమే జీవిది, మనిషిది. మంచిగానో, చెడుగానో దానిని అనుభవించవలసినదే. అయితే

జీవితాన్ని సాధ్యమైనంత వరకు దుఃఖరహితం చేసుకోగలగడం మనిషి ప్రత్యేకత అని – ఆ దుఃఖరహితం చేసుకునే మార్గాన్ని మానవాళికి ఉపదేశించిన గ్రంథమే ఈ "రిలేషన్స్".

నిరంతర మార్పు సృష్టి ధర్మం. సూర్య చంద్రులు, దివారాత్రులు ఎలా అయితే నిరంతరం ఒక దాని వెనుక ఒకటి మారి వస్తుంటాయో అలాగే చావు పుట్టుకలు కూడా నిరంతరం మారుతుంటాయి. మాయలో పుట్టి, భ్రమలో బ్రతికి తనువు చాలిస్తున్న మనిషి జ్ఞానపథం వైపు పయనించాలి. ఈ జ్ఞానం రెండు రకాలు. అది ఒకటి భౌతిక జ్ఞానమైతే రెండవది ఆధ్యాత్మిక జ్ఞానం. మానవుడికి సహజసిద్ధంగా వుండే భౌతిక జ్ఞానం అనే పునాదిపై ఆధ్యాత్మిక జ్ఞానసౌధాన్ని నిర్మించ తలపెట్టారు గురుదేవులీ గ్రంథంలో. అందుకనే ఈ గ్రంథంలో సన్నివేశాలు, సంఘటనలు సగటు మానవుడి దైనందిన కృత్యాల ప్రాతిపదికైతే, సంభాషణలు మాత్రం అవరోహణ నుండి ఆరోహణ వైపు ప్రసరించాయి.

సగటు మానవుడికి జ్ఞానప్రస్థాన సోపానములు గురించిన అవగాహన పరిమితమై వుంది. తత్కారణం వలన గురుదేవులు ఆ సోపానములను సోదాహరణంగా, ఆకర్షణీయంగా చూపారీ గ్రంథంలో. జీవితం, కర్మ, విధి, ఇంద్రియములు, మనసు, బుద్ధి, అంతరింద్రియం, అంతరాత్మ, దివ్యాత్మ, విశ్వాత్మ, పరమాత్మ అనే సోపానముల విశిష్టత తెలియజేస్తూ ఒక దాని నుండి మరొక దానికి మానవుడు

ఎలా ప్రస్థానం చెయ్యాలో ఆయా సన్నివేశాలు, సంభాషణల ద్వారా అద్భుతంగా వివరించబడింది. చిన్న ఉదాహరణతో విశాలమైన అర్థ జ్ఞానాన్ని ప్రతిపాదిస్తారు గురువులు, చూడండి.

పెళ్ళికి ముందు ఎవరెవరో తెలియక పోయినా, వివాహమనే బంధంతో ఒకటై జీవనయానం చేశారు దంపతులు. అంతమాత్రం చేత ఈ బంధం శాశ్వతం కాదు గదా! భార్య భర్తను వదలి ముత్తైదువగా ముందే వెళ్ళిపోయింది. అలా వెళ్ళిపోయిన భార్యను తల్చుకుంటూ, అశాశ్వతమైన బంధాన్ని శాశ్వతంగా భావించుకుంటూ కుములుతున్న భర్తకు (తద్వారా సమాజానికి) మార్గోపదేశం చేస్తున్నారు. భార్యా భర్తల సంబంధం గృహధర్మం. ఇది వాస్తవం, జీవితం. కలిసి జీవించినంత మాత్రాన వారి బంధం శాశ్వతం కాదు. బ్రతికినంతకాలం జరిపించేది, సాగించేది "కర్మ". బ్రతుకు ముగించటం "విధి". బ్రతుకు ముగించిన మనిషి కోసం బ్రతికివున్న వాడికి చెల్లా చెదరయ్యేది "మనసు".

ఈ కర్మ సంబంధమైన మనసును, ఇంద్రియాలచేత ప్రేరేపించబడిన బుద్ధిని ఆత్మీకరించడం ద్వారా ఈ మనసు ఆధ్యాత్మిక స్థాయికి చేరుతుంది. అట్టి మనసు అంతరేంద్రియ, అంతరాత్మ సంబంధం కల్గి వాస్తవాన్ని గ్రహిస్తూ ధ్యానసాధనా ప్రస్థానంతో ఆత్మగా, దివ్యాత్మగా మారి విశ్వాత్మకు సన్నిహితమై, చివరకు శాశ్వతమైన పరబ్రహ్మానందాన్ని పొందుతుంది అంటారు గురు విశ్వస్ఫూర్తి.

సమాజంలో పెళ్ళిచేసుకుని, పిల్లలను కన్న తరువాత సంసార భారాన్ని మోయలేక, తప్పించుకోటానికి వైరాగ్యం, తపస్సు అనే పదాలు వల్లిస్తూ శుష్క వేదాంతాన్ని సుష్టుగా చెప్తుతుంటారు కొందరు. నువ్వు సంసారంలో కూరుకుపో, నేను సన్యాసి నవుతాననే భర్తలు కొందరు, ధ్యానం మీద దృష్టి నిలవాలంటే సంసారాన్ని పరిత్యజించాలనే వితండవాదులు మరికొందరు. వీరందరికీ కనువిప్పు కల్గిస్తారు మరోచోట గురుదేవులు ఈ గ్రంథంలో పుస్తక పఠనం చేప్తూ, అనుభవ జ్ఞానాన్ని పొంది, ఎప్పటి కప్పుడు వాస్తవాన్ని నిరూపించుకోవడమే జ్ఞానమంటే. దీనికి సంసార త్యాగంతో పనిలేదంటారు. మనసుకు శాంతినిచ్చి, సమస్యలను సాఫీగా పరిష్కరించు కోడానికి మౌనమే మంచి సాధనం. అది మనసుకు ఓర్పు, నిగ్రహాన్ని ఇస్తుంది. మౌనాన్ని పాటించినపుడు ప్రశాంతచిత్తులవుతారు. ఆ స్థితిలో ఇల్లు అయినా, వనం అయినా సాధకునికి ఒక్కటే అంటారు విశ్వస్ఫూర్తి గురువుగారు.

ఆకర్షణనే ప్రేమనుకుని, తమను తాము ప్రేమికులుగా భావించుకుని పెళ్ళచేసుకుని దరిమిలా పై మెరుగు కరిగి, మోజు తరిగి కొద్ది కాలంలోనే ఆలుమగలు విరోధులుగా మారుతున్నారు. వారి గురించి ఆవేదనను వ్యక్త పరస్తూ "పవిత్రమైంది, కల్మషం లేనిది, కామం కానిది ప్రేమ. అది ఎవరికీ బంధం, నిర్భంధం కాకూడదు" ప్రేమంటే స్వార్ధరహితం, ప్రేమించాలి కాని కామించకూడదు అంటారు.

ప్రేమ మత్తులో మునిగిపోయి తప్పు చేస్తే దానికి పురుషుడు మాత్రం కారణం ఎట్లా అవుతాడు? బలహీనత లేని ఆడదానితో బలవంతుడైన మగవాడు కూడా తప్పు చేయించలేడు. కాబట్టి ప్రేమకు, కామానికి, ఆకర్షణకు మధ్య వున్న వైరుధ్యాన్ని తెలుసుకుని జీవించమని ఉపదేశించారు ఒక సన్నివేశం ద్వారా. సమాజంలో పైకి ఉత్తములుగా కనపడుతూ, ప్రక్కదారిన పాపపు పనికి పాల్పడే వారికి హెచ్చరిక చేస్తారు మరో సన్నివేశంలో. అభిమానం, అధిక ప్రేమ మనషులను అసమర్థులుగా చెయ్యగూడదు. సంసారంలో స్త్రీ పురుషుల కర్మ ఒకటే అయినా క్రమం తప్పి చేసేది కష్టాలను కొనితెస్తుంది. బాంధవ్యాలు గాడి తప్పితే గండాలు వస్తాయి. వాటిని దరిజేరనీయకండి అని హెచ్చరించారు గురు దేవులు.

స్త్రీ, పురుషుల మధ్య వున్న అసమానతలు, ఆధిక్యతలను ప్రశ్నిస్తారు, సున్నితంగా మందలిస్తారు, వుండవలసిన విధానాన్ని వివరిస్తారు మరో సన్నివేశంలో గురుదేవులు. పెళ్ళైంది అనడానికి గుర్తుగా స్త్రీ మెడలో తాళివున్నపుడు పురుషుడికి గుర్తు లేకపోతే ఎలా? అంటారు. తన భార్య "పతివ్రతగా" వుండాలని భర్త కోరుకుంటునప్పుడు, తన భర్త "సతివ్రతు"డుగా వుండాలని భార్య కోరుకోవడంలో తప్పేముందని ప్రశ్నిస్తారు. పెళ్ళి చేసుకుని, పిల్లలను కన్న భర్తకు సన్యాసానికి అర్హత వున్నపుడు, అదే పనిలో భాగస్వామి అయిన భార్యకు మాత్రం సన్యాసార్హత ఎందుకుండదంటారు

శ్రీ విశ్వస్ఫూర్తి గురువుగారు. ఉద్యోగం చేసే భార్య సంపాదించే సంపాదనపై పవిత్ర భావం - ఆమె ఆఫీసులో ఇతరులతో మాట్లాడే మాటలపై మాత్రం అనుమాన భావం పనికి రాదంటారు. "ఆడ- మగ ఇద్దరు భార్యభర్తగా జీవించేది ఒకరికి ఒకరు ఒకటిగా బ్రతకడానికి", కానీ ఆధిక్యానికీ, అనుమానానికి తావుండకూడదు వారి జీవితాలలో అని ఉపదేశించారు.

సమాజంలోని దుస్థితిపై, దురాచారాలపై సున్నితమైన విసుర్లు ఈగ్రంథంలో అనేకచోట్ల దర్శనమిస్తాయి. వేళ్ళూనుకుపోయిన వరకట్న దురాచారాన్ని గురించి చెప్తూ "పెళ్ళికి మనసుల ఏకత ముఖ్యం. దానిలో ఆర్థిక లాభాన్ని ముడిపెట్టడం వ్యాపార మనస్తత్వం"- అందుకని పెళ్ళితో వ్యాపారం చెయ్యొద్దని హెచ్చరిస్తారు. శారీరకంగా ఒక చోట, మానసికంగా మరోచోట మనుగడ సాగించే మనుషులను గురించి చెప్తూ "శారీరక సంబంధం అప్పటికే కాని మానసిక వ్యభిచారం నిత్యవేదన'' అంటారు. పైపై మెరుగులకు మోజుపడే యువతకు హెచ్చరికగా "ఈనాటి యువత ప్రతిదాన్నీ ఫ్యాషన్‌గా చూడటమే తప్ప ఒరిజినాలిటీ జోలికి పోవడం లేదు. అసలు ఆ దృష్టి కల్గడంలేదు" అంటూ ప్రతి విషయానికి మూలంలోకి వెడితేగాని మహాత్యం బోధపడదని అన్యాపదేశంగా చెప్పారు ఇంకో మాట.

ఇలాంటి విసుర్లతోపాటు చురకలు కూడా చూడముచ్చటగా వుంటాయి ఈ రచనలో. "వైఫ్ అంటే మొగుడి

లైఫ్‌కు నైఫే"– ఒళ్ళు దగ్గర పెట్టుకుని వుండాలి నాదగ్గర అన్న భర్తతో "నైఫ్ ఆపరేషన్‌లో ప్రాణాన్ని రక్షిస్తుందండీ"– అంటూ భార్య ప్రాముఖ్యాన్ని చెపుతుంది ఇల్లాలు. అలాగే మరొకచోట పెడత్రోవ పట్టిన భార్యతో "నేను నీభర్తనే అయినా నీమనసుకు కర్తను కాలేకపోయాను"– అంటాడు భర్త. ఇద్దరు మనుషులు ఒకటవడంలో మనసు పాత్రను చిన్న వాక్యంలో ఎంత అద్భుతంగా చెప్పారో చూడండి. మనం ఎన్నోనాళ్ళుగా వింటున్న విషయాలకు నూతన దృక్కోణాన్ని ఆవిష్కరించి ఆలోచింప చేస్తారు కొన్నిచోట్ల – "చంద్రుని నీడ భూమి మీద పడటంతో, భూమి మీద పడవలసిన సూర్య"కాంతికి"– తాత్కాలిక గ్రహణం ఏర్పడిందిగాని, అది సూర్యునికి కాదుగదా! మరి దానిని సూర్యగ్రహణం అని ఎలా అంటున్నారు?" అంటూ ప్రశ్నిస్తారు.

మనిషికి వాంఛలు అక్రమంగా కల్గితే సంబంధాలు కూడా అక్రమంగానే వుంటాయి. కాబట్టి ఈ అక్రమ కోరికలకు సంబందించి "అవసరం, అతి – క్రమం, అక్రమం" ఈ భేదం బాగా తెలియాలి. ఆశ అవసరమైనట్లే అత్యాశ అనర్థకం. అలాగే చేరిక, కూడికలతో వుండే ఈ బాహ్యా సంబంధాలన్నీ అశాశ్వతాలు. "చేరింది ఏదైనా చెదరక తప్పదు, కూడింది ఏదైనా విడిపోక తప్పదు" – కావున ఈ స్థితిని దాటి శాశ్వతమైన ఆత్మ – విశ్వాత్మ – పరమాత్మ "రిలేషన్స్" తెలిసికొని యావత్ ప్రజ ఆనందము పొందవలెనని గురువుల ఆకాంక్ష. అట్టి "రిలేషన్స్" తెల్పు గురువులు "సద్గురువులు", వారనుగ్రహించిన

ఈ గ్రంథము సకల జనులు చదివి జ్ఞానానందము బడయుదురుగాక!

పైడిపాటి ఉమానాధశర్మ
ఆంధ్రభాషోపన్యాసకులు
శారదా కళాశాల, విజయవాడ

# పాతూరి నాగభూషణం

చైర్మన్, జిల్లాపరిషత్, గుంటూరు

'ది రిలేషన్స్' పుస్తకం ప్రతి మనిషికి తన జీవితంలో జరిగిన సంఘటనలను మదిలోకి తిరిగి గుర్తుకు తెప్పిస్తుంది. భార్యాభర్తల మధ్య ఉండే రిలేషన్స్ ఎంత మధురంగా ఉంటాయో, ఉండాలో ఇందులోని కొన్ని పాత్రల ద్వారా సందర్భోచితంగా వివరించబడింది. మనిషి వాస్తవంగా ఏ పరిస్థితులలో ఏ విధంగా ఆలోచిస్తాడో, ఆ విధంగా కంటి ముందు ఆవిష్కరింపబడుతుంది. ప్రతి వ్యక్తికి రిలేషన్స్ పుస్తకం చదవడం ద్వారా గొప్ప అనుభూతి కలుగుతుందనడం అతిశయోక్తి కాదు. ఇద్దరు వ్యక్తుల మధ్య ఏవిధమైన రిలేషన్స్ ఉండాలో, ఏ విధంగా ఆలోచించాలో ఒకరికొకరు దూరమైనపుడు ఈ పుస్తకం చదివితే ఆ అనుభూతులు మరల మదిలోకి వచ్చే అవకాశాన్ని కలిగిస్తున్నది. ఈ పుస్తకాన్ని చదువుతుంటే ప్రతి ఒక్కరికి వారికి సంబంధించిన రిలేషన్స్‌లోని సంఘటనల దగ్గరకు మనసును తీసుకొని వెళుతుంది. ఈ పుస్తకాన్ని ప్రతి ఒక్కరు చదివి ఆనందించాలి, మనోధైర్యాన్ని తెచ్చుకోవాలి. తమకు సంబంధించిన రిలేషన్స్ స్ట్రెయిన్ అయినప్పుడు ఈ పుస్తకం గొప్ప రిలాక్సేషన్‌ను ఇస్తుంది.

# శ్రీ గురుభ్యోనమః

**అంబటి మధుమోహన్ కృష్ణ**

అధ్యక్షులు, జానపద కళాకేంద్రం

విజయవాడ

పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ గురువిశ్వస్ఫూర్తిగారి సాహితీ వనంలో విరిసిన మరో తులసి మొక్క రిలేషన్స్ గ్రంథం. రిలేషన్స్ రిలేస్టేషన్స్‌గా ఉంటే ఎలా ఉంటుందో ఈ పుస్తకం ఆసాంతం చదివితే అంతరాంతరాలలో గోచరిస్తుంది. అందరికీ అర్థమయ్యే రీతిలో సాధారణ భాషాశైలిలో అక్కడక్కడా ఆంగ్లపదాలతో కలసి అంతరంగ మనోవిశ్లేషణకు చింతనకు మార్గదర్శకంగా మలచిన పుస్తకరాజం. రాజీపడని రీతిలో నిర్మొహమాటంగా నిలువుటద్దం ముందు నిలిపిన రీతిలో ఆధునిక సమాజంలోని అనేక రకాల మనుషులను, మనసులను, భావాలను, వికారాలను విశ్లేషిచి విధి విధానాలను పరోక్షంగా బోధిస్తున్న అనేక సూక్తులు ఈ పుస్తకంలో దాగి ఉన్నాయి.

రిలేషన్స్ పుస్తకం చదివినంతసేపు, చదివిన తరువాత కూడా మానవ జీవితం ముఖ్యంగా దాంపత్యజీవితం మూడుముళ్ళతో ప్రారంభమయి ముగిసేదాకా మనుషుల మనస్తత్వాలు ఎన్నిరంగులు విరజిమ్ముతాయో స్పష్టంగా తెలిపే పుస్తకం.

భారతీయ సంస్కృతి ప్రపంచంలోని అన్ని దేశాల

ప్రశంసలు అందుకుంటున్న విశిష్ఠసంస్కృతి. అందులో మన వివాహసంప్రదాయం మరింత విశిష్టమైనది.

భార్య అనే పదానికి అర్థాంగి అనేది పర్యాయపదంగా ఉంది. దాంపత్య సంబంధ పవిత్రతకు విశిష్టతకు తార్కాణం అదే! ధర్మ, అర్ధ, కామ, మోక్షప్రయత్నాలలో దంపతులు పరస్పరం తోడుగా ఉంటామని పెళ్ళిరోజున ప్రమాణాలు చేస్తారు. జీవితాంతం కలసి మెలసి జీవన యానం సాగిస్తామంటారు. పంచభూతాత్మకమైన ప్రకృతి సకలజీవుల జన్మలకు మూలం కనుక అదే దైవం! అగ్ని, వాయువు, ఆకాశం, భూమి, జలం పంచభూతాలు. అవే ప్రకృతికి ఆధారాలు. ప్రకృతిని మనం దైవంగా భావించి భార్యాభర్తల సఖ్యతను, అనుబంధాన్నీ ప్రకృతి ప్రసాదించిన వరంగా భావించాలి.

మనిషికి సాటి మనుషులు అనేకులతో సఖ్యత ఉండవచ్చు, కాని సతికి, పతికి ఉండే సఖ్యతకు అనుబంధానికి సాటిరాగలది ఏదిలేదు. గురూజీ అనేక సందర్భాలలో ఈ విషయాన్ని సూటిగా నొక్కి మరీచెప్పడం విశేషం. భార్యాభర్తల మధ్య, ప్రేమికుల మధ్య నిష్కల్మషమైన, నిస్వార్థమైన, నిజమైన అనుబంధం, అనురాగం, ఆప్యాయత ఆత్మీయంగా ఉండాలనే విషయాన్ని పాత్రల భాషణలలో బహుముఖంగా పొందు పరచడం విశేషం.

వేదకాలం నుంచి ఈనాటి వరకు మానవజాతి నాగరికత, సంస్కృతి, విజ్ఞానం క్రమానుగతం అభ్యుదయ

దిశగానే పరిణామం చెందాయి. విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం మరింత వేగంగా పెరుగుతున్నాయి. అది హర్షించదగినదే. భారతీయ సంస్కృతి,సాంప్రదాయాతకు ఆ పురోగతి హాని కల్గించదు. కానీ నవీన నాగరికత పేరుతో మన భారతీయ సంస్కృతిలోని విశిష్టతని సత్సంప్రదాయాల్నీ విస్మరించరాదనే గురూపదేశం తేటతెల్లం. కొత్తొకవింత పాతొకరోత అనుకోకుండా వికృత పాశ్చాత్య వేషధారణల అనుకరణలు, వివాహేతర వివాహత్పూర్వ – శారీరక సంబంధాలు, మానసిక సంబంధాలు, విశృంఖల స్వేచ్ఛా విహారాలు సామాజిక కల్లోలాలకు ఎలా దారి తీయగలవో ప్రస్ఫుటం చేసిన అనేక ముగింపులు మనకు తెలియచేస్తున్నాయి.

ఒకరనేమిటి ! మేధావులు, పండితులు సంస్కర్తలు... ఆఖరికి పామరులు కూడా ఈ పుస్తకాన్ని చదివి మన దేశ సంస్కృతిని, సత్సంప్రదాయాలను పరిరక్షించుకోవడానికి మంచి ఉపకరణమీపుస్తకం. నవయువత, నవదంపతులు తప్పక చదవవలసిన మంచిపుస్తకం మనకు శ్రీశ్రీశ్రీ విశ్వస్ఫూర్తి గురు మహరాజ్‌గారి విరచితమై లభ్యమవడం మహాద్భాగ్యం.

శ్రీశ్రీశ్రీ గురువిశ్వస్ఫూర్తి మహరాజ్ పాదపద్మములకు నమస్కరించి శెలవు...

**అంబటి మధుమోహన్ కృష్ణ**
అధ్యక్షులు, జానపద కళాకేంద్రం
విజయవాడ

# ది ప్రెజెంటేషన్

అవును... సమాజానికి లభించిన ప్రెజెంటేషన్... గొప్ప బహుమతి 'ది రిలేషన్స్'.

నిత్య జీవితంలో మానవుల మధ్య బంధాలు, సంబంధాలూ ఎలా ఉంటున్నాయో, సందర్భానుసారంగా అవి ఎలా మారిపోతున్నాయో, తదనుగుణ మానసిక స్థితులు ఎలా ఉంటున్నాయో మన కళ్లముందుకు తెచ్చి, ఇరు పార్శ్వాలనూ స్పృశిస్తూ ఇదిగో... ఇలా వెళ్తే ఇలా జరుగుతుంది. అలా వెళ్తే ఏం జరుగుతుందో అంటూ రెండిటిలోని పాజిటివ్, నెగిటివ్ అంశాలను ప్రస్ఫుటపరుస్తూ నైతిక విలువల ప్రాతిపదికన జీవనగమనానికి సరైన మార్గాన్ని నిర్దేశించుకొనే అవకాశాన్ని అందించే మార్గదర్శి లభించడం నిజంగా మనకి, మన సమాజానికీ లభించిన గొప్ప బహుమతే కదా!

ఆత్మీయుల మధ్య సంబంధాలు బలహీనమైనపుడు 'రిలేషన్స్' విచ్ఛిన్నం కాకుండా నిరోధించడానికి ఈ 'ది రిలేషన్స్' ఒక దిక్సూచి కాగలదు. సమాజానికి ఎంతో మేలు చేయగల ఇలాంటి అద్భుత గ్రంథాన్ని ప్రచురించే అవకాశం కలగడం నిజంగా మాకు లభించిన గొప్ప బహుమతి. ఈ మహద్భాగ్యాన్ని కల్పించినందుకు మనస్ఫూర్తిగా వినమ్ర ప్రణామాలు అర్పించడం తప్ప వారికేమి ఇవ్వగలం...? దిగంతాలకు వ్యాపించే వారి సాహితీ కుసుమ సౌరభాలను వెదజల్లడానికి ప్రయత్నించే పిల్ల తెమ్మెరగా వారి సేవకు

పునరంకితం కావడం తప్ప...!

ఈ గ్రంథాన్ని ఆసాంతం చదివి, తమ అమూల్య అభిప్రాయాలను ముందు మాటల ముత్యాలసరాలుగా పేర్చిన శ్రీ పురాణపండ రంగనాథ్, శ్రీ అంబటి మధుమోహన్ కృష్ణ, డా॥ దుగ్గరాజు శ్రీనివాసరావు, శ్రీ ఉమానాథశర్మ, శ్రీ పాతూరి నాగభూషణంగార్లకు, ఈ పుస్తకప్రచురణకోసం తమ అమూల్య సహాయసహకారాలను అందించిన మిత్రులు శ్రీ ఆల్వా సాయిప్రసాద్, శ్రీ రమేష్ గార్లకు మా హృదయపూర్వక ధన్యవాదాలు.

ఈ గ్రంథం చదివిన తరువాత పాఠకులు తమ స్పందనలు, సలహాలు మాకు తెలియజేయవలసిందిగా కోరుచున్నాం.

భవదీయులు,

**స్ఫూర్తి పబ్లికేషన్స్**

విజయవాడ

# 1. ప్రేమావేశం

"పెండ్లి పీటలపై ప్రక్క ప్రక్కన కూర్చున్నది... మేమిద్దరమే...

తలంబ్రాలు పోసుకున్నదీ... మేమిద్దరమే...!

అగ్ని ప్రదక్షిణచేసి, ఏడడుగులు నడిచిందీ... మేమిద్దరమే...!

అరుంధతిని చూశామని చెప్పిందీ... మేమిద్దరమే...!

తొలిసారి ఏకాంతంలో వున్నదీ... మేమిద్దరమే!

హనీమూన్ చేసుకున్నదీ మేమిద్దరమే...!

అది ఎక్కడంటావేమో? మన బిల్డింగ్‌పైనే! ఎన్నాళ్ళంటావేమో...! శుద్ధ ఏకాదశి నుండి బహుళ విదియ వరకు...

'అదెలాగా?' అని సందేహిస్తావేమో! 'హనీ' నా ప్రక్కనే వుండగా, పైన మూన్ కదులాడుతోంటే... హనీమూన్ ఎక్కడో ఎందుకుంటుందన్నయ్యా? దానికోసం ఊటీ, కొడైకెనాల్‌కు పోవాలా? ఆమె హనీ... నేనే మూన్! మేమిద్దరమే హనీమూన్!

ఇద్దరమూ సుఖించాం... పిల్లల్ని కన్నాం. వాళ్ళను పెంచి పెద్దచేసి, వారికి విద్యాబుద్ధులు చెప్పించిందీ... మేమిద్దరమే! వాళ్ళకు పెళ్ళిళ్ళు చేసి, పంపించి వేసిందీ మేమిద్దరమే!

ఎవరింటికి వాళ్ళు... ఎవరిచోటుకు వాళ్ళు... చేరిపోయారు... అలా వాళ్ళను చూచి సంతోషించిందీ...

మేమిద్దరమే!... మళ్ళీ ఏకాంతంలో మిగిలిపోయిందీ... మేమిద్దరమే!

ఇన్నాళ్ళు, యిన్నేళ్ళు నా అర్ధాంగిగా... నా జీవిత సర్వస్వంగా నాతో కలిసి బ్రతికిన... నా భార్య... నేటికి నన్ను విడిచి ఒంటరివాణ్ణి చేసి... తన దారిని తాను చూచుకుని వెళ్ళిపోయింది! తనకు యింత స్వార్ధమా అన్నయ్యా? పుణ్యస్త్రీగా, నా చేతుల మీదుగా తనువు చాలించాలనుకున్న తన కోరికను నెరవేర్చుకుందిగా...! మరి నా సంగతి?... పోనీ... వెళ్ళిందే అనుకుందాం! తాను ఎక్కడికెళ్ళిందీ... ఎక్కడ వున్నదీ ఆ తరువాతైనా మాట మాత్రమైనా నాతో చెప్పగూడదా? పెళ్ళిలో నా పీట ప్రక్కన పీట వేసుకుని కూర్చున్న మనిషి.. నా బెడ్‌పై సగం వాటాను లాగేసుకున్న అర్ధాంగి, ప్రస్తుతం తాను ఎక్కడున్నా తన ప్రక్కన నాకు కాస్త చోటు యివ్వగూడదా...? నాకు భోజనం పెట్టి ఎదురుగా కూర్చుని, కొసరి కొసరి వడ్డించేదిగా మరి! నా వైపు గోముగా చూస్తూ నా నోటికి గోరుముద్దలు అందించేదిగా! తనకు అవన్ని యిప్పుడు గుర్తుకు రావడంలేదా? తనకు తెలుసు గదా నేను యిక్కడ ఒంటరి వాడినై, దిక్కుమాలిన వాడిగా పడివున్నానని? ఎన్నో సంవత్సరాలు... జీవితమంతా నాతో గడిపిన మనిషి.. యింతలోనే నన్ను మర్చిపోవాలా? ఇది దాంపత్య ధర్మమేనా అన్నయ్యా? ఇప్పుడు నేను ఎక్కడికి పోవాలి? ఆమె ఎక్కడుందని వెతకాలి? చూశావా అన్నయ్యా... మనిషిలో ఎంత స్వార్ధం వుంటుందో? భార్య కూడా నాకింతటి అన్యాయం చెయ్యాలా? మాకు పుట్టినవాళ్ళు వాళ్ళ బ్రతుకులు వాళ్ళు

వెతుక్కుంటూ వెళ్ళిపోయారు. అదిసరే! అర్ధాంగి కదా? ఆమెకూడా అదేపని చేయాలా? నేనూ తనతోపాటే వస్తానంటే... వీల్లేదంది! వద్దని వారించి, మా పిల్లల పిల్లల ముచ్చట్లు చూసుకోమంది! అలా నాకు వాళ్ళ ఎటాచ్‌మెంటుపెట్టి, తన సుఖం తాను చూచుకుంది! ఇది న్యాయమేనా అన్నయ్యా? చెప్పన్నయ్యా... నీవైనా చెప్పు ఆమె నాకు చేసింది న్యాయమేనంటావా? వేరుగా ఆమెను నేను ఏమీ కోరలేదుగదా! తానువున్న చోటుకు నన్ను పిలవలేదనేగా నా బాధ! ఎక్కడో తాను ఒంటరిగా వుండగలిగినా... తనకు తెలుసుగదా నా మనసు తనను విడిచి వుండలేని నా పరిస్థితి తనకు గుర్తురావాలి గదా? ముత్తైదువుగా తన వరకు తన కోరిక తీర్చుకుంటే... సరిపోయిందా? ఇక్కడ మిగిలిపోయిన వాడి సంగతి తనకు అక్కర్లేదా? ఆమెకోసం నేను ఎటనిపోగలను? కనీసం ఆ చోటు తెలిసినా ఏదో విధంగా అవస్థలుపడి, దారి వెతుక్కుంటూ పోయేవాణ్ణి! ఇప్పుడు నా గతేంటి? పగలే చీకటిగా వుంది. ఈ అంధకారంలో ఎన్నాళ్ళని బ్రతగ్గలను? తరువాతైనా ఎక్కడికి పోవాలి? ముక్తీ-మోక్షాలతో నాకు పనిలేదు... ఆ అవసరమూ నాకు వద్దు! ఎప్పటికైనా... ఏవిధంగానైనా... నా భార్యను నేను చేరుకోగలగాలి... మళ్ళీ... మేమిద్దరమే ఒకటిగా, ఒంటరిగా, శాశ్వతంగా వుండాలి! ఎన్నటికీ ఆమె నాకు దూరం కాకుండా వుండాలి! అలాగే వుంటాం... మళ్ళీ మళ్ళీ, మరోసారి ఆమెనే అడుగుతాను తాను వున్న చోటు చెప్పమని! అక్కడికి చేరుకునే దారి చెప్పమని! తాను ముందుగా వెళ్ళింది కనుక, ఆ మార్గం ఆమెకు పూర్తిగా తెలిసే వుంటుంది.

ఆ దారినే నేనూ పోగలను... రానివ్వదా నన్ను?... చూస్తాను ఎలా రానివ్వదో! తనకు నేను భర్తను కాదంటుందా? అలా అనదులే అన్నయ్యా! బహుశా అక్కడ తనకు తన వాళ్ళెవరో కనిపించి వుంటారు! ఆ సందడిలో నన్ను మర్చిపోయి వుంటుంది పుట్టింటి బంధం కదా మరి! ఆ తరువాతనైనా నేను గుర్తుకురానా? నన్ను తన దగ్గరకు రమ్మని అప్పుడైనా అనదా? అప్పుడే అడుగుతాను అడగవలసిన ఆ నాలుగు మాటలు! ఒడిసి పట్టుకుని నా గుండెలమీద పెట్టుకుని అదిమేస్తాను. ఏం చేస్తుందో చూస్తాను? ఎవరు అడ్డు వస్తారో చూస్తాను. అయినా... ఎవరెందుకుంటారు మా ఏకాంతంలో? ఆమె నా భార్య... నా అర్ధాంగి...! నా యిష్టం...! అలా మళ్ళీ మేమిద్దరమే అవుతాం 'ఇద్దరం కలిసే తనకు తెలిసిన దారివెంట తానువున్న చోటుకు చేరుకుంటాం'... ఏం అన్నయ్యా? మాట్లాడవు. నీ మరదలు నాకు చేసిన అన్యాయానికి నీకు మాత్రం బాధ కలగడం లేదా? వదినకు చెప్పు, తన తోడు కోడలు త్వరలోనే వచ్చి తనతో నన్ను తీసుకుపోతుందని! అన్నయ్యా! నన్ను గుర్తుపెట్టుకుంటావా? నా భార్యలాగా నీవు కూడా నన్ను పూర్తిగా మర్చిపోతావా? పోనీలే! అలాగే చెయ్యి! అర్ధాంగిగా బ్రతికిన భార్యే... మర్చిపోతే నన్ను ఎవరు మాత్రం ఎందుకు గుర్తుపెట్టు కుంటారు?... నా మనసు చెడి యిలా మాట్లాడడం లేదన్నయ్యా! నేను మామూలుగానే వుండి యిలా మాట్లాడుతున్నాను. వేరేవిధంగా నీవు ఆలోచన చేయవద్దు. నా ఆరోగ్యాన్ని గూర్చి అనుమానించవద్దు! అన్నయ్యా! నాకేదో మత్తు కమ్ముతోంది...

పడుకుంటాను. ఇంతసేపు నా మాటలు విని తన తప్పు తెలుసుకుని... బహుశా నా భార్య వచ్చేస్తున్నదేమో! పడుకుంటాను అన్నయ్యా!

“.........................................”

‘అన్నయ్యా! యింతసేపు నీవు యిక్కడే వున్నావా? మీ మరదలు నా మాటలు విన్నట్టుంది! అయినా తానువున్న చోటు నాకు తెలియనివ్వలేదు. అక్కడ అంతా చీకటిగా వుంది! కళ్ళు చికిలించి దానిలోంచి చూస్తే... ఎక్కడో దూరంగా గుడ్డి వెలుగులో ఆమె... అదే.... నా భార్య అటుతిరిగి కూర్చుంది. ముఖం స్పష్టంగా కనిపించడం లేదు. అయినా యిన్ని సంవత్సరాలు నాతో కలిసి వున్న వ్యక్తిని నేను పోల్చుకోలేనా? నేను చూచినది నా భార్యనే! అనుమానం లేదు... అన్నయ్యా! ఒకవేళ ఆమె తానుగా నా దగ్గరకు రావడానికి వీలు కుదరడం లేదేమో! నేనే అక్కడికి పోయే ప్రయత్నం చేస్తాను. మా యిద్దరిలో ఒకరిపై ఒకరికి పట్టింపులు, పంతాలు ఎందుకు? తాను రాలేదని నేనెందుకు బెట్టుసరి చెయ్యాలి? నేనే వెళ్తాను. ఆమె నన్ను చూచి గుర్తుపట్టి, ఆమే ఎదురొచ్చి, నన్ను తాను వున్నచోటుకు తోడ్కొనిపోతుందిలే. అన్నయ్యా! వెళ్ళేముందుగా నీకు, వదినకు చెప్పే వెళ్తానులే! ఆమె పిలిస్తే... ఒకవేళ ఆలస్యం చేయకుండా వెంటనే వెళ్ళిపోవలసి వస్తే... అప్పుడు ‘వెళ్తున్నానని’ చెప్పే వ్యవధి లేకపోవచ్చు! అందుకే ముందుగానే చెబుతున్నా... ఒకవేళ అలా వెళ్ళిపోతే... నా గురించి మీరేమీ మరోవిధంగా అనుకోవద్దు!

అయినా ఆమే వస్తుందేమో ఎదురుచూస్తాను కొన్నాళ్ళపాటు! అన్నయ్యా! ఆమె... నా భార్య... తప్పక వస్తుంది నా దగ్గరకు..."

"ఒరే శివం! ఏమిట్రా యిది? భార్య పోయిన వారంతా యిలా... నీలాగా మతి పోయి ప్రవర్తిస్తున్నారట్రా? ఎవరు శాశ్వతం? ఏది నిత్యం? పుట్టిన వారంతా ఏదో ఒక నాటికి పోవలసిన వాళ్ళే కదా! మనకు జన్మనిచ్చిన వారు వున్నారా యిప్పుడు? అందరూ, అన్ని జీవులూ అంతే! నది వరద నిలకడా? ఆటూ, పోటూ సముద్రానికి సహజమే! ఆ కాసేపు తట్టుకోవాలి ఆ ఉధృతాన్ని!... మళ్ళీ మామూలే! జీవితంలో ఎన్నో ఒడుదుడుకులు వస్తుంటాయి! అలాగే అవి పోతూవుంటాయి! కష్టసుఖాలూ అంతే! పుట్టుక... చావూ... అంతే! బాధ, సంతోషమూ అంతే! సృష్టే ద్వంద్వం! పెయిర్స్ ఆఫ్ ఆపోజిట్! ఒకటి లేక మరొకటి వుండదు. ఆ ద్వంద్వం ఒకదాని తరువాత ఒకటిగా వస్తూపోతూనే వుంటాయి! అది అలా జరగవలసిందే! నిజానికి పుట్టుక-చావు మధ్యగల జీవితమే జీవిది, మనిషిది. మంచిగానో, చెడుగానో మనిషి దానిని అనుభవించవలసిందే! అయితే జీవితాన్ని సాధ్యమైనంతవరకు దుఃఖరహితం చేసుకోగలగడమే మనిషి ప్రత్యేకత!

ప్రతిదానికి సమయం, సందర్భాలుంటాయి. మార్పు దానిని అనుసరించే వుంటుంది... సూర్యోదయ, అస్తమయాలూ అంతే! పగలు-రాత్రి... వెలుగు-చీకటి ఒకదానికొకటిగా మారిపోతూనే వుండాలి! సహజమైన దేనినీ ఆపడం సాధ్యంకాదు. అలా చేయగలమనుకోవడమే భ్రమ! సృష్టి-పుట్టుక-జీవితం దానికి

సంబంధించిన సుఖ దుఃఖాలు, దేనికది శాశ్వతమనుకోవడమే మనసుకు తెలియనితనం! అదే అజ్ఞానం! దానినే 'మాయ' అంటూ నిస్పృహ వేదాంతం చెబుతోంది! అది నిజం కాదు. సృష్టి నిజం! అది వస్తువాస్తవం! సత్యమే శాశ్వతం! ఈ భేదం పూర్తిగా తెలియడమే జ్ఞానం! ఇది విషయ జ్ఞానం (భౌతిక/పదార్థ) ఆధ్యాత్మిక జ్ఞానం అనే రెండు విధాలుగా వుంటుంది. వీటిని గురించి ఎవరు ఎన్ని విధాలుగా చెబుతున్నా, వివరిస్తున్నా, బోధిస్తున్నా... అవన్నీ జీవిత వాస్తవికత, తత్సంబంధ అవగాహనపై ఆధారపడి వుంటాయి.

విధిని నివారించలేం! అదే 'జరగవలసినది' అంటే! దీనినే ధర్మం అనాలి! జరగవలసిన దానిని నెరవేర్చవలసిందే! అదే కర్మనిర్వహణ. మనిషికి విద్యుక్త ధర్మమంటే యిదే! త్రికరణశుద్ధిగా కర్మ నిర్వహణ సాగించి, తత్ఫలితాన్ని సృష్టి ధర్మానికి... అంటె... విధి నిర్ణయానికి వదిలెయ్యాలి! దానిని శాసించగలిగింది మనిషి మనసు కాదు. సృష్టిపదార్థ తత్వమే అంత! అలాగే పుట్టుక చావులను నిర్ణయించేది... వాటిమధ్య జీవితకాల వ్యవధిని నిర్దేశించేదీ... మనిషి కాదు. అది కేవలం కాలగమనమే!... అదే పదార్థ చలనం ... దాని పర్యవసానం!

మానవ బంధాలు, సంబంధాలు, బంధుత్వాలు వ్యక్తి సమాజ సంబంధ మనోవికారాలే! అవి అప్పటికి వాస్తవాలు, నిజాలే! కాని అవి శాశ్వత సత్యాలు కాలేవు సుమా! అలాగే పదార్థ సంబంధ కర్మబంధ వ్యవహారాలన్నీ భౌతికాలే! అవి తత్కాలిత తర్కాలే!

ఉదాహరణకు వివాహానికి పూర్వం నీవు, నీ భార్య ఎవరికి ఎవరు? ఒకరికి ఒకరు తెలియనివారే కదా! పరాయివారే కదా! ఆ స్థితిలో మీ యిద్దరికి బంధం సంబంధించి ఏమైనా వుందా? వివాహం పేరుతో మీ యిద్దరికీ భార్య-భర్తల బంధం, సంబంధం యేర్పడి ప్రేమ-మమకారాలతో ఒకరికొకరు ఆప్యాయతను పెంచుకున్నారు... పంచుకున్నారు... పుట్టిన పిల్లలూ అంతే! అలాగే మన పేరెంట్స్‌కు గల భార్య-భర్త బంధంలో నేనూ, నీవూ ముందూ వెనుకగా జన్మించాం కనుకే అన్నతమ్ముడుగా అనుకుంటున్నాం! అదే జరగకపోతే... మనిద్దరి మధ్య సంబంధం ఏమిటి? మనిద్దరు ఎవరికి ఎవరం? కేవలం సమాజంలో యిద్దరు మనుషులం మాత్రమే! మనిద్దరి రక్తబంధంతో నా భార్య నీకు వదినగా, నీ భార్య నాకు మరదలిగా చుట్టరికం యేర్పడింది. కాసేపు అది లేదనుకుంటే... మనమంతా ఎవరికి ఎవరు ఏమౌతాం? ఇది కాలగమనంలో సమాజ బంధాలేగాని శాశ్వత ప్రత్యేక సంబంధాలు కావు. **చేరింది ఏదైనా చెదరక తప్పదు... అలాగే కూడినది ఏదైనా విడిపోక తప్పదు  ఇది మనిషికి-జీవికి ప్రకృతికే కాదు - సృష్టి తత్వం-పదార్ధ ధర్మం కూడ అంతే! దీనినే 'విధి' గా ఒక మేర సత్యంగా భావించవచ్చు!**

**భార్య భర్త బంధం, సంబంధం సామాజిక గృహధర్మం! పుట్టిన పిల్లలే కన్నవారికి దూరం కావడం సహజమైనప్పుడు, వేరువేరుగా ఎక్కడో పుట్టిన ఆడ-మగ యిద్దరూ భార్యభర్తగా ఒక చోట చేరి జీవించినంత మాత్రాన వారి బంధం శాశ్వతం ఎలా అవుతుంది? అలా కావడం 'విధి' ధర్మానికి, ప్రకృతి**

సహజతకు పూర్తి విరుద్ధం! కనుక జరిపించ వలసినదానిని 'కర్మ' పేర నిర్వహించడం, జరగవలసిన దానికి ప్రేక్షక పాత్ర వహించడమే మనిషి విద్యుక్త ధర్మం!... నీవైనా, నేనైనా, మరెవరైనా భార్య, పిల్లలు, తలిదండ్రులు – యిలా రక్తబాంధవ్యంగల ఎవరి విషయంలోనైనా మనిషి అనుకోవలసింది యిదే! కనుక ప్రస్తుతం చెదిరియున్న నీ మనసును ఒక చోటికి చేరదీసి, జీవిత వాస్తవాన్ని, కర్మ ధర్మాన్ని, విధి నిర్ణయాన్నీ క్షుణ్ణంగా అర్థం చేసుకో! జీవిత బంధాలు, సుఖదుఃఖాలు, వాటి అనుభవాలు ఇంద్రియ ప్రేరిత మనసుకు సంబంధించినవే! మనసు శాశ్వతం కాదు. దానికి ప్రత్యేక ఉనికి అంటూ ఏదీ స్థిరంగా వుండదు. కనుక దాని కారణంగా యేర్పడి జరిగేవన్నీ దాని మాదిరిగానే స్థిర ఉనికి లేనివే సుమా! అందుకే కర్మ సంబంధమైన మనసును, ఇంద్రియ ప్రేరితమైన బుద్ధినీ ఆత్మీకరించడం ద్వారా అవి భౌతికాతీతమై, ఆధ్యాత్మిక స్థాయికి చేరుతుంది. తద్వారా భౌతిక మనసు సహజరీతిలో ఇంద్రియప్రేరణ నియంత్రణ నుండి అంతరేంద్రియ అంతరాత్మ సంబంధంగా వస్తు వాస్తవిక గ్రహణతో 'ది మైండ్ ఆఫ్ ది మోరల్ శాంక్టిటీగా మార్పుచెంది క్రమంగా ధ్యాన సాధన ప్రస్థానంతో అది ఆత్మగా, దివ్యాత్మగా ఆధ్యాత్మిక ఉన్నత స్థాయికిచేరి, విశ్వాత్మగా సర్వవ్యాప్తమైయున్న పరమాత్మకు సన్నిహితమవుతుంది. ఈవిధంగా సుఖదుఃఖాలకు, రాగద్వేషాలకు బంధ బంధుత్వాలకు నిలయమైయున్న భౌతిక వికార మనసు ఇంద్రియాతీత స్థితిని పొంది, దుఃఖరహితమైన, శాశ్వత పరమానందాన్ని, అనుభూతిగ అనుభవించగలదు.

ప్రస్తుతం నీవున్న మానసిక  స్థితిలో నా మాటలు నీకు పూర్తిగా అవగాహన కాకపోవచ్చు! అయినా మనసును నిగ్రహించుకునే ప్రయత్నం చెయ్యాలి! జీవులన్నీ ప్రకృతిలోనివే! జీవపదార్ధ 'ఏకత'ను కలిగినవే! అయినా దేని బ్రతుకు దానిదే! జల చరాలు - భూచరాలు, వృక్ష జాతులతో సహా అన్నీ ప్రకృతి జీవులే అయినా, వాటి స్వరూప స్వభావం భిన్నమైనవే. ఉదాహరణకు విత్తనం నుండి మొలకగా ప్రారంభమై మొక్కగా మారిన దానినుండి వేరులు, కాండం వేరుపడి వేరులు నేలలోనికి, కాండం ఆకాశంవైపు సాగిపోతాయి. అయినా ఈ రెండూ ఒకప్పుడు విత్తనంలోనివే సుమా! కాండం కొమ్మలుగా... అవి రెమ్మలుగా విడిపోతాయి. రెమ్మలకు ఆకులు ఋతుక్రమంలో మొగ్గ - పువ్వు - పిందె - కాయగా వృద్ధిచెంది, పండుగా పక్వమై, పునరుత్పత్తికి వీలుగా తనలో గింజను దాచుకుని, రాలిపోతుంది. ఇది జీవ/జీవి వాస్తవికత' ఈ క్రమంలో దేని సంబంధం దానిదే అయినా చెట్టు ఒకటే! జీవజాతులూ అంతే మరి! ప్రకృతి సహజమైన వాటి మధ్యగల బంధాలు  సంబంధాలూ అంతే! తననుండి పుట్టి  (ప్రారంభమై) క్రమంగా తనకు దూరమవుతున్న కొమ్మలు, రెమ్మలు, ఆకులు, పూవు - పిందె, కాయ గురించి గాని... తననుండి శాశ్వతంగా నేల రాలిపోయే పండును గురించి గాని చెట్టులో ఏ భాగమూ బాధపడదు. మానవ బంధాలనూ ఆవిధంగానే అర్ధం చేసుకోవాలి!"

"అన్నయ్యా! నీ గీతోపదేశం నా మనసు భారాన్ని తేలిక చేస్తోంది! మమకార సుడిగుండంలో చిక్కుకున్న నన్ను వాస్తవ

తీరానికి చేరుస్తోంది...”

“గీతోపదేశం కేవలం కురుక్షేత్రంలోనే ప్రారంభంకాలేదు. ద్వాపరయుగంలోనే దానికి  అంకురార్పణ జరగలేదు. భారత సంస్కృతిలోనే దీని మూలాలు అంతర్గతంగా వున్నాయి- మానవ జ్ఞానం - నాగరికత వృద్ధితోపాటు సనాతన ధర్మ వైశాల్యత కూడా పెరిగింది. వర్ణ వ్యవస్థ బేస్‌లో కర్మయోగం ధ్వనిస్తూనే వుంది. వ్యవస్థ నిర్మాణంలో కుటుంబం, మానవ సంబంధాల విశ్లేషణ అనాదిగా ఏదో రూపంలో జరుగుతూనే వుంది. అలాగే భక్తి-జ్ఞాన-వైరాగ్యాల ఆచరణ భారతీయతలో వుంది. ఇంద్రియ మనసు దాని వికారాల వాస్తవానికి - అస్థిరతకు ఆత్మ సంబంధ ఆధ్యాత్మిక శాశ్వతత్వానికి విభజన జరుగుతూనే వుంది... అయితే తాత్విక చింతన సమగ్రతకు కర్మ-భక్తి-జ్ఞాన-వైరాగ్య యోగ వివరణగా కురుక్షేత్ర యుద్ధం ఒక ప్రేరణగా కృష్ణుని పేర వ్యాస విరచిత భగవద్గీత ప్రత్యేక రూపు దిద్దుకుంది. కర్తవ్య పాలన, కర్మ బోధన అనాది నుండి పరోక్ష రీతిలో వున్నప్పటికీ వేదాల విభజన జరిగినట్లుగానే, గ్రంధ రూపంలో మార్పు జరిగింది. కనుక దానిని చదవగలుగుతున్నాం.

దేనికైనా మనసు ప్రధానం! దాని స్వరూప స్వభావాలను అనుసరించే జీవిత గమనం. ఇంద్రియప్రేరణ - బుద్ధి తీరు మనసు నియంత్రణలో వుంటే  జీవిత వాస్తవం, నిత్యం ప్రత్యక్షమవుతూనే వుంటుంది. అందుకు ధ్యానం ఒక శక్తి వంతమైన మార్గం!

"The meditation is the moral medication to the mundane mind. So, follow it. Please strive to introvert your mind of introspection. Then you can achieve the peace of rapture..."

“ప్రస్తుతం నా మానసిక స్థితికి అది సాధ్యం కాదేమో అన్నయ్యా!”

“మన ఊహలు, ఆలోచనలు ఆత్మ విశ్వాసంతో కార్యాచరణకే అవి ఉపయోగ పడాలి! దేనికైనా ప్రయత్నం ప్రారంభమవుతుంది. సాధన చేయడం, సాధించడం తరువాత దశలు. **మనిషికి కృషి – ఋషికి తపస్సు కనీస ధర్మాలు! ప్రస్తుతం నీ మనసు నీ స్వాధీనంలో లేదు కనుక, దాని నిశ్చలతకు ధ్యానం అవసరమవుతోంది... రోగానికి ఔషధాన్ని ప్రయోగించి చూడాలి. ప్రయత్నానికి ప్రారంభం జరగాలి. శారీరక క్రమశిక్షణకు యోగ, మానసిక స్థిర స్థిమితానికి ధ్యానం ఉపయోగపడుతాయి.** అయితే అందుకు సంబంధించిన ఆయా విధి విధానాలు బాగా తెలిసిన వారి ద్వారా అభ్యాసం చెయ్యాలి. నేను వెళ్ళే ఆశ్రమానికి నిన్నూ తీసుకువెళతాను... నాతో రా! అక్కడ యోగ, ధ్యాన శిక్షణను అభ్యసించవచ్చు. తరువాత స్వయం సాధన చేసుకోవచ్చు. తప్పక ఫలితం వుంటుంది. నా మాట కాదనకు... ఏమంటావ్...?”

“అలాగే అన్నయ్యా! నీవు చెప్పినట్టే చేస్తాను...”

– – –

‘అన్నయ్యా! నమస్కారం! నేను నీకిచ్చిన మాట తప్పాను. నన్ను క్షమించన్నయ్యా! గతించిన నా భార్యపట్ల నాకుగల

ప్రేమాతిశయంతో ఆవేశంతో స్వాధీనం తప్పి ఛిద్రమైన నా మనస్సును మామూలు స్థితికి తేవడం కోసం నీవు ఎంతో ప్రయత్నం చేశావ్! ఎన్నో గొప్ప విషయాలు చెప్పావ్! అయినా నీవు చెప్పినట్లు మానవ ప్రయత్నం కంటే, విధి శక్తివంతమైనది. అదే నన్ను బలితీసుకుంటోంది. నిన్ను ధిక్కరించి నేనీ పని చేయడంలేదు. నా మనసు స్వాధీనానికి నేను ప్రయత్నించిన కొద్దీ... అది మరింత వ్యతిరేక దిశగా పోతోంది. పూర్తిగా అది నా అదుపు తప్పిపోయింది. తన వేపే నన్ను యీడ్చుకుపోతోంది నిస్సహాయంగా నేనూ దాని వెంటే పోతున్నాను...

గతించిన నా భార్య చేరిన గమ్యమేదో నాకు తెలియదు... అయినా, ప్రేమకు మరణం లేదని... అది శాశ్వతమని ప్రేమ జంటను అది ఒకే చోటుకు చేరుస్తుందనేది... బలీయమైన నా నమ్మకం... ఆ విశ్వాసంతోనే నేను ప్రాణత్యాగం చేస్తున్నాను. కేవలం భార్యపట్ల వ్యామోహ మానసిక బలహీనత యిందుకు కారణం కాదన్నయ్యా! పూర్తిగా ఆమెపట్ల నాకుగల మరుపులేని ప్రేమావేశ ఫలితమే యిది! దయచేసి నన్ను అపార్థం చేసుకోకు అన్నయ్యా!

తన మరిది తన భార్య వద్దకు పోయినట్లు వదినకు చెప్పన్నయ్యా! అన్నయ్యా! మరో మాట అడుగుతున్నాను... నీ మాట వినలేనందుకు... నన్ను... మనసారా క్షమిస్తావు కదూ...!

మీ పాదాలకు మీ తమ్ముడి... తుది... నమస్కారాలు!... శాశ్వత సెలవ్. అన్నయ్యా!... అన్నయ్యా!... వెళ్ళిపోతున్నాను...!

# ౨. కర్తవ్యం

"ఉద్యోగం మానేసి, ఎన్నాళ్ళిలా?"

"తెలియదు...!"

"జీతం – బత్తెం లేకపోతే, సంసారం గడిచేదెలా?"

"తెలియదు...."

"ఏమీ తెలియకుండా, పెళ్ళెందుకు చేసుకున్నారు?"

"అదీ తెలియదు! మీ బాబు – మా బాబు కలిసి, కుట్రపన్ని, నా చేత నీకు తాళి – అదే పసుపు తాడు కట్టించి, భార్యగ నిన్ను నా మెడకు చుట్టారు... నీవు మాత్రం అంతటితో వూరుకున్నావా? లేదు! ఇదిగో – ఇదిగో... ఇదిగో అంటూ ముగ్గురు పిల్లల్ని నా భుజాలెక్కించావ్... అనిత్యమైన యీ సంసార సుఖం శాశ్వత ద్దుఃఖానికి కారణమైంది. ఈ మాయ – మిధ్య లోకంలో కోరికల గుర్రాల.... జీవితాన్ని పరుగులు తీయిస్తున్నాయ్! ఈ మాయా మోహ మనసు యింతకాలం నాకు వాస్తవాన్ని తెలియనీయలేదు... ఇప్పటికైనా సత్యాన్ని గ్రహించాను. అనిత్యమైన, ద్దుఃఖకారకాలైన యీ మాయా మమకారం నుండి, కోరికల సుడిగుండం నుండి... ఆశల అగ్నిగుండం నుండి యీ అజ్ఞాన ఎండమావుల నుండి విముక్తిని పొందడానికి ప్రయత్నిస్తున్నాను... మేనకలా నీవు నన్ను మళ్ళీ సంసారమోహవశుని చేయకు..."

"ఏం పట్టుకుంది మీకు? ఏమేమో మాటాడుతున్నారు?

ఆఫీసుకు పోక యింట్లోనూ వుండక... యిన్ని రోజులు ఎక్కడెక్కడ తిరుగుతున్నట్లు?"

"జన్మ పరంపరలో కర్మవశుడనైన నేను ఎన్నో జన్మలతో... ఎన్నో చోట్లు తిరిగి... తిరిగి... మరెన్నో కర్మల ఫలితంగా నేటికి యీ జన్మ ప్రాప్తించింది. నీవూ నాలాగే ఎన్నో జన్మలు గడిచి యీ నాటికి యిలా నా భార్యగా నన్ను చేరావ్! ఇప్పటికైనా యీ మాయా మనసును జయించి ఆత్మజ్ఞానం పొంది, కర్మ విముక్తితో జన్మ రాహిత్యాన్ని చేరి, పరమాత్మ అనుగ్రహంతో మోక్షానికి అర్హతను సాధించాలి... యిదే మానవజన్మకు సార్థకం..."

"మీవరకు అది సరే! మరి, భార్య పిల్లల సంగతి?"

"గతించిన భర్తను అలా అడగగలదా ఏ భార్య అయినా? నా పూర్వాశ్రమం గతించింది... ఆత్మ మేల్కొంది! ఆధ్యాత్మికమే... నా లోకం! కర్మ బంధ విముక్తే... నా ధ్యేయం...!"

"మరణించిన భర్త మాటాడడు గదా! వేదాంతం చెప్పడుగా? అప్పుడిహ అడిగేది – చెప్పేది మాత్రం ఏముంటుంది?... మరి మీరు నిక్షేపంగా వున్నారు గదా? నిత్యం తిని, తిరుగుతూనే వున్నారుగదా?"

"మాయలో మునిగి వున్న నీ మనసుకు... కనిపించేదీ... అనిపించేదీ అదే! లేనిది వున్నట్లు చూపిస్తూ... కానిది అవునని భ్రమింపజేస్తూ, మనిషిని అజ్ఞాన చీకటిలో ముంచి వుంచేది ఆ మిథ్యా మనసే సుమా! అది నీడను నిజమని నమ్మించగలదు... ఇంకా నీవు ఆ మాయలోనే మునిగివున్నావు కనుక, భౌతిక

నేత్రాలకు కన్పించే యీ శరీరం నిజమనుకునే భ్రమతో అనిత్యమైన, నీటి బుడగలాంటి యీ సంసార బంధాలను – బంధుత్వాలను గూర్చి యింతగా మాట్లాడుతున్నావ్! నిజానికి మాయ మనసుతో తిరుగాడే యీ శరీరానికే ఆ బంధాలన్నీ...! ఆత్మకు అవి ఏ మాత్రమూ అంటుకోవు! అదే సత్యం – సర్వవ్యాప్తం – సర్వాతీతం! అది మినహా కనిపించేది... వినిపించేది... అనిపించేదీ... అంతా మిధ్యే! అది తెలియడమే జ్ఞానం! మేలుకో"

"మిమ్మల్ని, ఏదో మొండిదే పట్టుకుంది. అది భూతమో – రోగమో తెలియడం లేదు. ముందుగా సైకియాట్రిస్ట్ దగ్గరకు పోదాం పదండి!"

"నీవు పూర్తిగా భౌతిక భ్రమలో వున్నావ్! అందుకే భూతాలు కన్పిస్తున్నాయ్ నీకు! పంచభూతాత్మకమైన యీ ప్రకృతి నిర్మాణమే యీ మాయా శరీరం. అందుకు అశాశ్వతమైన యీ జీవితం నిజమని, నిత్యమని భ్రమిస్తున్నారు అజ్ఞానులు... నాలో నీకు భూతాలు కన్పించడానికి కారణం అదే! మాయ – మిధ్య అంటే అదే సుమా! నీవు పూర్తిగా భ్రమలో వున్నావ్! తమలోని ఆత్మను దర్శించగలిగిన వారికి ఆ భ్రమ నుండి ముక్తి లభించి, పరమాత్మ సన్నిధికి చేరగలరు! సైకియాట్రిస్ట్ కూడ మాయామోహ వశమైన పంచభూతాత్మక శరీరాన్ని కలిగిన వాడే కదా! నీవు నా గురించి అలా భ్రమించకు. ప్రస్తుతం నేను ఆ మాయాజాలం నుండి విముక్తి పొందే ప్రయత్నంలో వున్నాను. గురూజీ ఉపదేశం, వారి కటాక్షం నన్ను యీ మాయా సముద్రాన్ని దాటించగలవు."

“ఎవరా గురువు? ఏమా సంగతి?”

“భౌతిక మాయలో మునిగి మిధ్యనే నిజమని భ్రమించే నీవు... సద్గురువులో సత్యాన్ని, పరమాత్మను గుర్తించలేవు. నీడనే నమ్మేవాళ్ళు నిజాన్ని గుర్తించగలరా?”

“అందుకే ఆ సద్గురువు దర్శనం నాకూ చేయించండి! ఆ జగత్ మాయ నుండి నేనూ విముక్తి పొందుతాను. ముక్తి – మోక్షం మీ వరకే అనుకోవడం స్వార్ధం – అన్యాయం కూడా! మీకు అర్ధాంగిని నేను... అన్నింటా సగం వాటా వుంటుంది నాకు!”

“అది నీవనుకున్నంత యీజీకాదు. భగవంతుని సన్నిధిలో గురువు... గురువు దర్శనంతో భక్తుడు, భర్త సేవలో భార్య ... యీ క్రమంలో మనసును అర్పితం చేయగలిగిన వారికే యీ మాయ నుండి విముక్తి లభిస్తుంది...”

“భార్య – భర్త, పిల్లలు – సంసారం యివన్నీ నీడలే అన్నారుగా మీరు! పూర్తిగా భ్రమలే అన్నారుగా మరి! భర్త సేవంటారేమి?

“మాయ మిధ్య నుండి బయటపడడానికి సాధన చేసే భర్తలకు భార్యలు చేయ వలసింది అదే. భర్తకు త్రికరణ శుద్ధిగా సేవచేసే భార్యలకు భర్త ద్వారానే ముక్తి, మోక్షము లభిస్తాయి!” మాయ, మిధ్యలో మనసును జయించి, ఆత్మను దర్శించగలిగినవారికి అలాంటి బంధాలు వాటంతట అవే విడిపోతాయి. అలా పరమాత్మ వెలుగులో పునీతులు కాగలరు.

నేను ఆ ప్రయత్నంలోనే వున్నాను. ప్రస్తుతానికి నీవు సంసారబంధంలోనే వుండిపో! పిల్లలు పెద్దవాళ్ళు కావాలి గదా!"

"అందుకు మీరు లేకుండా, మీ సంపాదన లేకుండా, నేను చేయగలిగినది మాత్రం ఏముంటుందండీ? అందుకే చెబుతున్నాను... నా మాట విని పిల్లలకు మన బాధ్యతలు తీరేవరకు మీరు కూడా సంసార మాయలోనే వుండిపోండి. గురువులను దర్శించకండి! గృహస్థులుగా మన యిద్దరి బాధ్యతలు తీరిపోయాక మీతోపాటు నేనూ విముక్తి మార్గాన్ని వెతుకుతూనే జీవితం గడిపేస్తాను. భర్త అడుగుజాడలే భార్యకు శరణ్యం కదా!"

"నీ పతివ్రతా ధర్మం మెచ్చదగినదిగా వుంది! అయినా మొగుడికి కాపురం చేసి పిల్లల్ని కన్న స్త్రీకి సన్యాసానికి అర్హత వుందో లేదో నాకు బాగా తెలియదు. మా గురువుగారిని అడిగి తెలుసుకోవాలి!"

"అంటే మీ థియరీ ప్రకారం బ్రతికినంతకాలం ఆడది మగవాడికి కాపురం చేస్తూనే వుండాలా? ఒకవేళ మొగుడు సన్యాసై పరారైతే... బైరాగైతే... భార్య ఎవరికి  కాపురం చెయ్యాలి? పిల్లల్ని కలిగిన మగవాడు మాత్రం సంసారి కాదా? గృహస్థు కాదా? మరి సన్యాస స్వీకరణకు భార్యకులేని అర్హత, అవకాశం భర్తకు మాత్రం ఎలా లభిస్తుంది?"

"మగవాడికి వున్న హక్కులన్నీ ఆడదానికి వర్తించవు... ప్రస్తుత కుటుంబ వ్యవస్థలో గృహిణికి కొన్ని నియమాలు, హద్దులు వుంటాయి... ముఖ్యంగా భర్తకు సేవ చేసుకోవడం పిల్లల్ని మంచి

పౌరులుగా తయారించడం ఇల్లాలిగా స్త్రీ బాధ్యతలు! భర్త అంటే భరించేవాడు! అందుకే అన్ని హక్కులూ అతనికే వుంటాయి!”

“భరించడం అంటే... సంపాదించడం కుటుంబాన్ని పోషించడమనేగా అర్థం?”

“అవును. అందుకే సమాజం పురుషాధిక్యతలో వుంది.”

“మరి అలాగైతే... మీలాగా సర్వం మాయ, మిధ్య అంటూ సంపాదన బాధ్యతను వదిలేసే భర్తలకు... “భరించడం...” అనే అర్థం వర్తించదేమోగా! ఆ మాదిరిగా చూస్తే... మగవాడికి గల హక్కులన్నీ ప్రస్తుతం మీరు కోల్పోయినట్లేనా?... మరోమాట! సంపాదించి పోషించడమనే బాధ్యత కారణంగానే, సమాజంపై పురుషాధిపత్యం యేర్పడిందన్నారు మీరు. ఆ లైన్‌లో సంపాదించే ఆడవాళ్ళకు కూడా కుటుంబంపై అలాటి ఆధిక్యత యేర్పడడం న్యాయమేగదా! అలాగే సంపాదనా బాధ్యతలు వదిలేసి సన్యాసి వేషాలు వేసేవారికి సమాజంలో వుండే హక్కులేమిటి?”

“నీవు భౌతిక మాయలోను, సంసార మిధ్యలోనూ మునకలు వేస్తూ వున్నావు కనుక సత్యాన్ని గ్రహించలేవు! అందుకే సన్యాసం గురించి అలా మాట్లాడుతున్నావ్! ఏకాగ్రతతో, నాసికాగ్రంపై చిత్తాన్ని నిలిపి ధ్యానం చెయ్యి! నీ మనసుకు మాయ వదలి సత్యం బోధపడుతుంది!”

“మన మనసులు మాయను వదిలేస్తే... సంసార మాయలో పుట్టిన పిల్లల గతేమిటండీ? కన్నందుకు వాళ్ళ జీవితాలను వాళ్ళే నడుపుకోగలిగే వరకు పేరెంట్సుగా మన బాధ్యతలు మనం

నెరవేర్చాలి కదా! అనాథలుగా, వాళ్ళనీలోకంలో వదిలెయ్యలేం కదా! మరోమాట! కోపం తెచ్చుకోకండి! తెలియక అడుగుతున్నాను. దేవుళ్ళు – వాళ్ళ అవతారాలు కూడా భార్య పిల్లలతో సంసార జీవితాలు గడుపుతూనే వున్నారు గదండీ! అలాగే ఋషులు, మునులు కూడా చాల వరకూ గృహస్థులేగదండీ! విరాగులు – బైరాగులుగా, సాధువులు – సన్యాసులుగా వారు మారలేదు గదండీ! మాయా మిథ్య గురించి మీకు తెలిసినంతగా వారికి తెలియదంటారా? శివుడు ధ్యానముద్రలో తపస్సు చేస్తూనే వుంటాడు. అలాగే విష్ణువు యోగనిద్రలో వుంటాడు... వాళ్ళకూ వాళ్ళ సంసారాలు అతి సమీపంలోనే వున్నాయి గదండీ? మీరు చెప్పినట్లు ధ్యానం చేసి మాయ వదలి, సత్యాన్ని పొందితే... సంసారాలతో వారికి పని వుండగూడదు కదండీ! గృహస్థులుగా అలాటివారంతా ఎంజాయ్ చేస్తూంటే మీరు యిలా అంటారేమిటి? ఏవిటో! నా చిన్న బుర్రకు ఏమీ అర్థం కావడంలేదు!"

"నీవు! పూర్తి అజ్ఞానంతో మాట్లాడుతున్నావ్! దేవుళ్ళు – ఋషులు, మునులు, అలాంటి వారంతా సర్వశక్తి సంపన్నులు! మాయ – మిథ్య వారిని చేరలేవు! కనుక గృహస్థ జీవితంలో కూడ వారు పవిత్రులే!"

"సర్వ శక్తి సంపన్నులు – మాయాతీతులు అయివుండి కూడా వారు నిత్యం తపస్సు ఎందుకు చేస్తారో మరి!"

"నిత్య పవిత్రత కోసం, శక్తి సంపదకోసం!"

"అలా అయితే మీరుకూడా తీరిక సమయాలలో ధ్యానం చేసుకోండి! మాయ, మిధ్యలు మీనుండి పారిపోతాయి! అంతేగాని సంసార బాధ్యతలను వదిలేసి, పరారైతే అవీ మీతోనే వుంటూ, మీ వెంటే తిరుగుతూ వుంటాయి. శని శివుణ్ణి వదిలిందా?"

"సర్వజ్ఞులు - సర్వశక్తిమంతులు - మానవాతీతులతో నన్ను పోలుస్తావేంటి? వాళ్ళు కారణజన్ములు. నిత్య పవిత్రులు - సత్య దర్శకులు, చిరంజీవులు. మాయలో పుట్టి భ్రమతో బ్రతికి, తనువు చాలించడం మనిషి చేస్తున్న పని! అందుకే ధ్యానం, జ్ఞానం ద్వారా దానిని తొలగించుకొని పరమాత్మను తెలుసుకోవాలి!... అందుకే యీ క్షణిక సుఖాలు, నిత్య దుఃఖానికి హేతువయ్యే సంసార బంధాలు... వదిలించుకోవాలి! కర్మకు అతీతంగా బ్రతకాలి..."

"బుద్ధిలేకపోతే సరి! భార్యతో సుఖించి, పిల్లల్ని కని... వాళ్ళను పోషించవలసి వచ్చేసరికి ఓపిక తగ్గి వైరాగ్యం గుర్తుకొచ్చిందా? మాయ - మిధ్య సాకుగా దొరికాయా? సోమరితనాన్ని స్వాగతిస్తారా?"

"ఏమన్నావ్! నాకు బుద్ధి లేదా?... అసలు నీవు పతివ్రతవేనా? ఆ పరుషపు మాటలేంటి? అయినా భరిస్తాను భర్తను కదా నీకు? కోపం తెచ్చుకోను. అరిషడ్వర్గాలను జయించే ప్రయత్నంలో వున్నాను కనుక తమాయించుకుంటున్నాను. సాత్వికతే నా విధానం."

"కోపం వచ్చినప్పుడు చూచుకుందాంలెండి! అదిసరే! కర్మ ఫలితాన్ని ముందుగానే మనసులో నిలుపుకోకుండా మనిషి తాను చేయవలసిన విధిని, ధర్మాన్ని నెరవేర్చాలనే గదా గీతాకారుని సందేశం! మరి కర్మ చేయడానికి కారణం వుండాలి గదా! అందుకు జీవిత బాధ్యత అవసరం కదా! అలా జీవిత/జీవన అవసరానికి మనిషి చేసే కర్మకు రిలేషన్ తప్పదు కదా? మీదృష్టిలో యిదంతా మాయ - మిధ్యేనంటారా? ఇంతకూ, అసలు మాయ-మిధ్యా అంటే ఏంటి స్వామీ?... ఏం అలా చూస్తారు? సంసారం కాదనుకున్నవారు మీరు స్వాములేకదా స్వామీ?... అయినా గాలి పీల్చి, నీరుపోసి, తిండిపెట్టి శరీరాన్ని పోషించుకోవడం ఎందుకు? శ్రమించడానికి కాదూ? మనసుకు ఆలోచన ఎందుకుంది? మంచి బుద్ధితో జ్ఞానాన్ని వృద్ధి చేసుకోడానికి కాకపోతే..."

"ఇంతకూ నన్నేం చేయమని నీ వుద్దేశ్యం?"

"ఏం చేద్దామనుకుని పెళ్ళి చేసుకున్నారు? కష్టించి సంపాదించి, పెళ్ళాం పిల్లల్ని పోషించాలనా... లేక సర్వం మిథ్యంటూ సన్యాసుల్లో చేరిపోదామనా?... చూడండి! **దేనికైనా మనసు ముఖ్యం! మంచిచెడులకైనా, మిధ్యా మాయలకైనా... సంసారం - సన్యాసానికైనా... సుఖదుఃఖానికైనా... ధ్యానం - జ్ఞానానికైనా, ఆత్మ - పరమాత్మ దర్శనానికైనా, ముక్తి - మోక్షానికైనా, మనసు, దాని ఏకాగ్రత, శక్తి - పవిత్రత, సమర్థత ముఖ్యం! జీవికి పుట్టుకతో వచ్చిన ధర్మం బ్రతకడం! అందుకు అవసరమైన కర్మ నిర్వహణ తప్పని సరి! దానిని బాధ్యతగా**

**గుర్తించి, చిత్తశుద్ధితో నెరవేర్చాలి! అక్కడే మనసు వికారరహితంగా వుండాలి! అవసరం - అవకాశాలను బట్టి, బుద్ధి చాతుర్యాన్ని బట్టి కర్మ అనేక విధాలుగా వుంటుంది. కర్మకు కర్తవ్యనిష్ఠ అవసరం. అందుకు మనసు నిత్యం మనిషి స్వాధీనంలో వుండాలి! కర్మయోగమే - జ్ఞాన యోగ అర్హత కావాలి!** వికార మనసు వైరాగ్యాన్నైనా భ్రష్టు పట్టిస్తుంది. విశ్వామిత్రుడు తపస్సు చేస్తున్నాడని తెలిసి, అది ఏ పాటిదోనని చూచిపోదామనేగా మేనక వచ్చింది!... కళ్ళు తెరచి విశ్వామిత్రుడు కడుపుచేసి మేనకకు, కాన్పు చూచి... కన్పించకుండా పోయాడు! కాపురం చేయడానికి రాలేదు కనుక కన్న బిడ్డను వదిలేసి... ఆమెకూడా తన దారిన తాను పోయింది. పక్షులు పెంచవలసి వచ్చింది ఆ బిడ్డను! ఈ కథ కమామిషు మీకూ తెలుసు కదా! అంటే ఏమన్నమాట... **మనసు వికారం మహర్షినైనా, రాజర్షినైనా రజోగుణంలోకి నెట్టి, తమోగుణంతో వదిలేస్తుంది!** పైగా బాధ్యత తెలియనివారికి మానవత్వమూ మృగ్యమవుతుంది. సంసారిగా మీరు విశ్వామిత్రుణ్ణి అనుకరిస్తారా?... అందుకే తపస్సంపన్నులు కోపానికి బానిసలై, అహంకారంగా శాపాల్ని జారీ చేస్తూ వుంటారు. అలాటివారికి వారి మనసు వారి స్వాధీనంలో లేనట్లేగదా! తపస్సు ద్వారా సాధించాలనుకునేది ఇంద్రియాతీత మనస్సునే గదా! అందుకు సన్యాసం అవసరమా? గృహస్థులుగా తమ విద్యుక్త ధర్మాన్నే నెరవేరుస్తూ, ఆధ్యాత్మిక శిఖరాలకు చేరినవారు ఎంతమంది లేరూ? వారంతా మీలాగా జీవితాన్ని మిధ్య, మాయ అనుకుని వదిలేసి సోమరిపోతులుగా

తయారయ్యారా? వృత్తి – ఉద్యోగ బాధ్యతలను వదిలేశారా?... ఇదే చెప్పడం మీకు! బాగా వినండి! మాయ – మిథ్య అంటూ సోమరిపోతుగా తయారుకాకుండా, బుద్ధిగా ఉద్యోగం చేసి సంపాదించి, సంసార పోషణతో గృహస్థ ధర్మాన్ని, కర్తవ్యాన్ని పూర్తిగ నెరవేర్చుకోండి.... కాదంటే... నన్ను నమ్మించి, పెళ్ళి చేసుకుని, పిల్లల్ని కనిపించి, మా పోషణ బాధ్యతను వదిలేసి, భార్యగా నన్ను భావించకుండా, వైరాగ్యం పేరుతో చెడు తిరుగుళ్ళు తిరుగుతున్నావని, భర్తగా నాకు నమ్మక ద్రోహం చేసినట్టు మీమీద క్రిమినల్ కేసుపెట్టి సివిల్ దావా వేస్తాను. భార్యగా నాకుగల హక్కుగా పిల్లలకు తల్లిగా నాకుగల బాధ్యతగా మీమీద చర్య తీసుకోవలసి వస్తుంది. అది మాయో, మిథ్యో కోర్టులో తేలగలదు... ఇహ మీ యిష్టం!"

"అది సరే! ఇంతటి జ్ఞానం నీకు ఎలా అబ్బింది? పూర్వజన్మ సుకృతమేమో?"

"సుకృతం లేదు. అకృతం లేదు! నిత్య సత్యాన్వేషణే మార్గం! మీలాగ విద్యుక్త ధర్మాన్ని వదిలేసి, బాబాలు, అమ్మలు యిలాటి వారి చుట్టూ తిరగలేదు. పుస్తక పఠనం, జీవిత అనుభవ జ్ఞానాన్ని అధ్యయనం చేస్తూ, దానిని మనసులో పదిలం చేసుకుంటూ, దానిలోని వాస్తవాన్ని నిరూపించుకుంటూ వుండాలి. **కళ్ళతో చూడగలిగిన దాన్ని స్పర్శతో తెలుసుకోగలిగినదాన్ని... అనుభవాన్ని మిథ్య, మాయంటూ లేని దానినే సత్యమంటూ ఊహల వైరాగ్యంతో యాత్రలు చేస్తోంటే జ్ఞానం రాదు. కర్మయోగ సమగ్రతే జ్ఞానయోగానికి మార్గం కావాలి! ఆధ్యాత్మిక సంస్కృతిలో**

మొదటిగా గుర్తించవలసింది దీనినే... నిజానికి, సద్గురువులు బోధించవలసిన విధానం యిదే కావాలిగాని, మిథ్య మాయలు కాదు.

నిత్యం సత్యం అనుకునే 'ఆత్మ'కు దాని ఉనికికి నిమిత్త మాత్రమనుకునే పాంచభౌతిక శరీరమే ఆధారం! స్థూలమైనా - సూక్ష్మమైనా... ఏదో ఒక 'శరీర'మే దాని గుర్తింపుకు అవసరం అవుతోంది! అలాగే భౌతిక కర్మకైనా, ఆధ్యాత్మిక భావనకైనా దాని స్వరూప స్వభావాలే ముఖ్యం! కనుక, పంచేంద్రియ ప్రభావితమైన మనసును, వికార ప్రకోపానికి లోనుకాకుండా, నిగ్రహ, సంయమన స్థితిలో దానిని వుంచుకోగలగాలి! అందుకు, భక్తి - ధ్యానం ఏ మార్గాన్నైనా అనుసరించవచ్చు!...

అందుకే, మరోసారి చెబుతున్నాను. ధర్మార్థ కామ మోక్ష క్రమాన్ని  అనుసరిస్తూ, ప్రథమంగా కర్మయోగాన్ని పూర్తిగా నెరవేరుస్తూ గ్రహించి, గృహస్థ కర్తవ్యపాలన, బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తూ... తీరిక సమయాన్ని భక్తి - ధ్యాన - వేదాంత యిష్టమైన మార్గంలో, మీ మనోశక్తిని సద్వినియోగం చేసుకోండి! మాయ - మిథ్యల జోలికి పోవద్దు! అలా చేస్తే... ఏం జరుగుతుందో చెప్పాను గదా! దానిని మనసులో పెట్టుకొని, రాజర్షిలా గృహస్థ ధర్మాన్ని సమగ్రంగా నెరవేర్చుకోవడం ద్వారా మీరనుకునే మానవజన్మ సార్థకతను సాధించుకోండి!... ఏమిటా పిచ్చి చూపు?..."

"మరేమీ లేదు! నీలో సద్గురువును దర్శిస్తున్నా!"

"(నేను) గురువును కాదు... గోపికను కాను! అక్షరాల మీ భార్యను!.. మీ పిల్లలకు తల్లిని! భర్త – సంతానం పట్ల బాధ్యత తెలిసిన యిల్లాలిని!... అందుకే యింత సుదీర్ఘంగా నాకు తెలిసినదేదో చెప్పాను. నా శ్రమను వృథా చేయకండి! ఆలోచించి, ఆచరణకు పూనుకోండి!.. లేవండి... భోజనానికి! రేపటి నుండి మామూలుగా ఆఫీసుకు వెడతారు కదూ!... మా వారు మంచివారు!... అలాగే చేస్తారు!... ఏమంటారు?"

"సర్వజ్ఞాని... నా భార్య! వేరే గురువు నాకేల? ఆనాడు కురుక్షేత్ర యుద్ధ రంగంలో అర్జునుడికి కర్తవ్యాన్ని గుర్తుచేసే జ్ఞానయోగాన్ని బోధించిన ఆ గీతాకారుడే నీలో నాకు ప్రత్యక్షమైనాడు! నా మనసు పులకించింది. జన్మ ధన్యమైంది. నీవు నాకు కేవలం భార్యవే కాదు కర్తవ్యాన్ని నిర్దేశించి, నన్ను నడిపించే జీవిత సారథివి నీవు!"

"పోలికలు పొగడ్తలు యిహ చాలుగాని, కర్తవ్యాన్ని మరవకండి! గురువులైనా, మరెవరైనా, వారినుండి జ్ఞానబోధను గ్రహించాలి! దానిలోని వాస్తవాన్ని స్వీకరించాలి! ఆచరణ ద్వారా దాన్ని సార్థకం చేసుకోవాలి! సరేనా? లేవండి మరి!..."

"చిత్తం! ఆజ్ఞ!"

"అదే పరాధీన మనస్సంటే! అన్నింటా వ్యక్తిత్వం ప్రకాశించాలి!"

"నీ ఎదురుగా, ఏదీ కరెక్ట్‌గా మాట్లాడలేకపోతున్నానే...?"

"అదిగో! ఆ న్యూనతాభావమే తగదు! **వినయ వివేకంతోపాటు ఆత్మ విశ్వాసం, స్వతంత్ర భావం ప్రతి మనిషికీ అవసరం! అహంకారం లేదా దాసోహం – ఈ రెండూ కాదు. క్రియాశీలత, సమర్థత అవసరం!** మీకు అన్నీ వున్నాయి. అయినా యిప్పటివరకూ అవి ఉపయోగంలో లేవు! మాయ – మిథ్యలకు మీ మనసును బాగా అలవాటు చేశారు! ఇహనైనా – మీ మనసును వాటి జోలికి పోనివ్వకండి... ఇంతకూ... లేస్తారా... లేదా?"

"................................."

# 3. దుర్భోధ

"తాళి కట్టడమంటె, తాడుతో పశువును కట్టివేయడం కాదు! ఆడదానికి అది పెళ్ళి గుర్తు మాత్రమే! 'ఆ గుర్తు మగవాడికేదీ?' అని అడిగితే... సరియైన సమాధానం చెప్పదు యీ సమాజం!... 'దేవుళ్ళ పెళ్ళిళ్ళూ అలాగే జరుగుతున్నాయి కనుక, మనుషులు ముఖ్యంగా ఆడవాళ్ళు అలా ప్రశ్నించకూడదంటారు'. పైగా, పవిత్ర తాళిని ప్రశ్నించడం పతివ్రతకు తగిన పని కాదంటారు!... 'పతివ్రతం' ఆడదానికేనా? 'సతివ్రతం' మగవాడికి అక్కర్లేదా'? అని అడిగితే... 'కన్యాదానంతో పుట్టిల్లు వదలి భర్త యింటికి చేరిన ఆడదానికి పిల్లల్ని కనడానికి, పతికి సేవ చేయడానికి, భర్త పోషణలో సమాజ గౌరవాన్ని పొందడానికే అర్హత! అందుకు పతికి పతివ్రతగా కట్టుబడి వుండాలని' అర్థమేమోమరి! అలా అయితే సంపాదించే భార్య – ఇల్లరికం అల్లుడి సంగతి ఏమిటి? ఇదే సూత్రం అలాటివారికి అన్వయం కాదా?

"మొగుడికి కుదురుగా కాపురం చేసే లక్షణాలు నీలో కన్పించడంలేదు. పురుషుడి పౌరుషం – ఆడదాని ఆవేశం, నీలో ఫిఫ్టీ–ఫిఫ్టీగా వున్నాయి. ఏ క్షణాలలో ఏ లక్షణం యాక్ట్ చేస్తుందో, రియాక్ట్ చేస్తుందో తెలియడం కష్టంగా వుంది. భర్త యింట్లో ఒక మనిషిగా బ్రతకవలసిన నీవు, పబ్లిక్‌గా రాజకీయ డైలాగ్‌లు చెప్పడమంటే... సంసార లక్షణాలుగల భార్యగా నిన్ను ఎలా చెప్పుకోవాలి? నీ ప్రవర్తన కారణంగా పదిమందిలో నా మర్యాద నోరు నవ్వి, నొసలు వెక్కిరించినట్లుగావుంది. ఫలానా వాడి పెళ్ళాం పబ్లిక్ పర్సనంటే... కుటుంబ మర్యాద ఏం కావాలి?

నిజానికి నీవు ఊరుమీద తిరగవలసిన దానివే! సోషల్‌వర్క్... 'స్పెషల్' వర్క్ చేస్తూ బ్రతకవలసిన దానివి! స్టేజీ వేషాలే నీకు సూటవుతాయి! నీ హాబీలు లాబీలు – ఇంట్రెస్ట్ – ఎలిజిబిలిటీల గురించి పెండ్లికి ముందే నీవు మీ వాళ్ళకు చెప్పి వుండవలసింది... మాకూ యీ తల కుమ్మరం తప్పిపోయేది... నీకూ నీవు కోరుకున్న బ్రతుకు దక్కేది. అయినా యిప్పుడు మాత్రం మించిపోయింది ఏమీలేదు... బాగా ఆలోచించుకో!

**స్వేచ్ఛ – యిష్టం వ్యక్తిగతమే కావచ్చుగాని, సంసారం సమాజపరంగా బాధ్యతలపేర ఆ స్వేచ్ఛకు విచక్షణా పరిమితి యేర్పడుతుంది. తాను వున్న స్థానాన్ని బట్టే – వ్యక్తి స్వేచ్ఛకు హక్కులు, బాధ్యతలు కలుగుతాయి. అదే సంసార కట్టుబాటు, సమాజ పౌర ధర్మం!** విచ్చలవిడిగా, కోరుకున్న విధంగా తిరిగి బ్రతకాలనుకునే నీలాంటి విప్లవ వనితకు ఊరుమీద బలాదూరే సూటబుల్! పరువు మర్యాదలతో, బాధ్యతలతో కూడిన సంసారిక బ్రతుకు నీకు బాధాకరమే మరి! నీ ఒరిజినాలిటీయే అది! నీలో మార్పురాదు! మాకు అది సరిపడదు. బాగా ఆలోచించుకుని మీ వాళ్ళ సలహాతో ఏదో ఒక నిర్ణయానికి రావడం అందరికీ మంచిది"

"అంటే...? నాకు అర్థం కావడం లేదు"

"ఇంతకంటే వివరించి చెప్పగలశక్తి నాకు లేదు!"

"వాస్తవం మాటాడితే... అర్థం... ఊరుమీద తిరగడమా? ఉద్యమాలు నడపడమా? స్టేజీ లెక్కి ఉపన్యాసాలివ్వడమా?

సంసారానికి పనికిరాకుండా పోవడమా?"

"మత్తులో ఒళ్ళు తెలియక ఏదేదో మాట్లాడేవారుకూడా తమది వాస్తవమేనని తమకు తాము అనుకుంటారు. కుటుంబ జీవితంలో వుండేవారికి కొన్ని పద్ధతులు, కట్టుబాట్లు వుంటాయి. అలాగే భార్య భర్తగా వేరు వేరుగ – ఉమ్మడిగా హక్కులు, బాధ్యతలు వుంటాయి! **సమాజ జీవితంలో ప్రతివారు పౌరధర్మానికి లోబడి వుండాలి. కుటుంబ వ్యవస్థకు కొన్ని కట్టుబాట్లు, ఆచారాలు, సంప్రదాయాలు వుంటాయి. వాటిని గౌరవించాలి! అలాగే ప్రభుత్వ చట్టాన్ని ప్రతివారు ఆమోదించి ఆచరించాలి! తమ ధర్మాన్ని పూర్తిగా నెరవేర్చగలిగినప్పుడే ఎవరికైనా యితరుల బాధ్యతలను గూర్చి ప్రస్తావించే అవకాశం వుంటుంది.** గృహిణిగా నీ బాధ్యతలను నీవు చిత్తశుద్ధిగా నెరవేర్చగలిగినప్పుడే భర్తను గూర్చి ప్రశ్నించే అవకాశం వుంది. సమాజమొత్తంలో స్త్రీ సమస్యలను గూర్చి మాట్లాడే బాధ్యతగల మహిళా సంఘాలు ఎన్నో వున్నాయి. అందుకు నాయకులున్నారు... కనుక అది నీ పనికాదు. అయినా గృహిణి లక్షణాలు నీలో లేవు. ఇల్లాలి కళ అసలే కన్పించడం లేదు. ఉపన్యాసాల ఉద్రేకమే నీలో అధికం...! కనుక ఆ రంగాన్నే నీ జీవిత విధానంగా నిర్ణయించుకోవలసింది! అనవసరంగా యీ కుటుంబ లంపటంలో పడి, ఉభయ భ్రష్టుగా వ్యవహరిస్తున్నావ్..."

"అంటే... కాపురం చేసుకునే ఆడవాళ్ళు భర్త – పిల్లలు ఇవే తప్ప వేరే విషయాలేవీ మాట్లాడగూడదన్నమాట! అలా మాట్లాడేవాళ్లకు సంసార లక్షణాలు లేనట్లేగా మీ లెక్కగా? పగలు

వంటిల్లు – రాత్రి పడకటిల్లు, మధ్యలో పిల్లల చాకిరీ – భర్త సేవ... ఇవే యిల్లాలిగా... ఆడదానికి అర్హతలు! సమాజంతో వాళ్ళకు పనిలేదన్నమాట! సంపాదిస్తూ సంసారాన్ని పోషించే ఆడవాళ్ళకు కూడా ఇవే డ్యూటీలు కావాలన్నమాట! అంతేనంటారా?"

"నీతో వాదిస్తూ, నన్ను నేను దిగజార్చుకోలేను నీ లాజిక్‌ను యింతటితో సరిపెట్టు!"

"అలాగే మీరు చెప్పినట్లే చేస్తాను..., ఇందాక ఏదో నిర్ణయానికి రమ్మన్నారు? దేనిని గురించి?"

"ఊరు వ్యవహారాలు మానేసి, భర్తకు భార్యగా, పిల్లలకు తల్లిగా – యింటికి యిల్లాలిగా పరువు మర్యాదలతో సంసారం చేసుకుంటావో... లేక ఊరుమీద బలాదూర్ తిరుగుతావో నీకు ఏది యిష్టమో తేల్చుకో! అన్నీ కావాలనుకోవడం ఆడదానికి తగదు..."

"చూడండీ! లీగల్‌గా – సమాజ సమ్మతితోనే... మీకు భార్యగా హక్కు, బాధ్యతలతోనే నేను యీ యింటిలో ప్రవేశించాను... భర్తకు భార్యగా – పిల్లలకు తల్లిగా, యీ యింటి కోడలిగా నాకు గల హక్కు – బాధ్యతలు నాకు పూర్తిగా తెలుసు! ఆ విషయంలో మరొకరితో చెప్పించుకోవలసిన స్థితిలో నేను లేను! నేనూ... మంచి మర్యాద, పరువు ప్రతిష్టలుగల కుటుంబం నుంచే వచ్చాను. ఇహ మీకు సంబంధించి మీ బుర్రకు పట్టివున్న పాతకాలపు చాదస్తపు బూజుని దులిపేసుకుని, నేటి ప్రపంచ

తీరును గమనించండి! 'పోషించే వాడే పురుషుడు... భరించే వాడే భర్త' అనుకునే కాలం గతించి పోతోంది. నేడు సంపాదనకు, సమర్ధతకు స్త్రీపురుష భేదం లేదు. అందుకు అవకాశాలను వెతుక్కోవడమే అందరి పని! అలాగే కుటుంబమే మనిషికి లోకం కాదు. భూగోళమంతా చిన్న టి.వి.లో యిమిడిపోతోంది! జాతి మధ్య దూరం తరిగి పోతుంది! మరి దానితో పాటు మానవ మనస్సులు కూడ సమీపంలోకి రావాలిగదా? **భర్తకు భార్య కేవలం భోగ వస్తువేకాదు  బాధ్యతగల జీవిత భాగస్వామిని!** పిల్లల బాధ్యత తండ్రిలా భర్తకంటే, తల్లిలా భార్యకే బాగా తెలుసు. అంత మాత్రాన స్త్రీకి లోకంతో పని లేదనుకోవడం ఈ కాలానికి సరిపోయేది కాదు. చదువు, సంస్కారం, ఉద్యోగం, సమాజ దృష్టి గలవాళ్ళకు అది అసలు సాధ్యంకాదు. స్త్రీ జాతిని గూర్చి సమాజంలో పురుషాధిక్యత, అహంకారం కారణంగా మహిళాలోకానికి జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను గూర్చి బహిరంగంగా మాట్లాడవలసిన బాధ్యత స్త్రీగా నాకు వుంది. అంత మాత్రాన అది పురుష ద్వేషం, భర్తను ధిక్కరించడం, గృహిణిగా సంసార బాధ్యతలు తెలియకపోవడం, కుటుంబ పరువు మర్యాదలను పోగొట్టడం కాదు! 'ఆడది తిరిగి చెడడం - మగవాడు తిరగక చెడడం' అనేది తప్పు అవగాహన! **మంచి - చెడు ద్వంద్వంగా మనిషిలో ఎప్పుడూ వుంటాయి!** అందుకు ఆడ - మగ... బయట తిరగడం, తిరగక పోవడం... అంటూ వేరుగ వుండదు... అది, మనిషి మనస్సును బట్టి, వ్యక్తిగత నీతి, సంస్కారాన్నిబట్టి వుంటుంది. ఆడది యింట్లోనే వున్నా...

మగవాడు బయట తిరిగినా బుద్ధిని బట్టే బ్రతుకు తీరు, మంచి – చెడు, నీతి – అవినీతి వుంటాయి. కనుక నేను స్త్రీ జాతిని గూర్చి సమాజ స్ఫూర్తితో మాట్లాడినంత మాత్రాన ఇల్లాలిగా నా అర్హతను కోల్పోయినట్లు కాదు. అనవసరంగా బుర్రపాడు చేసుకోవద్దు! ఆడదానికి అందమే కాదు, దీనితోపాటు సభ్యతా సంస్కారం, వ్యక్తిత్వం, ఆత్మ విశ్వాసమూ వుంటాయి. అవి కేవలం మగవారికి ప్రత్యేక పేటెంట్ కాదు... ఏమంటారు?"

"నీలాటి మాటలు నేర్చిన మనిషిని పెళ్ళి చేసుకోవడమే నేను చేసిన తప్పు!"

"ఆ మాట యిప్పుడనుకోవడం... గతజలసేతుబంధమే! నేటి సమాజ దృక్పథ విశాలత మీ బుద్ధికి ఎలాగూ లేదు. అది నాకూ వద్దంటే ఎలా? నా మాట విని యిహనైనా కాస్త బయటి ప్రపంచాన్ని పరికించి, పలకరించి నేటి సమాజ జీవన జీవిత విధానాన్ని గమనించి, అర్థం చేసుకోండి! చంద్రుడు పూర్తిగా తెల్లగా లేకపోయినా, వెన్నెల చల్లగానే వుంటుంది మానవ నాగరికతా – అంతే మరి! అయినా దానిని అనుసరించడం మనిషి సమాజ జీవితానికి తప్పని సరి! నోటిలో పడింది మొదట చేదుగా వున్నా... లాలాజలం కలిసి అది ఆ చేదును పోగొట్టుకుంటుంది. అలాగే, నా మాటలు మీకు కోపం తెప్పిస్తున్నా... నిదానించి ఆలోచిస్తే... వాటిలోని వాస్తవం మీకే తెలుస్తుంది... ప్రస్తుతానికి మీరు ఆ పనిచేస్తూ వుండండి... నేను పోయి వంట వ్యవహారం చూస్తాను... సరేనా?... ఏమిటి అలా చూస్తారు?"

"అందం అధికమైనా... తెలివి మీరిపోయినా అలాటి ఆడదానితో అవస్థలే మగవాడికి!... ప్రస్తుతం నా పరిస్థితి అదే!... 'సరేనా' అంటే ఏం చెప్పను?"

"ఏం చెప్పాలో బాగా ఆలోచించుకుని... మీ వాళ్ళ సలహాతో ఏదో ఒక నిర్ణయానికి రండి..."

"నా మాటను నాకే ఒప్పగిస్తున్నావ్!"

"మొగుడూ పెళ్ళంగా... మీకూ నాకూ 'అది' తప్పదు."

– – –

"మిత్రా! నీ పెళ్ళాం పెత్తందారైపోయింది! ఆడమగ, కుడి ఎడమ తేడా లేకుండా అందరితోనూ రాచుకుని – పూసుకుని తిరుగుతోంది! స్టేజీలెక్కి, పబ్లిక్‌గా ఉపన్యాసాలు దంచుతోందట! ఆమె నీ మాటలో లేదా మిత్రా?"

"ఉద్యోగం చేస్తోందిగదా బాబాయ్! పదిమందితో మాట్లాడక తప్పదు!... మహిళా సంఘ సభ్యత్వం కూడ వున్నట్లుంది. వాళ్ళ మీటింగ్‌లకు పోవలసి వుంటుందేమో మరి!"

"అయితే... యిదంతా నీకు తెలిసే జరుగుతోందన్నమాట! ఆమె చేష్టలు మొగుడివిగా నీకే యిష్టమైనప్పుడు... ఎవరికి మాత్రం ఏమిటిగాని... కాకపోతే యింటి యిల్లాలిగా కాక సోషల్ వర్కర్‌గా, సొసైటీ మనిషిగా బహిరంగ స్టేజీలెక్కి స్పీచ్‌లిస్తూ వంశగౌరవాన్ని, కుటుంబ మర్యాదను గంగలో కలిపేస్తోంటే... బాధగా వుందిరా! ఇప్పటి వరకూ మన కుటుంబాలలో ఎవరూ యిలా

బరితెగించలేదురా? మన వంశగౌరవం తెలిసినవారు ఎన్నిరకాలుగానో అనుకుంటారు... 'ఫలానా వాడి పెళ్ళాం యిలాగా' అని అందరూ అనుకుంటూ వుంటే పదిమందిలో నీకు మాత్రం ఏం పరువుంటుందిరా?"

"ఏమైంది బాబాయ్? నీ మనసుకింత బాధ కలిగిందంటే... ఏదో పెద్దకారణం వుండాలి! ఆమె విషయంలో యింతవరకు నాకు ఏవిధమైన అనుమానమూ కలగలేదు..."

"ఎవరి ముఖం వారికి కనపడదు... అద్దం కావాలి! అలాగే, ఎవరి భార్యను గూర్చి వారికి తెలియదు. బయట వినే మాటల ద్వారానే అసలు విషయం గ్రహించాలి! నీ భార్య గురించి వ్యతిరేకంగా చెప్పవలసిన అవసరం నాకు లేదు... నా సంగతి నీకు తెలుసు. పాతకాలపు వాడిని! నా దృష్టిలో ఆడదాని శీలం ప్రాణం కంటె విలువైనదని, మగవాడి పరువూ మర్యాద, గౌరవం ఆడదాని కారణంగానే నిలవడమో - కొట్టుకుపోవడమో... జరుగుతూ వుంటుంది. ఆమెకు వ్యతిరేకంగా నేనేదో చెబుతున్నానని అనుకోకు! నిజానికి ఆమెను గురించి నాకు తెలిసినవన్నీ యిప్పుడు నేను నీకు చెప్పడంలేదు! ఒకరకంగా అది తప్పు! వంశగౌరవాన్ని కాపాడుకోవాలనే తాపత్రయంతో ముందు జాగ్రత్త కోసం నీకు యిలా చెబుతున్నాను... నీ యిష్టం! మీదపడి పోయినట్లు సిగ్గు బిడియం లేకుండా నడిరోడ్డుమీద, నలుగురి మధ్యే... భర్త గలిగిన ఒక ఆడది పరాయి మగవాడితో పగలబడి నవ్వడమేంటి... అది మనసులోకి వస్తేనే... నాతల తిరిగిపోతోంది"

“ఎవడు వాడు?”

“ఎవడో! నాకు మాత్రం ఏం తెలుసు? నేను కళ్ళారా చూచిన దృశ్యాన్ని మాటలో చెబుతున్నా! అయినా నీతి తప్పిన ఆడదానికి బట్టుపెట్టినట్టు ఒకడనేవిటి? ఆ నీతేవుంటే భర్తతోనే కట్టుబడి వుంటుందిగా ఏ ఆడదైనా?... నేనేదో చెప్పానని నా గురించి ఏమీ అనుకోకు! పెద్దవాణ్ణి! మనసులో కలిగిన బాధతో నాకు తెలిసిందేదో చెప్పాను!... అయినా నీ భార్య... నీ యిష్టం! ఒకరు చెప్పేదేముంది? నీకు చేతనైతే యిహనుంచైనా భర్తగా ఆమెను అదుపులో పెట్టుకో! అది నీ వల్ల కానప్పుడు పెళ్ళాం దాసునిగా మారిపోవడం తప్ప గొప్పగా నీవు చేయగలిగే దేముంది?... వస్తా!”

– – –

“ఏం నాయనా అలా వున్నావ్? పెళ్ళాం చచ్చిన వాడి ఫోజు కొడుతున్నావ్... ఏమైంది?”

“ఛస్తే... పీడా పోయేది! ఆ రోజుతోనే ఆ శని వదిలిపోయేది! బ్రతికుండి వేధిస్తున్నావ్! మనసుకు నెమ్మది లేకుండా చేస్తున్నావ్?”

“ఏమిటి మీరనేది?”

“మనిషి మాంసాన్ని మరిగిన మృగం మనిషిని వేటాడడానికే చూస్తుంది. మగవాళ్ళ వెంటబడే నీ సెక్స్‌మానియా... నిన్ను ఒకరితో వుండనీయడం లేదు. ఒకచోట

నిలవనీయడం లేదు. వయస్సు పెరుగుతున్నా నీ మనసు మారదు... బుద్ధి రాదు! అయినా పుట్టుకతో వచ్చిన గుణం బ్రతుకంతా వుంటుందేమో!"

"ఈ మాటలు మీ స్వంతమేనా... లేక... ఎవరైనా నేర్పిన డైలాగులా?"

"కళ్ళు మూసుకుని, పాలు తాగుతూ తనను ఎవరూ చూడడం లేదనుకుంటుంది... పిల్లి!... నీ వ్యభిచార బ్రతుకు ఎవరికీ తెలియదనుకోకు!"

"గతంలో మీ మనసులో మొలకగా, మొక్కగా వున్న అనుమానం నేటికి మానుగా పెరిగినట్లుంది... మీకు తెలియకపోయినా, నా మనసు నాకు పూర్తిగా తెలుసు! నా నీతి నాకు ముఖ్యం! నా శీలం నాకు ప్రాణం! అయినా మీతో వాదన చేయను... మీకు నా మీద నమ్మకం కలగడానికి నేను చేయవలసిందేమో చెప్పండి!"

"ఉద్యోగం మానేయ్!"

"అలాగే! ఈ రోజునుండే మానేస్తాను. ఆ జీతమేదో మీరే యివ్వండి' పిల్లల్ని పోషించుకోవాలి!"

"అదేవిటి?"

"అవునండి! తల్లిగా వాళ్ళను పోషించుకోవలసిన బాధ్యత నాకుంది! పెళ్ళాన్ని సాధించడంతో బతుకు తెల్లారుతున్న మీలాంటి అనుమానం మొగుడికి పిల్లల్ని పోషించుకునే

తీరికెక్కడిది? అయినా మీ జీతం మొత్తం యివ్వమనడంలేదు. మీ మాట ప్రకారం ఉద్యోగం మానితే నా కొచ్చే జీతం మీరివ్వక తప్పదు... చూడండి! నీతి తప్పి, వ్యక్తిత్వాన్ని వదలుకున్న ఆడది తప్పు చేయాలనుకుంటే... భర్తతో సహా ఆ పనిని ఆపలేరు! అలాగే... ఆ ధ్యాసే మనసులో లేని స్త్రీని ఎవరూ... ఏవిధంగానూ... తప్పుచేయించలేరు! ఇది ఆడమనసు! అయినా ఆడదానిని అనుమానించడం... మగవాడికి ఆనవాయితీ... ఆడవాళ్ళలోనూ ఆ బలహీనత వుండవచ్చు! అన్ని సందర్భాలలోనూ... అనుమానం పూర్తిగా అబద్ధం కాకపోవచ్చు! అయినా ప్రతిదానికీ సభ్యతా పరిష్కారం వుంటుంది. సమస్య వచ్చినప్పుడు చేయవలసింది ఒకరికొకరు రెచ్చిపోవడం కాదు! ఒకరిలోనైనా ఓర్పు అవసరం.

ఆడ – మగ యిద్దరూ భార్య భర్తగా జీవించేది పరస్పరం అనుమానించుకోడానికి కాదు. తద్వారా నిత్యం మానసిక వేదనను అనుభవించడానికీ కాదు! ఒకరికి ఒకరు ఒకటిగా బ్రతకడానికే. భర్త తెచ్చిన పూలు – కానుకలకే ఆడదాని మనసు పులకరించిపోతుంది. పుట్టింటివారు పెట్టిన నగలు... తానుగా కొని పెట్టుకున్న పువ్వులు అవి కేవలం అలంకారప్రాయమే!... మీకా ధ్యాసలేదు!

కల్మషం లేని మనసుతో, కలుపుగోలుతనంతో అందరితోనూ మాట్లాడటమనే నా అలవాటే... బహుశా నన్ను మీరు అనుమానించడానికి కారణం గావచ్చు!... దానిని

మార్చుకునే ప్రయత్నం చేస్తాను... కన్యగానే నేను మిమ్మల్ని చేరాను... శీలవతిగానే మీతో బ్రతుకుతున్నాను. నీతి నిజాయితీతోనే ప్రవర్తిస్తున్నాను. చివరికి భర్త ఒడిలోనే... జీవితాన్ని ముగిస్తాను... నాకా నమ్మకం వుంది! మీ మీద ప్రమాణంగా నేను నిజాయితీగానే మాట్లాడుతున్నాను. వాస్తవాన్ని గ్రహించి... భ్రమలను తొలగించుకోండి! మీ మనసుకు స్వస్థత చేకూర్చుకోండి!... అదీ మీ అంతట మీరే చేసుకోవలసిన వైద్యమే సుమా! అలాగే చేస్తారా?"

"ఎప్పటికప్పుడు నీ తెలివికి నేను బెండులా తేలిపోతున్నాను. అయోమయంగా వుంది నా మనస్సు"

"మనసు మనదేనండి! అయినా మనిషి వ్యక్తిత్వాన్ని మింగేసే స్థితికి దానిని పోనీయకూడదు... త్రికరణ శుద్ధిగా నేను మీ భార్యను. నా భర్తకు నేను అంకితం! నటన కాదిది! నా అంతరాత్మ సాక్షిగా చెబుతున్న సత్యమే యిది... ప్లీజ్! మీ మనసును మామూలు స్థితికి తెచ్చుకోండి. నేనుగా సర్టిఫై చేస్తున్నానుగా... మీ భార్య శీలవతే!"

"నిన్ను... నేను... పూర్తిగా నమ్ముతున్నాను..."

"మీ మనసులో అనుమానం పురుగుంది. అదే మీతో యీ డైలాగ్ చెప్పిస్తున్నట్లుంది! ముందుగా దానిని బయటికి గెంటెయ్యండి!"

"డాక్టరుగా నీవే ఆ పని చెయ్యాలి! పేషెంట్‌గా నాకు నేనేం చేసుకోగలను...?"

"అలాగే చేస్తాను! అయితే వైద్యం కంటె ముందు పేషెంట్‌కు వైద్యునిపై గురి కుదరాలి! అప్పుడే వైద్యం విజయవంతంగా ముగుస్తుంది."

"నీవు లాయరు కావలసినదానివి...!"

"అదే అయితే మీలాంటి బెదురు జీవులకు, నిత్యశంకితులకు నిత్యం జాగారమే! టైం టు టైంగా గుమాస్తా ఉద్యోగం చేస్తోంటేనే బెంబేలెత్తి పోతున్నారు! మీరిన్ని కష్టాలు పడుతున్నారు... లాయర్నైతే క్లైయింట్స్‌తో క్లోజ్‌గా మాట్లాడవలసి వచ్చేది? ఇహ మీ పని అనుమాన పూనకం డాన్స్‌లే!... మీ దగ్గర యిన్నాళ్ళు ఎలా బ్రతికేదాన్ని?"

"నీ దృష్టిలో నేనంత 'రోగ్' నన్న మాట?"

"రోగ్గో... రోగో! అదేదో మీకే తెలియాలి... మీరు మంచివారేనండి! మీ మనసు అనుమానం మాయలో పడింది! అయినా ఫర్వాలేదులెండి... వైద్యం చేస్తాను. క్రమంగా కోలుకుంటారు. ఆ నమ్మకం నాకుంది... ఇంతకూ మీకు డాక్టర్ మీద మంచి నమ్మకం వుందా?"

"వైఫంటే... మొగుడి లైఫ్‌కు నైఫే! వాడకంలో ఒళ్ళు దగ్గర పెట్టుకోవాలి!"

"నైఫ్ ఆపరేషన్‌లో ప్రాణాన్ని రక్షిస్తుందండీ!"

"ఆ బిలీఫ్‌తోనే వైఫ్ కమ్ నైఫ్ హాస్పిటల్‌లో ఎడ్మిట్ అయ్యాను... బ్రతుకు భారం నీదే!"

బ్రతుకు దాని భారం, ఎవరిది వారికేనండి!

**ఆత్మీయత – అనురాగ బంధమే అందరినీ కట్టి వుంచేది**... అనుమానమే మనసుకు భారం. మగనికి, మగువకు బిలీఫ్ గివ్స్ రిలీఫ్... సరేనా? ఏదీ... బుగ్గిటు తిప్పండి..."

# 4. వ్యక్తిత్వం

'మబ్బులేని ఆకాశం నిర్మలంగానే వుంటుంది. మనసులో మేఘాలు ఉరుముతూ, తరుముతూనే వున్నాయి నా చిత్తాన్ని! ఆలోచనా మెరుపులు అదిరి, ఉరిమి చూస్తూనే వున్నాయి నా వైపు... నాకీ మానసిక పరాధీనత స్వయంకృతాపరాధమా? 'ప్రేమ విరోధ'మా? 'అమృత విషమా? లేక మమకారభ్రమా?'...

నక్షత్రాలు ప్రకాశిస్తాయి స్వయంకృతంగానే సూర్యునిపై ఆధారపడతాయి గ్రహాలు, ఉపగ్రహాలు వెలుగుకోసం, వేడికోసం! మనిషిలోని ఆత్మశక్తి... స్వయం ప్రకాశమేనంటారు... అయినా 'వెలుగు-వేడి' కోసం మనసు పరాధీనం కావలసిందేనా? స్వయంశక్తితో తిరుగాడుతున్న గ్రహానికి కూడా... సూర్య స్వాధీనం తప్పడంలేదు  ఉపగ్రహం దాని గ్రహాన్ని వదిలిపోవడంలేదు. మరో దానిపై ఆధారపడిన దానిపైనా ఆధారపడడం మరింత ఘోరం! సృష్టిలో యీ పరస్పరాధారత, స్వాధీనత తప్పేవి కాదన్నమాట!

ఆకాశం నీలంగా వుంది ఎందుకో...! అందుకు రామన్ ఎఫెక్టా?... ఓజోన్ రిఫ్లెక్టా? మానవనేత్ర డిఫెక్టా?.. ఏమో మరి! సూర్యునికి మేఘం అడ్డం వస్తే... దాని నీడ నేలమీదనే పడుతుంది గాని సూర్యుని మీద కాదుగదా! సూర్యుడికి – భూమికి మధ్యగా చంద్రుడు అడ్డు నిలిస్తే... దాని నీడ భూమి మీద పడడం, ఆ మేరకు సూర్యకాంతి కన్పించకపోవడం... సూర్యగ్రహణ మంటారు? ఇంతకూ చంద్రుని నీడ భూమి మీద

పడడంతో, భూమి మీద పడవలసిన సూర్యకాంతికి తాత్కాలిక 'గ్రహణం' యేర్పడింది గాని అది సూర్యునికి కాదుగదా?... మరి, దానిని సూర్యగ్రహణం అని ఎలా అంటున్నారో మరి! అలాగే సూర్యునికి చంద్రునికి మధ్య భూమి చేరినప్పుడు భూమి నీడ చంద్రునిపై పడుతుంది. కనుక, ఆ మేరకు చంద్రునిపై సూర్యకాంతి వుండదు. దానిని చంద్రగ్రహణ మనవచ్చు. ఏ గ్రహణ సమయంలోనైనా... సూర్యునిపై నీడ పడదు. కనుక, ఉన్నవి భూగ్రహణం చంద్ర గ్రహణమేగాని.... సూర్యగ్రహణం కాదు. గ్రహాలు, ఉపగ్రహాలన్నిటికీ వెలుగు, వేడినిచ్చే సూర్యునికి గ్రహణం ఏమిటి?... ఏమిటో... నా మనసు ఉల్టాగా ఆలోచిస్తోంది. ఇందులో నిజమెంతో అబద్ధమెంతో... తెలియడం లేదు...

మరి... నా మనసుకు గ్రహణం ఎలా పట్టింది? నా ప్రేమ సూర్యునికి 'కిరణ్ అనే పురుష గ్రహం అడ్డుగా నిలవడంతో అతని నీడ నా మనసుపైన పడి, దానికి గ్రహణం యేర్పడింది. అతను మా యింటికి 'దశమ గ్రహం'గా మారకముందే... నా మనసుకు గ్రహణాన్ని పట్టిస్తోంటే... పెళ్ళి జరిగితే అది నా జీవితానికి శాశ్వత గ్రహణమయ్యేదే సుమా! అదృష్టవశాత్తు అది తప్పిపోయింది... అయినా దాని 'షాడో' నాకు చీకటిని కమ్మిస్తూనే వుంది. అయినా దాన్ని తొలిగించుకోవాలి... ప్రయత్నిస్తాను... యౌవన తాపం... జీవితానికి శాపమా? అయినా శాపానికి విముక్తి వుంటుంది కదా! ఆ ఆశతోనే జీవిస్తాను...?

"ఊహల ఊయలలో అలా ఎంతసేపని ఊగుతావ్?

వాస్తవంలోకి దిగిరా...! నేలమీద నడువ్! ఊగడమే అలవాటైతే... నడకనే మర్చిపోతావ్... వీల్ ఛెయిర్ వాకింగ్ సహజ విరుద్ధం కదా!"

"నీ వంతుగా, నీవు నాకు నడక నేర్పావు మమ్మీ!... మరి... నా మనసుకు నడుం విరిగిందిగా! నీవు నేర్పిన నడకను నేను ఎలా సాగించగలను?"

"........................................"

"బాధ పడకు మమ్మీ! తల్లి, తన బిడ్డకు చేయవలసిన దానికంటె... నీవు నాకు ఎక్కువగానే చేస్తున్నావ్! పుట్టుమచ్చ వికారంగా వున్నా... దానిని కోసి, తీసి వేయలేం కదా? కన్నందుకు తల్లివిగా నీ విధిని నీవు నెరవేర్చగలవుగాని... నా విధిని నీవు తప్పించలేవుకదా?... నన్ను యీ విధంగానే ఊహల ఊయలలో ఊగనివ్వు!... 'విల్' వీల్ చెయిర్‌లో తిరగనివ్వు!... వాకింగ్ స్టిక్ ఊతంతో నడిచే కాలమూ రావచ్చు! నాకు నీవు నేర్పిన 'నడక' వ్యర్థమైందని విచారించకు... 'అది ఏనాటికైనా ఉపయోగపడకపోతుందా' అనే హోప్‌తోనే వుందాం యిద్దరమూ... నీ పనిలోకి నీవు వెళ్ళిపో మమ్మీ!"

"విరిగిన భాగానికి స్టీల్ రాడ్ తొడిగి... ఆ విరిగింది అతుక్కునేవరకు వైద్యంతో వేచి వుంటారు గానీ... నీవు ఆ విరిగిన దానితోనే వుంటానంటే ఎలా?"

"నీవన్నది నిజమే మమ్మీ! స్టీల్‌రాడ్ శరీర భాగానికేగాని, మనసుకు కాదుగదా!... కొన్ని గాయాలు కాలగమనంలో

వాటంతటవే మానిపోవచ్చు! కాని మరికొన్ని సెప్టిక్‌తో శరీరాన్ని శవంగా మార్చేస్తాయి! నా మనసుకు తగిలిన గాయాలు తుదకు నన్ను ఏ దశకు చేరుస్తాయో... వేచి చూడడమే! మనం చేయగలిగింది."

"నా మాటవినమ్మా! తగిలిన గాయం సెప్టిక్ కాకుండా మానవ ప్రయత్నంగా మనకు చేతనైనది మనం చేద్దాం... కాదనకు. ప్రతిదానికీ కాలనిర్ణయ తీర్పు ఎలాగూ వుంటుంది! అయినా మానవ ప్రయత్నం మన వంతు."

"నీ యిష్టం మమ్మీ!"

– – –

"మమ్మీ! నీ బ్లడ్ నాలోవుంది... మరి నీ మనసు నాలోలేదా?"

"ఆ రెండే కాదమ్మా! నా జీవిత నకలూ నీలో వుంది!"

"మమ్మీ!... సారీ మమ్మీ! బాధ పడకు! నిన్ను హర్ట్ చేశానేమో... క్షమించు మమ్మీ! ..... ప్లీజ్..... ఇహ మీదట, ఎప్పుడూ అలా అనను...."

"సారీ ఎందుకమ్మా? ఇద్దరం మాట్లాడింది... ఒకటే!... నా డైరీ యిస్తాను. దాన్ని క్షుణ్ణంగా చదువుకో! నేను అన్నదానిలోని నిజం నీకే తెలుస్తుంది."

"సారీ మమ్మీ! నేను చదవను. అలా నాకు యిష్టం

వుండదు…”

“మనం, పరాయివాళ్ళం కాదుగా!… ఫర్వాలేదు… చదువు…”

“వద్దు మమ్మీ! మనం పరాయివాళ్ళం కాకపోయినా… మన సంబంధం తల్లీ – కూతురే అయినా… మనం యిద్దరమే గాని, ఒకళ్ళం కాలేం. మన జీవితాలూ అంతే! నా దృష్టిలో డైరీ వ్యక్తిగతం. తాను కన్న కూతురు జీవిత విషయాలు బాధ్యత కలిగిన తల్లికి తెలియవచ్చుగాని… తనకు జన్మనిచ్చిన మదర్ పర్సనల్స్ డాటర్‌కు తెలియకూడదు… అందుకే నీ డైరీని నేను చదవను”.

“నీవు చెప్పింది నిజమే! అయినా నా దృష్టిలో **మేజరైన తన కూతురితో వుండవలసింది ముఖ్యంగా ఆత్మీయతా స్నేహ సంబంధమే!** ఎందుకంటే తన తల్లి మాదిరే కూతరు కూడా ఎప్పటికైనా మరో యింటిపేరుతో, మరో చోటుకు పోవలసిందే! తల్లి కావలసిందే! మగపిల్లవాడి విషయం వేరు! వాడు యింటి యజమాని కాగలడు… అందుకే ప్రతి స్త్రీ తను కన్నవాడికి ఎప్పటికీ తల్లే…”

“మమ్మీ! ఎందుకు బాధపడుతున్నావ్… కళ్ళల్లోకి నీళ్ళెందుకొచ్చాయ్… నాకు చెప్పు మమ్మీ!… ప్లీజ్…”

“ఏమీ లేదమ్మా!… సో, యిప్పుడు మనది అక్కా చెల్లి సంబంధమే! నా డైరీ చదువు. అంతా నీకే తెలుస్తుంది.”

“అమ్మా! అలా అయితే చిన్నదాన్ని నేను కనుక నా డైరీని

నీకిస్తాను. దాన్ని నీవు చదివి నా పొరపాట్లు, లోపాలు, తొందరపాటు నిర్ణయాలు ఏవైనా జరిగి వుంటే చక్కటి సలహాలతో వాటిని సరిదిద్దే ప్రయత్నం చేయమ్మా! నాకు అక్కగా ప్రస్తుత నా మానసిక స్థితికి, గతికి స్వయంకృతాపరాధమేనేమో... నీవు నిర్ణయించు... నీవన్నట్లు నాకు అక్కగా... నాపై నీకు ఆ హక్కువుంది...”

– – –

“నీలో నా బ్లడ్, నా మనసే కాకుండా – నా జీవిత నకలు కూడ నీలో వుందనేది నీ డైరీ రిపీట్ చేసింది... నీవు కోరినట్టు నీ డైరీని చదవడంతో నా వంతు నేను చేయవలసిన పని పూర్తయింది... ఇహ యిప్పుడు నీ వంతు. డైరెక్ట్‌గా నా డైరీని చదవడానికి సెంటిమెంట్ ఫీలవుతున్నావు కనుక దాని సమ్మరీని వ్రాశాను. దానినైనా చదువు. అది నీ జీవిత భవిష్యత్‌కు ఏమైనా వుపయోగపడుతుందేమో చూడు... ఏమంటావ్?”

“అలాగే మమ్మీ! చదువుతాను. కాని దానిపై కామెంట్ చేయను... సరేనా?”

“అలాగే! నీయిష్టం!”

– – –

“హలో! ఎక్స్‌క్యూజ్‌మి! మిమ్మల్ని డిస్టర్బ్ చేసినందుకు సారీ...”

“ఫర్వాలేదు – విషయం చెప్పండి...”

"ఆడవాళ్ళు మౌనంగా వుండడం - మగవాళ్ళు కవ్వించి ప్రయత్నించడం మామూలు విషయం - మీ వ్యవహారం రివర్స్‌లో వుంది - నాకే అనిపించింది మీతో మాట్లాడాలనుకున్నా 'మౌనం' మీ గర్ల్‌ఫ్రెండని తెలిసి ధైర్యం చేయలేదు. మీరు కన్పిస్తే అనుకోని విధంగా పలకరించాను. మీరేమీ అనుకోకండి."

"గర్ల్ ఆర్ బాయ్ ఫ్రెండ్ అంటూ నాకు ఎవరూ లేరు. లైబ్రరీయే నా బృందావనం... ఇహ మౌనం విషయానికొస్తే... మాట మౌనం - మనసు మౌనం అని, అది రెండు విధాలుగా వుంటుంది. మాట మౌనంలో వున్నంత మాత్రాన మనసు మౌనంలో వున్నట్లు కాదు. దాని పని అది చేస్తూనే వుంటుంది. బుక్స్ చదవటం నాకు హాబీ. అలా అలవాటైంది యీ మౌనం. అయినా నా మౌనాన్ని భంగం చేసే వరూధిని గాని, మేనకగాని యిప్పటి వరకూ ఎవరూ నాకు సీన్‌లోకి రాలేదు... అందుకే యిలా బ్రతికిపోతున్నాను... చూడగా, నా మౌనాన్ని మీరు లాక్కున్నట్లుందే! ఏమీ మాట్లాడడంలేదు..."

"మీరు మాట్లాడుతున్నారుగా! ఒకరు ఆన్‌లోవుంటే... మరొకరు ఆఫ్‌లో వుండాలి కదా? ఇద్దరూ ఒకేసారి ఆన్ అండ్ ఆఫ్‌లో వుండకూడదు. మీరు మాట్లాడండి!

"అలా అయితే నేను ఆఫ్‌లో వుంటాను. మీరు 'ఆన్' లోకి రండి!"

"అలా వద్దు! మీరు ఆన్‌లోనే వుండి మాట్లాడాలి. మీ

మాటలు వినడం నాకు యిష్టంగా వుంది.”

“అయితే... మరోసారి కలుసుకుందాం. ప్రస్తుతానికి యిద్దరమూ ఆఫ్‌లోనే? ఎలా వుంది, నా ప్రపోజల్?”

“ఊరించి పూరించకపోతే ఎలా వుంటుందో అలా వుంది నా మనసు! ఆయామ్ ఇన్ డెసొప్పాయింటెడ్!”

“సారీ! నన్ను అపార్థం చేసుకోకండి. నాకు ఒక అర్జెంట్ అపాయింట్‌మెంట్ ఉంది. నేను ఎటెండ్ కావాలి. ప్లీజ్, లెటజ్ గో!”

– – –

‘ఎన్నాళ్ళయింది, మీరు నాకు కన్పించి?”

సారీ మిస్! ఇన్‌టైంలో మిస్సయినందుకు మరోసారి... సారీ! కారణం బుద్ధి పూర్వకం కాదు... ధ్యేయం – ధ్యాస వాటి యూనిటీపైనే. మనసును కాన్‌సెంట్రేట్ చేయడానికి కొంతకాలం నుండి సాధన చేస్తున్నాను... అందులో చాలవరకు సక్సెస్ అయ్యాను... అందుకే యితర విషయాలు, ఆలోచనలు మనసుకు చేరవు. ఇంట్లో వాళ్ళతో సహా తెలిసిన వారందరూ దానిని పరధ్యానం అంటున్నారు. నిజానికి అది నా ధ్యేయం పై ధ్యానమే గానీ... పరధ్యానం, ధ్యాస కానేకాదు. మీరు మరోలా అనుకోకండి. మిమ్మల్ని మళ్ళీ కలుసుకుంటాను అని మీకు నేను యిచ్చిన మాటను మర్చిపోయాను... సారీ! మీ మనసును చాలా బాధ పెట్టాను. ఐ యామ్ ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ!... మే ఐ

రిపీట్ యిట్?"

"దేనిని? మర్చిపోవడమా? సారీ అనడమా?"

"ఆ రెండూకాదు. మిమ్మల్ని మళ్ళీ కలుసుకుంటానని మాట యివ్వడం!"

"ఎందుకూ? మళ్ళీ మర్చిపోయి, నన్ను వెయిటింగ్‌లో పెట్టి, టెన్షన్ పెంచడానికా?"

"నా మాటల్ని మీరు పూర్తిగ అపార్థం చేసుకుంటున్నారు. సారీ! ఇహ నేను మౌనంగానే వుంటాను... మీరే మాట్లాడండి!... ముచ్చట పడతాను."

"మీరు ముచ్చట పడిపోయేంత మధురంగా నేను మాట్లాడలేనండి! మనసుకు మరుపురాని అనుభూతిని కలిగించే నేర్పు మీలాగ నాకు చేతకాదు! ఏ అద్భుతం చేశారో గాని మనిషిగా నన్ను వదిలేసి... నా మనసును మీతో తీసుకుపోయారు... క్షణం ఒక యుగంగా మీకోసం ఎదురు చూపులే నాకు!... మీ మగతనం, నా ఆడతనాన్ని యింతగా దగా చేయడం అన్యాయం."

"............................"

"మాట్లాడరే! మీకు అలవాటయిన మౌనమే నాకు ప్రాప్తమా?... వెన్న దొంగలా నానుండి ఎత్తుకుపోయిన నా మనసును ఎక్కడ దాచారో చెప్పండి! అది మీకు అక్కర్లేకపోతే... నా మనసును నాకు వాపసు చేయండి!... ప్లీజ్ మాట్లాడండి!"

"కొన్ని యాక్షన్స్ - రియాక్షన్స్ మనిషికి, మనసుకు తెలియకుండానే జరిగిపోతూ వుంటాయి. వాటి తుది ఫలితంతోనే అవి అలా జరిగినట్లు మనకు అనుభవం అవుతుంది. సాధారణ రీతిలో మనిషిని అందుకు బాధ్యతగా చేయకూడదు. అసలు మీ మనసును నేను దొంగిలించనేలేదు. యిద్దరికీ తెలియని రీతిగా పరస్పరం మనసుల మార్పిడి జరిగింది. మీ మనసు స్థానంలో నా మనసును, ఆత్మను కూడ వుంచి... నా హృదయస్థానంలో మీ మనసును ప్రతిష్ఠించుకున్నాను... నేను చేసిన నేరం అదే! నేను దొంగను కాదు... స్వార్థజీవిని కాదు. అలా మీకు తెలియకుండా చేసినందుకు నన్ను క్షమించండి!"

"క్షమించవలసింది మీరన్నట్టు నాలో వున్న మీ మనసేగదా? ఏమీ తెలియనట్లు వేరుగా నన్నడగడమెందుకు? అందుకే ముమ్మాటికీ మీరు దొంగే! ప్రేమ దొంగ! మౌన దొంగ!... మనలో మన మాట! ఆడదానిగా నాకో అనుమానం వుంది... మీ నకిలీని నాలో వుంచి... నా అసలును మీరు కాజేయలేదుగదా?"

"ఏమో మరి! మీరన్నదాని మీద యిప్పుడు నాకూ డౌటస్తోంది! అదేమంటే..."

"చెప్పండి! సందేహమెందుకు?"

"నా అసలును మీలోవుంచి, మీ నకిలీని నేను తీసుకున్నానేమోనని...!" ఏమీ హఠాత్తుగా అరుణోదయమైంది మీ ముఖం?... సంధ్య కాదు గదా?... **ఎవరైనా, తన నిజాలు**

**తానే పలుమార్లు చెప్పుకునేకంటె... ఎదుటి వారిని కూడా నిజాయితీగా అర్థం చేసుకునే ప్రయత్నం చేయడం సంస్కారం!** మనసుకు కపట ముసుగు వేయకుండా, మాటల్లో దానిని స్పష్టంగా చూపడమే నాకు అలవాటు. నా మాటలు మిమ్మల్ని బాధిస్తే... సారీ! అయినా ప్రస్తుతం మనిద్దరిలో ఎవరు ఎవరి మనసుతో మాట్లాడుతున్నామో నాకు తెలియడంలేదు!"

"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నట్లు, నా మనసు మీకు అర్పితమైనట్లు.... చాలా కాలానికిగాని నాకు తెలియలేదు... తీరా తెలిసిన తరువాత, మీ ప్రతిస్పందన కోసం వెతికితే... మీలో ఆ జాడలేదు. అందుకే ధైర్యం చేసి ముందుగా మీరు చేయవలసిన పనిని నేను చేశాను. మౌనస్వామిని పలకరించాను... ఫలితంగా నా మనసు నకిలీదని మీకు అర్థమైంది... అంతేగా! ఆడదాని చనువు, చొరవ మగవాడికి అలుసుగా, నట్టు లూజ్‌గా అనిపిస్తుంది. ప్రస్తుతం నా పనీ అలాగే అయింది..."

"ఈ నకిలీ ఊసెత్తి నన్ను అనుమానించింది మొదట మీరేకదా!"

"మన భవిష్యత్ ప్రేమ జీవితం ప్రణయ కలహంతోనే ప్రారంభమా?"

"అలా అయితేనే మంచిది. నిజ జీవితంలో అసలు కలహాలకు తక్కువ అవకాశం వుంటుంది. జీవితంలో ఎదురయ్యే ఏ సంఘటనైనా పాజిటివ్‌గా ఎదుర్కొని, ప్రశాంత మౌనంలో

జీవించవచ్చు."

"మౌనాన్ని మీతోనే వుంచుకుని, దానిని పెంచుకుంటారా ఏమి?"

**"మనసుకు శాంతినిచ్చి, సమస్యలను సాక్షీగా పరిష్కరించుకోడానికి మౌనమే మంచి సాధనం. అది మనసుకు ఓర్పు, నిగ్రహాన్నిస్తుంది."**

"అలా అయితే ఆ విధానాన్ని నాకు కూడా అలవాటు చేయండి!"

"ఒకరు అలవాటు చేస్తే అబ్బేది కాదు అది! మనసుకు సంబంధించినది యేదైనా సహజ పద్ధతే సత్ఫలితాన్నిస్తుంది... మళ్ళీ కలుసుకుందాం!"

"ఎన్నాళ్ళకు? - ఎన్నాళ్ళిలా?"

"ఎన్నాళ్ళో కాదు... కొన్నాళ్ళే యిలా!... ఎందుకు అలా 'డల్'గా ఫీలవుతావ్? I would come soon... మీ యింటి అడ్రసు కావాలి!"

"ఎందుకు మీరటు రావడం, మా డాడీ చూశారటే... కాళ్ళు విరగ్గొట్టగలరు? జాగ్రత్త!"

"అల్లుణ్ణెందుకు అలా?"

"అల్లుణ్ణవాలని వచ్చినా... అల్లుడైనా... ఆ మర్యాద ఎంతో గొప్పగా వుంటుంది... ఆకతాయిగా వస్తే... అంతకంటె ఎక్కువే.

టెన్నిస్ సన్మానం...”

“అలా అయితే కన్యాదానం చేయించుకోడానికే వస్తాం...”

“అలా అన్నారు, మోస్ట్ ఆస్పిషస్! సస్పెషన్‌గా రాకూడదు సుమా!”

“అది సరే... మరి... అయినా ఆ సంగతులు పెద్దవాళ్ళు మాట్లాడుకుంటార్లే!”

‘‘ఏ సంగతులు?... అడిగి అడుక్కుని అమ్ముడు పోయేవాళ్ళంటె... నాకు అసహ్యం!”

“అంటే... కట్నాలు అడగడం... కానుకలు కోరడం మీ దృష్టిలో – అడుక్కోవడం – అమ్ముడుపోవడమా? ఉత్త చేతులతో కాపురానికొచ్చి, అత్తగారు పెట్టింది తింటూ పడివుండే వ్యక్తిత్వంలేని కోడరికాన్ని ఏమంటారో మీ భాషలో! ధన కనక వస్తు వాహన చందన తాంబూలాదులతో కన్యాదానం జరిపిస్తే... ఆకాశ దేవతలు, ‘తథాస్తు’ అంటారు! అరుంధతి ఆనందపడిపోతుంది! అయినా అవన్నీ నాకెందుకు గాని... వాటన్నిటిని నీవే, నీ కోసమే భద్రంగా మూటగట్టుకొని రావాలి గుట్టుగా, గుట్టగా! అయినా అవన్నీ నా కోసం కాదు సుమా! నీ కోసం, నీ పిల్లలకోసమే అవి!”

‘‘అవన్నీ మనకెందుకులెండి! పెద్దవారు చూచుకుంటారుగా!”

“బరువు పెట్టందే... బంట్రోతుకూడ పలకదు, ఉలకదు....

అల్లుడంటే ఏంటి? ఐరావతంలాంటి వారు. తెల్ల ఏనుగు! కన్యాదానంతో కామధేనువు – వధువు వెంట నడవాలి!"

"............................"

"మౌనం అంగీకారంగా భావించి, మళ్ళీ కలుసుకుందాం... ప్రస్తుతం లిటిల్ పాజ్?... అరె... ఎందుకు అలా బాధపడతావ్? ఆ కన్నీరు నేను చూడలేను... తుడవనా? ఆ హక్కు నాకుందా?"

"మీకు కట్నమే కావాలా? చదువుకున్నదాన్నీ! నేను ఉద్యోగం చేస్తే చాలదా?"

"అవన్నీ మేరేజ్ తరువాత మాట్లాడుకోవచ్చు."

"అప్పుడు కట్నం కోసం నన్ను వేధించి, మా వాళ్ళను బాధిస్తారా? డబ్బే కావాలా మీకు? నేను కాదా? మీకు ప్రేమలేదా నా మీద? చెప్పండి డబ్బే కావాలా మీకు, నేను కాదా?"

"గొప్ప మాటలెందుకు? నీవే చూస్తావుగా నాకు ఏం కావాలో!... టైం యీజ్ గోల్డ్... ప్లీజ్ లెటజ్ గో... కెన్నెగో! I would like to meet you once again! Thank you..."

..................................................

'అలా వెళ్ళిపోయిన విద్యాసాగర్ దాదాపు నెలరోజుల తరువాత మళ్ళీ వచ్చాడు! తన పేరెంట్స్ తన యిష్టంతో నిమిత్తం లేకుండా... తనకు పెళ్ళి సంబంధం ఖాయం చేశారని... తాను ఎంత చెప్పినా, వారు వినిపించుకోవడంలేదని... అయినా నాకోసం తాను యిల్లు విడిచి వస్తానని... ఎటన్నా వెళ్ళిపోయి

గుడిలో పెళ్ళి చేసుకుందామని... నన్ను రెడీగా వుండమని పెళ్ళి జరిగిపోతే ఎవరు చేసేది ఏమీ లేదని... నా యిష్టం ఏమిటని అడిగితే... నా మనసు అయోమయంలో చిక్కుకుపోయింది... ఆ క్షణంలో అతనికి ఏమాటా చెప్పలేకపోయాను... అది గమనించి "సరే! నీకు యిష్టం లేకపోతే నేను మాత్రం చేసేదేముంది? నేను నిన్ను మనసారా ప్రేమించాను గనుకే... అందర్నీ కాదని, యిల్లు విడిచి నీ కోసం రావడానికి రెడీ అయ్యాను. నీకు సమ్మతి కాకపోతే, చెప్పు, బలవంతం లేదు. నాకా అదృష్టం లేదని మనసుకు సర్ది చెప్పుకుని... జీవచ్ఛవంలా బ్రతుకుతాను... వీలు చూచుకుని నీ కోసం మళ్ళీ ఒకసారి వస్తాను. ఈ లోపు బాగా ఆలోచించుకుని ఒక నిర్ణయానికొచ్చి... అవుననుకుంటే రెడీగా వుండు..." అని చెప్పి, అతను వెళ్ళిపోయాడు... అంతే...! చాలాకాలం వరకూ నాకు కన్పించలేదు...

ఆ మోసగాడి మొహాన్ని జీవితంలో ఎన్నడూ చూడగూడదని నిర్ణయించు కున్నాను... అది, అలా ముగిసిపోతే యీనాటి నా జీవితం యిలావుండేది కాదు...

శరత్‌చంద్ర – అంటే మీ నాన్నగారితో నాకు వివాహం జరిపించారు. మా పెద్దవారు! నా సమ్మతి – అసమ్మతితో సంబంధం లేకుండానే అలా జరిగి పోయింది. నాదంటూ ఏ ఆలోచనా లేకుండానే... ఆయన జీవితంలో ప్రవేశించాను... ఆయనది నిండైన విగ్రహం. నిజాయితీగల వ్యక్తిత్వం... ఆదరణ, ఆప్యాయత, ఆత్మీయతలకు ఆయన ప్రతినిధి! ఆయన నన్ను

అమితంగే ప్రేమించారు. అందుకు నేను ఉక్కిరి బిక్కిరి అయ్యేదాన్ని! అయినా నా గతస్మృతి నన్ను ఆయనకు కాస్త దూరంగానే నిలిపి వుంచేది. ఎంత ప్రయత్నించినా నా మనసు మొరాయిస్తూనే వుండేది. అది నా స్వాధీనంలోకి వచ్చేది కాదు. మానసికంగా నేను ఆయన్ని సమీపించలేకపోయేదాన్ని. వసంతకాల నిండువెన్నెలలో గొడుగు వేసుకున్నట్లుండేది ఆనాటి నా పరిస్థితి! నిరాశ – నిర్లిప్తతతోనే జీవితం గడుస్తూ వుండేది! తను నా ఉదాశీనతను గమనించినా, అందుకుగల కారణంకోసం ఎన్నడూ నన్ను ఎన్నడూ అడగలేదు. అదే ఆయన ఉత్తమ సంస్కార పరిణితి!

సంవత్సరంలోనే మాకు సంతానం కలిగింది. బాబు పుట్టాడు. ముమ్మూర్తులా ఆయన ప్రతిరూపమే. జన్మనిచ్చినందుకు సంతోషించానే గాని..., వాణ్ణి చూచి తల్లిగా పారవశ్యతను పొందలేకపోయాను. ఆయన సమ్మతితోనే సంతాన నిరోధాన్ని పాటించాం... మూడేళ్ళకే వాడి ఐ.క్యు. అద్భుతంగా వుంది. అందరూ వాణ్ణి పొగిడేవారే! అయినా నా ఉదాసీనతలో మార్పురాలేదు. అందుకుగల కారణం నా గురించి నాకు తెలిసినా, నా ఆరోగ్యాన్ని గూర్చి ఆయన చేసిన ప్రయత్నాలకు నేను వ్యతిరేకించలేదు. అయినా పరిస్థితిలో మార్పు మామూలే!

బాబుకు మూడో సంవత్సరం పూర్తికాకుండానే... మళ్ళీ గర్భం! మానసికంగానే కాక, శారీరకంగా కూడా నేను చాలా బలహీనతకు లోనయ్యాను. నా పరిస్థితిని గమనించి అబార్షన్‌కు ఆయన నా అనుమతిని అడిగారు. నేను అంగీకరించలేదు.

ఫలితం... నీవు జన్మించావ్! అప్పటి నా బలహీన పరిస్థితిని చూచి ఆయన ఎంతో కలత చెందారు. నిద్రలేని రాత్రులు ఆయన ఎన్నో గడిపారు. నాకు ఏ లోటూ రానీయకుండా, శ్రమనేది నాకు తెలియకుండా ఆయన నాకు సేవలు చేశారు. మానసికంగా ఆ ప్రేమమూర్తికి నేను ద్రోహం చేస్తున్నానని గిల్టీగా ఫీలయ్యేదాన్ని. నా మనసును మార్చుకునే ప్రయత్నం చేశాను... అయినా... గతం – దాని గుర్తులూ చెరిగిపోయేవి కావు...

నా సమ్మతితోనే బాబును ఆయన అక్కగారి యింట వద్దవుంచి, చదివించే యేర్పాటు చేశారు. ఆమెకు భర్త – పిల్లలు ఎవరూ లేరు. తమ్ముడంటే ఆమెకు అమిత అభిమానం! అందుకే... నీ అన్నను... ఆమె కన్న తల్లిగా హృదయానికి హత్తుకుని తన దగ్గరే వుంచుకుంది... ఆ తరువాత జరిగిన పరిస్థితుల పరిణామ ఫలితంట్... ఇప్పటికీ... నేను నా కొడుకును... చూడలేకపోయాను... వయస్సు నీకు ఇరవై దగ్గర! వాడు నీ అన్నగదా! తండ్రి పోలికలతో జూనియర్‌ట్, యిప్పటికి నవయువకునిట్, మహామేధావిట్ వెలిగిపోతూనే వుంటాడు. బహుశా పి.జి. స్థాయిలో మంచి కెరీర్‌లోనే వుండవచ్చు. యీ నాటికీ యీ దురదృష్టవంతురాలికి లేదు...

మీ డాడీ అదృష్టవంతులు! నా కొడుకును చూచుకొని నేను పొందలేని ఆనందం... తన కూతుర్ని చూచుకుని ఆయన పొందేవారు... మాట మాటకీ నిన్ను చూచి ఆయన ఎంత మురిసిపోయేవారో! నీ బెడ్ దగ్గరకు నన్ను పిలిచి, మొదట నీ ముఖం చూచి... నా ముఖంలోకి రెప్పవేయకుండా చూచేవారు!...

"భర్తగా నీ పట్ల నాకు గల ప్రేమ – ఆత్మీయతలకు భార్యలో నీలో స్పందన లేకపోయినా... తండ్రిగా నా వాత్సల్యం, పాపలోనైనా ప్రతిఫలించదా?"... ఆయన అలా అన్నప్పుడు కట్టలు తెగిన దుఃఖంతో ఆయన్ని పట్టుకుని, యేడ్చేదాన్ని!.... ఆయన చలించి పోయేవారు... "బాధపడకు! ఇహ మీదట అలా అనులే...!" అంటూ నన్ను పట్టుకుని తీసుకెళ్ళి సోఫాలో కూర్చోబెట్టి... ఎదురుగా తాను కుర్చీలో కూర్చునేవారు!... నిన్ను తెచ్చి నా చేతులకు అందించేవారు! నిజానికి, పసిపిల్లగా నీకు కావలసిన అవసర సేవలన్నీ ఆయనే చేసేవారు... ఊహ తెలిసి యిప్పటివరకు నీవుగా ఆయన్ని చూడనేలేదు గదా! అలాగే నేనూ యింతవరకూ పెరిగిన నా కొడుకును చూడలేదు...! ఇలా, మన మందరమూ దురదృష్టవంతులమే... కారణం...? ఆ ఒక్కటీ చెప్పి... నా సమాచారం ముగిస్తాను.

నీ తొలి బర్త్‌డేకి... నా గత స్మృతి రూపం సాగర్ వచ్చాడు. ఎలా రాగలిగాడు? అతని పట్ల నా మనసులో పాతుకుపోయిన ప్రేమ భావమే... అతనికి దారి చూపింది... మీ డాడీకి అతన్ని పరిచయం చేశాను... నిండు విగ్రహమే కాదు, నిర్మల చిత్తం మీ డాడీది!

"మంచి మనసు కలిగినవారికి మంచి స్నేహం లభించడం అందరి విషయంలోనూ జరగదు... కొంతమందికే... ఆ అదృష్టం" సాగర్‌తో ఆయన అన్నమాటలవి... అక్కడ నిలవలేక లోపలికి వెళ్ళిపోయాను.

ఆ తరువాత కూడ సాగర్ వస్తూనే వున్నాడు. అతని పట్ల నాకు గల ప్రేమ బలహీనత అతన్ని రాకుండా ఆపలేకపోయింది... నా విషయంలో అతని చనువును, ప్రవర్తనను కూడ అదుపు చేయలేకపోయేది... అతను చేసిన మోసం శూలంలా నా మనసులో గుచ్చుకుంటున్నా... అది అంకుశంలా పనిచేస్తున్నా... నా మనసు నన్ను అతని వేపే నడిపించేది. నా భర్తకు నేను నమ్మక ద్రోహం చేస్తున్నాననే స్పృహ నాలో కలుగుతున్నప్పటికీ... ఎప్పటికప్పుడు 'ఇదే ఆఖరిసారి, మరెప్పుడూ రాకుండా సాగర్‌కు బుద్ధి చెప్పి పంపించాలని' ఎంత దృఢంగా నిశ్చయించుకున్నప్పటికీ... అతని రాకతో, మళ్ళీ మామూలే! అతను వెళ్ళిన తరువాత, నేను చేస్తున్న తప్పుడు పనికి నా మనసు నన్ను నిలదీస్తుండేది... అందుకే ధైర్యంగా నేను నా భర్త ముఖంలోకి చూడలేకపోయేదాన్ని! అయినా, తన భార్య - కూతురుపట్ల ఆయన ప్రేమ వాత్సల్య ప్రవర్తనలో ఎలాటి మార్పూ కన్పించేది కాదు. అది నన్ను మరింతగా బాధ పెట్టేది!

నిజం నిప్పులాంటిది. దాన్ని బట్టలో మూట కట్టలేం!... సాగర్‌తో సరసం - నా మోహ మురిపెము - ప్రేమమత్తు - ఎంతోకాలం దాగలేదు. నా కపట నాటకానికి, ద్రోహబుద్ధికి చరమగీతం పాడి నా దాంపత్య జీవితానికి ముగింపు పలికే రోజు రానే వచ్చింది. చిలిపి మాటలతో - సెక్సీ చూపులతో సాగర్ నా మనసునూ, శరీరాన్ని రెచ్చగొడుతున్నా... అప్పటి వరకూ అతనికి దూరంగానే కూర్చున్న నేను నిగ్రహాన్ని కోల్పోయి... అతను చాచిన చేతులు అందుకుని అతని కౌగిలిలో

చిక్కుకుపోయాను. అతని స్పర్శతో, మాటలు చేతలతో ఏదో తెలియని తమకంలో నేను మునిగిపోయాను. తలుపు పూర్తిగ వేయవలసిన అవసరం అప్పటివరకూ కలగలేదు... ఆ తరువాత, దానిని మర్చిపోయాం. ఆఫీసుకు వెళ్ళి ఐదుగంటల తరువాతే యింటికి వచ్చే నా భర్త... నా పాపం పండి... ఎందుకో ఆ రోజు మధ్యాహ్నమే వచ్చారు... దగ్గరకు వేసివున్న తలుపును నెట్టారు... హాలులో దృశ్యాన్ని చూశారు... అప్పటి నా శరీరస్థితి... సెమీ నూడ్! మనసు, పూర్తిగా మోహ మత్తు... ఆ స్థితిలో మమ్మల్ని చూచిన నా భర్త... నిశ్చేష్టునిగా నిలబడి పోయారు... మేము లేచి, తలలు దించుకుని నిలబడిపోయాం... క్షణం కాలం స్థంభించింది... ఆయన ఏమీ అనలేదు... ముందుకు రాలేదు... కాసేపటికి వెనుతిరిగి మౌనంగా గుమ్మం దిగి వెళ్ళిపోయారు... అప్పటి నా పరిస్థితిని చెప్పడానికి తగిన భాష తెలియలేదు...

సాగర్ మళ్ళీ నన్ను దగ్గరకు తీసుకునే ప్రయత్నం చేసి... ఏదో అనబోయాడు. మత్తు వదిలిన నేను అతన్ని విదిలించి దూరంగా జరిగాను. గుమ్మంలో నిలబడి వెళ్ళిపోయిన నా భర్త రూపమే నా మనసులో నిలిచింది. గతం గుర్తుకొచ్చి... నా విషయంలో ఆయన ప్రేమ... అలాగే నా కపట నటన ఒక్కసారిగా నాకు ఎదురుగా నిలిచాయి. నా వ్యక్తిత్వమే నన్ను నిలదీసి, నా బలహీనతను, తప్పును గుర్తుచేసింది. నా జీవితానికి సాగర్ చేసిన మోసం, నా భర్తకు నేను చేసిన ద్రోహం కళ్ళకు కట్టినట్లయింది... ఇంతకాలం భార్యగా ఆ ప్రేమమూర్తికి చేస్తున్న ఘోరం ఏమిటో అర్థమైంది... అంతే...! వశం తప్పిన కోపంతో

ఏం మాట్లాడానో... ఆ దుర్మార్గుణ్ణి ఎలా నిందించానో ప్రస్తుతం గుర్తుకు రావడం లేదు. అతన్ని నా జీవితంలో మరెన్నడూ కన్పించవద్దన్నాను. స్త్రీ ప్రేమకు ప్రాణాన్నిస్తుంది... అలాగే ప్రేమ ద్రోహానికి ప్రాణాన్ని తీస్తుంది. అయినా నేను ఆ పని చేయలేను... తక్షణమే వెళ్ళిపో! కలలో కూడా నన్ను గుర్తు చేసుకోవద్దు..." సాగర్‌తో నేను అన్నమాటలివి. ఇది అతను ఊహించని పరిణామం! అతను వెళ్ళిపోయాడు... తలుపు వేశాను. తరువాత మళ్ళీ రావడానికి అతను ప్రయత్నం చేసినా... నా సమాధానంలో మార్పులేకపోవడంతో, ఈనాటికీ అతని జాడ నాకు తెలియదు... అయినా నేను నీతి తప్పిన భార్యనే సుమా!...

ఒకరోజు ఉదయమే తలుపు చప్పుడైంది. సాగర్ వచ్చాడేమో అనుకునేసరికే నాకు కోపం పెరిగిపోయింది. విసురుట్ వెళ్ళి దఢాలున తలుపు తీశాను... ఆశ్చర్యం...! మీ డాడీ!... నా కళ్ళలోకి చూశారు!... అదే ప్రశాంతత! అదే ప్రేమ భావం!! ముఖంలో కోపం ఛాయగానైనా లేదు. నేను తలదించుకుని 'రండి' అంటూ ప్రక్కకు తొలగాను. నాకు దుఃఖం ఆగడంలేదు. లోపలికి రాగానే ఆయన పాదాలపై పడిపోవాలనుకున్నాను... క్షమించమని ప్రాధేయపడాలనుకున్నాను... ఏదీ చేయలేకపోయాను... ఆయన సరాసరి బెడ్‌రూంలోకి వెళ్ళి, బోల్ట్ వేసుకున్నారు. అక్కడే నిలబడిపోయాను చాలాసేపు! బయటికి రాగానే బావురుమని ఏడ్చి ఆయన కాళ్ళను చుట్టేద్దామనుకున్నాను. చాలాసేపటివరకు ఆయన బయటికి రానేలేదు. సోఫాలో కూలబడ్డాను... వెంటనే

లేచి, ఆయన కూర్చునే కుర్చీలోకి చేరాను. కాసేపటికి సూట్‌కేసుతో బయటకొచ్చారు... నీ బెడ్ దగ్గరకొచ్చారు... క్రిందపెట్టిన సూట్‌కేస్‌ను తీసుకొని, లోపల పెట్టాలని ముందుకు వెళ్ళాను. ఆయన నా వైపు చూశారు. ఆగిపోయాను... నిన్ను ఎత్తుకుని అలవాటు ప్రకారం నీ ముఖం – నా ముఖం... మార్చి మార్చి చూచి..., నిన్ను పడుకోబెట్టి, నా వైపు తిరిగి... "పాపకు ముమ్మూర్తులా నీ పోలికలే! అయినా... నీ బుద్ధికి జిరాక్స్ కానీయకు... నీవు నా భార్యవే! ఈమె నా బిడ్డే! ఈమెను అతి జాగ్రత్తగ పెంచుతూ, మంచి విద్యా బుద్ధులతో గొప్ప మనిషిట్ తయారించు. మీ యిద్దర్నీ పోషించవలసిన బాధ్యత నాదే! అవసరమైన డబ్బు పంపిస్తూ వుంటాను. పాపకు ఏవిధమైన లోటూ రానీయకు. కలవారి బిడ్డట్ ఆమెను సంరక్షణ చెయ్యి!... నాకా అదృష్టం... లేదు!... నేను, నీ భర్తనే అయినా... నీ మనసుకు కర్తను కాలేకపోయాను... **ఎవరికి నచ్చిన జీవితాన్ని వారు నడుపుకునే హక్కువున్నా... సాంసారిక నీతి – సామాజిక రీతిని అనుసరించాలి. వ్యక్తి స్వేచ్ఛకు విచక్షణను నేర్పాలి**.. అది నీకు జరగలేదు... నేను నిన్ను అమితంగా ప్రేమించాను... అంత మాత్రాన నా విషయంలో నీవూ అలాగే వుండాలనేదేముంది?" నాకు దుఃఖం ఆగలేదు. ఏడ్చాను... ఆయన్ని పట్టుకు క్షమించమని ప్రాధేయపడాలని అనుకున్నాను... అయినా అలా చేయలేక పోయాను. గతంలో అయితే, నా కంటి నీరు చూస్తే... నిలువునా చలించి పోయి దగ్గరకు తీసుకుని, పసి పిల్లను ఓదార్చినట్లు అనునయించేవారు. కాని... యిప్పుడు, నా వైపు కాసేపు

రెప్పవేయకుండా చూచి... ఒకడుగు ముందుకు వేయబోయి, ఆగిపోయారు. తన కళ్ళు తుడుచుకున్నారు... "నేను వెళ్తున్నాను... నన్ను ప్రశ్నించకు... నా వస్తువులనే నేను తీసుకువెడుతున్నాను..." నేలపై కూలబడిపోయాను... దగ్గరకొచ్చారు... నన్ను ముట్టుకోలేదు... "బాధపడకు, నీపై నాకుగల ప్రేమలో ఎన్నడూ మార్పుండదు. అది శాశ్వతం! పవిత్రం... ఇద్దరమూ, కాల పరీక్షకు నిలుద్దాం!... పాప జాగ్రత్త సుమా!"... మరోసారి నిన్ను తన చేతుల్లోకి తీసుకుని ముద్దు పెట్టుకుని... నిన్ను మళ్ళీ నా చేతులలో వుంచి... "వెళ్తున్నాను" అంటూ గుమ్మం వైపు కదిలారు. నేను నిన్ను బెడ్‌పై వుంచి, ఆయన వెంట వెళ్ళి ఆయనకు ఎదురుగా అడ్డుగా నిలిచి, వెళ్ళవద్దని ఆయన కాళ్ళను చుట్టివేద్దామనుకున్నాను... ఆయన గేటు వద్దకు వెళ్ళి తిరిగి నావైపు చూశారు... అంతే, ఆయన వీధిలోకి వెళ్ళిపోయారు... గేటుపై తలవాల్చి నిలబడి, ఆయన నా కనుచూపుకు దూరమయ్యే వరకు అలాగే చూస్తూవుండిపోయాను... దగ్గరగా ఆయన్ను చూడడం నాకు అదే ఆఖరుసారి... ఇన్నేళ్ళూ... ఆయన రాక కోసం ఎదురు చూస్తూనే వున్నాను... అయినా మృగతృష్ణగానే వుంది నా బ్రతుకు... నీ చిన్నతనంలో నేను నిన్ను స్కూలుకు తీసుకెడుతూవుంటే... దాదాపు ప్రతిరోజూ నిన్ను చూడడానికి మీ డాడీ దూరంట్ వేచివుండేవారు. అందుకు వీలుట్ నేను కూడా కాసేపు నీకు ఎడంగా ఆయన వెళ్ళిపోయేవరకూ ఆగేదాన్ని... బహుశా నీవు కాలేజీ చదువు పూర్తి చేసేవరకు ఆయన అలాగే చేసేవారేమో మరి! నీ కారణంగానైనా

కొన్నాళ్ళపాటు దూరంగానైనా నా భర్తను చూచుకునే అవకాశం కలిగింది. అది ఒక తృప్తి! అయినా, నాకు యిప్పటికీ అర్థం కాని విషయం... మనసులో ఎన్ని విధాలుగా ఎన్నిసార్లు అనుకున్నా... యిన్నాళ్ళకైనా నన్ను – నా భర్తను చేరకుండా చేసిన ఆ దుష్ట శక్తి ఏది?... బహుశా అది ఆ ప్రేమమూర్తికి, నేను చేసిన నమ్మక ద్రోహమే కావచ్చు... అయినా ఇప్పటికీ, ఎప్పటికీ గర్వంగా తలెత్తుకుని చెప్పగలిగిన విషయం ఒకటుంది. సాగర్ ప్రేమ మాయలో చిక్కుకున్నా నాతో శరీర సంబంధానికి అతను ఎన్నివిధాల ప్రయత్నించినా, రెచ్చగొట్టినా, ఒక్కోసారి దాదాపు నేను కంట్రోలు తప్పిపోయే పరిస్థితి దాపురించినా... అన్నిటినీ తట్టుకుని... చివరకు నా కన్యత్వాన్ని నా భర్తకే అర్పించుకున్నాను... నన్ను అమితంగా ప్రేమించిన ఆ ప్రేమమూర్తి నా భర్తపై ప్రమాణం చేసి, నేనీ విషయాన్ని చెప్పగలను. నా అంతరాత్మే అందుకు సాక్షి... ఆ తరువాత పరిస్థితులే... నన్ను సంసార నీతిని తప్పించాయి. నాతో తప్పు చేయించాయి...

ప్రేమసంబంధ వ్యవహారంలో మనిద్దరి జీవితాలు దాదాపుగ పోలికలు న్నప్పటికీ... నాకంటె నీవు... అడ్వాన్స్ అయ్యావేమోనని నా అనుమానం! ఏమైనా నా అనుభవాన్ని నీవు ప్రామాణికంగా తీసుకుని, నీకు ఎదురైన సమస్యను పరిశీలించు. **తన ఆకర్షణను ప్రేమగా వర్ణించి, స్త్రీలోని ప్రేమ సంబంధ మానసిక బలహీనతను ఆధారంగ చేసుకుని మగవాడు తప్పు చేయిస్తూ ఉంటాడు మానసిక బలహీనతలేని ఆడదానితో**

**బలవంతుడైన మగవాడు కూడ తప్పు చేయించలేడు.** కనుక, స్త్రీకి జరిగే అన్యాయాలకు అత్యాచారాలకు కేవలం మగవాడినే నిందించేకంటె అందుకు గల తన వంతు కారణాన్ని కూడా తనకు తాను తెలుసుకోవాలి. కనుక, నీ తొందరపాటుతో జరిగిన అనర్థానికి అదే ధ్యాసతో నిత్యం కుమిలిపోకుండా, నూతన జీవితానికి మార్గం వెతకడం మంచిది... నా గతం గూర్చి పూర్తిగ చదివి... దాని స్ఫూర్తితో మనసుకు ధైర్యం చెప్పుకుని, ఆత్మవిశ్వాసంతో జీవిత పురోగమనాన్ని సాగించాలి... ప్రయత్నం పాపా...!'

– – –

"పాపా! నా జీవిత గతాన్ని చదివి నన్ను అసహ్యించుకున్నావా?... ఆగ్రహం చెందావా?"

యిచ్చిన దానిని చదువుతూ "ఆ రెండూ చేయలేదు మమ్మీ! నీవు వ్రాసి యిచ్చిన దానిని చదువుతున్నంతసేపు నాకు ఎలాటి అభిప్రాయమూ కలగలేదు. కారణం నేనూ దాదాపు అదే బోటులో వున్నాను కనుక. నీ కడుపున పుట్టి... నీ తప్పులను ఎత్తి చూపడం... ఏవిధంగానూ నేను చేయవలసిన పనికాదు... కాకపోతే... వయసు తొందరలో తెలివి తక్కువతనానికి, నా జీవితానికి తగిలిన షాక్‌కు వెంటనే తేరుకోలేని స్థితిలో ప్రస్తుతం నేను వున్నప్పటికీ... అంతకంటె ముఖ్యంగా కుటుంబ సంబంధంగా మన దురదృష్టానికి బాధపడుతున్నాను మమ్మీ!... భర్త వుండీ – నీవు భార్య వుండీ డాడీ... అలాగే కొడుకు వుండీ

నీవు – కూతురు వుండీ ఆయన – అంతకంటే, తండ్రి, అన్న వుండీ కూడా – నేను... యిలా అందరం వుండీ, అన్నీ వుండీ యిలా, ఒకరికి ఒకరం కాకుండా చెదిరిపోయి బ్రతకడం... తలచుకుంటేనే వేదన కలుగుతోంది మమ్మీ! మన కుటుంబాన్ని గూర్చి యింత స్పష్టంగా తెలియనంత కాలం నాకు జరిగిన దానికే కుమిలిపోతున్నాను. డాడీ – అన్నా వుండి కూడా ఎవరూ లేని దానిగా బ్రతికే నా దురదృష్టానికి బాధపడుతున్నాను మమ్మీ!

నిన్ను నిందించడం కాదుగాని – నాకు అర్థమైనంతలో, దీనికంతటికీ నీ ప్రేమ – నీ ప్రియుడే ముఖ్య కారణంగా అనుకుంటున్నాను... నా అవగాహన తప్పు కావచ్చు లేదా రైటు కావచ్చు! కాని, నీ బాయ్ ఫ్రెండ్ నిన్ను మోసం చేసినా, నీకు ఆ ప్రేమ మత్తు వదలకపోవడంతో... నిన్ను అమితంగా ప్రేమించిన ప్రేమమూర్తిగా నీవనుకునే మా డాడీకి మనసును యివ్వలేకపోయావ్! కనీసం నీకు పుట్టిన బిడ్డ మీద కూడ మమకారం లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించావ్! డాడీ అది గ్రహించి అన్నను నీకు దూరంగా వుంచవలసి వచ్చింది. భర్తకు భార్యననే స్పృహ లేకుండా పరాయి మగవాడితో నీ విచ్చలవిడి ప్రవర్తనే... డాడీని నీకు దూరం చేసింది... నీలోవున్న నీ ప్రేమ బలహీనతే నన్ను క్రమశిక్షణలో వుంచలేకపోయింది... ఫలితం, నీతో సహా మనం అందరం యీ దుస్థితిని అనుభవిస్తున్నాం. కుటుంబం విచ్ఛిన్నమైంది... మమ్మీ! నీ కడుపున పుట్టిన నీ కొడుకైనా నీకు ఎన్నడూ గుర్తుకు రాలేదా?... నా అన్నను గూర్చి నాకు చెప్పడం పూర్తిగా మర్చిపోయావా? డాడీ విషయం నీ

వ్యక్తిగతమైనా, అన్నా - చెల్లెలు మమకారం గురించి నీకు అసలు తెలియనే తెలియదా మమ్మీ!... ఎందుకు ఏడుస్తావ్? నేను యిన్ని మాటలన్నందుకా?... సారీ మమ్మీ! నన్ను క్షమించు. నీకు పుట్టి నేను ప్రశ్నించడం తప్పని ఒప్పుకుంటున్నాను. నేను డాడీ దగ్గరకెళతాను... నేను ఆయన డాటర్నని చెప్పుకుంటాను... నా అన్నను కలుసుకుంటాను. నేను తన చెల్లెల్నని చెపుతాను... మమ్మీ! తల్లితండ్రిగా అన్నీ నీవై నన్ను పెంచి, రక్షించిన నిన్ను వదిలేస్తాననుకునేవ్!... అన్నా, నేనూ కలసి వచ్చి, నిన్ను లాక్కుపోయి డాడీ కాళ్ళమీద పడేస్తాం... రెడీగా వుండు!... ఎందుకు మమ్మీ అలా చూస్తావ్? నా మీద కోపం వచ్చిందా?"

లేదమ్మా! నీవు అన్నా, అనకపోయినా... నాకు తెలుసు, నేను దోషినే! నీవన్నట్లు అందరం వుండి, ఎవరికి ఎవరూలేని వారిట్ కుటుంబం యిలా చెదిరిపోడానికి కారణం నేనే! నీవు చెప్పింది అక్షరాలా నిజం! నీ తండ్రి - నీ అన్నా - నీవు ఏకమై మీరంతా కలిసి హాయిట్ బ్రతకండి! నాలాంటి నీతిహీనమైన మనిషికి మీలో స్థానంలేదు. అందుకే, నా గురించి ఏమీ ఆలోచన చేయకు! నేను యిలాగే బ్రతుకుతాను. చేసిన తప్పుకు ఒంటరి జీవితంతోనే శిక్షను అనుభవిస్తాను. అంతటితోనైనా - నాకు దోష పరిహారం జరుగుతుందేమో! నీవైనా జరిగిన తప్పును దిద్దుకొని వాళ్ళ దృష్టిలో మంచిట్ జీవించు. నాలాట్ ఆ గతాన్ని మళ్ళీ నీ జీవితంలోకి ప్రవేశింపనీయకు... ఇది నా సలహా మాత్రమే!"

"లేదు మమ్మీ! నన్ను మోసం చేసినవాణ్ణి నేను ఎప్పుడో

మర్చిపోయాను. నీ గతం తెలిసిన తరువాత నా మనసు మరింత దృఢంగా వుంది. నీకు మాట యిస్తున్నాను. ఏ పరిస్థితులలోనూ ఆ గతం నా జీవితంలోకి రాదుగాక రాదు... అది మనిద్దరిలో జీర్ణమై పోవడమే మంచిదేమో! జరిగిన దానిని ఒక పీడ కలగా మర్చిపోయి, జీవితంలో అలాటివి ఏవీ జరగనట్లుగానే అనుకుని, ఆ గతాన్ని భవిష్యత్ జీవితానికి ఒక గుణపాఠంగా స్వీకరిస్తాను... ఎలాగో తెలుసా మమ్మీ! మమ్మీ – డాడీ ప్రేమతో... అన్న అనురాగంతోనే సుమా! నాకు నేనుగా మాత్రం కాదు. అలా కాదంటే చెప్పు – మనిద్దరం యిలాగే బ్రతికేద్దాం..." మనకు ఎవరూ లేని వారిగా, మనిద్దరమే కాలక్షేపంగా బ్రతికేద్దాం..."

"పాపా! నీ పోలికలు నావే గాని, తెలివి మాత్రం మీ డాడీదే! నీ అన్న మేధాశక్తిని, వాడికి మూడో సంవత్సరంలోనే గ్రహించాను యిప్పుడు వాడు..."

"మమ్మీ! బాధపడకు! త్వరలోనే మనం అందరము ఒకే చోటికి చేరగలము... మనకీ మంచిరోజులు వస్తాయి. డాడీ అడ్రసు చెప్పు నేను వెళ్తాను. నీవు చెప్పిన దాన్ని బట్టి నేను ఆయన్ను గుర్తు పట్టగలను. నన్ను తన డాటర్‌గా తెలుసుకోగలరు. నాలో పూర్తిగా నీ పోలికలే వున్నాయి గదా మమ్మీ! ముందుగా ఆయన్ను నేనే పలకరిస్తానుగా 'డాడీ' అని! మమ్మీ! డాడీ నీవు వున్న ఫొటో యివ్వు. ఐడెంటిటీగా వుంటుంది...

"పాపా!..."

"ఏమిటి మమ్మీ!"

"ఇలా వచ్చి... నాకు ఒక ముద్దుపెట్టమ్మా!... ఆయన స్మృతితో – నా మనసు ఎలాగో అవుతోంది."

"...నాకు తెలుసు మమ్మీ నీ మనసు! నీది – నాదీ కూడా... వయసు వేడితో, ఊహలో ప్రేమ... ఆనాటిది! నిజానికి ప్రేమంటే అది కాదేమో! అనుభవ ప్రేమ యీనాటిది... యిదే కల్మషంలేనిది... కామం లేనిది... మమ్మీ! డాడీ దగ్గరకెళ్దాం! నాతో వస్తావా?... పోనీ, నీ కొడుకును చూడడానికైనా రావచ్చుగా... ఏమిటి మమ్మీ మాట్లాడవ్?"

"గుండెకు గాయమైంది పాపా! ఇప్పటి వరకూ ఎలాగో, మొండిగా బ్రతుకుతున్నాను... ఇలా ఎన్నాళ్లిలా కుళ్ళి కుమిలిపోతూ, కునారిల్లుతూ బ్రతకమంటావ్?"

"ఇటు, నా వైపు చూడు మమ్మీ!... గుండె తీసి, మరో గుండె అమర్చగల యీ హైటెక్ కాలంలో గాయపడిన గుండెతో బాధ పడవలసిన అవసరం లేదు. నీకు అన్నిటికీ డాడీయే ట్రీట్‌మెంట్ చేయగలరు. ముందుగా డాడీ హాస్పిటల్‌లో ఎడ్మిట్ అయిపో! ఆయనే అన్నీ చూసుకుంటారు.

"మీ ముగ్గురూ కలుసుకోండి!... నన్ను యిలాగే వదిలెయ్యండి! నా గురించి ఆలోచన చెయ్యొద్దు!"

"అలాగే మమ్మీ! నీ యిష్టం! మనిద్దరం యిలాగే వుందాం! తల్లీతండ్రి తరువాతే గదా అన్నా చెల్లెలు అనురాగం..."

"మిమ్మల్ని తన పిల్లలుగా, నేను మీకు తల్లిగా... డాడీ

అనుకోవచ్చుగాని... నన్ను తన భార్యగా మీ డాడీ అంగీకరించరు. అది నాకు పూర్తిగా తెలుసు..."

"జాతకాలు చెబుతున్నావేంటి? డాడీ నిన్ను అమితంగా ప్రేమించిన ప్రేమమూర్తని... నీవేగా అంటున్నావు మమ్మీ!... నాకు తెలిసి నిజమైన **ప్రేమకు ద్వేషం తెలియదు**... నిన్ను భార్యగా – డాడీ నిన్ను అంగీకరిస్తారు. అందుకు నేను హామీ! తల్లిని పిల్లల్నీ ఆయన వేరు చేయరు. ఇది నాకుగల గట్టి నమ్మకం!"

"మీ డాడీ అంటే నీకు అంతటి నమ్మకం వుంటే... నీ యిష్ట ప్రకారమే జరిపించు... నాకు అభ్యంతరం లేదు... నీవు అనుకున్నట్లు జరగదనే నా నమ్మకం."

"అలాగే మమ్మీ! మానవ ప్రయత్నం మొదటిది కదా! మధ్యలో నీవు మనసు మార్చుకోకు. అలా అని నాకు మాట యివ్వు!"

"అలాగే!... మరోదారి లేదు నాకు..."

"అలా ఎందుకనుకుంటావ్? డాడీ నీకు హైవే! అన్నా – నేను స్టేట్ రోడ్స్... మార్గాలే లేవంటావేం? మేమంతా నీకు ఏమీ కామా?"

"..............................."

"మాట్లాడు మమ్మీ! మౌనంగా వున్నావేంటి?"

"నాటి గతంతో... నేటి రోగంతో... చివరికి మిగిలింది... శాశ్వత మౌనమే!... అంతా నీ యిష్టం అన్నానుగా పాపా! ఇంకా

నేను మాట్లాదేముంది?"

"కాదు మమ్మీ! ఇంకా, నీ మనసులో ఏదో వుంది. క్లియర్‌గా మాట్లాడడం లేదు."

వేరే ఏమీ లేదమ్మా!... నీవు ఎలాగూ నీ తండ్రిని చేరుకుంటావ్... నీ అన్నను చూస్తావ్... ఇహ నాకు మిగిలింది ఒకే ఒక కోరిక...! నా జీవితం పూర్తయ్యేలోపు నా కొడుకుతో... ఒక్కసారి... అమ్మా! అని పిలిపించుకోవాలని వుంది... జీవిత తృప్తికి అదైనా మిగులుతుంది నాకు.

"అలా అనకు మమ్మీ 'ఒక్కసారి' అంటావేమి? అన్నా - డాడీ - నీవు - నేను అందరమూ కలిసే వుంటాం. ఆ డౌట్ నీకు అక్కర్లేదు... నేను అడిగిన ఫొటో యివ్వమ్మా! డాడి దగ్గరకెళ్తాను. వాళ్ళిద్దర్నీ యిక్కడకు తీసుకొస్తాను. అందరం డాడీ దగ్గరే వుందాం! సరేనా? అనమ్మా సరేనని!"

"అంతా నీ యిష్టమేనన్నానుగా! మళ్ళీ అంటున్నా, నీ ప్రయత్నం నెరవేరాలని... తల్లిగా దీవిస్తున్నా... సరేనా..."

"ఓ.కె! మమ్మీ! ఓ.కె! విజయం నాదే...!ల

\- \- -

"మమ్మీ!... మమ్మీ!... డాడీ వచ్చారు... తలుపుతీయ్!... మమ్మీ!...."

"......................................................"

"మమ్మీ! నిన్నే! నేను... తలుపుతియ్ మమ్మీ!"

"..........................................."

"ఆమెకు నిన్నంతా బాగులేదమ్మా! రోజంతా చాల బాధపడ్డారు... బయటికి రాలేకపోయారు. రాత్రంతా మూలుగుతూనే వున్నారు! మేము దగ్గర వుంటామంటే... వద్దన్నారు... ప్రొద్దుట్నుండీ తలుపు తీయలేదు. రెండు మూడుసార్లు పిలిచినా పలుకలేదు..."

"వెంటిలేటర్‌లో నుండి చూడండి... ఏదో అనుమానంగా వుంది..."

"ఆమె మంచంపైనే వుంది... ఇంటి ఓనర్‌ను పిలుచుకురండి... తలుపులు విరగ గొట్టాల్సి వుంటుంది."...

"మమ్మీ!... మమ్మీ!... డాడీ! మమ్మీ పలకడం లేదు..."

"ఇంకెక్కడ మమ్మీ... మీ మమ్మీ చనిపోయింది..."

"లేదు డాడీ మమ్మీ యిక్కడే వుంది లేటు చేశామని కోపంలో వుంది... నేను మాట్లాడిస్తాను. చూడండి... మమ్మీ! మమ్మీ! ఇంకా నిద్రేనా? డాడీ వచ్చారు. లే మమ్మీ!... డాడీ వస్తే... నీవు ఎక్కడికెళ్ళావ్...? మమ్మీ!

"మీ మమ్మీ... మనల్ని వదిలేసి... ఏ లోకాలకో వెళ్ళి పోయిందేమో? తిరిగిరాదు..."

"ఈ పాపం... బయటికి తీసుకెళ్ళండి..."

"ఏం బాబూ!... నీవు ఆమె భర్తవా? ఆమె బ్రతికుండగా రాకూడదని శపథం చేసుకున్నావా?..."

"ఏమిటి నువ్వు మాట్లాడేది? ఇదేనా సమయం? ఆయన ఏ స్థితిలో వున్నారు? కాస్తన్నా బుద్ధుండాలి!... బాబూ! మీరేమీ అనుకోకండి! మీ భార్య అంటే ఈమెకు అమిత అభిమానం!... తెలిసీ తెలియక ఏదో తెలివి తక్కువగా మాట్లాడింది... అవి మీరు మనసులో పెట్టుకోకండి..."

"................................"

"శవాన్ని బయటకు తీసుకురండి...

బాబూ: తలగడ క్రింద యీ కవరు...!"

– – –

"ఈ కవరు నా భర్త శరత్ చంద్రగారికి అందజేయండి..."

'ఏమండీ! బావున్నారా? మిమ్మల్ని యిలా పలకరించి... ఎన్ని సంవత్సరాలైందో. మీకు తెలుసు. పాప పసిదానిగ వున్నప్పుడే... మీరు మమ్మల్ని ఒంటరిగ వదిలేసి... వెళ్ళిపోయారు... కారణం... నాకు తెలుసు. మీ దారికి అడ్డునిలిచి, మిమ్మల్ని వెళ్ళకుండా చేయాలనుకున్నాను. కాని, అప్పుడు ఆ ధైర్యం నాకు లేకపోయింది. పాపను నా చేతులలో వుంచి, మీరు చెప్పిన మాటలు నిత్యం నాకు గుర్తుండేవి... మీరు చెప్పినట్లే పాప విషయంలో నాకు చేతనైన కృషి చేశాను...

మమ్మల్ని విడిచి వెళ్ళినా, మాకు ఏ లోటూ రాకుండా

పోషించారు... కృతజ్ఞతలు... నా అనారోగ్యాన్ని గురించి ఒక భార్యగా నేను మీకు చెప్పుకునే అవకాశం, అదృష్టం నాకు లేకుండా పోయాయి. అందుకే మెడికల్ ట్రీట్‌మెంటుకు మీరు పంపిన డబ్బును ఖర్చుచేయడానికి నా మనసు అంగీకరించలేదు... ఫలితం, రోగం తీవ్రమై నేటికి నన్ను చావు సమీపానికి చేర్చింది. రోజు రోజుకీ, శ్వాస చాల కష్టమైపోయింది... పాపకు యీ విషయం పూర్తిగా తెలియనివ్వలేదు. నా మానసిక, శారీరక వేదన బాధను భరించలేక మీ దగ్గరకు రావాలని కొన్నిసార్లు అనుకున్నాను. అయినా మీ అనుమతి లేకుండా... మీరు పిలవకుండా నాకు నేనుగా ఎలా రాగలనండీ?

నా జీవితం పూర్తికాబోతున్న సంగతి నాకు తెలుస్తూనే వుంది కనుక... మన విషయం పాపకు చెప్పాను. ఆమె మీ వద్దకు వచ్చి మిమ్మల్ని తీసుకు వస్తానని పట్టుపట్టింది. మీరున్న అడ్రసు మన ఫోటో తీసుకుని మీ వద్దకు బయలుదేరింది. బహుశా అక్కడకు వచ్చే వుంటుంది. నేను బ్రతికి వుండగా మిమ్మల్ని ఒక్కసారైనా చూడాలనేది జీవిత కోరిక... కాని, అది నెరవేరదని నాకు తెలుసు! బాబును చూచి "వాడితో కనీసం ఒక్కసారైనా...'అమ్మా' అని పిలిపించుకుని... కన్న తల్లిగా మాతృత్వ తృప్తి చెందాలని ఆశపడ్డాను... అది... నెరవేరదనీ నాకు తెలుసు... జీవితంలో అధిక భాగం మీరు నాకు దూరంగా వున్నా... ఆఖరి ఘడియలలోనైనా.. మీ ఒడిలో తలపెట్టుకుని తృప్తిగా తుదిశ్వాస వదిలెయ్యాలని ఆశించాను... అదీ నెరవేరే

అవకాశం కన్పించడంలేదు. ఇలా జీవితంలో నేను అనుకున్న దానిని, ఆశించిన దానిని దేనినీ పొందలేకపోయినా... ఒకే ఒక తృప్తి నాకు మిగిలింది... అదే... అదే..., మీరుకట్టిన మాంగల్యంతోనే... జీవితాన్ని పూర్తి చేసుకుంటున్నాను... నా మరణానికి ముందుగా మిమ్మల్ని చూచి, మీతో మాట్లాడే అవకాశం అదృష్టం నాకు ఎలాగూ లేదు కనుక... నేను చనిపోయిన తరువాతనైనా మిమ్మల్ని పలకరించి, మాట్లాడాలనే తుది కోర్కెతో యీ వుత్తరం వ్రాస్తున్నాను...

బాబుకు... అమ్మగా... నేనున్నాననే సంగతి తెలుసో లేదో మరి! వాడి అమ్మగా చనిపోయిందని యిప్పుడు వాడికి స్పష్టంగా చెప్పేయ్యండి... పాప కూడ మీదగ్గరకే చేరుకుంది కనుక... ఇహ మీదట తల్లిలేని ఆ పిల్లకు తల్లీ... తండ్రీ... మీరే...! మరో మాట! ఇంతకాలం, మీరు మాకు పంపించిన డబ్బుకు సంబంధించి 'ఎకౌంట్' వివరంగా వ్రాశాను... బాలెన్స్ బీరువాలో వుంది... తీసుకోండి!...

ఇహ... ఏమీ వ్రాయలేనండి! మనసు – శరీరం... నా వశం తప్పుతున్నాయి. బ్రీతింగ్ అతి కష్టంగా వుంది... అయినా... ఒకవేళ మీరు వచ్చే వరకైనా... ఈ ప్రాణం నిలిస్తే... ఏమో! ఆ ఆశకూడ లేదు... భర్తకు యిల్లాలుగా వుండి... కనీసం, పిల్లలకు తల్లిగానైనా... ఆఖరి దశలో... సమీపంలో ఎవరూ లేని దిక్కుమాలిన స్థితిలో... చనిపోతున్న దురదృష్టవంతురాల్ని... నేను... నన్ను క్షమించండి...

బాబును అడిగినట్లు చెప్పండి... పాపను ఓదార్చండి!... ఏమండీ... మిమ్మల్నే శ్వాస కష్టమై పోతోందండీ... పడిపోతున్నాను... నన్ను పట్టుకోండి... పడుకోబెట్టండి. ఏమండీ... అమ్మా... ఉఖ!.... మీకు... మీ పాదాలకు... ప్రమా...లు.... సెల...వ్..."

# 5. జీవితం

**"ప్రేమించి పెళ్ళి చేసుకోవడం..., ఆ ప్రేమను అలాగే కొనసాగించగలగడం..., పెళ్ళిచేసుకుని ప్రేమించడం - దాన్ని అలా పోషించుకోగలగడం... ఈ రెండూ - చాలా అరుదుగా జరిగేవే!** సమాజపరంగా జీవితానికి పెళ్ళి ఒక ముఖ్య అవసరమే అయినా... వివాహ బంధంలో సాధారణంగా స్వార్థం - స్పర్థ అధికంగా వుంటాయి! ఇవి ప్రేమకు సంబంధించినవి కావు సుమా!... కనుక, నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకుని మీ పట్ల నాకున్న ప్రేమను తగ్గించుకోలేను... ప్రేమ మార్గంలో యీ జీవితం మీకు అంకితం... శంకించవలసినది లేదు... మీ విషయం... మీ యిష్టం.

**ఆశలేని అభిలాష - స్వార్థం తెలియని తపన... యివి అర్థంలేని మాటలుగా అనిపించవచ్చు! కాని, మనసుకు అతీతంగా... హృదయాంతర్గత ఆత్మీయత కలిగినవారికే... యీ వాస్తవిక అనుభవం సాధ్యం! ఆత్మీయత - దాని అనుభూతి కేవలం ఆధ్యాత్మికమే కాదు, ఆచరణ సాధ్యమైన జీవిత ధర్మం అది!**... ముదిమి మీద పడిన వారి మాటలు కావు యివి. నాకు సాహిత్య పరిచయం నేర్పిన జ్ఞానం యిది... నాకు తెలుసు... మీరు మాట్లాడరు... నా మాటలకు బదులు చెప్పరు! ఈ నా మాటలు... బహుశా మీ మనసును నొప్పించాయేమోగాని... అవి నా మనసు నుండి వచ్చినవి కానేకావు... నా హృదయలోతుల నుండే అవి వెలువడినాయి... ఇది నా నిర్ణయం: మిమ్మల్ని ప్రేమించిన నాకు మీతో పెళ్లి సాధ్యం కాదు కనుక,

మీరు వేరొకరిని పెళ్ళి చేసుకుని, ఆమెను ప్రేమించే ప్రయత్నం చేయండి! మీ పట్ల నాకున్న ప్రేమకోసం ఎప్పుడైనా మిమ్మల్ని కలుసుకునే ప్రయత్నం చేస్తాను... అది, మీకు అభ్యంతరమైతే... అలా చేయను... అయినా వాయుపుత్రుని హృదయంలో వాల్మీకి రాముని ప్రతిష్ఠ జరిగినట్లే... నా హృదయపీఠంపై... మీ రూప ఆవిష్కరణ శాశ్వతం...

Wish you good luck.

మీకు అభినంద వందనాలు – శైలజ

"ఏం నాయనా! తలపట్టుకు కూర్చున్నావ్...? తలనొప్పా? తనువు బాధా?... చేతిలో ఏదో వుత్తరం వున్నట్లుంది, అది 'లౌ' లెటరా? లీవు లెటరా ఆర్ రిలీవ్ లెటరా?... చింతాకాంతుడవైయున్నావ్... కాంతా విరహమా...?"

"ఒరేయ్! నీ టి.వి. కట్టేయ్! దేనికైనా – సమయం – సందర్భం తెలియాలి!"

"తెలుసు కనుకే తెలుసుకొనే ప్రయత్నం చేస్తున్నాను. "ఫ్రండ్ యిన్ నీడ్" అన్నారు! **స్నేహితులు సంతోషాన్నే కాదు, అవసరమైతే దుఃఖాన్ని కూడ పంచుకోవాలి!... ఇష్టంలోనే కాదు – కష్టంలోనూ ప్రక్కనే వుండాలి! ఇది స్నేహ ధర్మం**... విషయం వ్యక్తిగతమైనా... వ్యవహారంలో మిత్రులకు వాటా వుంటుంది. స్నేహంలో అలా వుండాలి కూడ! అందుకే అడుగుతున్నాను. నీవు చెప్పకపోయినా నాకు కలిగిన అనుభవంతో విషయాన్ని కొంతమేర గెస్ చేయగలను... సాధారణంగా టీనేజ్‌లో ఏగని (Agony) ప్రేమ

ఫెయిల్యూర్‌తోనే కలుగుతుంది. ఇంకో పాయింట్‌లో – **తాను కోరుకున్న చిన్నది – మరొకర్ని చేరుతున్నా మనసుకు అదే బాధ! ప్రేమ తిరస్కారం, హృదయానికి గాయం చేస్తుంది... అలాగే, ఆత్మీయుల ఎడబాటూ అంతే వ్యధను కలిగిస్తుంది...** నా వూహాలలో ఏదైనా వుందనుకుంటే... నీ విషయం చెప్పాలనుకుంటే... నీ యిష్టం! మిత్రునిగా నాకు తోచిన సలహా చెబుతాను... లేదంటే... అదీ సరే!"

"ఈ వుత్తరం చదువు... పూర్తిగా చదివి... ఏం చెబుతావో చెప్పు!"

"నీ వుత్తరం నేను చదవడం ఏమిటి? అది సభ్యతా పద్ధతి కాదు..."

"ఫర్వాలేదు! నీవు నా మిత్రుడివి! నా హితంకోరే మంచి స్నేహితుడివి! నీ విషయంలో నాకా భేదం లేదు... యిదిగో... చదువుకో!"

"................................"

"పూర్తిగా చదివావా? బిట్లు బిట్లుగ – బట్లు బట్లుగానా?"

"...She is correct, besides, her mind is perfect!"

"ఆమెకు నీవు అన్నవనుకొని మాట్లాడుతున్నావా?... లేక, నా మిత్రునిగానా...?"

"ఆమైనా – మరొకరైనా – నీకు కాబోయే 'బెటర్‌హాఫ్' వరుసకు నాకు సోదరి కావలసిందే కదా!"

"అందుకనేనా ఆమె తరఫున 'వకాల్తా' పుచ్చుకున్నట్టు పాక్షికంగా మాట్లాడుతున్నావ్?"

"తమ్ముడు తనవాడైనా, ధర్మం అందరికీ సమానమే!... ఆమెది మర్మం తెలియని మనస్సు! కల్మషంలేని హృదయం! ఆ స్వచ్ఛతే ఆమెతో యీ వుత్తరాన్ని యింత నిర్మలంగా వ్రాయించగలిగింది! ఈ రోజులలో చాలామంది ఆకర్షణనే ప్రేమగా భ్రమించి, ప్రేమికులమనుకుంటూ పెళ్ళి చేసుకుని దరిమిలా పై మెరుగులు కరిగిపోయి మోజు తరిగిపోయి, ఒకరికొకరు వ్యతిరేకులుగా విరోధులుగా మారి, పరస్పరం సాధించుకుంటూ బ్రతుకులను నరకప్రాయం చేసుకోవడమే... ఎక్కువగా జరుగుతోంది! ఊహాజనితంగా ఆశించినట్లు జీవితంలో జరగకపోవడంతో అర్ధంతరంగా అనేక జీవితాలు అంతమైపోవడం కూడా యీ రోజులలో మాములైపోయింది! ప్రేమకు, పెళ్ళికి తప్పనిసరిగా బంధం అవసరంలేదనేదే ఆమె భావన! ప్రేమ రూపంలో – మానసికంగా తాను నీకు అంకితమైనా... నిన్ను వేరే వ్యక్తిని పెళ్ళి చేసుకోమనడంలోనే... ఆమెకు స్వార్ధం లేదనేది తెలియడం లేదా? 'ప్రేమ ఒకరికే' అనేది బహుశా ఆమె నమ్మకం కావచ్చు!... ఇందులో ఆమెను తప్పుపట్టవలసింది గాని, నీవు తలపట్టుకోవలసిందిగానీ ఏమీ లేదు! నీకు యిష్టమైన అమ్మాయితో నీవు పెళ్ళి చేసుకో! యిందులో ప్రత్యేకంగా సమస్యేముంది?"

"ప్రేమించడం... ఆమెకే తెలుసునన్నమాట! ఆమె సిద్ధాంతం ప్రకారం – ప్రేమికులంతా పెళ్ళిళ్ళు

మానేయాల్సిందేనా?"

"అది, ఆమె నమ్మకం! ప్రేమికులందరూ ఒకే తీరుగా ఎలా వుంటారు? ప్రేమ క్వాలిటీ, క్వాంటిటీని బట్టి - దాని పెర్ఫార్మెన్స్ వుంటుంది."

"ఇంతకూ నీవు చెప్పే బోడి సలహా ఏమిటి?"

"ఆమె యిష్టాన్ని నీవు కాదనకు! నీ యిష్టంతో ఆమెను బాధపెట్టకు!"

"ఆ పని ఆమె చేయొచ్చునన్నమాట!"

"ప్రేమ వ్యక్తిగతం! ఇద్దరి ప్రేమ, కలరు డిజైన్ ఒకేవిధంగా వుండాలనేముంది? ప్రేమికుల వ్యక్తిత్వాలు ఒకటికాదు గదా! మరి ప్రేమ తీరూ అలాగే వుంటుంది! **వెరైటీ యీజ్ యాన్ ఇన్ఎవిటబుల్ యాస్పెక్ట్!** కనుక ఆమె తన పద్ధతిలో తన ప్రేమను వ్యక్తం చేసింది! అలాగే, నీ లైన్‌లో నీవు ప్రేమను సెట్ చేసుకుని సెటిలైపో! ప్రేమ పవిత్రమైంది. అది ఎవరికీ బంధం - నిర్బంధం కాకూడదు... పర్సనల్‌గా నేనూ 'లౌ లైన్' ఆన్‌లైన్ కాకపోవడంతో గెయిన్ అయిన నాలెడ్జితో మీ విషయంలో యింత 'డీప్'గా డీటెయిల్‌గా....

"నీకూ ప్రేమ రైలు తప్పిపోయిందన్నమాట! ఆ సంగతి నాకు యిప్పటివరకూ చెప్పలేదే!"

"నీ ఎఫెయిర్ నీవు మాత్రం నాతో చెప్పావేంటి? బెడిసి కొట్టింది కనుక... యిప్పుడు లెటర్ చేతికిచ్చావు."

"ప్రస్తుతం ఉభయులమూ ఒకే బోటులో ఉన్నాం కనుక, ఓపెన్ మైండ్‌తో మాట్లాడు కుందాం! కొన్నాళ్ళపాటైనా పర్సనల్ విషయాలు! ప్రైవసీ లాకర్‌లో వుంచాలి సుమా!"

"ఆ డౌట్ నీకూ – నాక్కూడా అక్కర్లేదు. It would be an intact fact! నన్ను నమ్ము!"

"నిజం చెబుతున్నాను విను! నేను ఆమెను అసలు ప్రేమించనేలేదు. ప్రేమంటే నాకు తెలియదు. స్వార్థం కోసం నటించాను. ఆ యాంగిల్‌లో నాకు యింటరెస్ట్‌లేదు. ప్రేమ సెంటిమెంట్ ఒంటబట్టిందంటే... దాన్ని వదిలించే తగిన సైకియాట్రిస్ట్‌లు దొరకడం చాలా కష్టం... అసలు ప్రేమంటే – ప్రత్యేకంగా ఏముంటుంది?... నా దృష్టిలో – అప్పటికి నచ్చిందేదో అదే ప్రేమ! అది కాకపోతే మరొకటి? పేరు ప్లేసు ఏదైతేమి? పర్పస్ సెర్వ్ కావాలన్నదే – నా మోటివ్! అందుకే యిప్పటివరకు ఆమెతో నటించాను... ఆమె ఫామిలీ బాక్‌గ్రౌండ్ ప్రాపర్‌కాదు! పేరెంట్స్ ఒక కులంవారు కాదు. ఆమె ఫాదర్‌ది రిజర్వేషన్ కమ్యూనిటీ! వాళ్ళ డాటర్‌ను చేసుకుంటె... కాష్‌తో పాటు ఉద్యోగప్రాప్తి కూడా కలుగుతుందనే నా ప్లాను. కట్నం ఎలాగూ వస్తుంది కనుక, ఫైనాన్షియల్‌గా సౌండ్ కావచ్చు!... నీవు చూడలేదుగానీ... ఆమె ఫిగర్, ఫేస్ చాలా ఆకర్షణీయంగా వుంటుంది. నామనసును వశం చేసుకున్న ఆ ఎట్రాక్షనే ఆమె ఎదుట ప్రేమగా మాట్లాడుతూ – ఆమెను పెళ్ళికి తొందరచేశా... ఆమె, నా మనసు గ్రహించిందేమో మరి ప్రారంభంలో పాజిటివ్‌లో వున్నప్పటికి, క్రమంగా మేరేజ్‌కి అంత యింపార్టెన్స్ యిచ్చేదికాదు.

ఏ సందర్భంలోనైనా చాల జాగ్రత్తగా వ్యవహరించేది... లిమిట్‌గా మాట్లాడేది... నాకు ఓర్పు నశించి, మొన్నొక రోజు పెళ్ళి విషయంలో అవునో కాదో తేల్చివేయమని గట్టిగా ఒత్తిడి తెచ్చాను... ఆలోచించుకుని చెబుతానని... యిప్పుడీ వుత్తరం చేతికిచ్చి – మరోమాట లేకుండా వెళ్ళి పోయింది... ఇప్పుడు నన్నేం చేయమంటావ్?"

"ప్రేమంటే నీకు ఎలాగూ తెలియదు కనుక... దాని అవసరం నీకు లేదు కనుక... నీవు కోరుకునే ఉద్యోగ లాభానికి అవకాశం వున్న మరోచోట ప్రయత్నించు! అనవసరంగా ఆమెను ఒత్తిడి చేయొద్దు! ఆమెను చూచే ప్రయత్నం చేయొద్దు! నీకు నీవుగా అన్నివిధాల సెటిలైన తరువాత అప్పటికీ అభిమానం వుంటే... అదీ ఆమెకు అభ్యంతరం లేకపోతేనే... ఒక పరిచయస్తునిగా ఆమెతో మాట్లాడవచ్చు! అంతేగాని, అనుకున్నది ఆమె ద్వారా నెరవేరలేదనే కక్షను మనసులో వుంచుకోవద్దు! అలా ప్రవర్తించవద్దు!... సరేనా"

"............................................................"

"ఏమీ? బదులు మాట్లాడవేమి?"

"నాకు ఏమీ తోచడంలేదు."

"గతాన్ని మనసులో పాతి పెట్టుకునే కంటే... అనుకున్న దానిని సాధించుకోడానికి పురుష ప్రయత్నంగా మళ్ళీ ప్రయత్నం చెయ్యి!"

"నీవు కూడా ప్రయత్నించు – నాకు కావలసినదేదో చెప్పానుగా! అలాటి సంబంధంకోసం నీకు తెలిసిన వారితో ఎంక్వైరీ చేయించు. మిత్రుడివిగా నీవు నాకీ సాయం చేయాలి!"

"అలాగే! అయితే పెళ్ళి పేరుతో నీవు ఆశించే విధి విధానంలో నాకు చిన్న అనుమానం వుంది. చెప్పమంటావా?"

"చెప్పు! దానిదేముంది? విషయం తెలియాలిగదా!"

"సాధారణంగా కులాంతర వివాహంలోనైనా భర్త కులమే భార్యకు వర్తిస్తుంది గాని, భార్య కమ్యూనిటీకి అది ఎలా వర్తిస్తుంది? పైగా మతమార్పిడి వుందిగాని, కులమార్పిడి ఎలా సాధ్యం...? అయినా – రూల్స్‌ను ఫూల్స్‌చేసే ఘనాపాటీలు లేరని కాదు... నాకు తెలిసింది చెప్పాను. అది ఎంతవరకు కరెక్టో నాకు తెలియదు. పూర్తి ఇన్‌ఫర్‌మేషన్‌కు నీవు కూడా ప్రయత్నించు"

"నీవు చెప్పిందే నిజమైతే... నా పథకం మార్చుకోవలసిందే!"

"పూర్తి సమాచారంతో ఆ పని చెయ్యి!... అయినా నాకు తెలిసినంతవరకు వివాహం జీవిత బంధం! ఆ యిద్దరి మనసుల 'ఏకత' ముఖ్యం! దానితో ఆర్థిక లాభాన్ని ముడిపెట్టడం... వ్యాపార మనస్తత్వం మాత్రమే! భార్య, భర్త మధ్య అనురాగ, ఆప్యాయతలు వృద్ధి కావాలిగానీ... నటన కాదు... ఈ ఫిలాసఫీ ఒంటబట్టడంతో... నేను కూడా పెళ్లికి తగిన పిల్లను సెలక్ట్ చేసుకోలేకపోయాను..."

"నీ విషయమే నీకు తేలనప్పుడు నాకేం చేస్తావుగానీ... ముందు నీ సెటప్ చూచుకో?"

"రోగికి, మరో రోగే చెప్పగలడు మంచి సలహా! మెడిసిన్ అనుభవమూ వుంటుంది కనుక, మందుల జాబితా కూడ యివ్వగలడు... ఇప్పుడు యిద్దరమూ ప్రేమ పేషెంట్లమే కనుక, సీనియర్ – జూనియర్‌గా ఒకరికొకరం ఓదార్చుకుంటూ, అప్పటి వరకు మాట్లాడుకుంటూ వుందాం..."

"ఎప్పటివరకు?"

"ఇద్దరకూ డొమెస్టిక్ బాస్‌లు వచ్చేవరకు!"

"అలా అయితే, ఇహ మీదట 'లా' లైన్ వదిలేసి – 'లక్కీ రూట్'లోకి పోదాం!"

"అది, నాకు కుదరదులే!"

"అదేమి?"

"చెప్పానుగా! **భార్య – భర్తగా, జీవితభాగస్వాములుగా బ్రతకవలసిన వారిమధ్య ఆప్యాయత, అనురాగ, ప్రేమ భావమే పనిచేస్తూ వుండాలిగాని, ఆర్థిక లాభనష్టాలు లావాదేవీలకు ఏమాత్రం చోటుండరాదు.** అందుకే... కట్నకానుకలకు నేను చాలా దూరం! ఏమంటావ్?"

"విష్ణుమూర్తి గుండెలపై కూర్చోగలిగింది లక్ష్మీదేవే సుమా! పాదసేవ మాత్రమే దక్కిందట భూదేవికి! ఎందుకంటావ్? కలిమిలేమిలే కారణం! కట్నకానుకలతో, కనకాభరణాలతో

కలవారి పడుచులా లక్ష్మీదేవిలా అత్తవారింట అడుగుపెట్టిన కోడలికి లభించే ఆదరణ, గౌరవం, మర్యాద... సింప్లీ... ప్రేమ టోకెన్‌తో వచ్చినవారికి ఎలా లభిస్తుంది?"

"కట్నకానుకలను ఖాయం చేసుకుని, ఆడపెళ్ళివారితో ఘనంగా కళ్యాణం జరిపించుకోవడం... నైతికంగా ఆడపిల్లకు అమ్ముడుపోవడం కాదా? భార్యగా ఆమె దృష్టిలో భర్తకు లభించే గౌరవం ఏపాటిది?"

"నీది పూర్తిగ తప్పు అవగాహన! పుట్టింటి వారి 'పెట్టు'తో కోడలిగా కదిలి వచ్చేది 'తన' యింటికే... అవన్నీ తెచ్చేది 'తన' భర్తకోసమే! మెట్టినింట కోడలిగా భర్తకు వారసురాలిగా తన సంతానానికి తల్లిగా... తన స్థానాన్ని సుస్థిరం చేసుకోడానికే ఆ లాంఛనాల సమృద్ధి! అత్తవారింట్లో కోడళ్ళకు లభించే విలువ తాను తెచ్చుకున్న కట్నకానుకలకు దామాషాయే!"

"కోడలిగా యింట్లో ప్రవేశం యిచ్చినందుకు కట్నకానుకలు ఎడ్వాన్స్ డిపాజిట్లా?"

"ఎలా అనుకున్నా... అర్థం ఒక్కటే!... నా దృష్టిలో అవన్నీ స్టేటస్ బ్యాలెన్స్‌కు ప్రిస్టిజ్ మెయింటెనెన్స్‌కు!"

"కారణం ఏమోగానీ... నీది పూర్తిగా మనీమైండ్ అయిపోయింది!... నీతో వాదించి లాభంలేదు – నీ యిష్టం! అయినా అత్యాశతో, కట్నకానుకల డిమాండ్‌తో ఆడపిల్లగల వారిని అప్పులపాలు, అవస్థలమయం చేయడం మగపెళ్ళి వారి వ్యక్తిత్వానికి, మానవత్వానికి ఏమాత్రం గౌరవప్రదం కాదు. నా

దృష్టిలో మగపెళ్ళివారికి కట్నకానుకలు చదివించుకోవడం కంటె, తన పుట్టింట్లో న్యాయంగా తనకు రావలసిన ఆస్తి భాగాన్ని వాటాను కోడలిగా తనతో తెచ్చుకోవడం కంటె, తన పుట్టింట్లో తనకు రావలసిన ఆస్తి వాటాను తన కోసం తెచ్చుకోవడం ఆడపిల్లలకు శ్రేయస్సు!"

"ఎవరి తిండి వారే తింటున్నట్లు. ఎవరి ప్లేటు వారే కడుగుకుంటున్నట్లు – ఎవరి ఆస్తి వారికే వుంటే... యింకా వారిద్దరి మధ్య భార్యభర్త సంబంధానికి మీనింగేముంటుంది? ఇచ్చి పుచ్చుకోవడంతో అటూ యిటూ వియ్యాలవారి స్టేటస్ బ్యాలన్స్ తప్ప, వ్యక్తిత్వాల ప్రమేయం ఏమీ వుండదు... ఆడపిల్లకు అన్నివిధాల ఆర్థిక పుష్టిని కలిగించి అత్తవారింటికి పంపగలగడం ఆమెను కన్నవారికే ఘనత!"

"ఇంతకూ నీవనే ఆ పరిస్థితి దక్కేది అల్లుడికా, ఆడపిల్లకా?"

"అల్లుడికి కట్నం యిచ్చి కూతురుకు పెళ్ళి చేయడాన్ని వరకట్నం అంటారు. ఇది ఇప్పటిది! అలాగే, కూతురుకు కట్నం తీసుకుని... పెళ్ళి చేయడాన్ని కన్యాశుల్కం అంటారు... ఇది గతంలోనట! ఇవన్నీ నేను మా అమ్మ దగ్గర నేర్చుకున్న పాఠాలే సుమా! నా స్వంతం ఏమీ లేదు... ఇహ నన్నేమీ అడక్కు..."

"అయితే నేను వెళ్తాను. ఇలా అయితే నీకు పిల్లని చూడడం నా వల్ల అయ్యేపనికాదు."

"కట్నం లేకుండా – తేరగా అయితే పిల్లని

కుదిర్చేస్తావన్నమాట! ముందు నీ సంగతి చూసుకో!"

"అలాగే గాని, మరొక్క మాట! ఇహ మీదట ఎప్పుడూ... ఈ వుత్తరం వ్రాసిన అమ్మాయి ఊసుమాత్రం మానేయ్!"

"లాభం లేని కేసైతే... నాకెందుకు ఆ తగలాటకం!"

"అలా అనుకోవడం ఉభయతారకం! పిల్లని చూడమంటావా?"

"వద్దులే నీతో దండగమారి వ్యవహారం!"

"అయితే వస్తా..."

– – –

"మీరు మిస్ శైలజ అనే నమ్మకంతోనే మిమ్మల్ని యిలా పలకరించాను... అది నిజం కాకపోతే... సారీ!"

"సారీ ఎందుకు? మీ నమ్మకం నిజమే!... మీరు...?"

"నా వైపుగా నా గురించి నేను చెప్పుకునే కంటె... మీరు ప్రేమించిన వ్యక్తికి... నేను స్నేహితుణ్ణి! అంతకంటె... ప్రాణమిత్రుణ్ణని అంటే మోస్ట్ సూటబుల్‌గా వుంటుంది. మేము స్నేహితులమైనా – మీ యిద్దరి మధ్య సాగిన ప్రేమ విషయంలో మాత్రం వాడు – సారీ!... మేమిద్దరం అలాగే అనుకుంటాం – నాకు తెలియనివ్వలేదు. అయితే... మొన్న మీరు వ్రాసి యిచ్చిన లెటర్‌తో వాడు చాల 'అప్‌సెట్' అయినాడనే చెప్పాలి మరి!... కారణం అడిగితే మీరు వ్రాసిన వుత్తరాన్ని చదవమని

చేతికిచ్చాడు... నేను అంగీకరించలేదు... ప్రేమికుల ఉత్తరాలు – వారి ప్రైవేటు ఆస్తి గదా! ఇంటిమసీ ఎలాటిదైనా మరో వ్యక్తికి, దాని సంబంధం వుండరాదు. అయినా వాడి దృష్టిలో నేను బయటి వ్యక్తిని కాదనే భావంతోనే దానిని చదవమని బలవంతం చేశాడు! సభ్యత కాకపోయినా... చదివాను... సారీ!"

"ఆయన దృష్టిలో, మీరు పరాయివారు కానప్పుడు మీరు ఆ వుత్తరాన్ని చదవడానికి, ఆయనకు లేని అభ్యంతరం నాకు మాత్రం ఏముంటుంది? అది – మీ యిద్దరి యిష్టం!"

ప్రేమ విషయంలో మీ మనసు ఎంత పవిత్రమైనదో, స్వచ్ఛతను కలిగినదో, ఉన్నతమైనదో... ఆ వుత్తరం ద్వారా నాకు తెలిసింది! దానితో నేను ఎంతో యింప్రెస్ అయ్యాను. అందుకే పర్సనల్‌గా మిమ్మల్ని చూచి, మీతో మాట్లాడాలనే మంచి మనసుతో యిలా వచ్చానేగాని... వాడి తరపున కాదు... కేవలం మీ పట్ల నాకు కలిగిన నా వ్యక్తిగత అభిమానంతోనే యిలా వచ్చాను... మీకు అభ్యంతరం లేకపోతే... ఆ అవకాశం నాకు యివ్వండి... లేదంటే... వచ్చిన దారినే వెళ్ళిపోతాను..."

"లేదంటే... వచ్చిన దారినే వెళ్ళరా?"

"ఎలాగైనా వెళ్ళిపోవాలిగా! అయితే... మీరు అవకాశం యిస్తే... మీతో మాట్లాడిన మనసు తృప్తితో వెళ్తాను. లేకపోయినా వెళ్తాలెండి!... నిరాశాభారంతో!"

"మీరు బాగా మాట్లాడగలరు"

"ఏవీలేకపోయినా... ఏదో ఒకటైనా వుండాలి కదా, మనిషన్న తరువాత!"

"ఏవీ లేకపోవడం ఏమిటి?"

"ప్రస్తుతం – నా స్వంత విషయాలు వద్దులెండి! మీరు మాట్లాడండి!"

"ఏమి మాట్లాడమంటారు?"

"ప్రేమ విషయంలో – నా ఫ్రెండ్‌కు సంబంధించి, అంతటి కఠిన నిర్ణయం ఎందుకు తీసుకున్నారు? వసంతం ప్రకృతికి నూతన శోభనిస్తుంది... యౌవన ప్రేమ, క్రొత్త జీవితాలను ప్రసాదిస్తుంది... విడిలి వికసించని మొగ్గ, పూవుగ పూజకైనా వుపయోగపడదు... అలాగే ఫెర్టిలైజ్‌కాని ప్రేమ... బోన్సాయ్ మోడలే కదా?"

"చెప్పానుగా, మీరు చాలా బాగా మాట్లాడగలరని! ఇంతకూ – మీ మిత్రుడి తరఫున మీ సలహా ఏమిటి?"

"ఎవరి తరఫునా, మీకు సలహాలు చెప్పడానికి నేను రాలేదు... మీకు చెప్పానుగా! కేవలం మీ వృత్తాన్ని చదవడం ద్వారా, మీపట్ల నాకు కలిగిన సహృదయత, సద్భావం, అభిమానం కారణంగానే యిలా వచ్చాను... నా దృష్టిలో యీనాటి యువత ప్రతిదాన్నీ ఫాషన్‌గా చూడడమే తప్ప, ఒరిజినాలిటీ జోలికి పోవడం లేదు. అసలు ఆ దృష్టే ఎవరికీ కలగడం లేదు. ప్రేమ విషయంలోనూ అంతే! మోజు, మోహంతో అధికస్థాయిలో

ఆకర్షణకే యిష్టపడుతున్నారు... అందుకు భిన్నంగా మీరు ప్రేమ ఒరిజినాలిటీనే మనసులో నిలుపుకోగలిగారంటే గొప్పగానే వుంది!... అయినా నేను యిందాక చెప్పినట్లు... దేనికైనా దానితో ప్రయోజనమే దాని వికాసానికి కారణం కావాలి! ఇద్దరి మధ్య అంకురించిన ప్రేమ అందుకు భిన్నం కాదు... నా స్నేహితునిపట్ల, అంతటి ప్రేమ కలిగిన మీరు... అతనితో వివాహాన్ని తిరస్కరించడం... నాకు అర్థం కావడంలేదు!"

"అది తిరస్కరించడం కాదు! మీరన్నట్లు **వినియోగం, ప్రయోజనం దేనికైనా కారణ క్రియా రూపమే!** ధనాన్ని అలాగే వుంచితే దానితో వుపయోగం లేనట్లే... దేనికైనా వినియోగమే వుత్తమ పద్ధతి!... అయినా... గింజలన్నీ మొలకలుగా మారవు... అలాగే పువ్వులన్నీ ఫలదీకరణ చెందవు! కొందరి విషయంలో... ప్రేమా... అలాంటిదే! అది, జీవితంతో పాటు నీడలా వస్తూనే... ఆ జీవిత పూర్తితో... అదీ..."

బాధపడకండి! ప్లీజ్... అనవసరంగా మీ ప్రేమను గుర్తుచేసి, మిమ్మల్ని హర్ట్ చేశాను. సారీ ప్లీజ్!

"ఇందులో ప్రత్యేకంగా మీరు చేసింది ఏమీలేదు... అంతా స్వయంకృతమే! ఎవరైనా ప్రేమ భావాన్ని కలిగివుండడం... తప్పు, నేరం కాకపోయినా... గింజనైనా – మొక్కనైనా నాటేముందు నేల తీరును, నీటి వసతిని జాగ్రత్తగ పరిశీలించుకోవాలి! నిజం చెప్పాలంటే... నా ప్రేమ విషయంలో ఎలాటి పరిశీలన, సాయిల్ టెస్ట్ చేయలేదు. అందుకే నాకు సంబంధించి మీరన్నట్లు, నా

ప్రేమ బోన్సాయ్ మొడలే!..."

"మీ ప్రేమికునితో వివాహాన్ని మీరు ఎందుకు తిరస్కరించారో... వివరాలు నేను అడగను. అయినా మీరుగా అలాటి నిర్ణయం తీసుకోడానికి దారితీసిన పరిస్థితులు చెప్పడానికి మీకు అభ్యంతరం లేకపోతే తెలుసుకోవాలని వుంది"

"మీరు ఆయనకు ప్రాణమిత్రులన్నారు కనుక, అలాగే మీరు నా పట్ల సద్భావం కలిగి వున్నట్లు మీరు చెబుతున్నారు కనుక... నా మనసులోని మాట మీకు చెబుతాను... నేను ఆయన్ను ప్రేమించాను... ప్రేమంటే పవిత్రము, స్వార్థరహితమనేది... నా దృఢ విశ్వాసం! అయితే ఆయన నన్ను కామించారే తప్ప, ప్రేమించలేదు. ఏదో స్వార్థ ప్రయోజనాన్ని ఆయన నానుండి ఆశించినట్లు నాకు అర్థమైంది! ఇది నా అవగాహన మాత్రమే! అది వాస్తవం కావచ్చు... కాకపోవచ్చు! ప్రేమ విషయంలో నా మనసుకు అది పూర్తి విరుద్ధం! ఆయన నుండి నేను కోరుకున్నది అదికాదు. అందుకు ఆయన్ను నేను నిందించను. అది, ఆయన వ్యక్తిగత స్వభావ సహజత్వం కావచ్చు. ఈ పరిస్థితిలో, నాకు నేనుగ, నా ప్రేమ వరకే పరిమితం కావాలని నిర్ణయించుకున్నాను. ఇది, నా వ్యక్తిగతం కదా! ప్రేమ అవగాహనకు సంబంధించి, మా యిద్దరి మనసులు పరస్పర విరుద్ధంగా వున్నాయి. ఈ స్థితిలో నాకు ఆయనతో వివాహం అసాధ్యం... అలా జరగడం నా మనసుకు సమ్మతం కాదు..."

"వాడు నాకు ప్రాణస్నేహితుడే కావచ్చు... అంతకంటే

ఎక్కువగా అతను మీరు ప్రేమించిన వ్యక్తి! అది వాస్తవమైనప్పటికీ అతన్ని గూర్చి వ్యతిరేకంగా మీ ఎదుట మాట్లాడడం సభ్యతకాదు... స్నేహధర్మమూ కాదు. మీ ప్రేమ విషయంలో అతని మనసు గూర్చి మీ అండర్ స్టాండింగ్ కరెక్టే...! ఆ విషయంలో ఓపెన్‌గా అతను నాకు చెప్పినదాన్ని బట్టి – అతని పట్ల మీ ప్రేమ పవిత్రతను అతను ఏమాత్రము గమనించలేదు. ఇంతకాలం కేవలం అతని స్వార్ధ ప్రయోజనానికే మీతో నటించాడు. మీతో వివాదం, ఉద్యోగరీత్యా, యితరత్రా మీ రిజర్వేషన్ అర్హత అతనికి ఉపయోగపడుతుందని ఆశించాడు. మీ విషయంలో అతను అనుకున్నదీ... అది ఒక్కటే! కాని అది సాధ్యం కాదని బహుశా అతనికి తెలియకపోవచ్చు... నేను దానిని క్లియర్ చేశాను. దానితో అతని మనసులోని అసలు విషయం స్పష్టంగా చెప్పాడు. పైగా అతనితో వివాహాన్ని మీరు తిరస్కరించడంతో మీ ద్వారా తాను ఆశించింది జరగదనే భావంతో నిరాశపడి – తన తలపై ఏదో పెద్ద భారం దిగిపోయినట్లు ప్రస్తుతం అతను ఫీలవుతున్నాడు... పెళ్ళికి అమ్మాయిల వేట ప్రారంభించాడు..."

"అది నేననుకున్నదే! ఇందులో బాధపడవలసిందేమీ లేదు."

"తన స్వార్థంకోసం మిమ్మల్ని మోసం చేయాలనుకున్నట్లు మీకు ఫీలింగ్ కలగడం లేదా?"

**"ఏదైనా, జరిగినదానికి కారణంగా యితరులను**

అనుకునేముందు అందులో స్వయంకృతం ఏ మేరకనే పరిశీలన అవసరం! వాస్తవం తెలియడానికి అది ఉపయోగ పడుతుంది. ఈ విషయంలో నేను చేస్తున్నది అదే!... మరి, మీరేమనుకుంటున్నారు?"

"నేననుకునే... మీరనుకునే దానికి... దాదాపు పూర్తి విరుద్ధం! వ్యతిరేకం!! నాకు అర్థమైనంతవరకు మీ ప్రేమ విషయంలో మీ స్వయంకృత దోషం లేదు. అతనిపట్ల పూర్తి ప్రేమ భావంతో మీరుంటే... స్వార్థబుద్ధితో ఫ్రాడ్ మెంటాలిటీతో కేవలం మీ కమ్యూనిటీ ప్రయోజనాన్ని ఆశించి ప్రేమను నటించడం ఘోరం కదా! సారీ! మీ కమ్యూనిటీని ప్రస్తావించానని వేరుగా ఫీలవకండి! నిజానికి కమ్యూనిటీ అభిమానంతోనే... మీకు జరిగిన అన్యాయానికి బాధపడుతూ... యిలా మాట్లాడుతున్నాను. మీరు మరోలా అనుకోకండి! జన్మత్త వచ్చిన కులాభిమానం ఆ మనిషి ఏ స్థాయిలో స్థితిలో వున్నా, రక్తంలోంచి అది తొలగిపోదు... అదే, నన్ను యిలా మాట్లాడిస్తున్నది..."

"మీరు...?"

"అవును! నేనూ మీ కమ్యూనిటీకి చెందిన వాడినే! మీ ప్రేమికుడికి యిది తెలియదు. అందుకే తన మనసులోని వక్రబుద్ధి వాస్తవికతను నాకు చెప్పగలిగాడు! వాడు నాకు మిత్రుడే కావచ్చుగాని మీతో ప్రేమను నటిస్తూ ఫ్రాడ్ మెంటాలిటీ మెయింటెన్‌చేయడం నాకు చాల బాధ కలిగింది!"

"అందులో నా లోపమూ వుందిలెండి!... ఆయన

మనస్తత్వం అలాటిది! నేను వేరుగా అనుకోవడం ఎందుకు?"

"అలాటి వ్యక్తితో మీకు పెళ్ళి జరగకపోవడమే మంచిదైంది. ఇంటర్‌కేస్ట్ మేరేజెస్‌తో పుట్టే పిల్లల భవిష్యత్ సమాజంలో ప్రాబ్లంగానే వుంటున్నది. కులాంతర వివాహాలతో కులం పోదు కదా! పుట్టినవారి పేరెంట్స్‌లో ఒకరి కులం తప్పదుకదా! పైగా తప్పుడు సర్టిఫికెట్లతో రిజర్వేషన్ ప్రయోజనాన్ని పొందే మోసపూరిత వ్యవహారాలు ఎక్కువగా వున్నాయి. అధికార యంత్రాంగం స్వంత లాభానికి అమ్ముడు పోయినప్పుడు... ఇవన్నీ మామూలుగానే జరిగిపోతూ వుంటాయి. జన్మరీత్యా రిజర్వేషన్ అర్హత కలవారికి... ఆ ప్రయోజనం అందకుండా పోతోంది. అంతేకాదు... ఒకసారి రిజర్వేషన్ సౌకర్యం పొందితే, దానిని తమ కుటుంబ వారసత్వంగా మారి వారి తరాలకే సరిపోతుంది! అలా అది కమ్యూనిటీ ప్రయోజనంకంటే కుటుంబ లాభానికి వుపయోగపడుతోంది! అలా రిజర్వేషన్ సౌకర్యం ఒక కమ్యూనిటీలో ప్రత్యేక వర్గాన్ని తయారుచేస్తోంది. కులమత రహిత సమాజమంటూ ఓటు రాజకీయాలలో మార్మోగినా... వాటి రాజ్యవ్యవస్థ సుస్థిరం చేస్తున్నారు. సమాజపరమైన కులం-మతం, అవినీతి రాజకీయానికి చేరిపోవడంతో అవి రాజకీయపార్టీలకు ఓటు బ్యాంకులుగా స్థిరపడిపోతున్నాయి. దానితో రాజ్యాంగపరమైన రిజర్వేషన్ ప్రయోజనం దారితప్పి, వ్యక్తుల స్వార్ధానికి స్వంతమైంది..."

"మీకు రాజకీయాలలోనూ మంచి ప్రమేయం, ప్రావీణ్యత

వున్నట్లుంది..."

"లేదు! సహజమైన అవగాహన మాత్రమే నాది!"

"నాకూ సమాజ సంబంధ, సేవాభావం మనసులో వుంది!... ఇలాటి విషయాలు మాట్లాడడానికి... మీరు ఎప్పుడైనా వస్తూవుండండి! మనమధ్య మీ మిత్రుని ప్రస్తావన రానవసరం లేదు!... దేని గురించైనా పూర్తిగా ఒక నిర్ణయానికొచ్చిన తరువాత దానిని మళ్ళీ మళ్ళీ గుర్తుచేసుకోవడం... తెలివైన పనికాదు..."

"అలాగే! వస్తానండి!.. మీ ప్రేమ ప్రస్తావనతో మీ మనసును నొప్పిస్తే... సారీ! ఎక్స్ట్రీమ్‌లీ సారీ!"

"మీరు అలా అనుకోవద్దు! మార్పులేని నిర్ణయంతో వుంది నా మనస్సు!"

"మీ మనసు ఎలా వున్నా... చనువుగా, చొరవగా ఒక మాట చెబుతాను... యిది సలహా కాదు సుమా! ప్రేమ పేరుతో, దాని వైఫల్యంతో మనసు వైకల్యంతో... మొత్తం జీవితాన్నే సారహీనం కానీయకండి! వయస్సు వసంతాన్ని... వృధా చేసుకోకండి... వస్తానండి. థాంక్స్...!"

\- \- \-

"మేడమ్! నేను యిలా అడగకూడదు...మీ పర్సనల్ విషయాలను గూర్చి నేను ప్రశ్నించకూడదు... అయినా, అడుగుతున్నాను మీలో ఏలోపమూ లేకపోయినా, మీరు యిలా ఒంటరిగా ఎందుకు మిగిలిపోయారు?"

"కారణం లేకుండా ఏదీ జరగదు... మంచి మనసుతో అడుగుతున్నావ్ కనుక... వివరాలు వదిలేసి, సింపుల్‌గా చెబుతాను విను. వివాహ వయసులో ఒకరి తరువాత ఒకరుగా ఇద్దరు మగవాళ్ళు నా జీవితంలోకి ప్రవేశించే ప్రయత్నం చేశారు. అందులో మొదటి వ్యక్తిని... నేను ప్రేమించాను... రెండో వ్యక్తి తాను నన్ను ప్రేమిస్తున్నానని చెప్పాడు. అయితే మొదటి వ్యక్తి మనసుతోనూ, రెండో వ్యక్తి తన మాటలతోనూ నన్ను మోసగించడానికి ప్రయత్నించారు... అయితే నా వర్జినిటీ బలికాలేదు. నన్ను ప్రేమించని వ్యక్తిని నేను వివాహం చేసుకోనట్లే... నన్ను యిష్టపడిన వ్యక్తిని కూడా అంగీకరించలేకపోయాను... వెరశి, నా జీవితం యిప్పటివరకు నా హక్కు భుక్తంలోనేవుంది! కనీసం అది బినామీగా కూడ మార్పు చెందలేదు... అది ఎలా గడిచిపోతోందో... నీవూ చూస్తూనే వున్నావు కనుక, వేరుగ నేను చెప్పవలసింది ఏముంది?... ఈ జన్మకు... యిది... యింతే...! జీవితాలు ఎన్నో విధాలు! కొందరికి ప్రేమయోగం వుండదు... మరికొందరికి పెళ్ళి యోగమూ వుండదు. నాకు మాత్రం... ఆ రెండూ లేవు... హాయిగా వుంది బ్రతుకు..."

"సారీ మేడమ్! మీ మనసును కష్టపెట్టాను..."

"నీవు అలా అనుకోవద్దు!... నా జీవితంతో, ఎవరికీ అవసరం లేకపోయినా... యింత మాత్రంగానైనా నీవు అడిగినందుకు సంతోషంగా వుంది."

"మేడమ్! నాగురించి మీరు ఎప్పుడూ ఏమీ అడగలేదు... అది మీ సభ్యతా సంస్కారం... అయినా మీ పర్సనల్ గురించి నేను అడిగినప్పుడు... మీరు అలా అడగక పోయినా... నాగురించి నేనే మీకు చెప్పాలి... వింటారా మేడమ్?"

"సంతోషంగా వింటాను. జీవితాల గూర్చి మాట్లాడుకోడానికి యీ నాటికైనా నాకో మిత్రురాలు దొరికినందుకు కాస్త తృప్తిగా వుంది. చెబితే వింటాను."

"నా గతం విని, నన్ను అసహ్యించుకోరు గదా?"

"అలా అయితే - అది స్నేహం కాబోదు. కాలక్షేపం మాత్రమే!... మంచి - చెడు, కష్టం - సుఖం అలా అన్నిటినీ యిద్దరూ పరస్పరం పంచుకుని, వాటిని భరించగలిగినవారే... స్నేహితులు...మిత్రులు! నేను నీకు అలాటి మిత్రురాలనే! సందేహించకు!"

"సొసైటీలో మాది ఫార్వార్డ్ క్లాసు... పేద కుటుంబం! మా పేరెంట్స్‌కు ఐదుగురు సంతానం. అయినా అందర్నీ చదివించడానికే వారు శ్రమించారు. నేను నాలుగో సంతానం. లెక్కకు మూడో అమ్మాయిని. వాళ్ళంతా దాదాపు యావరేజ్ స్థాయిలో సెటిలయ్యారు! ఇహ నాకు సంబంధించి... టెన్త్ క్లాస్‌లోనే ప్రేమ వలలో పడిపోయాను. మైనారిటీ తీరిన తరువాత పెళ్ళి చేసుకునే ప్రమాణాలను నమ్మి శరీరాన్ని అర్పించాను. దురదృష్టవశాత్తు గర్భం వచ్చింది! అది తెలిసి అతను మళ్ళీ కన్పించలేదు. రహస్య మార్గంలో మా వాళ్ళు దానిని లేకుండా

చేయించారు... టెంత్ పూర్తిచేశాను... ఇంటర్‌లో చేరాను..."

"ఫర్వాలేదు. చెప్పు"

"అదే భ్రమతో మరో వ్యక్తితో అదే తప్పు చేశాను. మొదటిసారి వచ్చిన గర్భంతో నాకు బుద్ధి రాలేదు... మళ్ళీ అదే జరిగింది! అయినా కన్నవారు దూరం చేసుకోలేరుకదా! ఆ ప్రమాదం నుండీ నన్ను బయట పడవేశారు వాళ్ళు! రెండోవాడూ పరార్! దానితో మనసుకు విరక్తి కలిగింది. మా వాళ్ళు పెళ్ళి ప్రయత్నాలు చేసినా... నేను ఒప్పుకోలేదు. నా జీవిత మొత్తంలో ఎన్నడూ, మగవాడికి ప్రవేశం జరగనీయరాదనే నిర్ణయంతో పెళ్ళి ఆలోచననే పూర్తిగ వదిలేశాను... అయినా వయసు ఒత్తిడో, నా మనసు బలహీనతో తెలియదుగాని, యిప్పటికీ శారీరకంగా తప్పులు చేస్తూనే వున్నాను. ఆ సంబంధంగానే ఓ వ్యక్తి ద్వారా యీ ఉద్యోగ ప్రాప్తి జరిగింది. బ్రతుకు తెరువుకు ఒక హామీ యేర్పడింది. అతనూ... యిప్పుడు లేడు!... సెక్స్ కోసం పెళ్ళి వేస్టనే తప్పుడు భావం నా మనసులో పాతుకుపోయింది... ఇప్పటికీ అలాగే జరిగిపోతోంది... నా జీవితం! అందుకే... మీలాటి వారితో కలిసి మాట్లాడాలంటే గిల్టీగా ఫీలవుతాను..."

"తప్పు! నా విషయంలో నీవు అలా ఫీలవకు... జీవితంలో నేను శారీరకంగ్ తప్పు చేయకపోయినా... ఆ యిద్దరి విషయంలో మానసికంగా నీకంటే ఎక్కువే తప్పు చేశాను. అది నీతి తప్పినట్లే! శారీరకంగా తప్పు చేయకపోయినా, ప్రేమపేరుతో మానసికంగా మగవాళ్ళను మనసులో పెట్టుకుని నిత్యం ఉద్రేకానికి

లోనుకావడం, వ్యభిచారం కంటే ఘోరమైనది. **శరీర సంబంధం అప్పటికే! కాని, మానసిక వ్యభిచారం నిత్యవేదన!** ఈవిధంగా చూస్తే పరోక్ష మార్గంలో నీ కంటె నేనే ఎక్కువ తప్పు చేశాను... కనుక, ఏవిధమైన సంకోచం లేకుండా... నాతో సన్నిహితంగానే వుంటూవుండు! మనం మంచి స్నేహితురాండ్రమనేది, నిత్యం మనసులో వుంచుకో! దాదాపు ఒకే తరహా జీవిత విధానం కలిగిన వారు పరస్పరం, సహకార సహవాసంతో ఒకమేర ఓదార్పును పొందవచ్చు... మన మిత్రత్వం శాశ్వతమే! నీ స్నేహితురాలి వద్దకు... తప్పక వస్తూ వుంటావు కదూ?... అరె... ఎందుకు అలా బాధపడతావ్? నీ కన్నీరు, నేను తుడవనా?...ఊరుకో! ప్లీజ్! యిలాచూడు!"

"మేడమ్! స్నేహితురాలిగా, నాకు మీ ఆదరణ లభించడం నా అదృష్టం! జీవితంలో అన్నిటినీ పోగొట్టుకుని, అందరికీ దూరమైన యీ దిక్కులేని... నా..."

"ప్లీజ్! అలా అనకు! దిక్కులేక పోవడం ఏమిటి? నీకు నేనున్నానుగా! మనిద్దరం ఒకరికొకరం! సరేనా?...బుర్ర ఊపడం కాదు. చేతిలో చేయివేసి చెప్పు...!"

"అలాగే మేడమ్! ఇది, నా ప్రమాణం..."

"ఇంతకూ... నేను మేడమ్‌ను కాదుగదా... మధ్య వయసుదాటిన మిస్‌నే! కుమారినే!"

సారీ మే...మిస్! అలవాటు ప్రకారం అలా అన్నాను ఇహ ఎప్పుడూ అలా అనను...

“నీది చాల సున్నితమైన మనసు! చిన్నదానికి కూడా ఎక్కువగా ఫీలవుతావ్! అదే నీ మానసిక బలహీనత! వయసు కూడా అందుకు కొంత కారణం కావచ్చు! ఇహ మీదట మనసును గట్టి చేసుకో! దేనికీ చలించని స్థాయికి దానిని తయారించు. నీకు తోడుగా నేనున్నానుగదా!”

“అలాగే మేడమ్! సారీ! థాంక్స్ మిస్!”

# ౬. తొందరపాటు

"I love you much..."
"I won't like such..."

"Why..."

"తెలియదు మనుషులకు ప్రేమ!

తెలియును నరులకు స్వార్థం!

ఆకర్షణ విన్యాసాలు – అవసర నటనలు,

కాదు ప్రేమంటే – కామ కల్మష ఊట!

ఆత్మీయతే ప్రేమ – అనురాగమే హృదయం!

కాదు కోరునదేదీ  – ప్రేమకు అర్థం!

No place 'to give and take' in love!
It has its unity and sanity...
Purity Charity and serenity;
Amity - Comity and humanity
Have you been with...
All these in abundence?
No, you have little utility

of all these qualities..."

"ఇది మీ బుర్రలో తెలివికాదు... ఎక్కడో అరువు తెచ్చుకున్నదే!"

"అంటే... నీ ఉద్దేశ్యం... నా బుర్ర బ్లాంకనా?"

"మీ బుర్ర బ్లాంకో... బ్యాంకో... టాంకో..., నాకు తెలియదుగాని, యిప్పుడు మీరు చెప్పిన కవితలాంటి కథనం మాత్రం... మీది కాదు!"

"అర్ధాంగి అపోజిషన్‌లో చేరిపోతే... పతిదేవునికి గతియేమి?

"ఆలుమగలు అధికార ప్రతిపక్షాలలో విడివిడిగా చేరిపోతేనే... రెండు విధాలా లాభం - నాలుగు చేతులా ఆదాయం! పైగా యిద్దరిలో ఎవరో ఒకరు అధికారంలో వుంటారు... ఇది ఫ్యామిలీ బెనిఫిట్..."

"దీన్నిబట్టి చూస్తే... నా బుర్ర బ్లాంకే! నీ బుర్రే బ్యాంక్!"

"మాయదారి రాజకీయాలు, మనకెందుకుగానీ... ఫైనాన్షియల్ గెయినింగ్‌కు ప్లాను వేయండి.. ఉన్నదాంతో సరిపెట్టుకుంటే వచ్చే తరాలకు ఎలా?"

"ప్లానింగ్ హీరో స్థాయిలోనే వుంది ప్రభుత్వానికి! ప్రజలకు గెయినింగే "జీరో బేస్'లో వుంది!.. సుదీర్ఘ స్వాతంత్ర్య పోరాట ఫలితంగా దేశానికి రాజకీయ స్వాతంత్ర్యమే వచ్చింది స్వదేశీ పరిపాలన యేర్పడింది! అది స్వరాజ్యమే గాని... నేటికీ 'సు' రాజ్యస్థాపన జరగలేదు... పైగా పెర్మిట్ - లైసెన్స్- కోటా రాజ్యం ప్రారంభమైంది ఆనాడు! స్వదేశీ పెట్టుబడిదారులు ఆర్థికరంగాన్ని... స్వదేశీ సంస్థానాధీశులు, జమిందారులు - పెత్తందార్లు - రాజకీయాధికారాన్ని స్వంతం చేసుకున్నారు. దోపిడీదారులు జాతీయ సంపదను తమ స్వంతం చేసుకున్నారు.

రౌడీలు – హంతకులు సమాజాన్ని తమ యిష్టానికి ఉంచుకున్నారు. వలస పాలనకు బదులు వంశ వారసత్వ పాలనే దేశానికి దక్కింది! ప్రభుత్వ యంత్రాంగంలో పాలకులు – ప్రముఖులు అవినీతినే ఆశ్రయిస్తున్నారు. క్రమంగా ప్రజలూ దానికి అలవాటు పడుతున్నారు. ఇలా – ప్రజాస్వామ్యం రాచరిక పోకడలతో, దేదీప్యమానంగా వెలిగి పోతోంది!.....”

“మన ఫామిలీ గెయినింగ్‌కు ప్లాను గీయమంటే... దేశం సంగతి చెబుతారేంటి?... ఇంట గెలిచి, రచ్చ గెలవమన్నారు...!”

“అది చేతగాకే... రచ్చకెళ్ళేది! సమస్యకు పరిష్కారం కాంపౌండ్ లోపల కుదరకే... కోర్టులకెళ్ళేది! దేశీయంగా కుదరకే అంతర్జాతీయంగా పోయేది! కాశ్మీర్ సమస్య అంతే అయిందిగా...! ఇహ మన విషయానికొస్తే... మోసం చేయందే మనీ రాదు. మనీ లేక ప్లానింగ్ అప్పుల పాలవుతుంది! ఋణాలతో గెయినింగ్ వడ్డీలకే సరి! కనుక తాహతుకు మించి, ఊహలు చేయరాదు...”

“దేశంలో లక్షలు – కోట్లు సంపాదించే వారంతా కుబేరులంతా ఎలా సంపాదించా రంటారు?”

వారు రాజకీయ వ్యాపారులు, అధికార ఆశ్రయులు! అయినా దానికీ కొంతకాలం వేచి వుండాలి మరి! అలాకాక, ఇన్‌స్టాంట్ కాష్ లాభం కావాలంటే... తత్సంబంధ అధికార్లతో రాజకీయ లాలూచీలు జరపాలి! ఫ్రాడ్ అండ్ ఫోర్జరీ ఫార్ములాతో, లార్జ్‌స్కేల్ బెనిఫిట్ గ్యారంటీ! వీటిలో నేను దేనినీ చేయలేను... నీవల్లయితే చూడు మరి! నేను మాత్రం నీ వెంటే వుంటాను

‘సంచి’ పట్టుకుని…”

“పురుష రోషం – మగ తెగింపు… ఈ రెండిటిలో ఏదీ లేనట్లుంది మీకు!”

“ఆ రెండూ వున్నాయి. అటూ యిటూగా… మీసాల వరకే! ముందుగా మత్తు మందు చల్లితేనే.. మోసం చేయడం, యీజీ! అది ఆడవాళ్ళ దగ్గరే ఎక్కువగా వుంటుంది! నాకు లేని తెగింపు నీకుంటే… సాగించు… జాగేల?”

“దేనికైనా ప్లాన్ కావాలిగా? వ్యూహ రచన చేయండి! థియరీ మీది… ప్రాక్టికల్స్ నావి… గెయినింగ్ ఫిఫ్టీ… ఫిఫ్టీ!”

“ఫామిలీ ఫండ్… పంచుకోవడం ఏమిటీ?”

“దేనిని దానిగానే చూడాలి! ప్లానింగ్, గెయినింగ్ వెంచర్‌లో మనం పార్టనర్లం మాత్రమే!”

“ప్రయోజనంలేని యీ పగటి కలలు దేనికిగానీ… ప్రాపర్ వేలో, ప్రాపర్టీ ఎర్నింగ్‌కు ఆలోచన చేయడం మంచిది! మనిషన్న తరువాత మంచి, మర్యాద – మానవత్వం, వ్యక్తిత్వం అవసరం…”

“ప్రస్తుతం హైటెక్ హైనెస్‌లో వైట్ కాలర్ నేరాల యుగంలో… మీరు చెప్పినట్లు బడా రాజకీయుల ‘స్కామ్’ల ఘనతలో… ప్రాపర్ వే… అనుకుంటే పాపర్‌గా మిగిలి పోవడమే! మనీ ప్లస్ లైన్‌లో ప్లాన్ ఆలోచన చేయండి… కాదంటే అన్నింటా చెడిపోగలరు! యుగాన్ని బట్టి దేవుళ్ళు అవతారాలను మార్చుకోలేదూ? కాలాన్ని బట్టి మానవులూ మార్చుకపోతే ఎలా?

మనీ గెయినింగని నేనంటుంటే... మానవత్వం... గాడిద గుడ్డూ, అంటారేంటి? బాగుపడే రోజులు లేవా మీకు?"

"ఇంతకూ, నన్నేం చేయమంటావో చెప్పు... నాకుగా, నా బుర్రకేమీ అందడం లేదు..."

"చెప్పానుగా! మనీ గెయినింగ్ ఫస్ట్! మిగతావన్నీ తరువాత!

"అలాటిదేదైనా ఒకరిద్దరితో అయ్యేపని కాదన్నానుగా?"

"కాదు కనకే పథక రచన చేయమన్నాను... ఒకరిద్దరితో అయ్యే పనైతే, మీరెందుకు నాకు తోడుపెళ్ళికొడుకులాగ?"

"అలా అయితే... అందుకు ముందుగా... మనం స్కామ్ సీనియర్స్‌ను, ఫ్రాడ్ ప్రముఖులనూ శరణు వేడాలి!"

"ఏమైనా చేయండి. నాకనవసరం. మళ్టీ మిలియనీర్‌గా కాకపోయినా... కనీసం కొన్ని లక్షలైనా యింటికి చేరాలి!... అంతే!"

"...పాపం పండి పట్టుబడిపోయాననుకో...!"

"శుభమా అంటూ పని ప్రారంభించమంటూ వుంటే... ఆ అపశకున మాటలేంటి మీకు...? చెప్పానుగా... మీకు బాగుపడే రోజులు లేవని!

"ఇందాక, 'I love you much', అని అన్నది, మనీ గెయినింగ్‌కేనన్నమాట!"

"అవును... అన్నాను: మళ్ళీ మళ్ళీ ఎన్నిసార్లయినా

అంటాను. I love you much for money!"

"అదన్నమాట నీ అసలు మనసు! మనీనేగాని మనిషిని కాదన్నమాట...నీవు ప్రేమించేది?"

"మీకు కారులో తిరిగే యోగంలేదు..."

"లేకపోవడమేమి? డ్రైవర్నయితే వాహన యోగం వున్నట్లేగదా!"

"స్వంతకారు సంగతి నేనన్నది!"

"పెట్రోలు ధరలు మండిపోతుంటే... ఉన్నవాళ్ళే వాటిని అమ్మేస్తోంటే... స్వంత కారెందుకుగాని.... అయినా, మంచాన్ని బట్టి మోకాళ్ళు ముడుచుకోవాలి!"

"బుద్ధి కుశలతగల మనిషి చేయవలసింది మోకాళ్ళు ముడుచుకోవడం కాదు... కాళ్ళ పొడుగుకు మించిన మంచాన్నే సంపాదించుకోవాలి!"

"అది నావల్ల కాదులే...!"

"మరి... మీవల్లయ్యేది పిల్లల్ని పుట్టించడమేనా?"

"...అదీ... అనుమానమే!... నీవు ప్రొసీడవుతూంటే... పమిటె చెంగులా, నిన్ను ఫాలో అవడమే... నేను చేయగలిగింది... ఏమిటీ, అలాచూస్తావ్? కోపం వచ్చినట్లుందే....! కాసేపు కామ్‌గా వుందాం! కరిగిపోతుందిలే గుస్సా!"

"అలా అనడంలో ఏమిటి మీ ఉద్దేశ్యం?"

"మన సంభాషణ యింతటితో ఆపేద్దాం... ముందుకు సాగితే... వ్యవహారం ముదిరి పోతుంది!"

"మొగుడూ - పెళ్ళాం మధ్య ముదురు, లేత ఏముంటాయ్?"

"ఉంటాయ్ అనేకం! ముదురు లేతతో పాటు, కలిమి - లేమి... మోజు - మోసం... యిలా భార్యా భర్తగా బ్రతికేవారి మధ్య అనేకం వుంటాయి! ఉదాహరణకు... నేను ముదురు... నీవు లేత! స్పష్టంగా తెలుస్తూనే వుందిగా!

"అది, మీ మనసులో వుందేమో గాని... కలలో కూడా నేనెప్పుడూ అలా అనుకోలేదు... పైగా... 'మోజు-మోసం' అంటారేంటి? అలాటిది ఏదైనా వుంటే... అది మీకే వర్తిస్తుంది..."

"ఎవరికి వర్తించినా తుది ఫలితం ఒకటే!"

"మీ మాటలు నాకు అర్థం కావడం లేదు! ఈ రోజు మీరేమిటో క్రొత్తగా మాట్లాడుతున్నారు! మనసు దాచుకుని మాటాడుతున్నారు..."

"దాచుకోవడం - దోచుకోవడం, ఆడవాళ్ళకు సహజం! ఆడతనం ఆకర్షణకు అదికూడా కొంత అవసరం కావచ్చు! అది... అంతవరకే అయితే... కొంతలో కొంత మేనేజ్ కావచ్చు! దానివెంట నటన నడుస్తూ, డైలాగులు వినిపిస్తూ వుంటే మాత్రం భార్యా భర్తగా బ్రతకవలసిన వారిలో ప్రత్యక్ష - పరోక్ష రీతిగా

యిద్దరికీ హాని కలుగుతుంది! అది గమనించి, ఆ మేరకు మనుషులు, తమ మనసులను కట్టడి చేసుకోవాలి!...”

“..................................”

_ _ _

“ఎందుకేడుస్తావ్?”

“మీ చేతగానితనానికి!”

“చేతగాకపోవడం ఏమిటి? భర్తను కలిగిన నీతో... భార్యను కలిగిన నేను... కాపురం చేస్తూ....పిల్లల్ని పుట్టించడం... చేతగానితనమా?”

“...గొప్పే! మీతో పిల్లల్ని కనడమే కొంప ముంచేట్టుంది! నా సంసారం చట్టుబండల య్యేట్టుంది!”

“అంత ప్రమాదమేమొచ్చింది?”

“నా హస్బెండ్ డేంజర్ ఫిగరయ్యేట్టున్నాడు!”

“నీకా అనుమానమెందుకొచ్చింది? నా గురించేమైనా అన్నాడా?”

“నా గురించి, మీ గురించి ప్రత్యక్షంగా పేరుపెట్టి ఏమీ అనలేదు...”

“మరి.... డేంజరంటావే?”

“మాటలసందర్భంలో... ఏది చెప్పినా నా వల్ల

కాదంటారు... పిల్లల్ని పుట్టించడమేనా మీకు చేతనయ్యేదని అన్నాను... దానికి అతను 'అదికూడా అనుమానమే..!' అని అన్నాడు! అలా అనడంలో అతని ఉద్దేశ్యమేమో... నాకు అర్థం కావడంలేదు... ఇన్నాళ్ళూ... అలా ఎప్పుడూ అనలేదు... మన విషయం ఏమైనా తెలిసిందేమోనని... భయంగా వుంది"

"తెలిస్తే మాత్రం... ఏమిటంటా?"

"మీరు, మగ మహారాజులు!

"అంతదూరం ఎందుకాలోచిస్తావ్?... ఆ పరిస్థితులే వస్తే... నేను లేనా... నీకు? నన్ను దూరంచేసి మాట్లాడతావే?"

"కొండంత అండగా మీరున్నారనే కదా భర్తవున్నా తెగించి, మీతో సంసారం చేస్తున్నాను. కీడెంచి మేలెంచాలి! ఒకవేళ ఆ పిల్లలు, తన పిల్లలు కాదని ఆయన ఋజువు చేయగలిగితే... సమాజంలో వాళ్ళ భవిష్యత్ ఏమిటి? వాళ్ళకు ఫాదర్నని లీగల్గా మీరు బయటికి రాలేరు కదా! అయినా ఒకవేళ మీరే అని తెలిస్తే... మనిద్దరి పరువు ఏం కావాలి? ఆ పరిస్థితిలో నేనైనా – మీరైనా, నలుగురిలో తలెత్తుకు తిరగగలమా?"

"ఈ ఆలోచన రావలసింది యిప్పుడు కాదు. తొలిసారి... నీకు గర్భం వచ్చినప్పుడే చెప్పాను... అబార్షన్ చేయిస్తానని! నా మాట విన్నావు కాదు! పైగా భర్త కలిగిన నాకు భయందేనికని ధీమా పోయావు!"

"నిజమే! అలాగే అన్నాను... మీరంటే నాకుగల అమిత ప్రేమ కారణంగా... మీ ప్రతిరూపాన్ని నా గర్భంలో నిలుపు

కోవాలని, కలకాలం అది నా కళ్ళెదుట తిరగాలని... అలా ఆశపడ్డాను... అప్పటినుండి ఆయనంటే... ఎంతో యిష్టాన్ని నటిస్తూ... ఆయనకు అనుమానం రాకుండా ప్రయత్నించాను. ఆయన కూడా నాతో ఎంతో యిష్టంగా నా ప్రవర్తనలో తనకు ఎలాంటి అనుమానం లేనివిధంగా వ్యవహరించారు... ఇప్పటికీ... డైరెక్ట్‌గా... నన్నేమీ అనలేదు... అయినా నా భయం నాది!..."

"ఏది ఏమైనా... నేను నీకు చెప్పగలిగింది... ఒక్కటే. ఏ పరిస్థితులలోనైనా... నీకు... నేను... ఉన్నాను... నన్ను నమ్ము! అనవసర ఆలోచనలు, అనుమానాలను మనసులో పెట్టుకుని, అందాన్ని పాడు చేసుకోవద్దు! అది నేను భరించలేను."

"చాలు! మీనుండి ఆ మాత్రం మాట చాలు నాకు! ఇహ దేనినైనా ఎదుర్కొని పోరాడగలను... పరిస్థితులను జయించగలను..."

"ఎందుకైనా మంచిది! అతని మనసులో అనుమానం స్థిరపడకుండా చూడు!... నీవు. నీ పిల్లల బాధ్యత నాకు భారం కాదు... అయినా సొసైటీలో... బంధువర్గాలలో వ్యతిరేకత రాకూడదుకదా!"

"నీ పిల్లలు... అని అంటున్నారు... వాళ్ళు మీ పిల్లలు కారా?"

"...మన పిల్లలు!... సరేనా?... నిత్య శంకితం, నిద్రపోనీయదు... నిద్రలేని నీ అందం... మబ్బుచాటు చంద్రుడే!"

"నేను అంత అందంగా వుంటానా?"

"ఎవరి సంగతి వాళ్ళకి తెలియదు. అదేదో యితరులే చెప్పాలి..."

"నా గురించి యితరులెవరో ఎందుకు చెప్పాలి? అది మీరే చేయాలి! అప్పుడే నాకు తృప్తి!"

"పొగుడుతున్నానని అనుకోకుండావుంటే... ఒక్కమాట చెప్తాను! నీ ఫేస్ బ్యూటీ... నీ బాడీ పొందిక చూస్తే... పొగరు చచ్చిన వాడికి కూడా... మనసు పోటెక్కుతుంది! వయసు మీరిన వాడికి కూడా... ఒళ్ళు తుళ్ళిపడుతుంది. ఓపిక చిగురిస్తుంది... అందం ఒక్కటే కాదు... నీలో తొణికిసలాడే అపురూప ఆకర్షణ, నిండైన ఆడతనం... అదే నన్ను... నీకు... ప్రేమ పూజారిగా మార్చింది!"

"నా పరిస్థితీ మీకు తెలిసిందే! సుఖాన్నివ్వలేని భర్తతో సంసారం జీవితాంతం నరకప్రాయమేననుకున్నాను. కాని, నా అదృష్టం నన్ను మీ కౌగిలికి చేర్చింది!... పగబట్టిన కోడెనాగులా... కాటువేసిన మీ మగసిరి నరనరానా పాకి, నాలో నిలిచిపోయింది! అందుకే మీ ప్రతిరూపాలను నాలో నిలుపుకున్నాను... నన్ను.... మీకు... దూరం చేయకండి! అలా చేయడమంటే... మన పిల్లలను తల్లి లేనివారిగా చేయడమే!... సవతి తల్లే భరించలేదు తన భర్త పిల్లల్ని. మన పిల్లల్ని మీ భార్య ఎలా అంగీకరించగలదు? అయితే అందుకు అతీతమైన మాతృత్వం మనసు గలవారూ వుంటారులెండి! కాని, అది చాలా అరుదు.

"అదే వద్దంటున్నాను... అనవసరంగా అతిగా ఆలోచించి,

ఆవేదనకు లోనవుతా వెందుకు? ఇంత చెప్పినా... నా విషయంలో నీకు అనుమానం ఎందుకు కలుగుతోందో అర్థం కావడంలేదు. మనిద్దరి ప్రేమకు ప్రతిరూపాలుగా ప్రతిక్షణం వారు ప్రత్యక్షమవుతారు మనిద్దరి మధ్య... నిన్ను దూరం చేయడం ఏమిటి? దీనిని బట్టి చూస్తే... నీ భర్త విషయంలో కూడా నీ ఊహలు, అనుమానాలూ నిజం కాదేమో...!"

"ఆడదానిగా నా భయం నాకుంటుందండీ! మనిద్దరి మధ్యా సంతాన సంబంధం వుంది కాని... సమాజ సమ్మతి లేదు కదా!... మీకూ తెలుసు... పెళ్ళి భర్తకు సంబంధంలేని సంతానం అక్రమమైనదేనని! ఆయన మెంటాలిటీ ఎప్పుడు ఎలా వుంటుందో ఊహించలేం... మీరు నాకు ఒక్కమాట యివ్వండి! ఆయన మనసు ఎలా వున్నా ఆయనతో నా సంబంధం ఎలా అయినా, మన పిల్లలకు తండ్రిగా... మీరు..."

"....నీ మనసు పూర్తిగా నీ అదుపు తప్పుతున్నట్లుంది. కాసేపు ఆ విషయాలేవీ మాట్లాడకు... నీకు సంబంధించి అన్నిటికీ నేనున్నానని ఎన్ని విధాలుగా చెబుతున్నా నా మీద నీకు నమ్మకం కలగడంలేదు... పదే పదే అనవసర అనుమానానికి, టెన్షన్‌కూ లోనవుతున్నావు..."

"నా జీవిత సర్వస్వమనుకున్న మిమ్మల్ని నేను అనుమానించడమా? ఇహ మీదట అలా పొరపాటున కూడా అనకండి! ప్రస్తుతం అటూ యిటూ నా పరిస్థితి చాల 'డెలికేట్'గా వుంది..."

"మళ్ళీ అదే ధోరణి! దానిని మర్చిపోయి మరోవైపుగ నీ

మనసును డైవర్ట్ చేసుకో!"

ఏదైనా, ఎలాగైనా మీరే మార్చాలి!... మగవాడిగా... మొనగాడిగా... మీదే ఆ లైన్... అదే ఆ చూపే... ఆ ఒంటికన్ను కొంటెతనమే... నా మతిని... అయ్యో ఉండండి! ఆగండి కాసేపు! అరె...! ఎంటమ్మా ఆ తొందర!... ప్లీజ్ ఒక్క నిమిషం ఆగండి... ప్లీజ్!... బాత్‌రూంకు వెళ్ళస్తా... వెంటనే వస్తా!"

"పద నేనూ వస్తా!"

"ఛీ! ఛత్తిగా పసిపిల్లాడిగా మాటాడుతున్నావ్!... తప్పు! అలా రాకూడదమ్మా! బుద్ధిగా యిక్కడే కూర్చో! వెంటనే వచ్చేస్తా!"

"నాకూ అవసరం వుంది...."

"అయితే...ముందు మీరెళ్ళిరండి!"

"కాదులే! నీవు ముందు వెళ్తేనే... లైన్ సరిగా వుంటుంది..."

"లైనంటే?...."

"అది... అదేదోలే!... అరె! ఎవరో వచ్చినట్లున్నారు! నీవు బాత్‌రూంలోకి పో!... నేను మాట్లాడి పంపిస్తాను...

ఏమిటి మమ్మీ! ఫోనన్నా చేయకుండా... సర్‌ప్రైజ్‌గా వచ్చేశావ్?"

"ఏం? రాకూడదా...? నీ యింటికి ఫోన్ చేసే రావాలా?"

"...అలా అని కాదు... ఊరికే అలా అన్నాను..."

"ఆఫీసుకెళ్ళలేదే...!"

"ఒంట్లో బాగాలేదు... సెలవు పెట్టాను..."

"సరళేదీ?"

"పిల్లల్ని స్కూలుకు పంపించి... అటునుంచి అటు తనకు

తెలిసిన వారింటికి వెళ్ళుస్తానంది!"

..."ఎవర్రా బాత్‌రూంలో...!"

"నాకు తెలిసిన వాళ్ళ తాలూకు...!"

"ఎంతమందిరా... నీకు తెలిసిన వాళ్ళ తాలూకు? ఎంతకాలంరా... యిలా... అల్లరి చిల్లర పనులు? పెళ్ళికాకముందంటే... ఏదోలే అనుకోవచ్చు. పెళ్ళాం వచ్చి... పిల్లలు కలిగిన తరువాత కూడా... అదే అయితే ఎలారా?..."

"అది కాదమ్మా!..."

"ఒరే! నాకు తెలుసురా నీ బుద్ధి! వేరుగా నీవు నాకేమీ చెప్పనక్కర్లేదు!"

"...నమస్కారమండీ!"

"ఎవరు నువ్వు? వ్యభిచారం చేసుకుని బ్రతికే నీవు లాడ్జిల వెంటపోవాలిగాని... సంసారుల యిళ్ళల్లో నీకేం పని? చెడిపోయినదానివి చెడిపోయిన దానిగానే వుండాలిగాని... పచ్చటి సంసారాలను పాడుచేయడానికి తయారవుతావా? పో బయటికి! దరిద్రపుముండా! ఏరా? పెళ్ళాన్ని బయటికి పంపించి యిలాంటి బజారుముండల్ని యింటికి తెస్తావా? బుద్ధిలేదురా నీకు?... ఏమే! యింకా అలాగే నిలబడ్డావే పో... బయటికి దౌర్భాగ్యపుముండా! చండాలపుదానా?"

"...ఏవండీ...!"

"వెళ్ళు...!"

"ఈ రోజులు ఎలా వున్నాయిరా? అదేదో మాయదారి రోగం... మనుషుల్ని పట్టుకుని పీల్చేస్తుందటగా?

పీక్కుతింటుందటగా? దానికి మందే లేదటగా? అది వచ్చిన వారు బ్రతకరటగా?... అయినా బంగారంలాంటి పెళ్ళాన్ని పెట్టుకుని... యింకా నీకెందుకురా యిలాటి చండాలపు పనులు?... డెట్టాల్ కలిపి, ఆ బాత్‌రూంలో నీళ్ళు పోసిరా... ఆ తిరుగుబోతు ముండ నానా చండాలం చేసుంటుంది. బయటవుండే... గట్టిగా నీళ్ళు కొట్టు... డోర్ తీసివుంచు...”

– – –

“ఏమిట్రా యిది? మొదటిది చూస్తే అలా అయింది. రెండోదనుకుంటే యిలా అయింది... ఎక్కడుందిరా లోపం? నీలోనా... వాళ్ళలోనా... లేక నీ జాతకమే అంతా?”

“ప్రత్యేకంగా లోపం కాకపోయినా... కారణం నాతోనే ప్రారంభమై వాళ్ళలో అది కాయలు కాసి పండుగామారి రాలిపోయింది... వయసు వేడితో... అనుభవశూన్యంతో అయినదానికీ కానిదానికీ, అతి చనువుగా వ్యవహరించి, ఆ మొదటిదానికి లోకువై పోయాను... ఫలితంగా చెలరేగి అది నాపైన స్వారీ చేయడం చేసింది... తుది ఫలితం తానే అనుభవించినా దాని ప్రభావం నా జీవితంపై అది నెగిటివ్‌గా ముద్రవేసింది. జీవితంలో పెళ్ళి పేరుతో మరో తప్పు చేయగూడదనుకున్నాను. అయినా – జరిగిపోయింది.

ఆమె నీతి తప్పి వ్యవహరిస్తున్నా... ప్రారంభంలోనే అదుపు చేయలేకపోయాను. ఆమె వయసు ఆకర్షణకు నా మనసు ఏదో తెలియని లంగుబాటుగా వుండేది... ఎన్నడూ ఆమె ప్రవర్తనను

ప్రశ్నించలేదు. దానితో పరోక్షంగా నేను సమ్మతించినట్లుగా బహుశా తనకు తాను అనుకోవచ్చు. ఆమె ప్రవర్తన విషయంలో ప్రారంభంలోనే కఠినంగా వ్యవహరించి వుంటే పరిస్థితి మరోలా వుండేదేమో... తాను కోరుకున్నవాడితో సంతానం కంటున్నా... ఆమెను ఏమీ అనలేక, నాకు నేనే గిల్టీగా ఫీలవుతూ, విరక్తిభావాన్ని మనసులో కలిగించుకున్నాను... నా చేతగానితనానికి నిత్యం నన్ను నేనే నిందించుకుంటూ ఆమెతో మామూలుగనే ప్రవర్తించాను. ఆమెది పూర్తిగా నటన అని తెలిసినా ఆమెను ఏమీ అనలేకపోయాను. ఏదోవిధంగా తనకు తానుగా నా జీవితంలోనుండి తొలగిపోతే చాలుననుకునేవాడ్ని. ఆ మొదటిది గయ్యాళిగా వ్యవహరించిందేగాని, యిలా వ్యభిచారిగా మోసపూరితంగా వ్యవహరించలేదు. ప్రేమను నటిస్తూ సైలెంట్ హెరేస్మెంటు చేయలేదు... ఏమైనా వాళ్ళపట్ల నా మానసిక బలహీనత సకాలంలో తగిన విధంగా చర్య తీసుకోలేక పోవడమే యీనాటి స్థితికి మూలం..."

"ఆమె వెళ్ళిపోయిన రోజు మీరేమైన గొడవపడ్డారా?"

"గొడవాలేదు – ఏమీలేదు! ఇన్నాళ్ళు లేంది, ఆ రోజు అంత రోషం నాకెలా వస్తుంది?... అంతకు ముందు రోజు ఊరికి వెళ్ళాను... తిరిగివచ్చి చూస్తే యింటికి తాళం వేసి వుంది... వాళ్ళమ్మకు బాగాలేదని, ఆమెను చూడడానికి వెళు తున్నట్లు ప్రక్కవాళ్ళకు చెప్పి 'కీ' వాళ్ళకిచ్చి వెళ్ళింది... నేను వాళ్ళ యింటికి ఫోన్ చేస్తే అక్కడికి రాలేదని చెప్పారు..."

"మరి పోలీస్ కంప్లెయింట్ యిచ్చావా?"

"ఇవ్వాలిగా మరి!... ఫార్మాలిటీగా యిచ్చాను."

"నీవుగాని, ఆమె వాళ్ళుగాని ఆమెను వెతికే ప్రయత్నం చేశారా?"

"వాళ్ళు ఏం చేశారో తెలియదు... నాకు సంబంధించినంత వరకూ ఆ అవసరంలేదు..."

"అదేవిటి అలా అంటావ్? జాడ తెలియని మనిషి కోసం, మానవ ప్రయత్నంగా వెతకాలి గదా!"

"నాకు అలాటి శ్రమతో పని లేకుండానే... ఆమె ఉత్తరం వ్రాసి పెట్టింది... ఇంట్లో వున్న పదివేలు డబ్బు – నగలతో సహా వెళ్ళి పోయింది... బహుశా వేరే కాపురానికి ముందు జాగ్రత్త కావచ్చు"

"ఉత్తరంలో ఏమని వ్రాసింది?"

"ఇదిగో... నీవే చదువుకో! ఇంత జరిగిన తరువాత దాచుకోవలసింది యింకా ఏముంటుంది నాకు?"

"ఎందుకులే! నీవే చెప్పు దాని సారాంశం!"

"అలా కాదు. నేను చెప్పలేను. నీవే చదువుకో!"...

"డియర్ బ్రహ్మానందంగారికి!

ఇలా పేరుపెట్టి సంబోధించినందుకు మీరేమీ ఫీలవరని నాకు తెలుసు... Love you much... ఇలా అనడం మాటగా నాకు అలవాటని... అది మనసు కాదనీ మీకు తెలుసు... నాకూ తెలుసు!

అసలు విషయానికొస్తాను. పేదరికం మాకు దగ్గరి చుట్టం! మనిద్దరి వయసులూ – మనసులూ చాలా దూరమైనా... మీతో

నాకు పెళ్ళి చేయించింది... అదే!... ఆ పేదరికమే! ఇదీ మీకు పూర్తిగా తెలుసు. భార్యగా మీనుండి నేను పొందిన సుఖం ఏమిటో కూడా – మీ మనసుకు తెలుసు!... అంతమాత్రాన ఆడది పరాయివాడితో తప్పు చేయాలని కాదు... అయినా నా వయసు నన్ను దారి తప్పించింది! నిజానికి యింతకాలం మీతో నేను ప్రేమ నటించాను. అందుకు తగినట్లే... మీరు కూడా గుంభనగా, అతి లౌకికంగా వ్యవహరించారుగా!... అలాకాక భర్తగా... ప్రారంభంలోనే నా తప్పును ఖండించి, నన్ను దండించి, మంచి దారిలో పెట్టివుంటే... పరిస్థితి యీనాటికి యింత దారుణంగా తయారయ్యేది కాదేమో! అభిమానం, అధిక ప్రేమ... మనుష్యులను అసమర్థులుగా తయారుచేయకూడదు...

నేను కోరుకున్నవాడు నాకిచ్చిన హామీ మేరకు అతనితో సంతానం పొందే విషయంలో సాహసం చేశాను. మీతో నాకు గర్భం రాదని... మీకు తెలుసు! మొదటిసారిగా నెల తప్పినప్పుడు నా శరీరంలో వచ్చే మార్పులను చూస్తూ మౌనంగా వున్నారేగాని... భర్తగా మీలో ఏ ప్రతిస్పందనా రాలేదు. నాకు తెలుసు... అక్రమసంతానానికి జన్మనిస్తున్నానని... ఈ పాపం ఏనాటికైనా నన్ను అందరికీ దూరం చేస్తుందని. అయినా ఆనాటికి, నా కడుపున పుట్టినవారైనా, నాకు ఆధారం కాకపోతారా, అనే ఆశతో మనసును సరిపెట్టుకున్నాను. పరాయివానితో పిల్లల్ని కని,... భర్త ఎదుటే తిరుగుతోంటే... నేను అనుభవించిన గుండెకోత ఎంతటిదో నాకు తెలుసు... నా సంగతి ఎలావున్నా... మీ సహనం... నిగ్రహం ఎలాటివో... నేను అంచనా

వేయలేకపోయాను. బహుశా, మీ చేతగానితనం అందుకు మీ మనసులోని గిల్టీనెస్సే అందుకు కారణం కావచ్చు! మీతో నేను ఎంత నేర్పుగా నటించినా... వ్యక్తిగతంగా నా తప్పు, నన్ను నిత్యం నిలదీస్తూ ప్రశ్నిస్తూనే వుండేది!

చివరకు - నేను అనుమానించినట్లే జరిగింది... నా పిల్లలకు తండ్రి కావలసిన వాడు... అందుకు తిరస్కరించాడు! తన తల్లి ఎదుట నన్ను ఘోరంగ అవమానించాడు!... లోకం దృష్టిలో నేను మిమ్మల్ని నా భర్తగా అనుకోగలనేమోగాని... లీగల్‌గా నా పిల్లలకు తండ్రిగా మిమ్మల్ని ఒప్పించలేను!... అలా అని అనాధలుగా, అక్రమ సంతానంగా వాళ్ళను సమాజంలో వదిలి వేయలేను... తల్లిగా నా మనసు అందుకు సాహసించలేదు. భార్యగా మిమ్మల్ని మోసం చేస్తూ... నాకు నేనుగా ...వేదనను అనుభవిస్తూ... ఎంతోకాలం... మీ ఎదుట, మీ భార్యగా వుండలేను. దోషిగా నిలబెట్టి నా అంతరాత్మ నన్ను ప్రశ్నిస్తోంది...అన్నిదార్లూ మూసుకుపోయాయి... ఇహ నాకు మిగిలింది... ఒకే ఒక మార్గం! నా పిల్లలతో సహా నేను నా జీవితాన్ని ముగించడమే...! అందుకే వెళ్ళిపోతున్నాను... మా కోసం వెతికే శ్రమ ఎవరూ చేయవద్దు! ఒకవేళ మా శవాలను గుర్తించవలసి వచ్చినా... మీరూ ఆ పని చేయవద్దు!

మరో మాట! మీరులేని సమయంలో మీ యింటిలో దొంగతనం చేశాను... జీవితంలో యింతవరకు ఏదీ... నేను అనుకున్నట్లు అలాగే జరగలేదు కనుక... రేపటి పరిస్థితులు ఎలా వుంటాయెూ అనే ఆలోచనతో... బీరువాలోని

పదివేలరూపాయలు తీసుకున్నాను... మీరు నాకు చేయించిన నగలను కూడా... నాతోనే... తీసుకుపోతున్నాను... అందుకు నన్ను క్షమించండి!... అయినా, మీరు మాత్రం వాటిని ఏం చేసుకోగలరు కనుక... సాహసించి మీరు మళ్లీ పెళ్ళి చేసుకోకండి! అయినా, అది మీ యిష్టం! ఆ విషయంలో ఏవిధంగానూ నా అభ్యంతరం వుండదు... అయినా చచ్చేదాని సర్టిఫికెట్ ఎందుకు మీకు? లీగల్‌గా, నైతికంగా... అన్ని విధాల... నేను మీ భార్యగా నాకున్న హక్కులను... స్వయంకృతాపరాధంగా పూర్తిగా కోల్పోయాను.

నాకు సంబంధించిన యీనాటి యీ దుస్థితికి భర్తగా మీరు ఏవిధంగానూ... ఏమాత్రమూ కారణం కాదు... నా పిల్లలకు తండ్రి కావలసినవాడు... నన్ను మోసం చేశాడని కూడా... అనలేను! అది... నా సెక్స్ బలహీనతగా, బుద్ధిహీనతగా అనుకుంటున్నాను...

ప్రత్యక్షంగా మిమ్మల్ని క్షమాపణ కోరే అవకాశం నాకు లేదు కనుక, యీ ఉత్తరం రూపంలోనే మిమ్మల్ని అలా వేడుకుంటున్నాను. నన్ను క్షమిస్తారు కదూ?... ఈ ఉత్తరాన్ని జాగ్రత్తగా వుంచుకోండి! అందరికీ, అన్నిటికి... యిదే సమాధానం...

భర్తను మోసగించిన భార్యగా... మీ పాదాలకు... నా... తుదివందనాలు....

–(మీ) సరస్వతి

"అది సరే! యిప్పుడు నీవు ఏం చెయ్యాలనుకుంటున్నావ్?"

"వేరే చేసేదేముంది? అన్నీ... ఆమే వ్రాసిందిగా వుత్తరంలో!... ఫార్మాలిటీగా పోలీసు కంప్లెయింటిచ్చాను... అంతే... మనం చేయగలిగింది..."

"ఆమె వెళ్ళి ఎక్కువ రోజులు కాలేదుగా... పోలీసులతో పాటు వెతకవలసిన ధర్మం మనకూ వుంది!"

"అలా చేయొద్దని... శవాలను కూడా గుర్తుపట్టవద్దని... ఆమె వ్రాసిందిగా!"

"అయితే మాత్రం... ఆవేశంలో ఆమె ఏదో వ్రాసిందని... మనం అలా వూరుకుంటే... ఆమె వాళ్ళతో సహా, అందరూ ఏమనుకుంటారు?"

"అవసరమైతే యీ వుత్తరం వుందిగా! ఋజువుగా!"

"పొరపాటున కూడా ఆ పని చేయకు. లీగల్‌గా అవసరమైతే తప్ప, ఈ వుత్తరాన్ని బయట పెట్టకు! దీనికి జిరాక్స్ తీసి జాగ్రత్తగా వుంచు... జరిగిన దానికి బాధపడకు! 'విధి' తప్పేదికాదు... అవసరమైతే ఫోన్ చెయ్యి... వస్తా..."

"........................"

– – –

"మీ పేరు... సరస్వతి కదూ...?"

"...............కాదు!"

"నేను మీకు తెలుసు!"

"..........తెలియదు!"

"ఒక్కసారి, నా ముఖంలోకి చూడండి!"

"చూడను!... ప్రేమించినట్లు నటించి... పరారైన దొంగ ముఖాన్ని... నేను చూడను..."

"మీరు... చాలా ఇమోషనల్‌గా వున్నారు... వాళ్ళంతా యిటే చూస్తున్నారు... కాస్త, అవతలికి వెళదాం!"

"అక్కర్లేదు!"

"నామీద మీకున్న కోపము... కసి... కరిగిపోయేవరకు మీ యిష్టం వచ్చిన భాషలో ఎంతసేపైనా తిట్టండి! బాధపడను. ప్లీజ్, కాస్త అవతలికెడదాం!"

"........................"

"...ఇప్పుడు చెప్పండి!"

"ఏం చెప్పాలి? టీనేజ్‌లో టీజ్ చేసి... కన్నె మనసులో కోరికలు లేపి... కన్పించకుండా పోయిన నీకోసం... ఎదురు తెన్నులు చూచి... చూచి, అందరితో ఎన్నో మాటలు అనిపించుకున్నానని చెప్పాలా?... చివరకు గతిలేని స్థితిలో... వయసు మళ్ళిన వాడితో... వివాహం చేశారని చెప్పాలా?... కట్టెకు కాపురం చేస్తూ, మనసుకు కనీస ఓదార్పు లేకుండా బ్రతికానని చెప్పాలా?... వయస్సు ఒత్తిడికి, మనోనిగ్రహాన్ని కోల్పోయి...నీలాంటి మరో మోసగాడి చేతిలో పడి... భర్తను మోసం చేస్తూ... ఇద్దరు పిల్లలకు తల్లినై..."

"బాధపడకు! ప్లీజ్ కంట్రోల్ యువర్‌సెల్ఫ్! ఫామిలీతో దైవదర్శనానికి, తిరుపతి వచ్చారా?"

"కాదు!... ఆ యిద్దరు పిల్లల్ని ఆ తిరుమల దేవునికి

ఒప్పగించడానికి... వచ్చా!... ఒప్పగించాను... నా చావుకోసం... తావును వెతుక్కుంటున్నాను... వెళ్తాను..."

"............................."

"నా తొలిప్రేమ గుర్తుగా... నేను నిన్ను మళ్ళీ చూస్తానని అనుకోలేదు... అంతా దైవలీల! జీవితంలో... అందర్నీ... అన్నిటినీ పోగొట్టుకున్న దురదృష్టవంతురాలినైనా... జీవిత తుది ఘడియలలోనైనా... మిమ్మల్ని చూడాలనే జీవితకోర్కె... యీ విధంగానైనా... నెరవేరింది. జీవిత మొత్తంలో యిదొక్కటే నేననుకున్నట్లు నెరవేరింది!... ఇహ, నా బ్రతుక్కు... యిది.... చాలు!... వెళ్తాను..."

"అలాగే వెళ్దువుగాని!... నీ గురించి నీవు మాట్లాడావు... నేను విన్నాను. మరి... నా గురించి వినవలసిన బాధ్యత నీకు లేదా?"

"బాధ్యతా? నీకసలు బాధ్యతంటే... అర్థం తెలుసా?"

"తెలుసో లేదో... నే చెప్పేదంతా ఓపిగ్గా విని... ఒక నిర్ణయానికిరా!"

"ఇప్పుడు నాకా అవసరం లేదు... మాట తప్పి, నన్ను మోసం చేసినట్లే యింకా ఎంతమందిని దగా చేసి... వాళ్ళ జీవితాలతో ఆడుకున్నావో...! అవన్నీ నేను వినాలా? నీ వంచనా ఘనత నాకు తెలియాలా?"

"అతిగా ఆలోచన చేయడం... దేనిని గురించైనా తొందరపాటు నిర్ణయానికి రావడం మొదటినుండీ... నీకు అలవాటే!"

"అందుకే... అతి తేలిగ్గా, నన్ను మోసం చేయగలిగావ్..."

"అదే... వద్దంటున్నా! మొదట నాగురించి నేను చెప్పేది పూర్తిగ విని... నీ యిష్టం వచ్చినట్లు మాట్లాడు! నాకు అభ్యంతరంలేదు..."

"..................."

"ప్రశాంతంగా విను. మా వాళ్ళు నాకు పెళ్ళి ప్రయత్నాలు ప్రారంభించారు. మా అక్క డాటర్‌ను చేయాలని వాళ్ళంతా నిర్ణయించుకున్నారు. నేను మన సంగతి చెప్పాను... ఎవరూ ఒప్పుకోలేదు. మా అమ్మతో సహా, అందరికీ చెప్పాను... అయినా, వారంతా ససేమిరా వీల్లేదన్నారు. వాళ్ళు అనుకున్నట్లే... నా పెళ్ళి జరిగితీరాలని పట్టుపట్టారు! మన విషయం తెలిసి,వాళ్ళు మరింత తొందరపడి, నా మాటతో అవసరం లేకుండానే... అన్ని యేర్పాట్లూ చేస్తున్నారు... ఏమి చేయాలో నాకు తోచలేదు. చివరికి నిన్ను తీసుకుని ఎటో వెళ్ళి పోవాలనుకున్నాను. అందుకు అవసరమయ్యే యేర్పాట్లు ఆలోచన చేశాను... చివరి క్షణంలో నా మనసు మార్చుకున్నాను... నా కోసం మీ కుటుంబ పరువు మర్యాద మంట కలసి పోకూడదనుకున్నాను... మీ కుటుంబ పరిస్థితులు... నీ తరువాత పెళ్ళి కావలసిన వారి భవిష్యత్ గురించి... ఆలోచన చేసి... నా కారణంగా మీ కుటుంబానికి కష్టము – నష్టము కలుగకూడదనే నిర్ణయంతో... నిన్ను చూడాలనే కోరికను కూడ...బలవంతంగా అణచుకుని...."

"మోహన్! బాధపడకు!"

"నన్ను క్షమించు సరూ! నీకు అన్యాయం చేశాను..."

"పోనీలే మోహన్! భార్య పిల్లలతో నీవైనా సుఖంగా వుంటే... నాకు అంతే చాలు! ప్రాప్తంలేని వారికి, ఎవరు మాత్రం ఏమి చేయగలరు?... నీ పరిస్థితులు తెలియక... నీ గురించి అపార్థం చేసుకున్నాను... ఇప్పటికైనా అసలు విషయం తెలిసిందిగా! నీ భార్య పిల్లలు... బావున్నారా? ఎక్కడుంటున్నారు?"

"చెప్పానుగా! తొందరపాటు నిర్ణయాలు నీకు అలవాటని!... నీవనుకున్నట్లు నాకు భార్యా పిల్లలు... ఎవరూ లేరు!"

"అదేవిటి? మీ అక్క కూతురుతో నీకు పెళ్ళి చేశారన్నావుగా?"

"చేశారనలేదు!... ముహూర్తం నిర్ణయించారు!... దానికి ముందే... యింటి నుండి వెళ్ళిపోయాను... నీవన్నట్లు నిన్ను మోసం చేసి, పరారు కాలేదు!"

"తెలియక, ఆవేశంతో... ఆవేదనతో... ఏదో అన్నానని – బాధపడకు! ఇప్పుడు ఎక్కడుంటున్నావ్?"

"బెంగుళూరులో!... ఒక్కమాట! నా మాట వింటావు కదూ?... నిన్ను మోసం చేయడానికి కాదు. యిలా అంటున్నది!... ప్రస్తుతం నీవున్న పరిస్థితులలో... నిన్ను విడిచి, నేను వెళ్ళలేను... ప్లీజ్ ! నామాటవిని, నా మీద నమ్మకంతోనే... గతంలో నా పట్ల నీకున్న ప్రేమ ప్రమాణంగా నీవు నాతో వచ్చెయ్! నీ మనసు కుదుటపడిన తరువాత, నీ యిష్టం వచ్చిన చోటుకు వెళ్ళవచ్చు!... నీపై నాకు ఏవిధమైన అధికారం లేదుగదా!"

"మన జీవితాలు ఎలా చెదిరిపోయినప్పటికీ... మానసికంగా, హృదయపూర్వకంగా... నేను నీ దానినే! ఆనాటి తొలిప్రేమ మధురస్మృతి జీవితాంతం చెరిగిపోదు... ఆడ మనసు! మాసిపోదు! నీతో రావడానికి నాకు అభ్యంతరం లేదు... అయినా, నీ విషయం కూడ ఆలోచించుకో! కాపురం చేసిన దాన్ని... పిల్లల్ని కన్నదాన్ని!... ఈ చేతులతో... వాళ్ళను..."

"...ఏం చేశావ్?"

"...చెప్పానుగా! ఆ తిరుమల స్వామికి ఒప్పగించానని!... వాళ్ళతో సహా చనిపోవాలనే నిర్ణయంతోనే... యింటినుండి వచ్చేశాను... దైవదర్శనం చేసుకుని, జీవితాలను సమాప్తం చేసుకోవాలనే... తిరుమలకు వెళ్ళాను... కాని..., పిల్లా పాపలతో దైవదర్శనానికి వచ్చిన ఆ జనసమూహాన్ని చూచి... ఆ దేవుని ముఖాన్ని దర్శించి... నా పిల్లలవైపు చూచినప్పుడు... వాళ్ళను గూర్చి నేను ఎంత కిరాతకంగా ఆలోచన చేశానో అర్థమైంది! కన్నవారికైనా, తమ పిల్లల్ని చంపే అధికారం ఎలా వుంటుంది? అందుకే... వాళ్ళను హత్యచేయాలనే మనసును మార్చుకున్నాను... నేనెలాగూ చనిపోవడానికి నిర్ణయించుకున్నాను కనుక, నా తరువాత వాళ్ళు దిక్కుమాలిన వాళ్ళుగా మారకూడదనే తలంపుతో... క్షణం... తల్లి హృదయాన్ని రాయి చేసుకుని... ఎవరైనా దయార్ద్రహృదయులు వారిని చేరదీయక పోతారా అనే నమ్మకంతో... వాళ్ళను... అక్కడే వదిలేసి..."

"ఏడవకు... చాలా తప్పుచేశావ్!"

"తప్పేముంది? వాళ్ళ తండ్రి ఫలానా అని చెప్పలేని నా

దౌర్భాగ్యస్థితిలో... అంతకంటే... నేను చేయగలిగింది ఏమీ లేదు!... ఇందాక ఏదో అన్నాను. నీతో వస్తానని! అలాకాదు మోహన్! ఈ దురదృష్టవంతురాలు ఎక్కడ అడుగుపెడితే అక్కడ వారికి... పీడ దాపురిస్తున్నది... నీవు వెళ్ళిపో మోహన్!... ఇప్పటికైనా నిన్ను చూశానుగదా! యీ తృప్తిచాలు!"

"చెప్పానుగా! వయసు పెరిగినా... జీవిత అనుభవం పాఠాలు నేర్పినా... తొందరపాటు నిర్ణయాలు చేయడంలో నీలో ఏమాత్రం మార్పురాలేదు... ప్రస్తుతానికి నాతో వచ్చెయ్! నాతోనే వుండిపొమ్మని నిన్ను నిర్బంధం చేయను... నాకు తెలుసు, ఆ హక్కు నాకు ఎలాగూ లేదని... కొన్నాళ్ళ తరువాత నీ మనసు స్థిమితపడితే... అప్పుడు, నీ యిష్టం వచ్చిన చోటుకు నీవు వెళ్ళిపోవచ్చు!... తొలినాటి ప్రేమికునిగా... నేటికీ, ఎవరూ లేని ఒంటరివాడిగా బ్రతుకుతున్న... నా మాట విను!"

"మోహన్! నీతో వస్తాను! మన యింటికివెళ్దాం పద! భర్తను వదులుకున్నాను... పిల్లల్ని దూరం చేసుకున్నాను... నిన్నుకూడా దూరం చేసుకోలేను. నా విషయంలో నీ మనసు తెలిసిన తరువాత కూడా... నేను నీకు దూరంగ వుండలేను... నా జీవితం ఎలా పోయినా... నా కారణంగా నీ భవిష్యత్ ఎడారి కాకూడదు... ఇప్పటికే ఎంతో పాపం, మూట కట్టుకున్నాను... నన్ను యింతగా ప్రేమించిన నీ మనసు బాధపెట్టి నీ ఉసురు కట్టుకోలేను. పద మోహన్ వెళ్ళిపోదాం!"

"హోటల్‌లో భోజనం చేసివెళ్దాం"

"నేనేమీ తినలేను..."

"ఫర్వాలేదు! కొంచెం ఎంగిలిపడు... ప్లీజ్!..."

''మరోమాట! పిల్లల్ని వదిలి క్రిందికి వచ్చి ఎంతసేపైంది?"

"ఎందుకు?"

"తిరుమలకెడదాం! పిల్లల్ని వెతుకుదాం! సెక్యూరిటీ వాళ్ళను ఎంక్వైరీ చేద్దాం! మనతో వాళ్ళను తీసుకొద్దాం..."

"మోహన్ ఆ ఆశ నాకులేదు!"

"అయినా మానవ ప్రయత్నం చేద్దాం!"

# 7. మార్పు

"రజస్వల కావడం, ఆడపిల్లకు తొలి అనుభవం!... పెళ్ళి కూతురుగా కాబోయే భర్త ప్రక్కన పెళ్ళి పీటపై కూర్చుని, మూడు ముడులు వేయించుకుని, అతని భార్యగా మారడం మరువలేని మరో జీవిత దశ!... మొదటి రాత్రి భర్త కౌగిలిలో మగవాడి తొలిస్పర్శ వెచ్చదనాన్ని అనుభవించి, ఆస్వాదించడం - జీవితంలో చెరిగిపోని అనురాగముద్ర! మాతృత్వం మరో తియ్యని అనుభూతి! లాలన పాలనగా ఆలిని ఏలుకోవాలి... మగసిరిగల మగవాడు!... ప్రకృతి సహజంగా పుష్పావతిని కావడం మినహా అవేవీ నాకు జరగలేదు జరిగిందల్లా... నీతో మోసపోవడమే!..."

"నేను, నిన్ను మోసం చేశానా?"

"అవును, అక్షరాలా! మేనత్త కొడుకుతో పెళ్ళి కుదిరిన నాకు, మాయమాటల మత్తు మందు యిచ్చి, మృగంలాగా ప్రవర్తించి, నన్ను 'రేప్' చేశావ్! కన్నెపిల్ల కలలనన్నిటినీ కాళ్ళతో తొక్కి నలిపేశావ్! వికలమైన మనసుతో - వికార చూపులతో, అయోమయంలో వున్న నన్ను... బెదిరిస్తూ నీ పశు కోరికను తీర్చుకునేవాడివి... నీ ధన బలం - కండబలంతో అందర్నీ భయపెట్టి నన్ను నా వారికి దూరంచేసి, యిలా, ఎవరూలేని దానిని చేశావ్!... ఇప్పుడేమో, పొమ్మంటున్నావ్? అదేమని అడిగితే... దిక్కున్నచోట చెప్పుకోమంటున్నావ్? 'నా' అనే వారెవరూ నాకు లేరనేగా, యిప్పుడు యిలా మాట్లాడుతున్నావ్?"

"ఆడది 'ఔ'ననకుండా, మగవాడు చేయగలిగింది

ఏమీలేదు... ఇప్పటి వరకు నీవు చెప్పినవన్నీ... నీ యిష్టంతోనే జరిగాయి! అందులో నేనుగ చేసిందేమీ లేదు  అనవసరంగా మాట్లాడకు... నీ యిష్టం వచ్చిన చోటుకు పోవచ్చు! లేదా నాతోనే బ్రతకాలనుకుంటే మీ వాళ్ళను రప్పించి, నేను కోరే కట్నకానుకల్ని తెగలిగితే రిజిష్టర్ మేరేజ్‌కి నేను రెడీ!"

"అందరికీ దూరమైన దాన్ని... నా కోసం, కట్నం ఎవరిస్తారు?"

"అలా అయితేనే జరుగుతుంది మేరేజ్?... లేదా యిన్నాళు ళ్ళ నాతో వున్నావు కాబట్టి తిండి, బట్ట యిస్తాను. నీ కిష్టమైతే యిక్కడే పడివుండు. నాకు అభ్యంతరం లేదు. అయితే నాకు సంబంధించిన ఏ విషయంలోనూ నీవు, జోక్యం చేసుకోకూడదు."

"నమ్మించి తీసుకొచ్చి... యిప్పుడు యిలా అనడం న్యాయమేనా?"

"న్యాయాన్యాయాలు నీకంటే నాకే బాగా తెలుసు! వాటిని గూర్చి మాట్లాడకు! వెళ్ళిపోతానంటే చెప్పు, యిప్పుడే పంపించివేస్తా!"

"మనిషి మీద మోజు, అవసరం వున్నంతవరకేనా ఆ మనిషితో అవసరం?"

"అవును! **ఎవరికైనా ఒక మనిషితో వున్న అవసరమే. ఆ వ్యక్తి యింపార్టెన్స్‌ను నిర్ణయిస్తుంది.** నా దృష్టిలో ఆడమగ సంబంధం అలాటిదే... "క్రొత్తొక వింత... పాతొక రోత!"

"భార్య – భర్త సంబంధం...?"

"అదీ... అంతే! ఆ యిద్దరి మధ్యలో 'తాళి', పిల్లలు వుంటారు కనుక, లోకం కోసం తప్పనిసరిగా మనసుల్ని మోసం చేసుకుంటూ యిష్టాన్ని చంపుకుంటూ, ఒక యింటిలోనే వుంటారు! నా దృష్టిలో కేవలం మనసు కోసమే అయితే మేరేజ్ అనవసరం!... మనసు ప్రేమ అనేవి, దేవతా వస్త్రాల్లాంటివి! ఉన్నాయనుకుంటే వుంటాయి. లేవనుకుంటే వుండవ్... ఇది నాకు తెలిసిన జీవిత ఫిలాసఫీ! ఇది, మనిషికొక తీరుగ వుంటుంది... అందుకే, ఎవరికోసం వారే బ్రతకాలిగాని, ఎవరూ మరొకరికోసం కాదు... మనసు స్వేచ్ఛ మనిషికి అవసరం! అందుకే నీ మంచికోసమే చెబుతున్నా! నీ మనసుకు యిష్టమైన చోటుకు వెళ్ళిపో! లేదా... యిక్కడే వుండిపో! నీ యిష్టం నీది – నా యిష్టం... నాది!... చెప్పానుగా కండిషన్! బాగా ఆలోచించుకో!"

– – –

"మొత్తం మీద, ఘటికుడివనిపించుకున్నావ్! వాడేశావ్ – వదిలేశావ్ – వదిలించు కున్నావ్! తెలివంటే... నీదే! మనలోమాట – యింతకూ నీ జమానాలో యీ కేసు నంబరెంత?"

"బాగా గుర్తులేదు గాని... బహుశా... ఆరున్నొక్కటి ప్లస్, కావచ్చు!"

"ఎప్పుడూ యిదే బతుకైతే... పెళ్ళి చేసుకునేదెప్పుడు?"

‘‘పెళ్ళంటే... మీ అర్థం ఏమోగాని... నాకు తెలిసినంతవరకు... కన్నవారు, తమ బాధ్యతలను వదిలించుకుని, మరో మనిషి మెడకు చుట్టే తతంగమే పెళ్ళికి అర్థం! ప్రేమ పెళ్ళి స్వయంకృతం. అది వేరులే! అడవిలో జీవిని బోనులో పెట్టినట్లు... ఎగిరే పక్షిని, పంజరంలో వుంచినట్లు...స్వేచ్ఛా జీవుల్నీ పెళ్ళి పేరుతో సంసార గృహ గుహలోకి నెట్టివేయడమే! బాధ్యతలు, బాధల సంకెళ్ళను తగిలించడమే! ఆ బానిస బ్రతుకు నాకు యిష్టం లేదు. అనుభవించాలి జీవితాన్ని మస్తుగ, మతుగా! ఆపైన, పెళ్ళిని గురించి తీరికగా ఆలోచన చేయవచ్చు. నీతి అంటే నాకు తెలిసింది నెయ్యిలేని నేతిగిన్నె...! వయసు ఉద్రేకాలు మిగిలేవి, కలకాలం వుండేవి కావు... అణచుకుంటే...అవి ఆవిరయ్యేవి కావు. వాయిదా వేసుకుంటే అసలు ఫాయిదాలతో అవి పెరిగేవీ కాదు. అందుకే... అనుభవించాలి జీవితాన్ని అందినంత వరకు! పెళ్ళిదేముంది? అవసరమనుకుంటే దాన్ని ఎప్పుడైనా చేసుకోవచ్చు! ... పెళ్ళంటున్నావ్... నీ యిలాకా పిల్ల ఎవరైనావున్నారేంటి?’

“ఉన్నా వుపయోగం ఏంటి? నీ ఫిలాసఫీ వేరుగా వుందిగా? ఈ లైన్‌లో వున్నవాడివి నీవు పెళ్ళి చేసుకోకపోవడమే అటూ యిటూ, అందరికీ మేలు! నీ ఫిగర్, విగరూ, మాట మాడ్యులేషన్, మాటకారితనం, ఆడపిల్లలకు ఆశలు రేపి మోసం చేయడానికి నీకు బాగా పనికొస్తున్నాయ్!... అయినా ఎంతకాలం చేయగలవ్ యిలా? నీతో మోసపోయిన వారందరూ మౌనంగా వుండరు. వారిలో ఎవరితోనో ఒకరితోనైనా, ఎప్పుడో ఒకసారి జీవితానికి

సరిపడా గట్టిదెబ్బే తింటావ్! ఇప్పటికైనా పద్ధతి మార్చుకో! పెళ్ళి చేసుకుని, పెళ్ళాం పిల్లలతో సమాజంలో గృహస్థునిగా, మంచి పౌరునిగా పేరు తెచ్చుకో! క్షణిక సుఖం కోసం జీవితాలతో ఆడుకోకు!"

"మీ పెద్దరికపు సుద్దులు, వృద్ధమాత ఉపదేశంగా వున్నాయి... పెళ్ళాం పిల్లలుంటేనే మంచి పౌరులవుతారా ఏమి?"

"అలా అని కాదుగాని, బాధ్యత గుర్తించి బ్రతకడం మంచి పౌరుని లక్షణం! అందుకు సంసారబాధ్యత సహజమైన స్వయంకృత మార్గం... అదే, సమాజ సమ్మతమవుతుంది. ఉదాహరణకు స్త్రీతో కలయిక అనేది భార్యతో జరిగితే... అది ఆచార ధర్మమవుతుంది. అదే, పరస్త్రీతో అయితే అత్యాచారం, అధర్మం, నేరం అవుతుంది. 'కర్మ' ఒకటే అయినా, క్రమం తప్పి చేసేది కష్టాలను తెస్తుంది. నీ ఆరున్నొకటి ప్లస్‌లో ఎవరైనా తెగబడి, ఫామిలీ కోర్టులో నీ మీద కేస్ వేసిందే అనుకో! పదిమందిలో, అప్పుడు నీ పరువు మర్యాద సంగతి ఏమౌతుందంటావ్?"

"ఏమని వేస్తుంది కేసు? అలావేసే... మనిషి నాకేమౌతానని చెబుతుంది?"

"అబ్‌డక్ట్ చేశావని! ఆమెను 'రేప్' చేశావని..."

"ఆమె సెక్స్ వర్కరని... ఎప్పటికప్పుడు సర్వీస్ ఛార్జీలు చెల్లించానని, దానికి కౌంటర్ వుంటుంది."

"దేనికైనా డిఫెండింగ్ వాదన వుంటుందిలే!... లీగల్‌గా ఎలా వున్నా... మనిషికి, అంతరాత్మ సాక్షిగా సమాజ నీతి వుండాలి గదా!"

"నీతి సంగతి నేతి గిన్నెతో పోల్చి చెప్పానుగదా! మళ్ళీ దాని జోలెందుకు?"

"సరే! నీ మొండితనానికి నా వాదన చాలదుగాని... ఒక్కమాట మాత్రం చెప్పగలను. నూరు గొడ్లను తిన్న రాబందైనా, ఏదో ఒకనాడు గాలివానకు కొట్టుకుపోతుంది... నీ సంగతీ అంతే!... వస్తా..."

- - -

"నా జాతకంలో పెళ్ళి మాటలేదు...!"

"అమ్మాయిల వేట ఉందా?..."

"ఉన్నట్లే వుంది! ఇన్నాళ్ళు జరుగుతున్నది అదేగా!"

"ఇంకేమేమి వున్నాయో జాతకంలో... ఏటి వరద వయసు ఉద్రేకం, ఎంతోకాలం నిలిచివుండేవి కావు!... గ్రహించు!"

"ఉన్నంత వరకైనా ఉపయోగించుకోవాలిగా!... వరదలోనే నదికి పూజలు చేస్తారు... పైసలు వేస్తారు..."

"ఉన్నదానిని, మంచిగ వుపయోగించుకోవాలి! వృథా చేయరాదు. వరద నీటిని, సాగరం పాలు చేస్తూ... సాగుబడికి నీరులేదని, వ్యవసాయాన్నే మాన్పించడం... స్వదేశీ సర్కారుకే

చెల్లింది... ఉపన్యాసాలు వినడం ఓట్లు వేయడం తప్ప దానికి ప్రజలు చేయగలిగింది ఏమీ లేదు... కాని, వయసును సద్వినియోగం చేసుకోవడం, వ్యక్తిగత ధర్మం – జీవిత అవసరం! ఇంతకాలం నీవు, కేవలం శరీర ఉద్రేకాల కోసం వివాహ రాజమార్గం వదలి... ఆడపిల్లల జీవితాలతో ఆడుకుంటున్నావ్? దానినే, నీ ప్రత్యేక ఘనతగ గర్విస్తున్నావ్! వాళ్ళ జీవితాలను ధ్వంసం చేస్తున్నావ్! కండబలం, ధనమదం ఎంతో కాలం పనిచేయలేవు. నామాటవిని యిప్పటికైనా మనసు మార్చుకుని, మంచిమార్గం వైపు మరలితే... అందరికీ మేలు కలుగుతుంది... నీకూ మంచి భవిష్యత్ వుంటుంది!... **తప్పు చేయడం కాదు మనిషి ప్రత్యేకత! ఒప్పును గుర్తించి వర్తించాలి. ఎటువంటి మనసునైనా... పశ్చాత్తాపం, ప్రక్షాళన చేస్తుంది**. నీ వయస్సులో నేనూ నీలాగానే వ్యవహరించాను. అయినా, అనుభవం నేర్పిన జ్ఞానంతో మార్గం మార్చుకున్నాను... అయితే, అందరూ స్వంత అనుభవంతోనే మారవచ్చుననుకోవడం కంటే... యితరుల జీవితాలనుంచి మంచిని తెలుసుకోవడం, వుపయోగం!... నాకు తోచినదేదో చెప్పాను... ఇహ, నీ యిష్టం! ఎవరికి వారికి, వారి గతాన్ని పరిశీలించుకుని వాస్తవాన్ని గుర్తించడమే ప్రయోజనం...”

“వయస్సు మర్యాద ఒకటుందిగా! వైరాగ్య మంటారేం?”

“వైరాగ్యంతో నిన్ను బైరాగిగా మారమని చెప్పడం, నా ఉద్దేశ్యం కాదు... ‘ధర్మార్థ కామ మోక్ష’ మనేవి పురుషార్థాలు! ప్రతి మనిషి క్రమానుగతంగా వాటిని నెరవేరుస్తూ వుండాలి!...

**ధర్మం అంటే విధి నిర్వహణ! చిత్తశుద్ధితో, తన బాధ్యతను (కర్మ) నెరవేర్చడం! ఇదే వృత్తిధర్మం అంటే!... తద్వారా 'అర్థం', అంటే ఆ కర్మ ఫలితం - (అది ధనరూపంలో కావచ్చు) ఏదో రూపంలో ధర్మ నిర్వహణ చేసిన వారికి చేరుతుంది... అలా లభించిన ఫలితాన్ని అనుభవించడం ఆ తరువాత దశ! 'కామం' అంటే కావాలనుకోవడం... అది శరీర - మానసిక సంబంధమైనవి కావచ్చు! అలాగే,నిత్యావసరాల సంభంధ కోర్కెలను తీర్చుకోవడం కావచ్చు. కనుక, కామం అంటే కేవలం స్త్రీ పురుష శరీర సుఖమనే కాదు. అందుకు ధర్మబద్ధమైన గృహస్థ జీవితం ఉద్దేశింపబడింది!**

**ఇలా, కర్మ (ధర్మ) నిర్వహణ దాని ప్రతిఫలం - అనుభవం - ఈ క్రమంలో జీవిత జీవన బాధ్యతా నిర్వహణ స్ఫూర్తితో... ఎప్పటికప్పుడు మనసు రిలాక్స్‌ను పొందవచ్చు! ముక్తి - మోక్షమంటె వేదాంత భావం, అర్థం ఏమైనప్పటికి, భౌతిక సెన్స్‌లో బాధ్యతల భారం నుండి ఎప్పటికప్పుడు విడుదల (ముక్తి) పొందుతూ, మానసిక స్వేచ్ఛను (మోక్షం) అనుభవించడమే!... వయసు త్రుళ్ళినా... మళ్ళినా... పురుషార్థ పరిధిలోనే, జీవిత క్రమశిక్షణ సాగిస్తూ వుండాలి!"**

"మీరు చెప్పిన దానిలో వాస్తవం లేదనలేనుగాని... అది, నా మనసులోకి 'సీదా' పోవడం లేదు..."

"నీకు వేదాంతాన్ని బోధించడం కాదుగానీ... మరోసారి ప్రయత్నిస్తాను. మనసు పెట్టి ఆలకించు. **పంచభూతాల నిర్మితం ప్రకృతి... దీని ఉత్పత్తి శరీరం! పంచభూతాల (Five Elements)**

స్వీకరణకు, శరీరంలో పంచేంద్రియాల అమరిక వుంది. వీటితో మెదడు స్పందన కారణంగా అది సెన్సోరియంగా మార్పుచెంది, తత్సంబంధ 'మనసు' యేర్పడుతుంది. దానికి ఆలోచన బుద్ధి కలుగుతాయి! పరిసరాల ప్రభావితమైన ఇంద్రియాలకు మెదడు స్పందించే తీరును అనుసరించి, మనసు దాని ఆలోచన బుద్ధి లక్షణాలు వుంటాయి. వీటి సమన్వయతా భేదాలను అనుసరించి, కర్మ (Action) నిర్వహణ వుంటుంది. మనసు దాని ఆలోచన - బుద్ధి, పరస్పరం భేదించినప్పుడు, మనం అనుకున్నదానినే చేయలేం! మనసు - ఆలోచన - బుద్ధి వీటిలో మనసు సెన్సోరియం రిఫ్లెక్షన్ బుద్ధి, సైకో ఇన్‌స్టింక్ట్ (Pyscho Instinct) సాధారణంగా ఈ రెండిటికీ ఏకత కంటే భిన్నతే ఎక్కువ! మనసు ఆలోచనకే పరిమితం! బుద్ధికి కార్య నిర్వహణ వుంది! ఆలోచన మంచిదైనా బుద్ధి చెడ్డదైతే... చేసే పని - దాని ఫలితం బుద్ధిని అనుసరించే వుంటాయి! అలాగే, చెడ్డ ఆలోచనను మంచి బుద్ధి నిరోధించగలదు. అయితే, ఆలోచనతో పాటు బుద్ధి కూడా చెడ్డదైనప్పుడు... వాటిని అడ్డుకునేది ఒకటుంది... అదే... అంత్ణకరణ... అంతరాత్మ ఇది, వాస్తవాన్ని మాత్రమే తెలియచేస్తుంది! దీనిని ఇన్‌స్పిరేట్ చేసేది సిక్త్‌సెన్స్ (అంతరేంద్రియం). కొన్ని సందర్భాలలో- మనసు- బుద్ధి కలసి అంతరాత్మను అణచి వేసినా - అది తాత్కాలికమే! ఏదో సందర్భంలో అంతరాత్మ నిజాన్ని చెబుతుంది! ఈ స్థితి పశ్చాత్తాప ఫీలింగ్!

మనసుకు సంబంధించి ఆలోచన, బుద్ధి యీ రెండూ

**దేనికదే పనిచేయకుండా, వాటిని మనసులో ఏకం చేయగలిగితే... అట్టి మనసు అంతరేంద్రియ ప్రభావితమై... అంతరాత్మ సాక్షిగా... మంచి – చెడు అనే విచక్షణా బేస్‌గా మంచి కర్మలనే చేస్తుంది... మంచి ఫలితమే లభిస్తుంది! అనుభవమూ అందుకు తగినట్లుగనే వుంటుంది... ఇందుకు ధ్యానం, ముఖ్యసాధనం!...**

ఇంతసేపు నేను చెప్పినది ప్రస్తుతానికి నీ మనసుకు చేరకపోయినా ఫర్వాలేదు. కనీసం, నీ ఆలోచనా విధాన్నైనా మార్పుచేసే ప్రయత్నం చెయ్యి!... మరోమాట! నేను వెళ్ళే ఆశ్రమానికి నాతోపాటు నీవూ ఒకసారి వస్తే...అక్కడి గురువుగారి మాటలను కూడ నీవు ఆలకించి... అవి నీకిష్టమైతే... తరువాత నీకు నీవే వెళ్ళవచ్చు! ప్రస్తుతానికి నా మాట కాదనకు... ఏమంటావ్?"

"అలాగే!"

– – –

"మీలో యింతటి మార్పును చూస్తానని నేను ఊహించలేకపోయాను... చాల సంతోషం! సాధారణంగా తప్పు చేసినవారే... ఒప్పును గ్రహించి, దానిని దిద్దుకోగలరు! మంచి చెడు... ఏదీ చేయలేనివారు... వేరే చేసేది మాత్రం ఏముంటుంది?"

"అందుకు దారి చూపించింది మీరే! గురువుగారి దర్శనం, వారి ఉపదేశం... నాలో నిద్రావస్థలో వున్న దేనినో తట్టి,

మేల్కొలిపినట్లయింది...

కామం - కోరిక జీవికి సహజం... జన్మ ప్రారంభానికి - జీవిత గమనానికి, అది ప్రాథమికం: ఋతుప్రేరణే అన్ని జీవులలోనూ అందుకు కారణం అవుతోంటే... ఆ సహజత మనిషిలో భోగలాలసగా, వ్యామోహ వెర్రిగా, రోటీన్ అలవాటుగా స్థిరపడిపోయింది. సృష్టిని - సృష్టి కర్తను ప్రశ్నించి, పరిశీలించగల మేధాశక్తి ప్రత్యేకతకు, యీ మానసిక బలహీనత ప్రామాణికమా? సెక్స్ సుఖానికి, సాంసారిక బాధ్యతను జోడించిన నాగరిక మార్గంలో గృహస్థ ధర్మం వుండగా... అనాగరిక వ్యభిచార మార్గాన్ని అనుసరించి, అక్రమ రీతిలో అనేకమంది ఆడవారి జీవితాలను అవినీతి పాలుచేయడం వారిని అవస్థలపాలు చేయడం విచక్షణ జ్ఞానం వుండవలసిన మనిషికి తగునా? కళ్ళెం చేతిలోలేని రౌతులాగ, తన మనసునే తన స్వాధీనంలో వుంచుకోలేని బలహీన - బుద్ధిహీనత... ఆధ్యాత్మిక జ్ఞానాన్ని కలిగియుండవలసిన మానవ జన్మకు అవమానం కాదా? మీ శరీరం మీకు తెలిసేటట్లుంటేనే అది స్పర్శ, స్పృహగా భావిస్తాం. అలాగే, మీ మనసు మీదిగా వుంటేనే అది నిగ్రహం, సంయమనంగా గుర్తించబడతాయి... కనుక, ప్రతివ్యక్తి తన మనసును తనదిగా వుంచుకుంటూ, విచక్షణ జ్ఞానంతో, కోరికల బానిసగా కాకపోవడమే మనిషి చేయవలసిన మొదటి పని. సక్రమ కోరికలను చంపడం - అలాగే, అక్రమవాంఛలను పెంచడం కంటే - విచక్షణ పరిధిలో వాటిని ధర్మయుతంగా - న్యాయ మార్గంలో వుపయోగించడమే మంచిది. కోరికలకు సంబంధించి

అవసర 'అతి' - క్రమం - అక్రమం - యీ భేదం బాగా తెలియాలి? ఆశ అవసరమైనట్లే అత్యాశ అనర్థకం..."

గురువుగారి యీ మాటలు... నన్ను నేను ప్రశ్నించుకుని, నా గతంలోని మంచి - చెడులను పరిశీలించుకునే అవకాశం కలిగించాయి... సెక్స్ బానిసను నేను! మోసపు మనసుతో ఎంతో మంది ఆడపిల్లలతో సెక్స్ గేమ్ ఆడుకున్నాను. నా తప్పు నాకు తెలిసింది. దాన్ని దిద్దుకునే ప్రయత్నం చేస్తున్నాను... నాలో యీ మార్పుకు కారకులైన గురువుగారికి నా జీవితాన్ని అంకితం చేస్తాను... వారి సందేశాన్ని ప్రచారం చేస్తాను. గతంలో నాలాంటి వారిలో కొందరిలోనైనా మంచి మార్పు తేవడానికి ప్రయత్నిస్తాను... దీనితో పాటు, మరో పనికూడా చేయాలనుకుంటున్నాను. అందుకు గురువుగారి ఆశీస్సులతోపాటు, మీ సహకారం కూడా నాకు కావాలి!"

"తప్పకుండా! నా విషయంలో మీకా సందేహం అక్కర్లేదు. గురువుగారి ఆజ్ఞను అనుసరించి నానుంచి మీరు కోరే ఎలాటి సహకారాన్నైనా, నా శక్తివంచన లేకుండా అందిస్తాను. అది నా ధర్మంగా, బాధ్యతగా భావిస్తాను... సందేహించవద్దు... చెప్పండి."

"నా జీవితం గురువుగారి సేవకు అంకితం'. ఇహ, వ్యక్తిగతంగా నాకు దేనితోనూ అవసరంలేదు. నాకున్న ఆస్తికి కస్టోడియన్‌గా, కేర్‌టేకర్‌గ మీరు దానిని సద్వినియోగం చేయాలి!"

"అలాగే! అది ఎలాగో చెప్పండి!... అయినా ముందుగా

గురువుగారి సలహా తీసుకోవడం ముఖ్యం!"

"చెప్పానుగా నాదంటూ నాకు ప్రత్యేకంగా ఏమీలేదు. ఆయన ఆజ్ఞే నా సర్వస్వం! అలాంటప్పుడు ఆయనకు తెలియకుండా నేను ఏది మాత్రం ఎలా చేయగలను? వారి అనుమతితోనే నేనీ నిర్ణయం తీసుకున్నాను. ఇందుకు ముఖ్య నిర్వాహకునిగా మిమ్మల్ని సంప్రదించమన్నారు... మీ సమ్మతిని తెలుసుకోమన్నారు! అందుకే - మిమ్మల్ని యిలా అడుగుతున్నాను... ఇది మీకు యిష్టమైతే... దరిమిలా మీరే గురువుగార్ని దర్శించి... వారి అనుమతిని పొందండి!"

"అలాగే చేస్తాను. మీ ఆస్తికి సంబంధించి దాని వినియోగ పథకాన్ని, విధానాన్ని వివరించండి!"

"గతంలో కామంతో కళ్ళు మూసుకుపోయి... డబ్బు మదంతో ఎందరో అమాయకుల జీవితాలను పాడు చేశాను. వారి భవిష్యత్‌ను నాశనం చేశాను. వీరిలో కొందరైనా, దిక్కుమాలిన స్థితిలో, యీనాటికీ జీవితాలను గడుపుతూ వుండవచ్చు... అలాగే, నాలాంటి దుర్మార్గుల చేతులలో యింకా ఎంతో మంది ఆడపిల్లల బ్రతుకులు చితికిపోయివుంటాయి! వారికి ఆశ్రయం కల్పించి, వారి బ్రతుకు తెరువుకు మార్గాలు చూపాలని నా ఉద్దేశ్యం! అలాగే, అంధులు - వృద్ధులు - అనాధ పిల్లలకు ఆదరణ లభింపజేయాలి... మగవాడి కామదాహానికి దగాపడ్డ అబలలకు దారి చూపడం ద్వారా... గతంలో నేను చేసిన పాపాన్ని పరిహారం చేసుకుంటాను... కనుక... అందుకు

వీలు కలిగే విధానాలతో పథకాలను రూపొందించండి! ఆశ్రమ నిర్మాణం చేయాలి! లీగల్‌గా అందుకు సంబంధించిన లాంఛనాలను పూర్తిచేయండి... గురువుగారి అనుమతితో నేనూ ఆశ్రమానికి వస్తూ వుంటాను... అనుమతించాలి సుమా మీరు!"

"ఎంతమాట! అందరినీ అనుమతించి ఆదరించగలిగినవారు... దైవసమానులు గురువుగారే కదా! మనందరం నిమిత్త మాత్రమే!... మీ ప్రతిపాదనకు నా సమ్మతిని తెలియజేస్తున్నాను... గురువుగారిని దర్శించి వారి ఆశీస్సులతో ఈ భారం తలకెత్తుకుంటాను."

"చాల సంతోషం! విధి నిర్వహణలో మీరు కృతకృత్యులు కాగలరని ఆశిస్తున్నాను..."

"అంతా గురువు గారి దయ వస్తానండి!"

"............................"

# 8. ఆడ మనసు

"చంటీ!... ఓ చంటమ్మా!... నిన్నేనే...!"

"అక్కా!..."

"ఏంటే పిలుస్తున్నా తిరిగి చూడకుండా పోతున్నావ్?"

"అక్కా! బావున్నావా? ఇలా నీవు నన్ను ముద్దు పేరుతో పిలిచి ఎంతకాలమైందక్కా! నన్ను అలా పిలిచేవారు... పలకరించేవారు ఎవరూ లేరిక్కడ! వేరే ఎవర్నో అనుకున్నాను... అక్కా! బావగారు పిల్లలు అంతా మంచిగా వున్నారు కదా? ఎక్కడుంటున్నారు? ఎన్నాళ్ళకు చూశానక్కా నిన్ను! ఈ ఊరిలోనే వుంటున్నారా?... ఏంటక్కా మాట్లాడవు?"

"ఏమిటే యిలా వున్నావ్? ఇంటికి పోదాం పద!"

"ఏ యింటికి? మీ యింటికి వద్దక్కా! నేను అంతటి లెవెల్లో లేను..."

"నోర్ముయ్! నీకూ – నాకూ లెవెలేంటే?... పోనీ మీ యింటికి పోదాం పద!"

"......................."

"ఏమిటే! నీ ప్రియుణ్ణి ఏమీ అననులే!"

"మేం పెళ్ళి చేసుకున్నామక్కా! నా మనసెరిగి, అప్పుడే మీరు ఆ పని చేసుంటే..."

"ఇప్పుడవన్నీ ఎందుకు?... ఆటో అతనికి చెప్పు మీ

యింటి అడ్రసు...”

– – –

“ఏమిటే, యింత యిరుకు పోర్షన్‌లో వుంటున్నారు? పిల్లలేరీ?... అసలూ... పిల్లల్ని కన్నావా?... మొగుడుంటే చాలనుకున్నావా?”

“ముగ్గురు పిల్లలక్కా నాకు! స్కూలుకెళ్ళారు... ఆయన ఉద్యోగానికెళ్ళారు”

“ఏముద్యోగం... ఎంత జీతం?”

“ప్రయివేటు జాబ్ చేస్తున్నారు... ఆయన తెచ్చేదాంతోనే తిండికి, బట్టలకు లోటు లేకుండా జరుపుకుంటున్నాం. అక్కా! ఈ వూరిలో మీరు ఎంతకాలంనుండి వుంటున్నారు?”

“ఆయనకు ట్రాన్సఫర్ అయి, యీ మధ్యనే వచ్చాం... మీరు ఎక్కడెక్కడ ఎన్నివూళ్ళు తిరిగి యిక్కడికి చేరారు?”

“అదేం కాదక్కా! ఆయన పేరెంట్స్ సమ్మతితోనే మాకు పెళ్ళి జరిగింది. కొంతకాలం వాళ్ళింట్లోనే వున్నాం... మూడు కాన్పులు అక్కడే జరిగాయి.”

“అంటే... నీకు పుట్టిల్లు లేదనుకున్నావ్ అంతేగా...”

“ఆనాటి పరిస్థితులు అలాటివి... అమ్మ బావుందా? ఎవరి దగ్గరుంటున్నది? అన్నయ్య దగ్గరేనా?... వదినతో గొడవలు ఏమీ లేవుగా?”

"వాడి దగ్గరే వుంటున్నది... ఆమెకూ ఆరోగ్యం బాగాలేదు... చిన్నదానివని, నిన్ను గారాబంగా పెంచినందుకు మాకందరకు కరెంట్ షాకిచ్చావ్‌గదా! అప్పటి నుండి ఆమె కోలుకోలేకపోయింది... అయినా, యిన్ని సంవత్సరాలు మమ్మల్నందరినీ మర్చిపోయి ఎలా వుండగలుగుతున్నావే?... నీది... మామూలు మనిషి గుండెకాదు... రాతి గుండె!... అది సరేనే... నీకు యిష్టమైన వాణ్ణి చేసుకోవాలనుకున్నావ్! మంచిదే! పెళ్ళంటే జీవిత బంధం కదా! అప్పుడు ఆ మాత్రం నీవు గ్రహించలేక పోయావ్!... అతని మత్తులో పూర్తిగా కీలుబమ్మవైపోయావు."

"అమ్మ ఎలా అనుకున్నా... నా మనసు తెలిసిన నీవు కూడా నాకు అనుకూలంగా ఒక్క మాటైనా చెప్పలేకపోయావు... చంపేస్తానని అన్నయ్య భయపెట్టాడుగదా!"

"కోపంలో ఎవరైనా అలాగే అంటారు... అంతమాత్రాన యిల్లు విడిచి, ఎవరితోనో లేచిపోవడమేనా? నీ యిష్టాన్నే నీవు నెరవేర్చుకున్నావ్‌గాని, దానితో కుటుంబ పరువు మర్యాద ఏమవుతాయని ఆలోచించావా? చిన్నతనం నుండి నీ మొండితనం తెలిసిందే అయినా... వయసు వచ్చిన తరువాత కూడ విచక్షణను కోల్పోయి ప్రవర్తించావ్!... అయిందేదో అయిపోయింది. ఆ తరువాతనైనా పోనీ నా దగ్గరకైనా రావాలిగదా! అదీ చేయకపోతివి! అనుకోని విధంగా యిప్పుడు కన్పించావ్ కనుక సరిపోయింది. లేకపోతే...? అందర్నీ యింత

బాధపెట్టి, నీవూ సుఖపడుతున్నది లేదు... ఈ పరిస్థితులు గ్రహించే కదా ఆనాడు నీ యిష్టాన్ని మేము వ్యతిరేకించింది... నీ క్షేమం కోరేగదా మేమంతా అలా చెప్పింది... ఎవరి మాటా వినకుండా... అందర్నీ వదలి..."

"అక్కా! బాధపడకు... నేను బాగానే వున్నానుగా!"

"ఉన్నావ్, ఎందుకు లేవు! కళ్ళకు కనపడుతూనే వుందిగా, ఆ బాగేవిటో!"

"పిల్లలు వస్తున్నట్లుంది... అక్కా! నీ మనసులోని నా మీదవున్న కోపం తగ్గించుకుని... వాళ్ళని ఆశీర్వదించక్కా!... ఒరే బాబూ నీవు చెల్లి – తమ్ముడు యిలా రండి!... ఈమెవరో తెలుసునా మీకు... నాకు అక్క – మీకు పెద్దమ్మ! పాదాలకు నమస్కరించండి!... లోపలికి పొండి స్నానంచేసి, బట్టలు మార్చుకుని వచ్చి, పెద్దమ్మ దగ్గర కూర్చోండి.... అక్కా! ఆయన్ని పరిచయం చేసినప్పుడు ఆయన్ని నీవు... ఏమీ అనవద్దు..."

"...ఆయన్ని, నిన్నూ అనడానికి... నేనెవర్నే? నీ మొగుడు... నీ యిష్టం!"

"అక్కా! మమ్మల్ని అలా దూరం చేసి, మేము నీకు ఏమీ కాని వాళ్ళంగా మాట్లాడకు. నీవు నాకు అక్కవి. ఆయనకు వదినవి... నా పిల్లలకు పెద్దమ్మవు... నావాళ్ళుగా నాకు మిగిలింది యింతే!"

"ఏదో మాట వరసకంటె... అలా బాధపడతావేంటి?"

"ఆయన వచ్చినట్లున్నారు... యిప్పుడే వస్తా!... ఆమె... మా అక్క!"

"నమస్కారమండీ! ఇదే... మొదటిసారిగా మిమ్మల్ని చూడడం!"

"నేనూ అంతేగా!..."

"స్నానం చేసి వస్తాను..."

"మంచిది... నేనూ వెళ్తాను... మళ్ళీ ఎప్పుడైనా వస్తాను..."

"అదేంటి అలా అంటారు ఎవరో దూరపు చుట్టంలా మాట్లాడుతున్నారు... నేను మీకు ఎడమైనా స్వయానా మీ చెల్లెలి యింటికి వచ్చి వెంటనే వెళ్ళిపోతారా? ఈ రాత్రికైనా వుండండి! అంత అర్జెంటనుకుంటే రేప్పొద్దుటే వెళ్దురుగాని! అయినా నాకెందుకులెండి... మీరు వచ్చింది మీ చెల్లెలింటికి కదా! అదంతా మీ యిద్దరిష్టం!... నావంతుగా చెబుతున్నాను... మీరు వుండండి!"

"దానిదేముంది?... కీలుబమ్మ! రిమోట్ కంట్రోల్ మీ చేతిలోనే వుంది... సరే మీ మాట కాదనడమెందుకు? ఇంటికి ఫోను చేసి వస్తాను. దగ్గరలో బూత్ వుందా?"

"ఆ సెంటర్‌లో వుంది... మీ యిద్దరూ వెళ్ళిరండి!"

"........................"

"అక్కా! చూశావుగా మీ మరిదిని! నా సెలక్షన్‌కు నీ

కామెంట్ వినాలని వుంది."

"నీ సెలక్షన్ కరెక్టేనే! ఇతన్ని అప్పుడు మాకు చూపించలేదుగా ఇతనితో డైరెక్ట్‌గా మాట్లాడితే... ఎలా వుండేదో...! అయినా అప్పటి మా ఎంక్వైరీలో ఇతనికి సంబంధించిన వివరాలు చాల రాంగ్‌లో వున్నాయి. అందుకే, అంత పట్టుదలగా మేమంతా నీకు అతనితో పెళ్ళికి వ్యతిరేకించాం. ఫిగర్‌ను చూచే... బహుశా నీవు 'లౌ'లో పడి వుంటావు.

"ఒక్క ఫిగరే కాదక్కా! ఆయన మనసు చాల మంచిది. ఇతర ఏ అలవాటూ లేదు. నేనంటే... మా మనసులు కలిసిన మొదటిలో ఎలా వుండేదో యీనాటికీ ఆయన ప్రేమలో మార్పు రాలేదు. పిల్లలంటే ఎంత యిష్టమో! తనకు ఆడపిల్లంటే ప్రాణం. ఆయన పేరెంట్స్ కూడా నేనంటే చాలా యిష్టంగా వుంటారు... కాకపోతే... పేదరికమే మైనస్ పాయింట్! ఈయనకైనా స్థిరమైన ఉద్యోగం వుండి వుంటె... జరుగుబాటు, పెద్ద కష్టంగా వుండేది కాదు...అయినా ఎంత చెట్టుకు అంతే గాలి!"

"ఉండు! లోపలికెళ్ళి మీ బావగారికి ఫోన్ చేసి వస్తా..."

"అక్కా! నేను నీకు కన్పించినట్లు, నాదగ్గరకొచ్చినట్లు బావగారికి చెప్పకు అమ్మకు, అన్నకు... ఎవరికీ తెలియనీయవద్దు."

.............................

"పిల్లలే వున్నారు... మీ ఆయన కన్పించరే?"

"వదినగారికి మర్యాద యేర్పాట్లు కోసం బయటికెళ్ళారు"

"నీవలా చెప్పి పంపించావా?"

"ప్రత్యేకంగా నేను చెప్పాలా? ఇంటికి వచ్చిన వారికి తగిన మర్యాదలు చేయాలని ఆయనకు మాత్రం తెలియదా?... బావగారికి ఏమని చెప్పావ్?"

"ఈ యింటి అడ్రస్ చెప్పి, వెంటనే యిక్కడకు రమ్మన్నాను... ఏమిటి, అలా చూస్తావ్? ఆయన రాకూడదా?"

"రాకూడదని కాదు... నా పరిస్థితిని చూచి, ఆయన బాధపడతారు... అక్కా! యిప్పటివరకూ ఎవరికీ తెలియకుండా ఎలా వున్నానో... యిహ ముందు కూడా అలాగే వుండాలని వుంది. అనుకోని విధంగా మనం కలుసుకున్నాం... మన రాకపోకలు మనవరకే లిమిట్ చేద్దాం!... ఏమంటావ్?"

"నేను పెద్దదాన్ని... నా మాటే నీవు వినాలి!"

"అయితే... బావగారు యిప్పుడు వస్తారన్నమాట!"

"ఊరికే... అలా అన్నానే! ఆ మాత్రం నాకు తెలియదా?... బాధపడకు. నీ యిష్టానికి వ్యతిరేకంగా నేను ఏమీ చేయను... సరేనా?"

"సరే! నీవే వచ్చిపోతూవుండు. నిన్ను చూచుకుని, నాకు అందరూ వున్నట్లే తృప్తి పడతాను... అమ్మను చూడాలని

వుంది…”

“ఇప్పుడేగదే… ఎవరూ అక్కర్లేదన్నావ్!”

“అమ్మకు బాగాలేదన్నావుగా!”

“అయితే మాత్రం నీకెందుకు? అందర్నీ కాదనుకుని వచ్చేసిన దానికి అమ్మతో నీకేం పని? ఆమెను అమ్మ అని అనుకుంటే… ఆమె మనసును యింత క్షోభ పెట్టేదానివా? నీ సుఖం నీవు చూచుకున్నావుగాని తల్లి హృదయాన్ని అర్థం చేసుకున్నావా?… ఏడవకు. పిల్లలు చూస్తున్నారు…”

“పోనీలే అక్కా! మిమ్మల్నందర్నీ బాధపెట్టి… నేను మాత్రం సుఖపడుతున్నదేముంది? ఎవరికి ఎలా జరగాలో, అలాగే జరుగుతుంది… ఎవరికి ఎవరు?… ఆయన వచ్చారక్కా! పిల్లలు వీధిలోకెళ్ళినట్లున్నారు… నేను వంటపని చూచుకుంటాను. నీవు ఆయనతో మాట్లాడుతూ వుండు. ఇందాక పలకరింపేగా జరిగింది… అక్కా! ఆయన్నేమీ అనవద్దు… ఆయన మంచివారే!…”

“మొగుడి మత్తు బాగా తలకెక్కింది దీనికి!”

“………………”

“ఏం ఉద్యోగం చేస్తున్నావయ్యా?”

“పార్శెల్ ఆఫీసులోనండి!”

“ఏమిస్తారు?”

"అన్నీ కలిపి రెండువేలు చిల్లర!"

"అన్నీ అంటే... లంచాలతో కలిపా?"

"లంచాలు కాదండి! పార్టీలు – పది – ఇరవై 'బక్షీ' యిస్తూ వుంటారు"

"ఇంత తక్కువ జీతంతో ఇంటి అద్దె చెల్లిస్తూ, పెళ్ళాం పిల్లల్ని ఎలా పోషించగలుగు తున్నావ్? వెనక ఆస్తి ఏమైనా వుందా?"

"అలాటిదేమీ లేదండి... ఉద్యోగమూ స్థిరం కాదండి! ఈ రోజులలో దేనినైనా డబ్బుతో కొనవలసిందేగదండీ!... చదువు కొనాలి! ఉద్యోగం కొనాలి! అల్లుణ్ణీ కొనాలి... అలా నన్నెవరూ కొనలేదులెండీ! ఏదో అవస్థపడి, చదువు పూర్తిచేయగలిగానుగాని, ఉద్యోగాన్ని కొనలేకపోయాను... ఆర్థిక స్థోమతలేని వారికి జీవిత నిలకడ సాధ్యంకాదు కదండీ! కాకపోతే, అనుకూలవతి అయిన భార్యను తెచ్చుకోవడం... బుద్ధిమంతులైన పిల్లల్ని కనుకోవడమే యిప్పటివరకూ నేను చేయగలిగిన ఘనకార్యాలు! బ్రతుకుపోరులో నిత్యం వెతుకులాట తప్పడం లేదు."

"అదిసరే! తెలివి, సమర్థత ఉన్నాయి కనుక, ఏదోవిధంగా సంపాదించి, పిల్లల్ని, పెళ్ళాన్ని పోషించుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. మరి వాళ్ళ చదువులు. భవిష్యత్ జీవితం కోసం చేయవలసింది చాలా వుంటుందిగా" భోజనం పెడితే సరిపోతుందా?"

"మీరన్నది వాస్తవమే! నిత్యం నాకు అదే ఆలోచన! ఎటు చూచినా నేను ఒంటరివాణ్ణి! కష్టమంటే ఏమీ తెలియని... కలవారి బిడ్డ మీ చెల్లెల్ని... ప్రేమ పేరుతో, నా పేదరిక ఊబిలోకి దించాను... అందుకు ఎంతో గిల్టీగా ఫీలవుతూ వుంటాను... పిల్లల్ని కనకపోయినా వారి భవిష్యత్ సమస్య వుండేది కాదు... దూరదృష్టి లేకుండా అన్నీ తెలివితక్కువ పనులే చేశాను. దిద్దుకునే వీలుండే తప్పులు చేస్తే... తర్వాతనైనా, వాటికి పరిష్కార మార్గాలుండేవి! ఇవన్నీ యిప్పుడు అనుకునేవి కావు! మరొకరికి చెప్పుకునేవీ కావు! అయినా... అక్కగా మీరు ఆమెకు కావలసినవారు కనుక... యివన్నీ చెప్పి, మిమ్మల్ని విసిగించాను... వేరుగా ఏమీ అనుకోకండి! ఇంటికొచ్చిన వారికి యింటి సమస్యలు చెప్పి, మనసు నొప్పించడం మర్యాద కాదని తెలిసినా... మీరు, మాకు పరాయివారు కాదనే చనువుతో యివన్నీ ఏకరువు పెట్టాను... ప్లీజ్... వాటిని మర్చిపోండి! డోంట్‌మైండ్ యిట్!

"నేను దానికి కావలసినదాన్నేగాని మీకు కాదన్నమాట!"

"మాకు మీరు పరాయివారు కాదన్నాను గదండీ!"

**"సంపదవున్నా... సమస్యలతో మునిగి, ఎందుకు బ్రతుకుతున్నామా!" అని అనుకునేవారూ వుంటారు... పేదరికంతోనైనా... మనసు తృప్తిగా జీవించే వారూ వుంటారు! భార్య భర్త యిద్దరి మనసుల మమేకం – జీవితానికి సుఖాన్ని, తృప్తిని కలిగిస్తుంది!** నా దృష్టిలో మీ దాంపత్యం అలాటిది.."

"మీరేమో యిలా అంటున్నారు! మీ చెల్లెలేమో, తనను

నమ్మించి తడి గుడ్డతో గొంతుకోశా"నంటుంది... ఏది నిజమో మరి!"

"నెనెప్పుడన్నాను అలా?"

"అనలేదులే, అందరూ వినేటట్లు! నీలో నీవే... అలా అనుకుంటున్నావని నా నమ్మకం!"

"నమ్మకానికి కూడా ఎంతో కొంత నిజం వుండాలి! కావాలనే కల్పించి... నా మీద మా అక్కకు కంప్లెయింట్ చేస్తున్నారన్నమాట!... అయినా, రాకరాక వచ్చిన మనిషికి... మన కష్టాల దండకం చదివి, ఆమెను విసిగించడం ఎందుకు?... లే అక్కా! స్నానంచేసి భోంచేద్దువు గాని..."

"పిల్లలకు పెట్టావా?"

"వాళ్ళు తినేసి పడుకున్నారు... నీవు లేచి రా!"

"చూశారా పక్షపాతం! మిమ్మల్ని పిలిచి...తనతో యిన్నాళ్ళ కాపురం చేసిన నన్ను... మర్చిపోయింది!"

"మర్చిపోయేటట్లు చేశారా నన్ను?... నీవు రా అక్కా!"

"ముందు మీ ఆయనకు పెట్టవే! ఈ లోపు నేను స్నానం చేసి వస్తాను. ఒక వేళ, మీ యిద్దరూ కలిసి తినే అలవాటుంటే... పదినిమిషాలు ఆగండి! వెంటనే వస్తాను"

"అలాగే ముందు ఆయనకు పెట్టేస్తా! తరువాత మనిద్దరమూ తిందాం... ఒకే పళ్ళెంలో ముద్దలు పంచుకుని

ఎన్నాళ్ళయిందో...!"

"....................."

"మీరు లోపల పడుకోండి! అక్కా నేను బయట కూర్చుని మాట్లాడుకుంటాం..."

"నేనూ పడుకుంటానే! మనసు బాగోలేదు"

"......................."

– – –

"పిల్లలు స్కూలుకెళ్ళారా?"

"ఏడింటికే వెళ్ళారు... ఆఫీసుకు ఆయనా రెడీ అవుతున్నారు. చాలా సేపు పడుకున్నావ్? ఒంట్లో బాగా లేదా? రాత్రి, మనసు బాగోలేదన్నావుగా... అందుకే ప్రొద్దుట నిన్ను లేపలేదు. బ్రష్ చేసుకుని స్నానం చేసిరా అక్కా! చీర మార్చుకోవడానికి ప్రస్తుతానికి నా చీర కట్టుకో! వెళ్ళేటప్పుడు నీ చీరతోనే వెళ్దువుగానీ.

"నేను వచ్చేవరకు, మీ ఆయన్ని వుండమను. మాటాడాల్సిన పనుంది"

..........................

"ఏమయ్యా అలా చూస్తావ్ ? మీ ఆవిడ చీరకట్టుకున్నాననా?"

“మీ యిద్దరికీ పెద్దతేడా కన్పించడం లేదు. నాకు ఆఫీసు టైం అవుతోంది. నాతో మాట్లాడాలన్నారట! ఈ రోజు వుండండి. సాయంకాలం కాస్త ఎర్లీగా వస్తాను. తీరికగా మాట్లాడుకోవచ్చు.”

“అలా కాదులే! భోజనం చేసి వెళ్ళి పోతాను. మావారికి ఫోన్ చేసి, అలా చెప్పాను. మళ్ళీ ఎప్పుడైనా వస్తాను... చంటీ! యిలా రా”

“ఆమె పేరు అదాండీ?”

“మా యింట్లో వాళ్ళందరం చిన్నతనం నుండీ దాన్ని అలా ముద్దుగా పిలుచుకుంటాం. అందరికంటే చిన్నది కదా! నీవేమని పిలుస్తావ్?”

“తన పేరు వసుంధరటగదా! నేను ‘సుందరీ’ అని పిలిస్తే సీరియస్‌గా చూస్తుంది. అందమైన ఆడవాళ్ళకు సీరియస్ ఫేస్, ఎగ్స్ట్రా గ్లామరండీ! కొంత అందుకే అలా పిలుస్తాను. ఆ వెంటనే వసూ డియర్ అంటా! అంతే... గులాబి పువ్వులా నవ్వేస్తుంది ముఖం...”

“ఏంటక్కా పిలిచావ్?”

“మీ అక్క, యిప్పటికిప్పుడే వెళ్ళిపోతుందట”

“అదేంటక్కా! ఈ రాత్రికి వుండు! అంతకీ యిక్కడ వుండలేకపోతే ప్రొద్దుటే వెళ్ళిపోదువుగానీ”

“నేనెందుకే బాబు... మీ యిద్దరి మధ్య!”

"ఆ సీనేంలేదులెండి! పతి వ్రతం కంటే దేవుడి వ్రతం ఎక్కువైంది, మీ చెల్లికి! నెలకి సగం పైగా నాగాలే!"

"మీకసలు సిగ్గేలేదు... నిత్యం పరగడుపే"

"సిగ్గెందుకే బాబు మొగుడూ పెళ్ళాల మధ్య"

"అలా చెప్పండి కాస్త! సన్యాసులే నయం సెక్స్ విన్యాసాలు చేస్తూ వుంటారు సీక్రెట్‌గా"

"సమస్యలు లేని సన్యాసులకు సంసార బాధ్యతలు గల సంసారులకు లింకు పెడతారేంటి?"

"ఎవరికైనా మనసు ముఖ్యం. సన్యాసమేంటి? సంసారమేంటి?"

"అదిసరే! మీ యిద్దరి సంగతి ఎలా వున్నా... పిల్లల భవిష్యత్ గురించి రాత్రి చాలా సేపు ఆలోచన చేశాను. ఒక నిర్ణయానికొచ్చాను. మీరు ఓ.కె. అంటే అలాగే చేస్తాను. కాదంటే నేను చేయగలిగిందేముంటుంది? ఇద్దరూ కష్టపడి కనుకున్నారు గదా పిల్లల్ని! మీ పిల్లలు – మీ యిష్టం, అయినా వాళ్ళ భవిష్యత్ సంబంధించి మీకున్న బాధ్యతలో నేనూ భాగం పంచుకోవాలనుకున్నా అందుకే...

"చెప్పక్కా, నీ మనసులో మాట!"

"అన్నిటికీ ముఖ్యమైంది డబ్బే గదా! ప్రస్తుతం మీరున్న ఆర్థిక పరిస్థితిలో వారి భవిష్యత్ భారంగా వుంటుంది మీకు! అందుకే చదువుతో సహా వాళ్ళకు సంబంధించిన పూర్తి బాధ్యతను

నేను తీసుకుంటాను. వాళ్ళను నా దగ్గర వుంచినా సరే... అలా వుంచితేనే మంచింది... మీ దగ్గరే వుంచుకున్నా సరే! ఇలా అన్నానని మీరు మరోలా ఫీలవ్వద్దు! నా చెల్లి పిల్లలైనా... నా పిల్లలైనా నాకు ఒక్కటే అనే మనసుతోనే యిలా ఆలోచన చేశాను. మీకు యిష్టం లేకపోతే నేను మాత్రం ఏం చెయ్యగలను. ఇద్దరూ బాగా ఆలోచించుకుని పిల్లల భవిష్యత్ అనే దానిపై మీ నిర్ణయం వుండాలి! తొందరేమీ లేదు. నేను మళ్ళీ వస్తాను. అప్పటి మీ నిర్ణయం చెప్పండి"

"అలా ఎందుకండీ! కన్నది మేము వాళ్ళ బరువు బాధ్యతలు మీ మీద వేయడం భావ్యం కాదండీ!"

"అయినా బావగార్ని అడగాలిగదా? అక్కా"

"అవన్నీ నేను చూసుకుంటాను ఆయనకు ఇష్టంలేని పని నేను మాత్రం ఎలా చేస్తాను!"

"మీ వరకు మీరు ఆలోచన చేసుకుని, ఏదో ఒక నిర్ణయాన్ని తీసుకోండి! మళ్ళీ చెబుతున్నాను... పిల్లల భవిష్యత్ అన్నిటి కంటే ముఖ్యం! మనం ఏ సంబంధమూ లేని ఎవరమో కాదు! అందుకే మీ విషయంలో నా బాధ్యతగా యిలా చేయాలనుకున్నాను. అనవసర అభిమానాన్ని ఫీలవ్వద్దు! గిల్టీగా అనుకోవద్దు! హృదయ పూర్వకంగానే నేను యీ ప్రతిపాదన చేశాను గమనించండి!"

"సరేనండి! నాకు ఆఫీసుకు టైం అవుతోంది. మీరు చెప్పిన దాన్ని మేమిద్దరమూ ఆలోచన చేసి ఒక నిర్ణయానికొస్తాం... వస్తానండి"

.....................................

"ఏంటక్కా యిది! నాకేదో అయోమయంగా వుంది. ఒక వేళ మా పరిస్థితులను బట్టి నీవు చెప్పిన దానికి మేం ఒప్పుకున్నా దీనికి బావగారు ఎలా అంగీకరిస్తారు?... పైగా మీ పిల్లల బాధ్యతలు మీకుండగా మా పిల్లల భారం కూడా మీరు తీసుకుంటే మన వాళ్ళుగాని, అలాగే బావగారి తరఫునవారు గానీ, మమ్మల్ని ఎన్ని విధాలుగా మాట్లాడతారో కదా! అది కూడా ఆలోచన చేయాలి కదా! ఒకవేళ నా పిల్లలు నీ యింట్లో వుండవలసి వస్తే మీ పిల్లలు మా పిల్లల మధ్య సఖ్యత ఎలా వుంటుందో కదా! అక్కా... ఎందుకు బాధపడుతున్నావ్? నేనేదైనా తప్పుగా మాట్లాడానా?"

"లేదు చెల్లీ! నీ మనసు నాకు తెలుసు. మనసు దాచుకోవడం నీకు చేతగాదు. నా అసలు పరిస్థితి నీకు తెలియదు. నీ భర్తకు అన్ని విషయాలు వివరంగా ఎలా చెప్పగలను? ఎంతైనా అతను నాకు కొంత దూరమే గదా? చూడు నీవు అడిగినంత వివరంగా లోతుగా అతను మాట్లాడలేకపోయాడు చెల్లీ! నాకంటూ పిల్లలెవరూ లేరు"

"అదేంటక్కా ! అలా అంటున్నావ్? నీకుపెళ్ళయిన ఏడాదిలోనే బాబు పుట్టాడు గదా! అమ్మే పురుడు పోసింది కదా?"

"నిజమే! ఆ పుట్టిన బాబు నాల్గవ యేట జబ్బుపడి చనిపోయాడు. ఆ తరువాత ఏడాది మళ్ళీ గర్భం వచ్చింది. అదీ అబార్షన్ అయింది. తరువాత అసలు మళ్ళీ గర్భం రాలేదు.

గర్భసంచిలో పుండుందని దానిని తొలగించేశారు. అమ్మ అని పిలుపించుకునే ఆశ, అంతటితో పూర్తయిపోయింది.”

“బాధపడకు సంపద ఉన్నా సంతానం లేని స్థితి, ముఖ్యంగా ఆడవాళ్ళను ఎంతో బాధపెడుతుంది. పోనీ, బావగారి తరపున ఎవరినైనా తెచ్చి పెంచుకోవచ్చు కదా!”

“అది చాలా చికాకులు, గొడవలకు కారణం అవుతుంది. ఆయన తరపున వాళ్ళు చాలా మంది వున్నారు. అయినా, ఆయనకూ అది యిష్టం లేదు. అది అలా వుంటే... ఆడవాళ్ళ విషయంలో మీ బావగారి తప్పుడు బుద్ధి నీకూ తెలిసిందే కదా!... ఆ రోజున సమయానికి నేను రావడంతో అదృష్టవశాత్తు ఆ కీచకుడి చేతిలోనుంచి నీవు తప్పించుకున్నావ్! అదే అలా జరిగివుంటే... నీ సున్నిత మనసుకు తగిలిన గాయంతో జీవితమంతా నీవు బాధపడవలసి వచ్చేది”

“అందులో బావగారిదే పూర్తి తప్పుకాకపోవచ్చు. తెలిసీ తెలియని వయస్సులో అక్క మొగుడు బావగారనే చనువుతో నేను ‘అతి’గా ప్రవర్తించి వుంటాను. అది, ఆయనకు మరో విధంగా అర్థమై వుంటుంది... మగవాడి ద్వారా ఆడవారికి జరిగే యిబ్బందులు గానీ, అత్యాచారం గాని, దానిలో ఏదో రూపంలో ఎంతో కొంత ఆడదానివంతు కూడా వుంటుంది. నా ప్రవర్తన హద్దులో వుంటే బావగారికి అలాంటి తొందర కలిగేది కాదు.”

“అదివరకే ఆయన ప్రవర్తన, అంత ఘోరంగా వుండేది. నాకు అబార్షన్ కావడం, గర్భసంచిని తొలగించడంతో కొంత

కాలం నేను సెక్స్‌కు దూరంగా వుండవలసి వచ్చింది. అది, ఆయనకు మంచి 'ఛాన్స్‌గ' దొరకడంతో విచ్చలవిడిగా ప్రవర్తించి, చెడు తిరుగుళ్ళతో మొండి రోగాన్ని తెచ్చుకున్నాడు. దానికి వైద్యం జరిగినా... కారణం ఏమో తెలియదు గానీ.... క్రమంగా అతనిలో మగతనం పూర్తిగా తగ్గిపోయింది. దాదాపు లేనట్లే! డయాబిటిస్ దానికి తోడైంది. ఇప్పుడు ఆయన, యింటిలో ఒక మనిషి అంతే! ఉద్యోగానికి సరిగా పోలేకపోతున్నాడు. దానితో నాకూ సెక్స్ భావం మరుపుకు వచ్చేసింది. ఇప్పుడు చెప్పు డబ్బువుండీ నేను పడుతున్న బాధేమిటో అది లేక నీవు పడుతున్న బాధేమిటో మనిద్దరిలో ఎవరం తృప్తిగా బ్రతుకుతున్నామో అర్థం చేసుకో! దానికి తోడు సంతానం లేక, భర్త సుఖం లేక కేవలం డబ్బుతో జీవిత తృప్తిని పొందడం ఎలా సాధ్యమో గ్రహించు. చంటమ్మా! జాగ్రత్త యివన్నీ మనిద్దరిలోనే వుండాలి సుమా'!

"అదేంటక్కా అలా అంటావ్? జీవిత సమాచారం ఆత్మీయుల మధ్య వుండాలి సుమా!"

"కనీసం వీళ్ళు నా పిల్లలు' అని అనుకునే తృప్తి కూడా లేదు నా జీవితానికి. అందుకే మీ పిల్లలు నా పిల్లలు కాకపోయినా, కనీస తృప్తి కోసమైనా వాళ్ళ బాధ్యతలను నేను తీసుకుంటాను. మరోమాట అత్యాశకు పోతున్నాని అనుకోకు. మీ యిద్దరికీ యిష్టమైతే మగపిల్లలు యిద్దరిలో ఒకడిని మాత్రం మాకు దత్తత యివ్వండి. మిగతా వాళ్ళ బాధ్యతలూ నావే సుమా! వాళ్ళని మీ దగ్గర వుంచుకున్నా, మా యింటికి పంపినా నాకు సమ్మతమే! దత్తత విషయం బాగా ఆలోచించుకోండి"

"ఈ విషయాలన్నీ బావగారితో మాట్లాడి ఆయన సమ్మతిని తీసుకోవాలి గదా?"

"అవన్నీ నేను చూచుకుంటాను... ముందు మీరొక నిర్ణయానికి రండి"

"సరే అక్కా! రాత్రికి, ఆయనతో మాట్లాడతాను. అయినా, నీవు కూడా మరోసారి ఆలోచన చేయడం మంచిది. బంధుత్వాలలో లేనిపోని కలతలు రాకూడదు."

"అన్నిటికంటే ముఖ్యం మీ పిల్లల భవిష్యత్! వాళ్ళను మంచి స్థితిలో వుంచడం తల్లిదండ్రులుగా మీ బాధ్యత! బాగా ఆలోచన చేయండి. నేను మళ్ళీ వస్తాను. అప్పటికి నాకు మీరు మంచి మాట చెప్పాలి. వెళ్తాను"

"అదేమిటి? అప్పుడే వెళ్తావా? కాసేపు వుండక్కా! భోజనం చేసి, మధ్యాహ్నం వెళుదువుగానీ"

"అలా కాదే! ప్రొద్దున వస్తానని ఆయనకు చెప్పానుగదా! వెళ్తాను... ఇంత కాలం తరువాత కలసిన నిన్ను వదిలి వెళ్ళాలంటే... మనసుకు బాధగా వుంది. అయినా ఎవరి సంసారం వారిదేగదా!"

"అక్కా! మళ్ళీ వస్తావు కదూ!"

"అదేవిటే అలా అంటావు? నా అవసరమూ వుంది కదా!"

"అలా అనకు అక్కా! పుట్టింటికి దూరమైన నన్ను నీవైనా..."

"ఛ ఊరుకోవే! ఏమిటే ఆ ఏడుపు ఎందుకు అంత బాధపడతావ్? నీ పిల్లలకు నేనున్నాను. నీకు నీ భర్త వున్నాడు. ఇంతకంటే యింకా ఎవరు కావాలి నీకు? పోనీ, ఒక పని చెద్దాం! పిల్లలు అతను సాయంకాలానికిగాని రారు గదా! నీవు నాతో వచ్చేయ్... యీ మాట నీ భర్తకు చెప్పివుంటే బావుండేది. అయినా, యీ సారి వచ్చినప్పుడు పిల్లల్ని తీసుకుని, మీ యిద్దరూ వచ్చి నాలుగు రోజులుండి వద్దురుగానీ నిన్ను ఒక్కర్తనే రమ్మనటం పద్ధతి కాదు. చెయ్యి యిలా చాపు! ప్రస్తుతానికి యిది వుంచు"

"ఏంటక్కా యిది? వద్దు నేను తీసుకోను"

"వద్దా! తీసుకోవా? చిన్నప్పుడు తిననంటే కొట్టి తినిపించాను. గుర్తుందా? ఇప్పటికీ నా మనస్సు అదే! నేను పెద్దదాన్ని! నీకు సంబంధించి నా యిష్టమే చెల్లాలి! మేరేజ్ నీ పర్సనల్ కనుక నేను అలా చేయలేకపోయాను. ఇదే చెప్పడం నేనిచ్చినదాన్ని వద్దనకు నీవు పిల్లల తల్లివైనా నా దృష్టిలో నా ముద్దుల చెల్లివే... చంటమ్మవే...!"

"అక్కా! అమ్మ గుర్తుకొస్తున్నది. నన్ను క్షమించమని ఆమెకు చెప్పక్కా...!

"అందరమూ కలుసుకునే రోజు దగ్గరలోనే వుంది బాధపడకు... అమ్మ ఒళ్ళో తలపెట్టుకుని నీ మనసులో బాధ తీరేవరకు ఏడుద్దువు గానీ, సరేనా!"

"అక్కా! దారి నీకు బాగా తెలియదుగా అక్కా"

"ఏమిటే"

"ఈ డబ్బులు నేను యిచ్చినట్లుగా తీసుకుని, ఆటోలో వెళ్ళొక్కా!"

"నాకు ఛార్జీలిస్తావా?"

"అది కాదక్కా! యివి నీవిచ్చినవే కదా! నా తృప్తి కోసం అలా అన్నాను"

"సరే! అలా అయితే ఈ పదీ నీవు తీసుకుని నీ చేతిలో ఐదునోటు యిలా యివ్వు... సరేనా? పిచ్చిపిల్ల! బాధపడకు"

"త్వరలో వస్తానుగ!"

"అక్కా!"

"ఏమిటే?"

"అక్కా! నన్ను ముద్దుపెట్టుకోవూ..."

"ఇలారా!... బుగ్గలు మీ ఆయన స్వంతం గదా! అందుకే నొసటపై... యిలా... సరేనా? బయలుదేరదాం... రోడ్డు వరకు వస్తానన్నావుగా... ఇంటికి తాళం వేసిరా..."

– – –

"ఎందుకు అలా దిగులుగా వుంటున్నావ్"

"నాకేం దిగులు? నేను బాగానే వున్నాను"

"కనపడుతూనే వుందిగా నీ అవతారం"

“నిత్యం, ఒకే తీరుగా వుండలేం గదండీ... కాలాన్ని బట్టి, అవతారాలు మారుతూనే వుంటాయి. అయినా, మీరు అలా ఎందుకనుకుంటున్నారో నాకు తెలియడం లేదు. నా వరకు నేను బాగానే వున్నాను.”

“అలా, నీవనుకోవచ్చు! స్టూడెంట్ దశనుండి పేరెంట్ దశ వరకు నేను, నిన్ను చూస్తూనే వున్నాను. ఇది వరకు ఎన్నడూ నీవు యిలా లేవు. పేదరికం, మనకి మొదటి నుండీ అలవాటే కనుక, ఇన్నాళ్ళూ ఏ రోజూ నీలో యిలా దిగులు చిరాకు చూడలేదు. ఈ మధ్యనుండే నీలో యీ మార్పు వచ్చింది”

“చెప్పానుగదండీ... కాలాన్ని బట్టి పరిస్థితులకు తగినట్లు తెలియకుండానే మనిషిలో మార్పులస్తాయి. అందుకు కొన్నింటికి మాత్రమే కారణాలు తెలుస్తాయి. నా పరిస్థితి ప్రస్తుతం అలాగే వుంది. ఆరోగ్యంలో కూడా ఏదో బలహీనత యేర్పడింది. అప్పుడప్పుడు మనసు డిప్రెషన్‌లోకి పోతున్నది. అయినా అన్ని కాలాలూ, అందరి మనసులు ఒక తీరుగా వుంటాయని, ఎలా చెప్పగలం? ఎదురైన పరిస్థితులతో రాజీపడుతూ సమయానుకూలంగా ప్రవర్తిస్తూ బ్రతుకును హాయిగా గడప గలగడం కొందరికి సాధ్యమైనా, నాకు అది కుదరడం లేదు. ఏం చెయ్యను? అది నా బలహీనత?

“నీ యిష్టంతోనే గదా పిల్లల్ని మీ వాళ్ళ దగ్గర వుంచింది”

“కాదని ఎవరన్నారు?”

“వాళ్ళని గురించి నీవు దిగులు పడవలసిన అవసరం

నాకు కన్పించడం లేదు. చూడాలనుకున్నప్పుడు మనం వెళ్తునే వున్నాం. వాళ్ళు వస్తూనే వున్నారు గదా! దూరం కూడా కాదు. మొదట్లో కాస్త దిగులనిపించినా రెండేళ్లు గడిచినా నీవు యింకా ఆ ఎటాచ్‌మెంట్‌తోనే వుంటే ఎలా? ఎంతో మంది తమ పిల్లల్ని దూరంగా హాస్టళ్ళలో వుంచి, చదివించుకోవడం లేదూ? ఎప్పుడోగాని, వాళ్ళను చూచుకునే అవకాశం వుండదు వాళ్ళ వారికి! నీ స్వంత అక్క దగ్గరుంచిన పిల్లల్ని గురించే నీవు యిలా దిగులు పడిపోతే రేపు భవిష్యత్‌లో పెరిగి పెద్దవాళ్ళయిన తరువాత, మనకి దూరంగా ఎక్కడెక్కడో సెటిల్ కావలసి వుంటుందిగా వాళ్ళు! ఇప్పుడు నీ మనసు యిలా వుంటే అప్పటి పరిస్థితి మరింత బాధాకరంగా వుంటుంది కదా నీకు. నా తరవాతే గదా నీకు పిల్లలు! నేనుండగా నీకు వేరే దిగులు, బాధ ఎందుకు? ఏమిటి అలా చూస్తున్నావ్? కళ్ళళ్ళల్లోంచి నీళ్ళు వచ్చాయి. కారణం నాకు తెలియకూడదా?"

"మీకు తెలియని కారణం వేరుగా నాకేముంటుందండీ? నేను బాధ పడుతున్నట్లు కూడా నాకు తెలియడం లేదు. మీకు నేను ఏముందని చెప్పను?"

"పిల్లల్ని గురించే అయితే... మీ అక్కను ఒప్పించి వాళ్ళను తీసుకొస్తాను. పిల్లల్ని కనడం వరకేగాని, పేరెంట్స్ వాళ్ళ భవిష్యత్‌ను నిర్ణయించలేరు. ఎవరికి ఎలా జరగాలో అలాగే జరుగుతుంది. వాళ్ళని మనతోపాటే వుంచుకుందాం... పదే పదే ఆమె అడిగింది కనుక అక్కడకు పంపించాంగాని, పోషించుకోలేక కాదుగదా! కాకపోతే రెండోవాడిని వాళ్ళకు దత్తత యిచ్చేశాం

కనుక వాడిదే సమస్య అవుతుంది. దత్తత రిజిష్టరైంది కనుక తల్లిదండ్రులుగా వాడిపై మనకు హక్కులేదు. ఆమేరకు నీవు నీ మనసు సరిపెట్టుకోవాలి. ఆ యిద్దర్నీ మనం ఎప్పుడైనా తెచ్చుకోగలం ఆలోచించి, నీవు ఒక నిర్ణయానికి రా! నాకు ఆఫీసు టైం అవుతోంది. బాక్స్ సర్ధిపెట్టు."

"…………………"

"ఏమిటి అలాగే కూర్చున్నావ్"

"పిల్లల్ని ఒకసారి చూడాలని వుందండీ!"

"నెల కూడా కాలేదు మనం వెళ్ళి వచ్చి యింతలోనే అంత బెంగయితే ఎలా? జీతం తీసుకున్నాక వెళ్దాంలే! అయినా వాళు ళ్ఉండేది స్వయానా మీ అక్క బావ యింట్లోనే కదా! తరచుగా మనం వెళ్తూ వుంటే వాళ్ళ ఏమనకుంటారు?"

"………………"

"నీ మనసులోని బాధేమిటో నాకు చెప్పడం లేదు."

"పుట్టింటికి నాకు ఎలాగూ దారి లేదు… అత్తవారింటికైనా పోయి కొద్ది రోజులు అక్కడ వుంటానండి"

"నేను యిక్కడ వుంటే నీవు అక్కడ వుండడం ఎందుకు?"

"మీ యింటికి వద్దన్నారుగా… పోనీ, మా యింటికి…"

"వెళ్ళగలిగితే వెళ్ళు! నాకు అభ్యంతరం లేదు. అయినా వాళ్ళంతా తలో మాటంటే బాధపడతావ్!"

"ప్లీజ్ నన్నర్థం చేసుకోండి. ప్రస్తుతం నా మనసు చాలా ఆందోళనగా వుంది. కారణం చెప్పలేను స్థలమార్పిడి జరిగితే...

"నేను చెప్పవలసినది చెప్పాను. తరువాత నీ యిష్టం"

"మా అమ్మ, నన్ను చేర్చుకుంటుందనే నా నమ్మకం ఆ ఆశతోనే వెళ్తాను. అలా వీలుకాకపోతే ప్రస్తుతం ఏదీ నిర్ణయించుకోలేను"

"నీ యిష్టం"

_ _ _

"గుడ్‌మార్నింగ్ వదినగారూ"

"చాల్లే మూసుకో! సిగ్గులేదూ?"

"ఎందుకు సిగ్గూ... ఏమి రాంగూ? వదినగారు అని అన్నానేగాని మరదలు పిల్లా అని పిలవలేదే"

"పిలవకుండానే నీ మన్మధ చూపులతో మత్తు మాటలతో తెచ్చావుగా వదిన గారిని మరదలు లైన్‌లోకి"

"రతీదేవి రైట్ కొట్టకుండా మన్మధుడు లైన్‌వేయగలడా? మీకేమీ తెలియనట్లు రాంగంతా నాదేనంటున్నారే! అనండి మీ యిష్టం ఎన్నైనా అనండి... పేద మరిదిని కదా!"

''ఆ మాటే వద్దన్నాను. తడవతడవకూ అలా అంటావెందుకు?"

“ఉన్న మాటేగా వదినగారూ...!’

“ఎప్పుడో సంగతది నేను నీకు ఏమి లోటు చేస్తున్నాను. అలా పేద అరుపులు అరుస్తావెందుకు? ఎన్ని రోజులైంది యిక్కడికి రాక? ఇన్ని సంవత్సరాలు కాపురం చేసినా... అది ముగ్గురు పిల్లల తల్లైనా నీకు పెళ్ళాం మీద మోజు తగ్గలేదు. అవును మరి! ప్రేమ జంట కదా!”

“మీరు, చాలా అన్యాయంగా మాట్లాడుతున్నారు వదినగారూ”

“అదిగో ఆమాటే వద్దన్నాను. వదినట వదినె! మన మనసులు కలిసిన ప్రారంభంలో ఏమన్నావో గుర్తు చేసుకో! నన్ను నీ పిల్లలకు తల్లినన్నావ్! మరి నేను నీకు... ఆ మాట కూడా నాతోనే చెప్పిస్తావా?”

“నేను అబద్దం ఆడను... భర్తతో సమానమన్నాను. ఇప్పుడు మాత్రం కాదన్నానా? మాట తప్పే మనిషిని కాదు నేను. మళ్ళీ మళ్ళీ చెబుతున్నాను. ఎప్పటికీ మన బంధం శాశ్వతం సరేనా!”

“మాట అనడం కాదు మగడా! మనసులో అది స్థిరంగా నాటుకు పోవాలి”

“ఆ అనుమానం, మీకు అక్కర్లేదు. నా పిల్లలకు తల్లిలాగా, నీవు ఎంతో భారం, బాధ్యతను మోస్తున్నప్పుడు యిచ్చిన మాటను తప్పుతానా నేను? ఆ మాత్రం కృతజ్ఞతాభావం నాకు లేదనుకున్నావా? ఇదే చెప్పడం పొరపాటున కూడా నా

విషయంలో ఎలాంటి డౌటు నీ మనసులోకి రాకూడదు. ఇందాక నన్ను పిలిచిన పిలుపు అలాగే కొనసాగుతూ వుండాలి ఎప్పటికీ... అయితే మీ చెల్లి విషయమే సమస్యగా మారుతున్నది.'

"ఏమైంది దానికి?"

"ఏమైందో నాకు అర్థం కావటం లేదు. ఎన్ని విధాలుగా అడిగినా తన మనసులో మాట తెలియనివ్వడం లేదు. నా అనుమానం మన విషయాన్ని పసిగట్టిందే మోనని!"

"దాని బంద! దానికి ఆ మాత్రం తెలివెక్కడిది? తనకు ఆరోగ్యం సరిగా లేనట్లు, నాతో చాలా సార్లు చెప్పింది. డాక్టరు దగ్గరకెళదామంటే వద్దంది. అది చెప్పడం లేదుగాని దానికి ఒంట్లో ఏదో రోగం వుంది. అంతేగానీ మన మీద దానికి అనుమానం లేదు. నీ సంగతేమోగానీ, నేనంటే యిప్పటికీ మంచి నమ్మకం దానికి"

"నాతో మాట్లాడటం బాగా తగ్గించేసింది. ఏదన్నా అడిగితే పొడి పొడిగా సమాధనం చెబుతోంది. ఈ మధ్య మా ఇంటికి వెళ్తానని అడిగింది"

"అక్కడికెందుకు?"

"ఆ మాటే నేనన్నాను. ఇద్దరం చెరో చోటు ఎందుకన్నాను. అయినా, మా వాళ్ళు మాత్రం ఎలా ఒప్పుకుంటారు? బాగా డల్‌గా వుంటున్నది. ఇక్కడికి తీసుకొస్తాను. నీవు ఒకసారి మాట్లాడితే ఆమెకు కొంత రిలీఫ్‌గా వుంటుందేమో! ఆలోచన

చెయ్యి"

"ఎంతసేపు... పెళ్ళాం సోది చెప్పడానికే వచ్చినట్లున్నావు? ఈ మాత్రానికి యిక్కడికి యింత దూరం రావడం ఎందుకు? పోయి దానికెదురుగా కూర్చుని ఓదార్చి బ్రతిమాలుకో! ఎంతైనా ప్రేమించి పెళ్ళాడిన పెళ్ళాం కదా! దానితో నన్నెలా పోల్చుకుంటాలే! నా అవసరం కోసం, నేను నిన్ను పిలిపించుకున్నట్లుంది గాని నిజంగా నా మీద నీకు మనసు లేదు. ఏదైనా యిద్దరి యిష్టంతో జరగాలి గాని, ఒకరితోనే అయ్యేది మనసులేని పనే!"

**"రెండు మనసులతో మనిషి ఏ పనీ పూర్తిగా చేయలేడు.** మన సంబంధం విషయంలో నేను నీ పట్ల పూర్తి మనసుతోనే వున్నాను. ఈ మధ్య దాదాపు సంవత్సరం నుండి ఇంట్లో మేం ఇద్దరు మనుషులుగానే వుంటున్నాం. రొటీన్‌గా ఎవరిపని వాళ్ళు చేసుకుపోతున్నాం... ఏ మాటకు ఆ మాటే చెప్పుకోవలసి వస్తే...

ఆమెలో ఆడతనం నిండుకుండలా తొణికిసలాడుతూ వుంటుంది. మాటలో... చూపులో... మగవాణ్ణి కట్టిపడేసే కొంటెతనం, రసికత, సరసం... సభ్యత-సంస్కారం సమపాళ్లలో వున్నాయి... ప్రస్తుతం... అవేమీ కన్పించడంలేదు. ఆమె స్థితిని బట్టి నాకు అర్థమైనంతవరకు... మన సంబంధం తెలిసే... అలా డిప్రెషన్‌తో బాధపడుతోందని నేననుకుంటున్నాను.

"అయితే ఏంటంట?... నిత్యం పెళ్ళాన్ని

పొగుడుకునేవాడివి. దాని భజన చేసుకుంటూ, బ్రతకాలిగాని... నా జోలికెందుకొచ్చావ్?... నామనుసుతో ఆడుకోవాలనా?"

"...క్రమంగా ఆమె నాకు దూరమైపోతోంది... మీరు నన్ను గెంటేస్తున్నారు దురదృష్టవంతుణ్ణి! ఉభయభ్రష్టుణ్ణి! ఇప్పుడేవిటి... ప్రారంభంనుండీ, నా బ్రతుకు యింతే!... నేను మనసారా కోరుకున్న దేనినీ పూర్తిగా దక్కడం లేదు. మోసంచేయడం నామనసుకు తెలియదు. అవసరం గడుపుకోవడం వరకే నాకు అలవాటు లేదు. అయినా, మీరు కూడా నన్ను అపార్థం చేసుకుంటున్నారు. మీ మనిషిగా మీరు నన్ను నమ్మలేక పోయినా మా పిల్లలనైనా మీ పిల్లలుగా భావించి, మీరిచ్చిన మాటను నెరవేర్చుకోండి! అంతేచాలు! ఎలాగూ ఆమె మనసు బాగా దెబ్బతింది. ఇహ మీద ఆమె నన్ను భర్తగా ప్రేమించలేదు. మీరు దగ్గరకు రానీయరు. చూడండి. చివరకు నా గతి, ఎలా దిగజారిపోతోందో!"

"ఇప్పుడు నిన్ను నేను ఏమన్నానని దివాళాకోరు మాటలు! అయిందేదో అయిపోయింది. పోయి నీ ముద్దుల పెళ్ళాంతోనే కాపురం చేసుకో! నీ పిల్లల కోసం నేను యిచ్చిన మాటను... ఏ పరిస్థితులలోనైనా నిజాయితీగా నెరవేరుస్తాను"

"ఇంకెక్కడి కాపురంలెండి! అక్కాచెల్లెలు కలసి నన్ను ఎవరూ లేనివానిగా చేశారుగా చాలు!"

"ఇటు చూడు ఎవరూ లేరా నీకు? మగసిరి గల మగవాడిగా, నీవు అనవలసిన మాటేనా ఇది? జోడుగుర్రాల

మీద స్వారీ చేయవలసిన మొనగాడివి. యిలా పల్స్ డ్రాపైనట్లు మాట్లాడతావేంటి?”

“డ్రాప్ కాక ఏముందండి, నా బ్రతుకు? ఇంట్లో పస్తు... మస్తని యిక్కడికొస్తే సుస్తీ పడేటట్లు ముందూ వెనకా వాయించారు?”

“ఇంట్లో పస్తంటే... ఇక్కడ మస్తంటే... అర్థమయ్యేటట్లు చెప్పు”

“అవునండీ! చెప్పానుగా! నీ చెల్లెలూ నేను మొగుడూ పెళ్ళాంగా వుండడం లేదు. ఇలా యింట్లో పస్తుకాక మరేంటి? ఎంత ఆశతో ఆకలితో వచ్చానో యిక్కడికి!”

“ఆకలితో వచ్చినవాడు ఆలస్యం చేయడు. ఆరగింపుకే ఆరాటపడతాడు... నీ లాగా పెళ్ళాం వూసులు చెప్పడు...”

“..... ......... ........”

“............... ........”

– – –

“అక్కా! ఉత్తరం ద్వారా నీతో మాట్లాడవలసి వచ్చినందుకు నా మనసు చాలా బాధపడుతున్నది. వేరే మార్గం లేక యిలా వ్రాస్తున్నాను. నీకు తెలుసు చిన్నతనం నుండీ మన యింట్లో నా భోగం, నా పట్ల మీ అందరి గారాభం! అమ్మ అంటూ వుండేది ‘ఇలా అయితే రేపు మొగుడు దగ్గర ఎలాగే’ అని నిజమే!

ప్రతిదానికి నా మొండితనం చివరికి ప్రేమ పేరుతో నాకు శాపమైంది. దేనికీ లోటు లేని జీవితానికి అలవాటుపడిన నాకు సంసార ప్రారంభ రోజులలో పేదరికం, అదేదో కొత్త అనుభవంగా వుండేది. అది నన్ను ఎక్కువగా బాధించేది కాదు. పైగా ప్రేమించిన వానితో జీవితం... థ్రిల్‌గా వుండేది! తృప్తిగా గడిచిపోయేది. అయితే... సంతానం కలిగి బాధ్యతలు పెరగడంతో పేదరికం ఎంత బాధాకరమో... అనుభవంలోకి వచ్చింది. ఆలోచన లేని అంచనాలు... ఊహలు, వాస్తవంలో నా తప్పును నాకు తెలియచేశాయి. అయినా చేయగలిగింది ఏమీలేదు. అందుకే యిన్నాళ్ళు అన్నింటినీ సంతోషంగా భరించాను... నా వాళ్ళందరికీ దూరమైనా భర్తే సర్వస్వంగానూ... పిల్లలే ఆస్తిగాను అనుకుని బ్రతికాను.

అనుకోని విధంగా నీవు కన్పించడంతో నా పట్ల ఆనాటి నీ ప్రేమ అనుభవంలో కొచ్చింది... అక్కా! నీకు గుర్తుందా? నీకూ, నాకు తినమని అమ్మ ఏదైనా పెడితే... ముందుగానే నా వంతు నేను తినేస్తే నీ వంతులో సగం నాకు పెట్టేదానివి. అదీ మింగేసి నీ వైపు చూస్తోంటే... నీవు నవ్వుతూ ఒక్క మొట్టికాయ వేసి మళ్ళీ కాస్త నా నోటికి అందించే దానివి. నా ఆకలి, ఆశ అమ్మకు ఎంత తెలుసో, నీకు అంతే తెలుసు. నేను చేసిన చిలిపి పనులు, నీ మీద వేసుకుని అమ్మతో తన్నులు తినేదానివి. అమ్మ నిన్ను కొడుతుంటే... నీకు అడ్డం వచ్చి నేనూ తన్నులు తినేదాన్ని... అక్కా!... అక్కా... ఆనాటి అంతటి నీ ప్రేమ... నా జీవితం పూర్తయ్యే వరకు వుంటుందనుకున్నాను. అయినా నేను

దురదృష్టవంతురాలిని!

"నేను ప్రేమించిన వ్యక్తి... భర్తగా... నన్ను మోసం చేస్తున్న సంగతి, ఆయన ప్రేమమత్తులో వున్న నేను, యింతకాలం తెలుసుకోలేకపోయాను. భర్త–భార్య మధ్య వుండవలసిన ప్రేమ, నమ్మకం... ఆ రెండింటిస్థానంలో అందుకు బదులుగా మోసం–నటన చేరినప్పుడు... ఆత్మాభిమానం కాస్త ఎక్కువగా కలిగిన నాలాంటి వారికి... మార్గం...?

ప్రస్తుతం నామనసు పూర్తిగా డిప్రెషన్‌లోకి చేరిపోయింది... ఏక్షణంలో ఏం జరుగుతుందో తెలియడంలేదు. కొన్నాళ్ళపాటు, అత్తవారింటికి వెళ్దామనుకున్నాను... ఆయన వద్దన్నాడు.

అవును అది, అతని యిష్టం కదా!... అమ్మదగ్గరకెళ్దమనుకున్నాను... ఆ దారీ... ఎప్పుడో మూసుకుపోయిందిగా...!

అక్కా! పిల్లల విషయం... వాళ్ళను నాపిల్లలుగా కాక... నీ బిడ్డలుగానే భావించు. గతంలో నీవు నాకు యిచ్చిన మాట ప్రకారం... వాళ్ళకు మంచి భవిష్యత్ వుండేటట్లు ప్రయత్నించు. వాళ్ళ తండ్రికి సంబంధించి ప్రత్యేకంగా నేను చెప్పేది ఏమీ లేదు... అది మీ యిద్దరి యిష్టం! ఇది, మనస్ఫూర్తిగా చెబుతున్న మాటే! లీగల్‌గా ఎలావున్నా... నైతికంగా, మానసికంగా ఇక మీదట ఆయన్ని భర్తగా భావించలేను... భార్యగా, అతనితో కలసి జీవించలేను. ఇది నా తుదినిర్ణయమే... మరి నా గతేంటి? అవును, అది దారం తెగిన గాలిపటమే! ఆత్మహత్య మహాపాపం!

అయినా, జీవచ్ఛవంలా బ్రతకడంకంటే... అదే మేలేమో మరి! అయినా యింకా ఏమీ అనుకోలేదు. అక్కా! నీకు మరోసారి గుర్తుచేస్తున్నా! నీ సంరక్షణలో, పోషణలో వున్న పిల్లలు ఏనాటికీ నీపిల్లలే!... ప్రేమించి, తానే సర్వం అనుకుని, నమ్మి తనను చేరిన భార్యకే ద్రోహం చేసిన వ్యక్తికి... పిల్లల భవిష్యత్ ఒక లెక్కా! కనుక వాళ్ళ విషయంలో నీదే బాధ్యత ! ఏపరిస్థితులలోనూ పాపకు నా బ్రతుకు తీరు రాకూడదు. ఇది, ప్రత్యేకంగా నేను నీకు చెప్పుకునే మాట! నాకు పుట్టిన పాపానికి నా దురదృష్టం దాన్ని  వెంటాడకూడదు.

పిల్లలంతా... నన్ను పూర్తిగా... మర్చిపోయేలా, వాళ్ళను తయారు చేయి! ఇది, నాకోరిక! మరో మాట... ఇహమీదట, ఒకవేళ నేను జీవించి వుండవలసి వస్తే...  అతని భార్యగా బ్రతకను. వసుంధరగనే బ్రతకగలను.... అందుకు వీలుగా అతనితో విడాకుల కోసం, నాకు సాయం చేయి!  అదీ... నీ యిష్టమే!

అక్కా! నా చిన్నతనం నుండే, నామనసు నీకు తెలుసు ఎంతో ఓర్పు తరువాత... కాదనుకున్న దాన్ని, తిరిగి కావాలనుకోలేను. అయినా, ప్రస్తుత నాస్థితికి ఎవర్నీ నేను తప్పుపట్టను. నా విధిని నేను నమ్ముకున్నాను. ఇహమీదట నాకు కావలసింది భర్తతో సంసారం కాదు. నా (నీ) పిల్లల భవిష్యత్తే! అదీ, నీచేతిలోనే వుంది. ఆ విషయంలో నీవు నాకిచ్చిన మాట నెరవేర్చుకోగలవనే నమ్మకంతోనే నా పిల్లల్ని–నీ పిల్లలుగా... వదిలేశాను. మీ యిద్దరి మధ్య నుండి నేను

తొలగిపోతున్నాను... మోసంచేసిన మనిషి మొహం మళ్ళీ చూడలేను, ప్రేమించిన హృదయాన్ని ముక్కలుచేసిన మనిషితో కలిసి వుండటం, ఏవిధంగా సాధ్యం...? కనుక, ఈ జీవితానికి యిది చాలు. నా భవిష్యత్ గురించి, యిప్పటివరకు ఏమీ అనుకోలేదు. ఇంక, ఆ అవసరం నాకు వుందా? అనేది ప్రస్తుతం నామనసులోని ప్రశ్న! సమాధానం నాకు తెలియడం లేదు. ఒకవేళ, బ్రతుకవలసివస్తే... ఎక్కడైనా... నీతిగానే బ్రతుకుతాను. అందుకు అవకాశం లేనప్పుడు... జీవితాన్ని చాలించడమే మార్గం కదా! అయినా... నీవు ప్రయోజకుల్ని చేసిన నా పిల్లల్ని... కళ్ళారా చూచుకునే వరకూ సజీవంగా వుండడానికే... ప్రయత్నిస్తాను... ఎలాగో తెలియదు...

నా పిల్లల తండ్రికి నేను వేరుగా ఉత్తరం వ్రాయలేదు... వ్రాయలేను కూడా! అందుకే దీనినే ఆయనకు కూడా చూపించు... చదివించు... ఆలకించు, ఆలోచించుకో!... రెండు మనుసులు ఒకటైన యిద్దరికి, ఒకటి చాలు గదా!...

అక్కా!... ఇహ శెలవు తీసుకుంటాను...

ఇట్లు,

నేటి వరకూ, నీవు ప్రేమించిన నీ చెల్లి...

–చంటి

# 9.అసమర్థుడు

రూపాయి ఆదాయం లేదు... పాపాయి పుట్టిందీ లేదు... వెనక చిల్లిగవ్వ ఆస్తిలేదు... ఆడది సంపాదించి పెడితే తేరగ తిని, హోవారాగా తిరుగుతూ... పహరా కాస్తాడా నీకు? రోషంగల మగాడెవడూ యిలా బ్రతకడు. పూట గడవడమే అతనికి తెలిసింది. వేళకు తిండి పెడుతూ నీవు యిలాగే పోషిస్తోంటే... జీవితంలో అతను చిన్న పని కూడా చేయలేడు. రానురాను పూర్తిగా బద్ధకస్తుడై ఎందుకూ పనికిరాకుండా పోతాడు... నీ మేలుకోరి చెబుతున్నా! ఇప్పటికైనా జాగ్రత్తపడు. నీ భవిష్యత్ నీవు చూచుకో! చేతిలో ఉద్యోగం వుంది నీకు. ఎవరి మీదా ఆధారపడకుండా, హాయిగా బ్రతకొచ్చు... అప్పటికీ నీకు యిష్టమైతే... మరో దారి చూచుకోవచ్చు."

"ఇతన్ని వదిలేస్తే... మరో పెళ్ళి చేస్తారా నాకు?"

"అది నీ యిష్టం! దానికి నేను చెప్పేదేముంది?"

"రూపాయి ఆదాయం లేని సంగతి, వెనక ఆస్తి లేని విషయం మీకు ముందే తెలుసుగా, మరి అలాంటి మనిషితో నాకు పెళ్ళెందుకు చేశారు... నాకు ఉద్యోగం వున్న సంగతీ మీకు తెలుసు. ఎవరి మీద ఆధార పడకుండా ఒంటరిగా బ్రతకగలననీ తెలుసు... అలాంటప్పుడు అసలు నాకు పెళ్ళెందుకు చేశారు... అలా వదిలేస్తే... యిప్పుడు నీవు చెప్పినట్లు నా యిష్టానుసారంగా హాయిగా బ్రతికేదాన్ని గదా! అప్పటికి యిష్టమైతే పెళ్ళి చేసుకునే దాన్నేమో! అన్నీ జరిగిపోయిన తరువాత యిప్పుడు

యిలాంటి సలహాలిస్తావేంటి?"

"అప్పటి పరిస్థితులు అలాంటివి! ఇంటికి నీవు పెద్దదానివి కావడంతో... పెళ్ళి నీకు జరగనిదే నీ తరువాత వారికి ఎలా అవుతాయి? పైగా నీ వయసు పెరిగిపోతున్నది. అందుకే నీ విషయంలో కాస్త తొందరపడవలసి వచ్చింది. అయినా మేము నీకేమీ తక్కువ చేయలేదు కదా?"

"ఏమిచ్చారు నాకు? కట్నంగా డబ్బులిస్తే ఊరికే ఖర్చుయిపోతుందని ఇల్లు కొనిస్తామన్నారు. అతనికి ఉద్యోగం వేయిస్తామన్నారు. పెళ్లయి మూడేళ్ళయినా యిప్పటికి ఏది నెరవేర్చారు? పెళ్ళినాటికి నా వొంటి మీద వున్న ఒంటిపేట గొలుసుతోనే సరిపెట్టారు. గాజులు చేయిస్తామన్నారు. ఏదీ. ఈనాటికీ అతీ గతీ లేదు. నన్ను చేసుకున్నవాళ్ళకి ఏమీ లేదని తెలిసి నన్ను యిలా ఎందుకు చేశారు?"

"లేని వాళ్ళు లేనట్లుగానే వుంటారా బ్రతకుంతా? సంపాదించుకునే తెలివి వుండొద్దు? ఎల్లకాలం, పిల్లనిచ్చినవారి మీద పెళ్ళాం సంపాదన మీదే ఆధారపడి బ్రతుకుతారా? ఉద్యోగం వేయిస్తామన్న మాట నిజమే! ఎంతో ప్రయత్నం చేశాం. 'డిగ్రీలున్నవారికే యీ రోజుల్లో దిక్కులేదు. టెంత్ క్లాస్ చదువు ఉన్న వానికి ఉద్యోగం ఎవరిస్తారు? ఎవర్నడిగినా యిదే మాట! అయినా, ఎవరి బ్రతుకు వారు బ్రతకవలసిందిపోయి మగవాడు, ఎవరి మీదనో ఆధారపడడం సిగ్గులేని పని అభిమానం వున్నవారెవరూ అలా బ్రతకరు. పని పాటు లేకుండా కూర్చోబెట్టి

తిండి బెట్టి నీ మొగుణ్ణి నీవే అలా పనికిమాలినవానిగా తయారు చేశావ్!”

“నీ రెండో కూతురుకు సంబంధాలు వస్తోంటే పెద్దదాన్నయిన నన్ను అందుకు అడ్డు తొలగించుకోడానికి మీరంతా కలిసి పన్నిన కుట్ర యిది! ఏదో విధంగా ఎవరికో ఒకరికి నన్ను కట్టబెట్టి, మీ బాధ్యతను నెరవేర్చుకోవాలనుకున్నారు. నీ రెండో కూతరు కోసం నా జీవితాన్ని బలిచేశారు. యిప్పుడు వేరే దారి చూచుకోమని సలహా యిస్తున్నావు. కాపురం చేసుకునే కూతురుకు ఏ తల్లి యిలాంటి సలహా యివ్వదు. మొగుడు పేదవాడు సంపాదన లేనివాడైనంత మాత్రాన కాపురం వదులుకుని భార్య తన దారిన తాను పోవడమేనా? అలా ఎన్నిసార్లు? పెళ్ళంటే లైసెన్స్‌డ్ వ్యభిచారం కాదు గదా!

‘నీ మంచి కోరి నేను చెప్పిన దానికి నీవు తప్పుడర్థాలు తీస్తున్నావ్? ఇహ, నీ సంగతి నాకు అనవసరం. కష్టపడి సంపాదించి, మొగుణ్ణి పోషించుకో, శ్రమచేసి బ్రతకవలసిన అవసరం లేకుండా చేసి సోమరిపోతుగా తయారుచేసి అతన్ని ఊరు మీద హోవారా చెయ్యి! ఏ ఆడదానికైనా తన మొగుడు ప్రయోజకుడని గర్వంగా చెప్పుకోగలగాలి”

“అది నీ కనవసరం! నా సంసారాన్ని నడుపుకునే విధానం నాకు తెలుసు. అది నా వ్యక్తిగత విషయం. ఇందులో నీ జ్యోకం అవసరం లేదు... నీ బోడి సలహాలు నాకు అక్కర్లేదు...

మరో మాట! నీ రెండో అల్లుడికి కట్నం కానుకలు,

లాంచనాలతో ఎంతో దోచి పెట్టావ్. అయినా అది నాకనవసరం. తండ్రి ఆస్తిలో, ఆడపిల్లగా న్యాయంగా నాకు రావలసిన వాటా నాకివ్వండి.... నా బ్రతుకు నేను బ్రతుకుతాను. దేబిరించి, మిమ్మల్ని అడగడం కాదది! పుట్టింటి ఆస్తిలో నాకు హక్కుంది... తొందరలో సెటిల్ చేసి నా భాగం నాకు పంపించు..."

"ఆస్తిలో భాగమా? నీకసలు మతి వుండే మాట్లాడుతున్నావా? లేక మొగుడి మైకంతో కలవరిస్తున్నావా? నీ తండ్రి ఆస్తి ఆయన స్వార్జితం! అది ఆయన ఇష్టం. దానిలో వాటా అడిగే హక్కు ఎవరికీ లేదు. ఇష్టపూర్వకంగా ఆయన యిస్తే.... ఆయనిచ్చింది నోరు మూసుకుని తీసుకోవడమే! ఆయన తదనంతరమే అదీను! అప్పుడైనా ఆయన విల్లు వ్రాయకపోతేనే వాటాల సంగతి వచ్చేది ఎవరికైనా! నీ మొగుడు నీ మీద ఆధారపడి బ్రతికే పరాన్నజీవి! అయినా ఎవరితోనూ పని లేకుండానే, నీ బ్రతుకు నీవు బ్రతుకుతానంటున్నావు. అంత రోషం కలిగినదానివి, మా ఆస్తిలో వాటా అడుగుతావే! బుద్ధి లేదూ... లేని హక్కును చలాయించాలనుకుంటే... నీకు పుట్టింటికి దారి లేకుండా పోతుంది... నీ యిష్టం!"

"............"

"మళ్ళీ మరోమారు చెబుతున్నా ఈ పనికిమాలిన, దిక్కులేనివాడితో నానా యాతనలు పడుతూ... బ్రతుకంతా నరక బాధను అనుభవిస్తావో... ముందుగా మేలుకుంటావో... త్వరగా తేల్చుకో! అదీ నీ యిష్టమే... ఈ సోమరిపోతుతో నీ భవిష్యత్

హింసలపాలవుతుంది. ఇప్పటి వరకు తిండితో సరిపెడుతున్నావ్! అది అంతటితో ఆగదు. రాను రాను అతని సోమరితనం అనేక అలవాట్లకు నిలయమవుతుంది. వాటి కోసం అతను దేనికైనా తెగించవచ్చు... ఇలా చెప్పడం నిన్ను భయపెట్టడం బెదిరిచడానికి కాదు. భార్యగా నీకు అతని మీద ప్రేమ, అభిమానం వుండడం తప్పు కాకపోవచ్చు కానీ అది అతన్ని ఎందుకు చేతగాని వాడిగా తయారుచేసే ప్రమాదాన్ని తెచ్చిపెట్టుకోకు... మరో మాట! నా రెండో అల్లుడికి దోచి పెట్టానని నా మీద నిందవేశావు! అది తప్పు! అతని చదువు ఉద్యోగం హోదా... వెనక ఆస్తి... వీటన్నిటి విలువా లెక్కవేస్తే... అతనికి మేం యిచ్చింది ఏ మూలకూ? ఆయనతో నీ మొగుణ్ణి పోల్చడమా? అదో పెద్ద జోక్! ఇహ మీదట ఎప్పుడూ అలా అనుకోకు. ఎంత చెట్టుకు అంతే గాలి! మామిడి చెట్టును ముళ్ళ కంపతో పోల్చడం... వెర్రితనమే! ఏవేవో పిచ్చి వూహలతో గాలి మేడలు కట్టుకోకుండా, వాస్తవాన్ని తెలుసుకుని బ్రతుకు. పాలు తాగినా పాముకు విషం విరిగిపోదు... నీవు పోషించే నీ భర్తతో ఏనాటికైనా నీ జీవితానికి ప్రమాదం వుంది... త్వరలో మేలుకో!... పద్ధతిని మార్చుకో! కన్న కూతరు పట్ల ప్రేమ, బాధ్యత గల తల్లిగా ముందు హెచ్చరికగా యివన్నీ చెబుతున్నాను గాని, ఎవరి పట్ల ద్వేషంతో కాదు. స్వయంకృషి, స్వాభిమానం ప్రతి మనిషికి అవసరం. మనసుంటే మార్గం వుండకపోదు. నీ మొగుడితో ఉద్యోగం చేయించాలని నిజంగా నీకుంటే... నీ చెల్లిని అడుగు. ఆయనకు చాలా పలుకుబడి వుంది. ఎక్కడైనా ఉద్యోగం వేయించగలరు.

"మరీ అంత హీనంగా మాట్లాడకు ఒకరి కింద ఉద్యోగం చేయడం ఆయనకు యిష్టంలేదు. అదే అనుకుంటే ఎప్పుడో వచ్చేది... వ్యాపారంగాని, ఇండస్ట్రీగానీ పెట్టే ప్రయత్నంలో వున్నారు... ఆ పని చాలా వరకు పూర్తి కావచ్చింది.

"బెట్టుసరి మాటలు కట్టిపెట్టి... వాస్తవంగా బ్రతికే అలవాటు చేసుకో! నా మాటలలోని నిజాన్ని గ్రహించి, జీవిత మార్గాన్ని సరిచేసుకో! నే వెళ్తాను... నన్ను అపార్థం చేసుకోకు!"

"ఈ రోజు వుండరాదూ?"

"కాదులే!.. నే వెళతాను మళ్ళీ ఎప్పుడైనా రావాలనుకుంటే వస్తాను."

" .........................."

" .........................."

– – –

"ఎందుకలా వున్నావ్... నాకు తెలుసు మీ అమ్మ వచ్చింది... నా గురించి ఏవేవో అని వుంటుంది. వాటిని మనసులో పెట్టుకుని బాధపడుతున్నావ్" అంతే కదూ?"

"మా అమ్మ వచ్చిన సంగతి మీకెలా తెలుసు?"

"బస్‌స్టాండ్‌లో కన్పించింది... దగ్గర కెళ్ళి పలకరించాను... ముఖం చిట్లించుకుని దూరంగా వెళ్ళింది..."

"అల్లుడనే కనీస మర్యాదను కూడా ఆమె మర్చిపోయిందన్న

మాట! పూర్తిగా చిన్నల్లుడి మైకంలో వుంది. అందుకే, ఆమె కళ్ళకు ఎవరూ ఏదీ కన్పించడం లేదు. మీరు పలకరించకుండా వుండవలసింది... అయినా మీరు బస్‌స్టాండ్‌కు ఎందుకెళ్ళినట్లు”

“హైదరాబాద్ నుండి నా ఫ్రెండ్ వస్తున్నట్లు మరో స్నేహితుని ద్వారా తెలిసింది... అతనికి స్వంత కంపెనీ వుంది... అతని ద్వారా ఏదైనా ఉద్యోగ అవకాశం వుంటుందేమోనని... మరో ఫ్రెండ్‌తో పాటు అతన్ని రిసీవ్ చేసుకోడానికి వెళ్ళాను. మేం ముగ్గురం ఇంజనీరింగ్ కాలేజీలో క్లాస్‌మేట్స్”

“వాట్! ఇంజనీరింగ్ కాలేజీలోనా?”

“సారీ హైస్కూల్లో”...

“ఎందుకు తడబడుతున్నారు?... నిజం చెప్పండి... మీరు ఇంజనీరింగ్ చదివారు కదా? చెప్పండి.”

“నాకు అబద్ధం చెప్పొద్దు”

“..................”

“మాట్లాడరేం? చెప్పండి... ఎందుకు అలా చూస్తున్నారు. నాకు నిజం కావాలి”

“నిజమే చెబుతున్నాను సుజా.... ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ చదివాను”

“మరి టెంత్ క్లాసని ఎందుకు చెప్పారు? మీ చదువు క్వాలిఫికేషన్ గురించి మా అమ్మ అంత హీనంగా పెట్రేగిపోయి

మాట్లాడుతొంటే... మీరు, మౌనంగా ఎందుకున్నారు. కనీసం నాకైనా నిజం చెప్పి వుంటే... ఆవిడ నోరు మూయించేదాన్నిగా! అల్లుడనే కనీసం గౌరవం లేకుండా మిమ్మల్ని అంత అవమానకరంగా మాట్లాడినా... ఆమె కన్పించినపుడు మర్యాద కోసం పలకరిస్తే బుద్ధి, జ్ఞానం లేకుండా ముఖం త్రిపుకుని దూరంగా పోతుందా? ఈ సారి వస్తే సంగతి చెబుతాను... ఇప్పుడు చెప్పండి! ఇంజనీరింగ్ చదవి, టెంత్ క్లాసని ఎందుకు చెప్పుకోవలసి వచ్చింది?... అనేక మంది గొప్పకు లేని డిగ్రీలు వున్నట్లు ప్రచారం చేసుకుంటారే! మిమ్మల్ని మీరు యిలా తక్కువ చేసుకుని ఎందుకు మాట్లాడుతున్నారు?"

"మంచి పొజిషన్‌లో వున్నవారు పోకిరీ వేషాలు వేసినా, పాడు పనులు చేసినా అవి గొప్పగానే వుంటాయి యితరుల దృష్టిలో! స్థానబలిమి అంతటిది! మీ అమ్మగారికి నా మీద కోపం వుండడంలో అర్థం వుంది... ఆమె మాటల్లో వాస్తవం వుంది... నిజానికి తన పెద్దల్లుడిని గూర్చి తాను గొప్పగా చెప్పుకోవడానికి నా దగ్గర ఏమీ లేదు గదా!"

"నేను అడిగింది, ఆమెను గురించి కాదు. మీరు నాకు నిజం ఎందుకు చెప్పలేదు?"

"తక్కువను ఎక్కువగా చెప్పుకోవడంలో తప్పు వుంటుంది కానీ, నేను ఎక్కువనే తక్కువగా చెప్పాను గదా? దోషం ఏమిటి?"

"ఎక్కువ తక్కువలను కాదు నేనడిగింది. నాకు నిజం ఎందుకు చెప్పలేదు. ఇదే నా ప్రశ్న!"

"నీవు ఎప్పుడూ అలా అడగలేదు గదా?"

"అందరికీ మీరు చెప్పేదే నిజమనుకునేదాన్ని"

"ఇప్పుడ కూడా అలాగే అనుకోవచ్చు గదా?"

"నిజం తెలిసిన తరువాత అలా ఎలా అనుకోగలను? నా భర్త ఇంజనీరైతే... టెంత్ క్లాసని చెబితే ఎలా ఒప్పుకుంటాను?"

"దేనినైనా వాస్తవ దృష్టితో ఆలోచన చెయ్యాలి! **పి.జి. చేసి ఫుడ్‌కు తనపై ఆధారపడిన కొడుకుకంటే కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషించే తండ్రికే స్వతంత్ర వ్యక్తిత్వం వుంటుంది**... చిన్నతనం నుండి యీ నాటి వరకూ నేను పేదరికంలోనే బ్రతుకుతున్నాను. స్వయంకృషితోనే చదువుకున్నాను. కూలి పని చేశాను. ఉద్యోగ రిజర్వేషన్‌కు నాకు అర్హత లేదు... అది వున్న వాళ్ళకు అది వారసత్వ హక్కుగా వుంది. నిజంగా అది అవసరమైన వాళ్ళు యినాటికీ ఊసురోమంటూ బ్రతుకుతున్నారు. నా క్వాలిఫికేషన్‌కు తగిన ఉద్యోగం రేటు లక్షల్లో వుంటుంది. ఊహలలో కూడా నేను దానిని చేరుకోలేను. ఇంజనీరింగ్ పైగా ఎలక్ట్రానిక్ చదివిన వారు గుమాస్తా ఉద్యోగానికి పనికిరానట్లు భావిస్తారు. కనీసం టెంత్ క్లాస్ సర్టిఫికేట్‌తో ప్రయత్నించినా దాని రేటును కూడా నేను అందుకునే ఎత్తులో లేదు... నిజానికి ఏదో విధంగా జీవితంలో సెటిల్ అయిన తరువాత వివాహం చేసుకోవాలనుకున్నాను. కట్నం తీసుకోవడం నా మనస్తత్వానికి విరుద్దం. అయినా, మీ వాళ్ళు ఉద్యోగం ఆఫర్ చేయడంతో

దానిని పెళ్ళి కానుకగా భావించవచ్చని నీతో మేరేజ్‌కి అంగీకరించాను... ఆ తరువాత జరిగింది... యీనాటికీ జరుగుతున్నది నీకు తెలుసు... బస్‌స్టాండ్‌లో పలకరించినప్పుడు నా పట్ల మీ అమ్మగారి ప్రవర్తనకు నా మిత్రులు ప్రశ్నించారు. నేనంటే ఆమెకు ఎంతో అభిమానమని నేను నిరుద్యోగిగా వుండడంతో ఆమెకు నా పై కోపమని వాళ్ళకు సర్ధి చెప్పాను... అయినా పేదవాడికి పరువు గుర్తుకు రావచ్చునా? పౌరుషాన్ని ఫీల్ అవవచ్చునా? అవమానానికి ఆవేశపడవచ్చునా?"...

"బాధపడకండీ! ప్లీజ్! ఆమె తత్వం మీకు తెలిసిందే కదా!... ఉద్యోగాన్ని గూర్చి మీ ఫ్రెండ్ ఏమన్నారు? అతనికి ఏదో వ్యాపార కంపెనీ ఉందన్నారుగా?"

"క్లాస్‌మెట్‌ను ఉద్యోగం అడగటానికి అభిమానం అడ్డొచ్చి...."

"పోనీలెండి! అడిగి లేదనిపించుకోవడం కంటే అడక్క పోవడమే మంచిదైయింది... చదువుకున్న వారందరికీ ఉద్యోగాలే వస్తే దేశవ్యాప్తంగా విద్యావంతులైన కోట్లాది నిరుద్యోగులు ఎలా వుంటారు? మీ మనస్తత్వం నాకు అర్ధమైనంత మేర మిమ్మల్ని ఎక్కువగా బాధించేది మీ నిరుద్యోగం కంటే నా సంపాదన పైనే మీరు ఆధారపడుతున్నానే భావనే ఎక్కువగా వుంది" అలా అనుకోకండి! కుటుంబ బాధ్యతలు భార్య – భర్తకు సమానంగానే వుంటాయి... అయినా అవకాశాలను బట్టి వాటిల్లో కాస్త హెచ్చు తగ్గులుండవచ్చు, అంత మాత్రాన ఫీలవలసింది ఏమీ లేదు.

మరో నాటికైనా మీరు సంపాదించగలరు. ఒకవేళ మీరు సంపాదిస్తూ నేను నిరుద్యోగినైతే నేనూ మీలాగే అనుకోవాలా?"

"అలా అనుకోవడం లేదు నేను... గెస్టుకు మర్యాదలు హోస్ట్ చెయ్యాలి. నా యింటికి (మాట వరసకంటున్నాను నాకు యిల్లెక్కడిది) వచ్చి భార్యగా నా జీవితంలో ప్రవేశించిన నిన్ను భర్తగా నీకు ఏలోటూ లేకుండా చూడవలసిన బాధ్యత నాకు వుంది... అది నెరవేకపోగా,... గెస్టే హోస్టను..."

"ప్లీజ్! అలా ఫీలవకండి! ఆ భేదం భార్య–భర్తగా బ్రతకవలసినవారిలో వుండకూడదు. నా మాట విని మీ మనసులోని ఆభావాన్ని లేకుండా చేసుకోండి!... మీరు ఇంజనీరింగ్ చదివారు కదా! పోనీ... కాంట్రాక్టరుగా పేరును నమోదు చేసుకోవచ్చు గదా!"

"దానికీ సాల్వెన్సీ కావాలి... ఇన్‌వెస్ట్‌మెంట్ కావలసి వుంటుంది... కొంత అనుభవం కూడా అవసరం..."

"పోనీ కొంతకాలం ఎవరైనా కాంట్రాక్టర్ దగ్గర ఉద్యోగిగా చేరి అనుభవాన్ని సంపాదించవచ్చుగా!"

"నీవన్నది నిజమే! అందుకు ప్రత్యేక టాక్టిస్ అవసరం అవుతుంది. కాంట్రాక్టర్‌కు లాభాల శాతం పెంచాలి. ప్రాజెక్ట్ వర్క్ ఫ్రాడ్ కూడా జరిపించవలసి రావచ్చు. అయినా, కాంట్రాక్టర్ నిజాయితీని లోకానికి చూపగలగాలి. అవినీతికి, నిజాయితీ పెయింటింగ్ పూయాలి. ఆయన రాజకీయానికి నమ్మిన బంటుగా

నిలవాలి. లాభాలను తగ్గించి, ఖర్చులు పెరిగినట్లుగా లెక్కలు వ్రాయాలి. ఇవన్నీ నా వల్ల అయ్యేవి కావు.”

“అదే గదా నా బాధ! ఈ అసమర్థ జీవితం ఎన్నాళ్ళో... అర్థం కావడం లేదు!”

“అలా అనకండి నాకు తెలుసు మీలో అసమర్థత లేదు. అభిమానం, నిజాయితీ, అవసరమైన దానికంటే కాస్త అధికంగా వున్నాయి. పరిస్థితులతో రాజీపడి అవసరాలను గడుపుకునే ‘లౌకికం’ మీలో లేదు... అయినా మనకీ మంచిరోజులు వస్తాయిలెండి! మరోమాట నేను ఉద్యోగం చేస్తున్నందుకు మీకు బాధగా వుంది కదూ?”

“అలాంటిదేమీ లేదు... కాకపోతే... లోకరీతి ప్రకారం భర్త సంపాదిస్తే భార్య దానిని స్వదినియోగం చేయాలి. అంత మాత్రాన ఆడవాళ్ళు ఉద్యోగాలు చేయకూడదని కాదు. కాని సంపాదన కంటే సంసారం, పిల్లలు యీ బాధ్యతలను స్త్రీలు మాత్రమే విజయవంతంగా నెరవేర్చగలరు... పిల్లల్ని మంచి పౌరులుగా తీర్చిదిద్దగల సామర్థ్యం వారికే వుంది.... అలాగే, **సమాజంలో మగవాడి మర్యాద కుటుంబ గౌరవం కాపాడగలగిన వారు స్త్రీలే సుమా!** అయినా కాలమార్పిడితో జీవిత విధానమూ మారాలి గదా! మన విషయంలో పురుషధర్మం పూర్తిగా ‘ఉల్టా’గా వుంది.”

“మనకు పిల్లలే లేరు... మంచి పౌరులంటారేమి?... ఎన్నాళ్ళు స్వామీ యీ సంతాన నిరోధక బ్రహ్మచర్యం?”

"నీవు అనుమతించినంత కాలం... చూడు ఎవరో వచ్చినట్లున్నారు... మీ పుట్టింటివారు కాదుగదా!"

"మా వాళ్ళంటే ఆ మాత్రం భయం మీకు వుండాల్సిందే... మీ ఫ్రెండ్ రమణ... రండి, లోపలికి"

"కాఫీగాని, కనీసం టీకైనా పాలున్నాయా?"

"నా భర్త మరీ అంత పేదవాడు కాదులెండీ ఇంటికి వచ్చిన వారికి మర్యాద చేయలేనంత పేదరికంలో మనంలేం?... ఆయనతో మాట్లాడుతూ వుండండి"

"ఏం చేస్తున్నావని అడగను... అది నాకు తెలిసిందే కనుక!... ఏం చెయ్యాలని అనుకుంటున్నావ్ అని అడుగుతున్నాను... బుర్రలో ఏదైనా ఆలోచన వుంటే చెప్పు"

"మైండ్ బ్లాంక్– బ్లాక్ బోర్డ్ క్లీన్ నీవు ఏదైనా ప్రపోజ్ చేస్తే తప్ప యిప్పటి వరకూ నాకు ఏ ఆలోచనా లేదు"

"నీకు తెలుసుగా నేనూ నిరుద్యోగినే! ఇద్దరు పిల్లల భారం అధికం! నీకు ఆ సమస్య లేదు కనుక కొంత వరకు నీవు అదృష్టవంతుడివే!"

"నా అదృష్టం అష్టవంకరులుగా నలుదిశలా అత్తవారి యింటి వరకూ వ్యాపించింది. వాళ్ళ దృష్టిలో రూపాయికే కాదు, పాపాయికి కూడా నేను పనికి మాలిన వాడినే! నిజానికి, వాళ్ళే కరెక్ట్! సాధారణంగా కూతురు కాపురం ముగ్గురు పిల్లలు – అరవై కాసులుగా వుండాలని కోరుకుంటారు గదా కన్నవారు!

మా కాపురంలో ఆ ఆనవాలే లేకపోవడంతో నన్ను వాళ్లు అలా అనుకోవడంలో తప్పులేదు... అది సరే! ఆదాయ మార్గానికి ఏదైనా ప్రపోజల్ వుందా? 'జోగిజోగి' రాచుకున్నట్లు వుండకూడదు"... చెప్పు ఏదైనా ఐడియా వుంటే...."

"అనుకోని విధంగా రెండు మూడు ఆఫర్లు వచ్చాయి... నాకు ధైర్యం చాలడంలేదు... అందుకే యిలా వచ్చాను. వస్తానంటే యిద్దరం కలసి వెళ్ళి అక్కడే మాట్లాడుకుందాం... లేదంటే... డ్రాపై పోదాం"

"అసలు ఆ ఆఫరేదో చెప్పనే లేదు... డ్రాపైపోవడం ఏమిటి?"

"బయటికెళ్ళి మాట్లాడుకుందాం..."

"నేను వినకూడని రహస్యాలా అవి?... కాఫీ తీసుకోండి"

"రహస్యాలేమీ కాదండీ! నాకు తెలిసిన బ్యాంక్ బ్రోకర్ వున్నాడు అతనికి బ్యాంక్ మేనేజర్‌కి మంచి దోస్తీ! అతనితో మాట్లాడించి, బ్యాంకు లోను ప్రయత్నించి దానితో ఏదైనా యిండస్ట్రీ పెడితే ఎలా వుంటుందనేనది నా ఆలోచన! మా యిద్దరికీ మంచి అండర్‌స్టాండింగ్ వుంది కనుక. ఇద్దరమూ పోయి ఆ బ్రోకర్‌తో మాట్లాడదామని వచ్చాను... అంతే! యిందులో స్పెషల్ రహస్యం ఏమీ లేదు."

"బ్యాంక్‌లోనంటే... ష్యూరిటీలు అవసరం అవుతాయి గదా!"

“సెల్ఫ్ ష్యూరిటీలపై అవకాశం వుంటుందేమో ప్రయత్నిద్దామని”

“ఉద్యోగాలకైతేనే అలాంటి అవకాశం వుంటుందేమో? ఏదో విధమైన హామీ లేకుండా... “లోన్ ఎలా సాధ్యం?”

“నా ఐడియా మాత్రమే యిది! వివరాలు అతన్ని అడిగితే గాని తెలియవు... అందుకే, యిద్దరమూ వెళ్దామంటున్నాను.”

“సరే ! ఉద్యోగాలకు ఎలాగూ అవకాశాలు లేవు కనుక, వేరే మరేదైనా ప్రయత్నించండి.”

“నీవు ఏదీ చెప్పడం లేదేమిటయ్యా బాబూ?”

“ఆమె చెప్పిందిగా! అలాగే చేద్దాం.”

“త్వరగా రెడీఅవు మరి!”

“ఏవండి రమణగారూ! మీకు తెలుసుగా మా పరిస్థితి. లంచాలివ్వాలంటే... మా వల్ల కాదు.”

“గాలానికి గుచ్చాలిగా, ఎరగా, ఏదో ఒకదాన్నీ?”

“అదే మా దగ్గర లేదంటున్నాను. మీ పలుకుబడితోనే... దాన్ని సాధించే ప్రయత్నం చేయండి.”...

– – –

“ఏమైంది, వెళ్ళిన పని? కాయా – పండా?”

“..............”

"మాట్లాడరేం?"

"అది ఏదో, నాకూ అర్థం కావడం లేదు. నాకు అనిపించినదాన్ని బట్టి,... అది ... పూవ్వు–పిందె కూడ కాదు."

"బ్యాంక్ లోన్ అన్నారుగా...?"

"రమణ చెప్పింది అదే !... కాని, వాస్తవం అది కాదు... అసలు అది ఏదో కూడా నాకు అర్థం కావడం లేదు."

"అక్కడ జరిగిందేమో, వివరంగా చెప్పండి... నాకేమైనా అర్థం అవుతుందేమో ప్రయత్నిస్తాను."

"నాకే చెప్పలేదు ఎవరూ వివరంగా. నీకేం చెబుతాను?"

"మీ మిత్రుడు రమణ ఎవరితోనో, మిమ్మల్ని మాట్లాడిస్తానన్నాడుగా... ఆయన్ని కలుసుకున్నారా?"

"రమణే మాట్లాడి వచ్చాడు... అతను నాకు చెప్పినదాన్ని బట్టి... నేను చేయవలసిన ఉద్యోగమేమో తెలియదుగాని... నెలకు పదివేల రూపాయల జీతం యిస్తారట! వాళ్ళు చెప్పిన చోటుకు వెళ్ళి... చెప్పిన పని చేయాలట! ఆ పనేదో స్పష్టంగా తెలియదు..."

"అదేదో రమణకు తెలుసేమో అడగలేదా?"

"అడిగాను. అతనూ స్పష్టంగా ఏమీ చెప్పడం లేదు... పైగా మనం నిరుద్యోగులం... జీవనోపాధికి, ఏదో ఒకటి చెయ్యాలి గదా!... అది, ఏదైతే ఏమి? మనకు కావలసింది, జీతం డబ్బులు!.. మీ యిష్టం. ఇంతకంటే వివరాలు వాళ్ళు

చెప్పరు. వాళ్ళని అడగడం కూడ అనవసరం... యిలా వుంది అతను చెప్పిన సమాధానం...”

“నాకు అనిపించిన దానినిబట్టి... ఇహమీదట మీరు అక్కడికి పోకండి... అనవసరమైన ‘రిస్క్’ ఫేస్వ్వాల్సి రావచ్చు. ఎలాగూ మన యిబ్బందులు మనికి వుంటాయి... యిన్నాళ్ళు బ్రతకలేదా? ఉన్నదాంతోనే సర్దుబాటు చేసుకుందాం... నాకు తెలియకుండా, మీరు ఎక్కడా దేనికీ కమిట్ కాకండి... మీరు చెప్పిన దాన్ని బట్టి చూస్తే... మీ స్నేహితుడు రమణ ప్రవర్తన అనుమానంగా వుంది. అయినా, అతని విషయం మనకి అనవసరం... మీరు అతని మాటలను గ్రుడ్డిగా నమ్మకండి! మీరొక్కరే నిరుద్యోగి కాదు... దేశంలో ఉద్యోగం, ఉపాధి లేనివారు కోట్ల మంది వున్నారు... అయినా, వారందరూ ఏదో విధంగా బ్రతుకుతూనే వున్నారు కదా! పాడు పనులు చేసి, ప్రాణాల మీదికి తెచ్చుకునేకంటే... పస్తులున్నా, పరువుగానే వుంటుంది...”

‘‘రూపాయిలో పరువుంది... హోదాలో గౌరవ మర్యాదలున్నాయి. అక్రమ మార్గాలతోనైనా సంపదను చేకూర్చున్న వారికే జనం, జేజేలు పలుకుతున్నారు... ‘స్కామ్’లపేర, కోట్లాది ధనాన్ని దోపిడీ చేసినవారినే, ప్రజానాయకులుగ, పాలకులుగ... ప్రజలు అంగీకరిస్తున్నారు. నీతి, అవినీతి మధ్య తెర చిరిగిపోయింది... ఎలా సంపాదించారనే దాని కంటే... ఎంత గడించారనేదే, ప్రజల గుర్తింపులో వుంది...”

"అందుకని...?"

"ఏం చేసైనా, డబ్బు గడించాలి. అదే వ్యక్తి సమర్థతకు సర్టిఫికేట్ !... ప్రయత్నిస్తాను!"

"'రెస్ట్' తీసుకోండి... మీ మనసు ఎక్సైట్ అయిపోతోంది..."

"కోట్ల రూపాయలు దోపిడీచేసి, కోర్టు బోనెక్కవలసి వచ్చినా... జరిగే నష్టం ఏమీ లేదు... వారసులకు అది మిగిలిపోతుంది. అయినా, నేరానికి శిక్ష వేయించేది సాక్ష్యమే కనుక... దానిని సమాధి చేయగలిగితే.. 'క్లీన్ చిట్'తో కోర్టు నుండి బయటికి రావచ్చు... మీడియా ప్రచారంలో ఘన కీర్తినీ పొందవచ్చు... అదే చేస్తాను..."

"ప్లీజ్. నా మాట విని, రిలాక్స్ అవ్వండి.. ఆవేశం, అన్నివేళలా మంచిదికాదు... అదే, కొన్నిసార్లు ఆపదలోకి తోస్తుంది... ప్లీజ్, బి.కామ్!"

– – –

"శ్రీమతి సుజాతగారికి!... భార్య స్థానంలో వున్న వ్యక్తిని యిలా సంబోధించకూడదు. అయినా, తెలిసీ చేస్తుంటాం కొన్ని పనులు!... నేను మీకెంతో ఋణపడి వున్నాను... ఆదాయంలేని భర్తను యింతకాలం పోషిస్తున్నారంటే... మీ ఓర్పు గొప్పది! అందుకే ఋణపడి వున్నానంటున్నాను... దేనికైనా **ఆధారపడి బ్రతకడం... అథమం...! తనవంతు శ్రమిస్తూ, సహాయ**

**సహకారాన్ని ఆశించడం మధ్యమం!.. స్వయంపోషణ సమృద్ధితో, మిగులు బడ్జెట్టును కలిగి వుండడం... ఉత్తమం...** ఇంతకాలం నేను అథమ స్థానంలోనే బ్రతుకుతున్నాను. ఎంత ప్రయత్నించినా కనీసం మధ్యమ స్థాయికి కూడ చేరుకోలేక పోయాను... ఆత్మాభిమానం గలవారికి ఆధారపడి బ్రతకవలసి రావడం... ఆత్మహత్యతో సమానమే! సంపాదించి, భార్య పిల్లల్ని పోషించవలసిన బాధ్యతగల మగవాడు భార్య ఫీడింగ్‌లో అవమానాల బహుమానాలతో... జీవచ్ఛవంలా బ్రతకడం... తగదుe అంతకంటే... శవంగా మారడమే మార్గం... నాకు తెలుసు... అది పిరికితనమని! అయినా అంతకంటె వేరే దారి లేనప్పుడు... ఎవరైనా చేయగలిగింది అదే!... అయినా, భవిష్యత్‌ను గూర్చి పూర్తిగా ఆశ చావలేదు... ప్రయత్నిస్తాను...

సంపాదన కలవారంతా ఉద్యోగ హోదాలలో వున్నవారే కాదు గదా! ఆదాయానికి స్పష్టమైన మార్గం లేకపోయినా... ఆస్తిని సంపాదించుకోగల 'సమర్థు'లు అనేకమంది వున్నారు... ఉదాహరణకు మీ 'ఫ్రెండ్, ఐ మీన్ నా ఫ్రెండ్ (నీకు తెలుసుగా!) నిరుద్యోగిగా కన్పిస్తున్నా బాగా సంపాదిస్తూనే వున్నాడు... అతను అలా ఎలా చేయగలుగుతున్నాడో నాకు తెలుసు... నేను అలా ఎందుకు చేయలేకపోయానో కూడా నాకు తెలుసు!... ఈ రెండిటిని జమిలీగా మనసులో పెట్టుకుని... ఎన్నో ఆలోచనలతో... యిల్లు విడిచి వెళ్ళిపోతున్నాను... 'ఎక్కడికి? ఎందుకు?'... తెలియదు!... నాది, అసమర్థుడి ఆకలి యాత్ర! తిరిగివస్తే... జీవించి వున్నట్టు! అంతవరకూ నా

గురించి... నీవు/మీరు ఏమైనా అనుకోవచ్చు. అది మీ యిష్టం!"

– – –

"హలో మేడమ్! హౌ ఆర్ యూ! ఓకే ?"

"ఐ యామ్ ఓకే! మా ఆయన న్యూసే తెలియలేదు."

"తెలియడానికేముంది, మేడమ్! అన్నీ తెలివితక్కువ పనులు చేస్తున్నాడతను... అవకాశం చూపించినా... అనుమానమే! మార్గం చెప్పినా దీర్ఘాలోచనే! బ్రతుకు చెప్పే పాఠాల్ని నేర్చుకోలేనివారికి, ఎవరూ మాత్రం, ఏం చేయగలరు?... అతను, నా స్నేహితుడే కావచ్చు... కాని, అంతకన్న ఎక్కువగా మీ ముఖం చూచి నాకు చేతనైన సలహాలిస్తోంటే... దేనికీ అతను 'ఔ'ననలేదు. ఇంత సపోర్టున్న యిక్కడే ఏమీ చేయలేని వ్యక్తి, ఎక్కడికో పోయి ఏం చేయాలని?"

"ఉన్నంతలో ఆయనకు నేను ఏమీ లోటు చేయలేదు. అయినా, ఆయన మనసు యిలా ఎందుకు మారిందో అర్థం కావడం లేదు. ఇలా ఆయన యిల్లు విడిచిపోవడం నాకు అయోమయంగా వుంది. ఆదాయం లేని భర్తను గురించి అందరూ అనుకునే దానికంటే భర్త విడిచిన ఆడదాన్ని గూర్చి నలుగురూ ఎంత ఘోరంట్ అనుకుంటారో ఆయనకు తెలియలేదు. నేను దానిని ఎలా భరించాలి? మనసుకు ఏమీ తోచడం లేదు ఏం చేయడానికీ పాలుపోవడం లేదు. పుట్టింటివారితో నాకు పెద్ద సమస్య లేకపోయినా... ఆయన

తరపువారితో మాటలు పడాలిగదా! ”

“అది మీ ఊహేగాని, మిమ్మల్ని గురించి ఎవరూ మాత్రం ఎందుకనుకుంటారు? మీ వంతుగా సంపాదించి, చేతగాని భర్తను పోషించారు యింతకాలం! ఇందులో మిమ్మల్ననడానికి ఏముంది?... ఆ ఆలోచన మీకు అనవసరం! అయినా, మనలో మాట... బ్రతుకు తెరువుకోసం దూర ప్రాంతాలకు పోయే భర్తలంతా భార్యల దగ్గరే వుంటారా?... మీదీ, అలాగే అనుకోవచ్చు...!”

“సమాజంలో వున్నప్పుడు, మన వరకు అలా అనుకుంటే సరిపోదు కదండీ! సంపాదన వున్నా లేకపోయినా ఆడదానికి మగవాడి ఆసరా వున్న దారి వేరు కదండీ! ప్రస్తుతం నేను చేస్తున్న ఉద్యోగానికి గ్యారంటీ లేదు... ఒక వేళ, నేనూ నిరుద్యోగినైతే... అటు భర్తా దగ్గరలేక... ఆ పరిస్థితిని, ఊహిస్తేనే భయం వేస్తోంది...”

“మీ ఆయనలాగ మీకూ అనవసర ఊహలు, అనుమానాలూ ఎక్కువే! ఏమైనా నా వంతుగా నేను ఒక మాట చెప్పగలను... మీరు ఒక స్నేహితుని భార్యగనేకాక... మీరంటే నాకు ప్రత్యేక అభిమానం వుంది... అదే మనసు మీకూ వుంటే... ఇహ, మీరు దేనిని గూర్చి వర్రీ కానక్కర్లేదు..”

“..................”

“ప్లీజ్! నా మాటల్ని అపార్థం చేసుకోకండి! మనసులో

వున్న మాటను దాచుకోకుండా చెప్తాను... ఇహ... మీ యిష్టం!... మరో మాట... వింటానంటే చెబుతాను..."

"చెప్పండి!"

"మీ ఆయన్ను గూర్చి... నాకు పూర్తిగా తెలుసు. అయినా ప్రస్తుతం ఆ వివరాల్లోకి వెళ్ళను... సమయం వచ్చినప్పుడు... అన్నీ చెబుతాను... వెళ్తాను..."

"అదేంటి?... ఉండండి!... ఫర్వాలేదు. మా ఆయన్ను గూర్చి మీకు తెలిసింది చెప్పండి... అది రైటైనా... రాంగైనా... నేను అప్‌సెట్ కాను! ఆ కంట్రోల్ నాకుంది."

"................."

అతను... ఒక మాఫియా గ్యాంగ్‌లో చిక్కుకు పోయాడు... నేర ప్రపంచంలో చిక్కుకుపోయాడు... సజీవంగా తిరిగి రావడం అనుమానమే...

"బాధపకండి ! ప్లీజ్! చెప్పగూడని మాటనే చెప్పాను... కొన్ని నిజాలు సమాధిలోనే వుండాలి. మీరు ఒత్తిడి చేయడంతో... మనసు కంట్రోల్ తప్పి, నాకు తెలిసిన నిజం చెప్పాను... సారీ!"

"అలా అని, మీకెలా తెలుసు?"

"ప్రస్తుతానికి అదీ రహస్యమే! వివరంగా ఏమీ చెప్పలేను... అయినా, ముందు జాగ్రత్త కోసం చెబుతున్నాను. అతని కారణంగా అతని భార్యగా మీకూ కొన్ని యిబ్బందులు రావచ్చు! ఒకవేళ, అలాటిదేదైనా వస్తే... అందుకు మీకు అండగా నేనున్నాను...

ప్రస్తుతం నేను చెప్పగలిగింది యింతే!... మరో మాట! కొన్నాళ్ళపాటు ఫర్వాలేదుగాని ఎక్కువకాలం మీరు యిక్కడే వుండడం మంచిది కాదు... నివాసం మార్చాలి... అయినా, దీనిని గూర్చి ఎక్కువగా ఆలోచన చేయవద్దు!... మీకు అభ్యంతరం లేకపోతే... వచ్చిపోతూ వుంటాను...“ ఆడ మనిషిట్ నేను ఒంటిరిట్ వుంటున్నప్పుడు మీరెలా వస్తారు?ు అని మీరంటే... పూర్తిట్ మానేస్తాను... అయినా మీ అవసరంలో, నా సహకారం ఎప్పుడూ వుంటుంది... వెళ్తాను...”

“అంతా అయోమయంగా వుంది... పెళ్ళిద్వారా నేను సుఖపడింది ఏమీ లేకపోగా... అదనంగా, యిప్పుడు యీ టెన్షన్ దాపురించింది... అతన్ని బయటికి తెచ్చే ప్రయత్నం మీరు చేయగూడదూ...?”

“దానికే ప్రయత్నిస్తాను... కాని, మాఫియా అంటే... చాలా భయంకరమైంది. అయినా తనమాటే తనకుగాని ఎవరి సలహా వినేరకం కాదు గదా  మీవారు”

“పుట్టింటికి పోవడం, నాకు యిష్టం లేదండీ! అది అనవసరమైన రిస్క్!”

“అలా ఎందుకండీ? అంతకీ అవసరమైతే ‘సేఫ్టీ సెక్యూరిటీట్ మీకు నేనున్నానుగా!” అంతదూరం ఎందుకాలోచిస్తారు? నన్ను నమ్మండి!... నిశ్చింతట్, నిక్షేపంట్ వుండండి! నేను వస్తూ వుంటాను గదా! వర్రీ పడకండి!... ఏమంటారు?”

"అలాగే ! మీ యిష్టం !... మీ స్నేహితుణ్ణి గురించి ఏదైనా ఆలోచన చెయ్యండి!"

"అలాగే... వస్తానండి!"...

_ _ _

"ఏమే? ఇప్పటికైనా నీ బుర్ర తిరిగిందా? నా మాటలలో నిజం తెలిసొచ్చిందా?... ఆడది సంపాదించిపెడితే తిని తిరిగేవాడికి అభిమానం-సిగ్గు ఎందుకుంటాయి? 'మొగుడుంటే చాలు, బ్రతుకంతా హాయి' అనుకునే నీలాంటి పతివ్రత పెళ్ళాంగ దొరికితే... అలాంటి వాడికి..."

"అమ్మా! అలా అమర్యాదట్ మాట్లాడకు ఎలాటివాడైనా, అతను నా భర్త! ఆయన్నేమీ అనకు... నువ్వేదైనా అనాలంటే నన్ను అను పడతాను."

"అవును మరి! అంతకంటే నీవు మాత్రం ఏమనగలవ్? వాడికి భార్య మాత్రమే కాదు నీవు కట్టు బానిసవు. పైసా సంపాదనలేని పనికిమాలినవాడంటేనే... యింతగా పడి చస్తున్నావ్ సంపాదనపరుడైతే, పతిసేవలో నిత్యం మునక లేస్తూ తరించిపోయేదానివే నీవు!... ఉత్తరంలో వ్రాసినట్లు... వాడు, చావడానికి పోలేదు... నిన్ను బెదిరించడానికి, పగటి వేషాలేస్తున్నాడు వెధవ!"

"అమ్మా! ఎందుకలా అసభ్యంగా మాటాడతావ్? నాన్నను ఎవరైనా ఏదైనా అంటే... నీవు భరించగలవా? సహించగలవా?

విని వూరుకోగలవా? నా పరిస్థితీ అదే గదా!... అయినా, ఆయన్ను గూర్చి యిప్పుడు యిలా అనుకోవడం ఎందుకు? అయన్నీ నాకు భర్తగా కుదిర్చింది మీరే గదా? ఆ మంచి చెడ్డలకు బాధ్యత వహించవలసినవారు మీరే... ఇప్పుడు మమ్మల్ని యిలా నిందించడం ఏమిటి?"

"నిందించడం కాదే! నీ కాపురం యిలా అయిందేమా అని బాధ కొద్దీ మాట్లాడుతున్నాను. ఎవరి సంగతి ఎలా వున్నా ఏమనుకున్నా... నాది, తల్లి మనసు అది గుర్తించి నన్ను అపార్థం చేసుకోకు."

"నిజమేనమ్మా! ఇప్పుడు నేను ఏం చెయ్యగలను? కట్టుకున్నవాడు, ఎటువంటి వాడైనా... భర్తే కదా! బ్రతికినంతకాలం, అది తప్పదు... నాకు పెళ్ళైతే చాలనుకున్నారు మీరు?"

"ఎప్పుడో జరిగిపోయిందాన్ని తవ్వుకుంటావెందుకు? ఇహ జరగవలసిన దాన్ని గూర్చి ఆలోచించుకో! కన్పించడంలేదని, అతన్ని గూర్చి పోలీసు రిపోర్టు యిచ్చావా?"

"ఇవ్వలేదు! అతని స్నేహితుడికి చెబితే... అలా వద్దన్నాడు..."

"అదేంటి? మనిషి ఆచూకీ తెలియనప్పుడు... వాళ్ళకు తెలియజేయాలి గదా!"

"ఆయన ఎక్కడున్నది... ఎలా వున్నదీ తనకు

తెలుసునంటున్నాడు అతని ఫ్రెండ్!"

"మరింకేం! వెళ్ళి తీసుకురావచ్చు గదా!"

"ఏమో మరి! ఆ సంగతి తను ఏమీ చెప్పడం లేదు."

"అది సరే! నీవు చేస్తున్న ఉద్యోగం నికరం కాదు గదా! అది కాస్త ఊడిపోతే ఏం చేస్తావ్?"

"ఏదో ఒకటి చూచుకోవాలిగదా! బ్రతకడానికి?"

"సంపాదించే మొగుడూలేక... నిలకడైన ఉద్యోగమూలేక... ఎలాగే బాబూ, నీ బ్రతుకు?"

"భర్తలు లేని వారంతా బ్రతకడం లేదా?"

"అసలు లేకపోతే... ఆ దారి వేరు! ఉండీ... లేనట్లుగా బ్రతకాలంటే... అది ఎటూగాని జీవితం అవుతుంది... పిల్లలూ పుట్టలేదు కాలక్షేపానికైనా.... అదీ ఒకందుకు మంచిదేలే!"

"..................."

"బిడ్డల క్షేమాన్ని కోరడంలో, తల్లిని మించిన వారు, ఎవరూ వుండరు... అందుకే, నీ క్షేమంకోరి చెబుతున్నా! ఇంకా కొన్నాళు ళ్ళ చూచి... అతన్ని గూర్చి... ఏదో ఒక నిర్ణయానికొచ్చాయ్!"

"అంటే...?"

"నీకు పెళ్ళై ఎంతోకాలం గడవలేదు... పిల్లలూ లేరు! వయస్సు ఏమంత మించిపోలేదు.. రెండోపెళ్ళి చేసుకుని,

సుఖపడేవారు, ఎంతమందిలేరూ?... ఇక చెప్పానని కాదు. నీ భవిష్యత్ గూర్చి నీవే, ఒక నిర్ణయానికి రావడం మంచిది... జీవితంలో, అతను, ఎలాగూ బాగుపడడు... ఆ సంగతి నీకూ తెలుసు... అందరికీ తెలుసు! అందుకే, నీ సంసార పరిస్థితిని చూచి బాధపడుతూ తల్లిగా నేను నీకు చెప్పవలసింది చెప్పాను... ఇహ, నీ యిష్టం... వయస్సులో వున్నావ్! ఒంటరిగా యిలా వుండడం, మంచిది కాదు... అతని స్నేహితుడంటున్నావ్! అతను ఎలాటివాడో మరి! నమ్మి ప్రవర్తించకు! ఏ టైంకు ఎలా వుంటుందో!... పోనీ... ఒక పనిచేయ్! సెలవు పెట్టి కొన్నాళ్ళపాటు యింటికొచ్చెయ్!"

ఇంతసేపు నేను చెప్పిన సంగతులు బాగా ఆలోచించుకో!..."

"వేరే ఆలోచించేదేముందమ్మా... మొన్నామధ్య ఎవరో గురువుగారొచ్చారంటే... ఆఫీసు వాళ్ళమంతా వెళ్ళాం... ఆయన ఉపన్యాసం, నాకేమీ అర్థం కాలేదు గాని.. ఆయన చెప్పిన ఒకటి రెండు సంగతులు నాకూ నచ్చాయి. అవి, నా మనసులోకి ఎక్కాయ్... చెబుతా విను! **'శరీరం - శరీరంలోని మనసు... మనసులోని ఆత్మ... ఈ మూడూ 'త్రియిన్ వన్'... అలాగే, సంసారంలో భార్య-భర్త 'టూ యిన్ వన్'! వ్యవస్థలో కుటుంబం-సమాజం..., ప్రజాస్వామ్యంలో ప్రజలు-ప్రభుత్వం..., సోషలిజం-కమ్యూనిజం... క్యాపటలిజం - కలోనియనిజం... యివన్నీ టు యిన్ వన్నే! ఫ్యూడలిజం-ఫ్యాసిజం... అంతటా**

**కామన్**... యిలా సాగిపోయింది. ఆయన ఉపన్యాసం... ఇందులో కూడా నాకు కాస్త అర్థమైంది, మనసుకు నచ్చింది... సంసారం–కుటుంబాన్ని గూర్చే!..."

"అయితే యింకేం మరి! ఆ గురువునే నమ్ముకో! టు యిన్ వన్నే ఆన్ చేసుకో!"

"నమ్ముకోవడం కాదు నేను చెప్పింది. అలాంటివి, అసలు నాకు యిష్టం వుండదు. అయినా, ఎవరు ఏది చెప్పినా... అందులో మంచి వుంటే గ్రహించాలి గదా! మంచో–చెడో, నా జీవితంలో జరగవలసింది జరిగిపోయింది. కనుక, నాకు వేరే ఆలోచన లేదు... నా భర్తతోనే నా జీవితం! ఇది, నా నిర్ణయం!... ఏ పరిస్థితులలోనూ యిది మారేది కాదు..."

నీవు మూర్ఖురాలివి నీబాగు కోరి చెప్పిన తల్లి మాటలు కూడా నీచెవికి ఎక్కడం లేదు. ఇహ  చెప్పేది ఏముంది నీ బుద్ది కర్మనుసారే అనుభవించు...

"నా భర్త పేదవాడు కావచ్చు! కాని... పిరికివాడు మాత్రం కాదు... తగిన ఉద్యోగం, లేదన్నమాటేగాని... ఆయన చాలా తెలివైనవారు... డిగ్రీ హోల్డరు! ఎప్పటికైనా ఉద్యోగాన్ని సాధించి, సంపాదించగలరనే నమ్మకం నాకుంది. నా నమ్మకం వృధా పోదు."

"ఏమన్నావ్? డిగ్రీ హోల్డారా? పతి భక్తి ముదిరి బాగా తలకెక్కింది నీకు...!"

“అవును! నీకు తెలియదు. నాకు తెలుసు ఆ సంగతి! ఆయనకు ఇంజనీరింగ్ బ్యాచ్‌లర్ డిగ్రీ వుంది.”

“ఏమిటి నీవు చెప్పేది?”

“అవునమ్మా! ఆయన ఇంజనీర్ ఉద్యోగాన్ని కొనుగోలు చేయలేకపోవడంతో, ఆయన అలా వున్నారు.”

“ఉన్న డిగ్రీని దాచుకోవడమెందుకు మరి ఆ మాట ఆనాడే చెబితే, ఏదో ప్రయత్నం చేసే వాళ్ళం గదా! టెంత్ క్లాస్‌ని చెప్పడం ఎందుకు?... ఆ గొప్పలు నాకు చెప్పకు... అంతా బోగస్... మాయ!”

“నీవు పరమ మూర్ఖురాలివి! మాలాంటి పేదవాళ్ళు నిజం చెప్పినా, నీకు బోగస్‌గనే వుంటుంది. అప్పుడు మీరు ఒప్పుకున్న కట్నం యిచ్చినా... మా తిప్పలేదో మేం పడేవాళ్ళం! అదీ చేయలేదు... చీటికి మాటికీ... ఆయన్ని అవమానించడం ఒక్కటే మీకు తెలుసు... ఇదే చెప్పడం ఇహ మీదట ఆయన్ని గూర్చి ఏమీ మాట్లాడకు!... గేటు చప్పుడవుతోంది... ఎవరో చూచి వస్తాను....”

“నీవుండు! నేను వెళ్తాను... పోలీసులే బాబు ఏదో కొంప ముంచాడు నీ మొగుడు... ఏమిటండీ?”

“సుజాత ఎవరు?”

“మా అమ్మాయి! ఎవరు కావాలి మీకు?”

“ఆమె కోసమే వచ్చాం! ఒకతను సూసైడ్ చేసుకున్నాడు.

అతని పాకెట్‌లో వున్న అడ్రస్ ప్రకారం యిక్కడికొచ్చాం. అందులో అతని పేరు లేదు... శవాన్ని గుర్తు పట్టడానికి ఆమె రావలసి వుంటుంది. మీ మగవాళ్ళనెవరినైనా తీసుకొని? మీరు త్వరగా రావాలి..."

"అమ్మా!..."

# 10. బాధ్యత

"యుక్తవయస్సులో పెళ్ళిచేసుకోవడం, పుట్టి పెరిగిన వూరును, స్వంతవారిని వదలి – భర్తవెంట నడచి అత్తవారింటిలో అడుగుపెట్టడం... ఎందుకంటారు?... కన్నవారు తిండిపెట్టలేక కాదు, ఆడపిల్లకు పెళ్ళిచేసి పంపించేది! వయస్సును అనుభవించడానికి... వారసులను పొందడానికి... భర్త బ్రతుకులో భాగమైపోవడానికి... అలా స్వంత కాపురాన్ని సంతరించుకోడానికి... తనవారిని వృద్ధిచేసుకోవడానికే సుమా! అంతేగాని, ముసలివాళ్ళకు ముక్కు మూసుకుని మురికి చాకిరి చేయడానికి కాదు ఆడదానికి అదే బ్రతుకనుకుంటే... మా పుట్టింటిలోనే వున్నారు మానానమ్మ, ఆమె హీరో అండ్ కో!... ఇదిగో, యిదే చెప్పడంe మీపేరెంట్స్‌కు... అంటే నిత్య పేషెంట్స్‌కు నన్ను ఎటెండర్‌గానో, ఆయాగానో, ఎయిడ్‌గానో, మేయిడ్‌గనో - ఊహించుకోకు... ఒకరికి సేవ చేయడమనేది మానవత్వంతోనో, అభిమానంతోనో జరగాలిగాని మరొకరి అధారిటీ, అధికారంతో కాదు. నేను మీకు భార్యగా యింటి కోడలుగా వచ్చానేగాని మీవాళ్ళకు సర్వెంట్‌గా కాదు... ఇంతకూ, నామాటలు ఏవైనా మీచెవికెక్కాయా... నాగొంతు నొప్పేనా? "

"....................."

"ఏం మాట్లాడరే? "

"ఏమని మాట్లాడను? లాయర్ మోడల్‌గా నీవాయింపుతో నాబుర్ర బోరై పోయింది... ఏమీ తోచడంలేదు...

అయోమయంగా వుంది... అటు చూస్తే జన్మనిచ్చిన పేరెంట్స్– పేషెంట్స్... యిటు చూస్తే"...

"భార్య కమ్ సర్వెంట్... అంతేనా?"

"నేనేమీ అనకుండానే... అన్నీ నీవే అనేసుకుంటున్నావ్!"

"నాకు నేనుగా అన్నదేమీలేదు. మీ కుత్సిత బుద్ధిని బయటపెట్టాను... అంతే"

**"తెలివైన భార్య తెరచాపలాంటిది సంసార నావకు!"**

"ఇంకేం మరి? నావలో మీరు మౌనంగా కూర్చోండి స్వామీ! "సరంగుగా నేనే నడుపుకుపోతూ వుంటాను – సంసార నావను, మీరు కాస్త చుక్కాని దగ్గర కూర్చుని, దిక్కులు చూస్తే చాలు!"

"నాలాంటి తెలివి మాలినవానికి, నీలాంటి మేధావి భార్యగా లభించడం తలకు మించిన తలపాగాను పెట్టుకున్నట్లుంది... బ్రతుకంతా బుర్ర వూపడమే నావంతు?

"నాకు తెలుసు! నాతెలివి తేటనీరైతే... మీది దొంగ ఊబి! "...ఇహనైనా నామాటవిని, మీపేరెంట్స్‌ను వృద్ధాశ్రమానికి తరలించండి. అక్కడి వాళ్ళే చూచుకుంటారు, వాళ్ళకి కావలసినవన్నీ!"

" వాళ్ళు ఊరికే చేర్చుకోరు..."

ప్రతి నెలా డబ్బు చెల్లించాలి. అదెలా సాధ్యం?

“పోనీ… అనాథ శరణాలయమైతే…?”

“అందరూ వుండి, అనాథ శరణాలయమంటే అదెలా కుదురుతుంది?”

“…. అలా కాకపోతే ……… కాస్త దూరానికి ట్రాన్స్‌ఫర్ చేయించుకోండి. ”

“వీళ్ళతో నాకు పెద్ద సమస్యగా వుంది… ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు.

…ఆఫీసుకెళ్తాను”

“ఇవ్వాళ ఆదివారం! పేరెంట్స్ ప్రేమ మత్తులో వారాలు కూడ తెలియడం లేదు మీకు… మీకే కాదు, లోకంలో అందరికీ వున్నారు పేరెంట్స్…! కాస్త ,బుద్ధి మార్చుకోండి!”

_ _ _

“ఏంటీ కాఫీ నీవు తెచ్చావ్… ఆమె లేదా?”

“లేదు! వాళ్ళమ్మకు బాగోలేదట! పుట్టింటికిపోయింది”

“వరుసగా రెండు రోజులూ సెలవులేగా! నీవు కూడ యింటికిపోయి, మీ పేరెంట్స్‌ను చూచి వస్తే బావుండేది!”

“ఆ… ఏం వెళ్ళను? ఏదో సామెత చెప్పినట్లు, చుట్టమని చూడబోతే… దెయ్యమై వెంట పడ్డట్లు… పేరెంట్స్ ప్రేమతో నేను పోతే… ఏకంగా వచ్చి మాతోనే వుంటామంటున్నారు. వెళ్ళిందగ్గర్నుండీ వాళ్ళది యిదే నస!”

"పోనీ, తీసుకురావచ్చు గదా! ఎక్కడున్నా, వాళ్ళ బాధ్యత నీదే కదా! మీరంతా ఒక చోటేవుంటే... కొడుకు దగ్గర వున్నా తృప్తి వాళ్ళకీ వుంటుంది కదా?"

"నా భార్య ఒప్పుకోవడం లేదు... పైగా, నాకు ట్రాన్స్‌ఫర్ వచ్చే అవకాశం వుంది... నాతో పాటు వాళ్ళను నేనెక్కడ త్రిప్పుకోగలను లేనిపోని రిస్క్! ఎక్కడ వుండవలసిన వారు అక్కడుంటేనే మంచిది. ఎవరికి తోచినట్లు వారు బ్రతకొచ్చు, స్థాన చలనం అందరికీ కలిసి రాదు."

"అదేంటి అలా అంటావ్? వాళ్ళకు నీ వొక్కడివే కదా కొడుకువి"

"అందుకే, మహా చెడ్డ ట్రబుల్‌గా వుంది వాళ్ళతో... చెబితే అర్థం చేసుకోరు! వాళ్ళ ధోరణి వాళ్ళది! నా దగ్గరే వుంటామంటారు! భార్యకు యిష్టం లేని పనిని మగవాడు ఎలా చేయగలడు? కాదని చేస్తే... కలతలకు, కలహాలకు కారణమే కదా?"

"అదేంటి? భర్త మాట భార్య గౌరవించి, అనుకూలించాలి గదా! వాళ్ళు మీకు ఎవరో పరాయివారు కారు కదా! వృద్ధాప్యంలో కొడుకుల దగ్గర వుండాలనే కదా ఎవరైనా ఆశపడతారు... కని పెంచి, లైఫ్‌లో స్వయం పోషకులుగా సెటిల్‌మెంట్ చేసిన పేరెంట్స్‌కు ముసలితనంలో వాళ్ళ అవసరాలను తీర్చవలసిన బాధ్యత ముఖ్యంగా కొడుకులపై వుంటుంది."

"కన్న మమకారంతో పిల్లల్ని పోషించడం, పశువులు,

మృగాలతో సహా అన్ని జీవులూ చేసే పనే! ఇందులో మనుషులకు ప్రత్యేకత ఏముంది? స్వంతంగా బ్రతకగలిగిన ఏజ్‌లో, స్టేజ్‌లో వేటి దారిన అవి పోతాయి! జన్మనిచ్చినందుకు ముసలితనంలో పోషించాలనే నియమం వాటికి వుందా?... వాటికంటే కాస్త ఆలోచన, బుద్ధి కలిగిన కారణంగా మనుషుల సంబంధాలు కొంత భిన్నంగా వుంటాయి. అవి వారివారి యిష్టాలమేరకుగాని డిమాండ్‌తో కాదు.”

“డిమాండ్ కాదది... పిల్లల బాధ్యత! కన్నందుకు, పిల్లల్ని రక్షించి పోషించుకో వలసిన బాధ్యతతోపాటు, వారికి బ్రతుకుతెరువును చూపించడం ఎలాంటిదో... జన్మనిచ్చినందుకు వృద్ధాప్యంలో వాళ్ళను పోషించడం వారికి పుట్టిన వారి బాధ్యత! తప్పనిసరి ధర్మనిర్వహణ !”

“నీవన్నట్లు జన్మనిచ్చినందుకు ఎవరిపిల్లల్ని వారు పోషిస్తూ రక్షించుకోవలసిన బాధ్యతా, సూత్రం అందరికీ వర్తిస్తుందికదా! అందులో పేరెంట్స్ ప్రస్తావనే ప్రత్యేకంగా ఏముంటుంది?... ఇదే ఫార్ములా ప్రకారం తాము కన్న పిల్లలకు పెళ్ళికానంత వరకే వారు తమ పిల్లలుగ వున్నప్పటికి, వివాహాల తరువాత ఆపిల్లలే మరొకరికి భార్యగనో... భర్తగనో మారి, దరిమిలా ఎవరి సంసారం, సంతానం వారికి యేర్పడి, తమ మాదిరే వాళ్ళు పేరెంట్స్‌గా ఎవరి బాధ్యతలను వారు నిర్వహిస్తున్నప్పుడు, తాతల తరంలో వున్న వారు, తాము కన్నవారినుండి ఏదో ఆశించడం, పైగా దానిని ‘తమ’ హక్కుగా భావించడం సహేతుకం కాదు...

వివాహానంతరం తమ కొడుకు జీవితాన్ని మరో మనిషి భార్యగా, జీవిత భాగస్వామినిగా పంచుకున్నపుడు, తనను కన్నవారి విషయంలో ఆ కొడుకుకు వ్యక్తిగత స్వేచ్ఛ ఎలా వుంటుంది? ఆ స్థితిలో ఎవరి ఫామిలీ బాధ్యత వారిదేగదా! అందులో ఆ భార్య-భర్త పరస్పర సమ్మతి సహకారమే ముఖ్యంగా వుంటుంది కదా?"

"నీవన్నది పాక్షికంగా రైటే కావచ్చుగాని, అది పూర్తి కరెక్ట్ కాదు. వృద్ధులైన పేరెంట్స్ విషయంలో... వారికి వారసులైన వారి పిల్లలకు బాధ్యత లేదా? "

"ఉంటుంది! అది ఎంత వరకు? 'తన' కుటుంబం తరువాతే గదా ఎవరైనా, ఏదైనా? తన కుటుంబ భారాన్ని మోస్తున్న 'కొడుకు'ë పేరెంట్స్‌కైనా, తన శక్తికి మించి ఏంచేయగలడు? పేరెంట్స్ యీవాస్తవాన్ని గుర్తించాలిగదా? ఆ అవగాహన వారికి లేనప్పుడు... ఏకొడుకైనా తన భార్య సమ్మతి లేక వారికి చేయగలిగింది ఏముంటుంది?... మరో ముఖ్యవిషయం చెబుతాను వినుë నాకోసం... నాభార్య తెచ్చిన కట్నంతోనే మాచెల్లి పెళ్ళిచేయడం జరిగింది... అంటే... ఏమన్నమాట? మాపేరెంట్స్ కన్న కూతురుకు వాళ్ళకోడలు పెళ్ళి చేసినట్లేకదా! ఆమె మంచితనం తెలియడానికి, యిది ఒక్కటి చాలదా?... పైగా, మా అవసరాలు ఎలా వున్నా, ప్రతి నెలా ఉన్నంతలో ఎంతో కొంత పంపిస్తున్నాను. ఇంకా ఏంచేయ్యాలి వాళ్ళకు నేను?... నాదగ్గరకొచ్చి వుంటామంటారు, ఎలా? ఓపిక వున్నంతవరకు ఎవరి బరువును వారే మోస్తూవుంటే... అవసరమైతే, కొంత ఆసరాగా చేయి అందించగలం... మొత్తం

ఎత్తుకు తిప్పాలంటే... ఎవరికి మాత్రం సాధ్యం?... పేరెంట్స్‌కైనా కొంత కామన్‌సెన్స్ వుండాలి !"

"కొన్ని పరిస్థితులలో కాపురం చేయకపోయినా... భార్యకు, భర్త భరణం యివ్వడం ద్వారా ఆమెను పోషించాలి! అలాగే, జన్మనిచ్చిన పేరెంట్స్‌ను వృద్ధాప్యంలో వారి కొడుకులు పోషించాలి ఇది లీగల్ విధానమే! ఇందులో బాధ్యతతోపాటు, చట్ట సమ్మతి కూడా వుంది. ఇది ఆచరణ పౌరధర్మమే! బలవంతం కాదు... దానధర్మం, త్యాగశీలత అంతకన్నా కావు... ముసలితనంలో తమపోషణకు ఆధారం లేనప్పుడు, అందుకు తమకు వారసులైన తమ కొడుకులను డిమాండ్ చేసే జీవిత హక్కు పేరెంట్స్‌కు వుంది. అవసరమైతే... కోర్టుద్వారానైనా దానిని సాధించుకునే అవకాశం వారికి వుంది. ఇందులో ఎవరి సమ్మతి అవసరం లేదు... అయితే, దానిని తమ బాధ్యతగా వారసులు గుర్తించగలిగినప్పుడు ఏచట్టమూ అవసరం లేదు... **జన్మబంధంలో ప్రేమ, అనురాగం.... అన్నిటికంటే శక్తివంతంగా పని చేస్తాయి...**"

"నీతిసూత్రాలు చట్టాలు పౌరధర్మాలు. వ్యక్తిబాధ్యతలు... వీటిని గూర్చి నీవు, నాకైతే చెప్పావుగాని... ఇవే చుట్టు తిరిగి, నీదాకా వస్తేగాని తత్వం బోధపడదు నీకు! ఇప్పటివరకు నీవు 'ఫ్రీ బర్డ్'వి! ఇంకా, కన్‌సార్ట్ (Consort) కళ్ళెంపడలేదు కనుక, రిసార్ట్ (Resort) లీజర్ రిలీఫ్‌గా అందరికీ ఉచితసలహాలు, స్పీచ్‌నిస్తూ నీమాతృభక్తిని, పితృభక్తిని చాటుకుంటున్నావ్. వైఫ్

వస్తే తెలుస్తుంది అసలు, లైఫేమిటో?... అనుభవంతో చెబుతున్నాను, వినుకో! జన్మనిచ్చి, స్వతంత్రంగా బ్రతికే స్థాయికి తెచ్చిన పేరెంట్సంటే ప్రేమ లేని వారెవరుంటారు? అది రక్తంలోనే పుట్టి పెరుగుతూ బ్రతుకంతా తిరుగుతూనే వుంటుంది... దీనిని చెప్పడానికి చట్టం అక్కర్లేదు... సర్కారు అవసరం లేదు... కాని, పరాయి మనిషి భార్యగా జీవితంలో ప్రవేశించి, తనకుగా ప్రత్యేక 'కుటుంబం' యేర్పడిన తరువాత 'తనది' అనే భావమే నానాటికీ పెరిగిపోతూ... భార్య పిల్లల్నే 'తన' వారిగా భావించుకునే స్థితి మనస్సులో స్థిరపడిపోతుంది. దాదాపు యిది ఏదో రూపంలో ప్రతి జీవికీ సహజం...! అదే రీతిలో తన పేరెంట్స్ తనకు పరాయి వారుగా అనిపించకపోయినా వారి పట్ల పూర్వపు సన్నిహితం... 'నా' భావం క్రమంగా సన్నిగిల్లిపోతుంది. చివరికి, ఆ బంధం- బాధ్యత- సమాజ లాంచనంగా మాత్రమే మిగిలిపోతుంది. ఈజీవిత వాస్తవాన్ని పేరెంట్స్‌గా అందరూ గుర్తించి, ఆమేరకు కొడుకులు కోడళ్ళ పట్ల తమ ఆలోచనా విధానాన్ని... ఆశించడాన్ని మార్పుచేసుకుంటే... వారి మధ్య బంధం భద్రంగానే వుండి సమస్యలకంటే సామరస్యతే ఎక్కువగా వుంటుంది. అందుకు భిన్నంగా, కన్నందుకు కొడుకులుపై తమకేదో ప్రత్యేక హక్కు వున్నట్లు డిమాండ్‌ను ఫీలయితే... ఉ భయులకూ యిబ్బందులే తప్ప, ప్రయోజనం శూన్యం...! ఏమంటావ్?"

"ఏమంటాను? నీవు పూర్తి స్థాయి భార్య లోలుడివి... హెన్‌పెక్డ్ హీరోవి అని అంటాను...."

"నన్ను నీవు ఏమన్నా నాకు అభ్యంతరంలేదు గాని... నీవు, త్వరగా పెళ్ళి చేసుకో! ఎవ్వరో చెప్పకుండానే నీబుద్ధికి జ్ఞానోదయమవుతుంది. అప్పుడు నీవు పెళ్ళాం గచ్ఛామీ అంటావో లేక పేరెంట్స్ గచ్ఛామీ అంటావో నేనూ వింటాను. ఎందుకైనా మంచిది డబ్బులున్న అమ్మాయినే చేసుకో! జీవిత వాస్తవం ఏమిటో దాని డెప్త్... రోజు వారీ లెఫ్ట్, రైట్ సీరియల్‌గా తలకెక్కుతుంది... "నీకూ వున్నారుగా పేరెంట్స్... నేనూ చూస్తాను యీనాటి నీ నీతుల నిజాయితీ!"

"చేసుకున్న సీనియర్స్‌ను చూస్తున్నానుగా! ఇంకా సెల్ఫ్ ప్రాక్టికల్స్ ఎందుకులే!"

"అంటే... పెళ్ళి చేసుకోవా ఏమి?"

"కావాలి అనుభవం గైడ్‌గా లైఫ్‌కు... స్వీయ ప్రయోగమే స్వీకారమంటే ప్రతివారూ... నేర్పేదెవరు? దాన్ని నేర్చేదెవరు?

**ఇమిటేషన్ మస్ట్‌బి ఇన్ లిమిటేషన్... బోత్ ఇనోవేషన్ అండ్ ఇన్షియేషన్... ఆట్ టు బి..."**

**యాజ్ యానోటేషన్ and కానోటేషన్..."**

"అవన్నీ సోషల్‌స్లోగన్స్... ఫ్లయింగ్ కిసెస్‌లాంటివి... నేను చెప్పేవి సంసార నిత్య వ్యవహారం, విత్ 'ప్రాక్టికల్ మిసెస్'... భేదం తెలియాలి..."

ఆభేదమే తెలిసిన వాడివైతే నీ పేరెంట్స్ విషయంలో భార్యచాటు మాటలు మాట్లాడవు"

“నావి భార్యచాటు మాటలు కావు... ఆమె ప్రాక్టికల్ పర్సన్! అందుకే, నాభవిష్యత్‌కు మా ఫాదర్ ఖర్చు చేసిన దానికంటే ఎక్కువుగానే నాభార్య నాపేరున తెచ్చిన కట్నం సొమ్మును ఆయనకు యిచ్చివేసి, నన్ను పితృ ఋణ విముక్తునిగా చేసింది... ఇప్పుడు చెప్పు నేను ఎవర్ని గూర్చి మాట్లాడాలి?”

“తండ్రి పిల్లల మధ్య పెట్టుబడులు ఋణాలు వుండవు. జన్మబంధంలోనే అవన్నీ యిమిడివుంటాయి... ఆవిషయంలో నీఅవగహన తప్పు!”

“ఆ జన్మబంధం కారణంగానే నా అవసరాలు తగ్గించుకుని, వాళ్ళ పోషణార్ధం ఎంతో కొంత యిస్తున్నాను... దానితో తృప్తి పడక ఏకంగా యింటిలోకే చేరి పోతామంటే ఎలా?”

“అలా అనడంలో వాళ్ళ ఉద్దేశ్యం... నీవనుకున్నట్లు కాక వేరుగా వుండవచ్చు... కలిసి వుంటే ఖర్చుకొంత తగ్గవచ్చు. ఓపిక వున్నంతలో మీకు చేదోడుగా వుండవచ్చు. ముఖ్యంగా, పిల్లల్ని చూస్తు తృపి చెందవచ్చు. ఆవయస్సులో ముఖ్యంగా ఎవరైనా కోరుకునేది అదేగదా! అందుకే... ప్రస్తుతం మన వయస్సులో, వాళ్ళు పేరెంట్స్‌గా తమ పిల్లల్ని సాకారు... అలాగే, ప్రస్తుతం మనం వాళ్ళను మన పిల్లలుగనే ఆదరించాలి”

“నీవు చేప్పే అర్ధంలేని మాటలకు, యిప్పుడు మాఆవిడ వుంటే... తగిన సమాధానం చెప్పి నీనోరు... మూయించేదే! అది నావల్ల కావడంలేదు... బతికిపోయావ్‌పో!”

“సరే! నీయిష్టం! ఆవిడ శరణం గచ్ఛామిగనే,

బ్రతుకులాగించు... వస్తా..."

– – –

"మీరు మేరేజెందుకు చేసుకోలేదు?"

"ఈప్రశ్నే నేను మిమ్మల్నడిగితే... ఏం చెబుతారు?"

"చెబుతాను! దేనినైనా కొనవలసిన వారికే కదా డబ్బు అవసరం? సకాలంలో దానిని సమకూర్చుకోలేని వారికి అన్నీ.... లోటే... లేటే! అమ్ముకునేవారికి, అమ్ముడుపోయేవారికీ ఆసమస్య పెద్దగా వుండదు."

"దేనికైనా ముందుగా పెట్టుబడి లేకపోతే... అమ్ముకోడానికైనా ఏముంటుంది?"

"మీరన్నది వస్తు మార్కెట్!... మేరేజ్ అలా కాదు కాకూడదు... వస్తువు అసలు ఖరీదు– టాక్స్–సెస్–లోకల్ టాక్సెస్– సర్వీస్ చార్జీలు–ప్లస్ లాభం– ఇన్ని కలిసి వస్తువు కొనుగోలుకు సిద్ధమవుతుంది. అలాగే వరకట్నం – బంగారం – ఆడబిడ్డ కట్నం – అల్లుడి లాంచనాలు – కానుకలు... ఏవిటిదంతా? అగ్ని సాక్షిగా పెళ్ళి పేరుతో రెండు జీవితాల పవిత్రబంధం, జరగవలసిన విధానమేనా యిది?... ఏదో తిప్పలు పడి, అడిగినవన్నీ సమర్పించి కొనుగోలు చేసినా... అల్లుడి అలక – ఆడబిడ్డ పెత్తనం – అత్త సతాయింపు– మామ సణుగుడు... మానవత్వం గలవారు చేయవలసిన పనులేనా యివి? దరిమిలా కాపురం చేసి పిల్లల్ని కన్నా ... ఉద్యోగం ఎరియర్స్ అడిగినట్లు

– బోనస్ డిమాండ్ చేసినట్లు, అదనపు కట్నం వసూలుకు, ఆజ్ఞలు – అల్టిమేటమ్! కాదంటే, కిరోసిన్ బోర్లింపు, అగ్నిప్రవేశం చేయించడం. రాముని భార్య సీతాదేవి గనుక బయటికి రాగలిగింది. అందరికీ అలా అగ్నిదేవుడి కన్సెషన్ వుండదు కదా?" ఏవిటీ యీ కిరాతకపు పనులు? రాక్షసులుగా పేరు పడిన వారైనా చేశారా యిలాంటి నీచపు పనులు?"

"ఇలా అయితే.... మీకు మేరేజ్ కావడం... కష్టమేనండీ!"

"అసలు, అదికావాలనుకుంటేనే గదా, కష్టం, నష్టం అనుకునేది?"

"మీ మేలుకోరి నాదో చిన్న సలహా! చెప్పమంటారా?"

"చెప్పండి...!"

"కనీసం మీకు పెండ్లి జరిగే వరకైనా మీరు ఫెమినిస్ట్ ఆరేషన్స్ చేయకండి!... ఆ తరువాత ఎలా మాట్లాడినా వ్యక్తిగతంగా నష్టం వుండదు. అప్పటికీ అవసరమైతే భర్తకు బెత్తం చూపడానికి ఫామిలీ కోర్టులున్నాయి కనుక అంతవరకూ మీరు కాస్త స్పీడ్ తగ్గించండి. ప్లీజ్!"

"అలాంటి దానినే అవకాశవాదమంటారు! అవసరాలు తీర్చుకుని, ఆశయాలను వల్లించడం ఆత్మవంచనే!"

"మీ మిలిటెంట్ మార్చింగ్ చూస్తుంటే... మేరేజ్ చేసుకుని మీరు మరో అమాయక జీవిని అవస్థలపాలు చేసేకంటే... యిలా వుంటేనే మంచిదేమోనండి!"

"అమాయకులు, అబలలు ఆడవాళ్ళే సుమా! ఏకాలంలోనైనా మగవాడి జులుం తగ్గిందెప్పుడు? ఆడదానికి న్యాయం జరిగిందెప్పుడు?"

"వరకట్నమంటే... మీకింత కసెందుకు? భారీగా కట్నకానుకలతో కన్యాదానం చేయడం ద్వారా మీరన్నట్లు తమ కూతురుకు భర్తను కొనిపెట్టడం... ఆడపిల్ల పుట్టింటి వారికి గొప్ప ఘనతే గదండీ! అలాగ అత్తవారింట్లో కోడలికి అధికార స్థాయి గౌరవం లభిస్తుంది గదా!"

"మీ ధోరణి చూస్తుంటే... ఎక్కడో నిలువు దోపిడికి వలపన్ని... చెట్టు చాటున వెయిటింగ్‌లో వున్నట్లుంది... ఇదే చెప్పడం కట్నం తీసుకుని మీరు పెళ్ళి చేసుకున్నట్లు తెలిస్తే... మా మహిళా సంఘం వారితో దాడి చేయించవలసి వుంటుంది. కేసు పెట్టడం!... పెళ్ళికొడుకు కాళ్ళూ చేతులు కీళ్ళు తప్పించేస్తాం... తరువాత మీ యిష్టం! బాగా అలోచించుకోండి!"

"కట్నం తీసుకుంటే... కీళ్ళు తొలగిస్తామంటున్నారు... అది సరే! ఒకవేళ... కట్నం వద్దంటే... దండేస్తారా మెడలో...?"

"...ఎవరు?"

"దాడి చేస్తామనేవారు...!"

"......................."

"ఏం అలా చూస్తారు?... మాట్లాడరేమి?"

"ఇదో హైటెక్ మోసం...!"

"విన్నవి... కన్నవి... అన్నిటినీ అనుమానిస్తే... ఎలాగండీ బాబూ మీతో?"

"నాతో ఏవిటి?"

" మేరేజ్...!"

"......................"

"ఎన్నాళ్ళనుండో వెయిటింగ్‌లో వుండి, ఇన్నాళ్ళకు ధైర్యం చేసి, నామనసును మీ ముందుంచుతున్నాను... కల్మషంలేని మీమనసు... యదార్ధత... నన్ను ఆకర్షించాయి. నేను కోరుకునే నా జీవిత భాగస్వామినికి మీనిర్భయ లక్షణాలే వుండాలని కోరుకుంటున్నాను... మిమ్మల్ని చాలా కాలం నుండి అబ్జర్వ్ చేస్తున్నాను. మీ ప్రతి కదలికలోనూ, ప్రవర్తనలోనూ నాకు కావలసినవన్నీ వున్నాయి... మిమ్మల్ని... ప్రేమిస్తున్నాను... తుది నిర్ణయం మీదే!"

"మేం పేదవాళ్ళం!"

"కాదు... ఏమాత్రమూ కాదు. పరిపూర్ణ వ్యక్తిత్వం, మానవత్వం... మీలో నిండుకుండలా వున్నాయ్! డబ్బు లేకపోవడం ఒక్కటే పేదరికం కాదు. నాగురించి కూడా మీరు యిలాగే అనుకుంటే... నాప్రపోజల్‌ను ఆలోచన చేయండి. **జీవితమంటే మనుష్యుల సమీపతే కాదు, మనసుల సన్నిహితం కూడా** ముఖ్యం! నా గురించి పూర్తిగా స్టడీ చేయండి. త్వరపడవద్దు... మరో మాట కూడా మీకు చెప్పాలి...

చెప్పమంటారా?”

“చెప్పండి! ముగ్గులోకి లాగుతున్నారుగా!… మీరన్నట్లు, మనసులు సన్నిహితం కావాలంటే - వాటిలో చాటు - మాటుe మాయ- మర్మం వుండకూడదు. అదేదో చెప్పండి వింటాను”

“సాధారణంగా భార్య చేసే బ్రెయిన్ వాష్‌తో అప్పటి వరకూ పేరెంట్స్‌పై వుండే ప్రేమను వాష్‌ఫ్రుట్ చేసుకుంటారు చాలామంది సుపుత్రులు! అది నాకు యిష్టంలేదు… జన్మనిచ్చి, జీవితాన్ని అందించిన పేరెంట్స్ నాదృష్టిలో ఎప్పుడూ దైవసమానులే! అయితే… ఆ అవగహన భార్యలో కూడా వుండాలి! తన భర్త - పిల్లలు తప్ప భర్త తరుపు తక్కిన వారితో తనకు ఎట్టి సంబంధం లేనట్లు, వారి పట్ల శత్రు భావంతో ప్రవర్తించకూడదు. తన తల్లితండ్రులను వదలి మరో యింటికి కోడలిగా వచ్చినా… తన భర్త పేరెంట్స్‌నే తనవారిగా భావించి, వారితో ఆప్యాయతతో ప్రవర్తించాలి! తన భర్త తన స్వంతం అనుకోవడంలో తప్పులేకపోయినా… వృద్ధాప్యంలో వున్న తన భర్త పేరెంట్స్‌ను కూడా అలాగే భావించి వారికి సేవచేయాలి! అలాకానప్పుడు భార్య - భర్త మధ్య దూరం పెరిగిపోతూ జీవితాలు అశాంతి పాలవుతాయి! ఇలాంటి ఊహలు, ఆశయాల కారణంగానే యింతకాలం మేరేజ్ పట్ల ఎక్కువగా ఆలోచన చేయలేదు… జీవిత భాగస్వామినిగా వచ్చిన వ్యక్తి… అంతవరకు కలిసి వున్న జీవితాలను దూరం చేస్తే… ముఖ్యంగా పేరెంట్స్ విషయంలో - అది నేను భరించలేను… ఈతరహా నా ఆలోచనలు మీకు

హితవుగా, సమ్మతిగా, మోడ్రన్ హైటెక్‌గా అనిపించకపోవచ్చు! అయినా నామనోభావాలను స్పష్టంగా మీముందుంచాను... వాటితో సహా నావ్యక్తిత్వాన్ని డీప్‌గా స్టడీచేసి, అన్నివిధాలా అది పాజిటివ్‌గా వుంటేనే... నాతో మేరేజ్ ప్రపోజల్‌ను అంగీకరించండి! అది ఏదైనా నాకు సమ్మతమే!"

"అలాగే, మీరు చెప్పినట్లే చేస్తాను..."

"నేను చెప్పినట్లు చేయడంకాదు. మీరుగా నిర్ణయం తీసుకోండి! ఆతరువాత నన్నేమీ సాధించవద్దు!"

"మీకంటికి నేనలా కన్పిస్తున్నానా?"

"సారీ!... కోపంలో కొందరి అందం... ఎక్స్‌ట్రుది పవరాఫ్ ఎన్ అవుతుంది"

"పొగిడేవారిని నమ్మకూడదు అలాంటివారి మనసు పొరల్లో తెరచాట్లు వుంటాయి"

"నామనసులో వున్నదేదో, సుస్తాగా చెప్పాను. దానికి చాటు మాటు... ఏమీలేవు! మీయిష్టం!"

"వస్తానండి! మళ్ళీ కలుద్దాం!"

"నిర్ణయాన్ని వాయిదావేయవద్దు!"

"వస్తానండి...!

– – –

"ఒంటరిగా వుంటున్నావ్... తుంటరి పనులేమి చేయడంలేదుకదా?

"చేయాలనేవుంది... ఏదీ నావల్ల కావడం లేదు"

"అదేమీ?"

"ఆకలీవుంది... ఆహారమూ వుంది... అయినా అనారోగ్య ఆంక్షల్లో ఆరగించేదేముంది? సుగర్ పేషెంటునని భావార్ధం!... అలాగే మనసూ వుంది... దానికి కోరికా వుంది. కాని శరీరం సహకరించడంలేదు, ఇహ జరిగేదేముంది... జాకీ చేసే హుషార్‌కు, 'సై' అంటూ గుర్రం రెచ్చిపోతేనే గదా, రేస్ గెలుపు? మధ్యలో బుద్ధి, గాలి వాటంగా వ్యవహరిస్తోంది... వెరిశి, ఉ పయోగం నిల్... అపవాదు ఫుల్!"

"ఎవరు ఏమనుకున్నా... నీమనసులోని నిజం నీకు తెలుసుగదా!"

"మనసులో నిజం, బుద్ధిలోని శుద్ధి, మాట, చేత ద్వారానే గదా తెలిసేది?"

"ఈమధ్య ఎవరో లేడీ వస్తూపోతూ వుందని విన్నాను..."

"వినడం ఏవిటి? వస్తూనే వుంది!"

"ఎవరామె?"

"మాచెల్లెలు! మాకు పిత్రార్జితం కొద్దిగా వుంది. నాకు భార్య బిడ్డలుగా వేరే వారసులు లేరు కనుక నా ఆస్తి హక్కును

తన పిల్లల పేర వ్రాసి యిమ్మంటోంది! నా తదనంతరం తనకు చెందేటట్లు ‘ విల్లు’ వ్రాస్తానంటే అలా కాదంటుంది”

“అదేమిటి  అలా అనకూడదు కదా?”

“ఆస్తి విషయంలో అనుకోకూడనిది, అనకూడనిది అంటూ ఏముంటుంది? అదేమంటే... ముందు జాగ్రత్తకోసమట! నిజానికి మొదటి నుండి తుది వరకు మాపేరెంట్స్‌కు వుపయోగపడుతూ అన్నీ చేసింది నేనే...! ఆమె వాళ్ళ దగ్గరకే వచ్చేది కాదు... మాతల్లి తుది ఘడియల్లో  తాను వచ్చి ఆమె నగలు తీసుకుపోయింది. ఉన్న స్థిరాస్తి మాత్రం మాతండ్రిగారి స్వార్జితం. ఆమెకేమీ సంబంధం లేదు. అయినా అది కూడా తమకే కావాలని, అలా వ్రాసి యివ్వమని ఒత్తిడి చేస్తోంది. అదుగో... ఆ స్వార్థ కార్యసిద్ధికి నాయింటికి వచ్చిపోతూ వుంది... ఎవరి బాగోగులూ ఆమెకు అక్కర్లేదు...”

“ఉహకు వాస్తవానికీ ఎంతదూరం? నీకు సొంత వారసులు లేకపోవడమే కదా దీనికంతకూ కారణం... నీవు పెళ్ళెందుకు చేసుకోలేదు? అదేకదా? యీనాటికి మీచెల్లెలుకు ప్లస్ పాయింటయింది!”

“ప్లస్... మైనస్..., దేనిదారిన అది పోగా..., ప్లస్ ఆర్ మైనస్‌గా మిగిలిపోయింది జీవితం!

“అందుకు ఏదో బలమైనకారణం వుంటుంది?”

“ఉంది! జీవితానికి సంబంధించి **అవసరం, కారణంగా”**

**అదే ఆలోచనకు, ఆచరణకు చేరి ఫలితాన్ని అనుభవంలోకి తెస్తుంది** ఇది నా అవగాహన మాత్రమే! జీవితంలో జరిగే చిన్నతప్పే ఒక్కోసారి జీవితాంతం పెనుముప్పుగా పెరిగిపోతుంది. పేరెంట్స్‌కు సేవ చేయడం వారికి పుట్టిన వారికి ప్రథమ కర్తవ్యమనేది నాదృఢవైఖరి! వివాహం అందుకు అవరోధం కావచ్చునేమో అనేది కూడా ఒకప్పటి నాఆలోచన! భర్తను, పిల్లల్నీ తనవారిగా భావించడం భార్యకు సహజం! ఆమేరకు తనభర్త పేరెంట్స్‌ను 'తన' అనే భావనకు ఆమెలో అవకాశంవుండదు. భర్తకు కూడా 'తన' భార్య – పిల్లల మమకారం తప్పనిసరి! అదే రీతిలో 'తన' పేరెంట్స్ అనే ప్రేమ అభిమానం తప్పనిసరి? ఈరెండిటి మధ్య కొడుకు నలిగిపోతున్నాడనే బాధ పేరెంట్స్‌కు... వుంటుంది. వీటన్నిటినీ సమపాళ్లలో సరిదిద్దుకోవడం అందరికీ సాధ్యమయ్యేది కాకపోవచ్చు. అందుకే... అసలు పెళ్ళి ప్రమేయమే లేకపోతే... సమస్యకి తావుండదుగదా అనే పొరపాటు ఆలోచన, అంచనాతో వయసు గడిచిపోయింది. దాని ఫలితం జీవితవ్యాప్తమైంది. మా పేరెంట్స్ జీవితాలు సుఖంగానే గడిచాయి. ప్రశాంతంగానే ముగిసాయి! కాని... నేను దిక్కులేనివానిగా మిగిలి పోయాను."

"పెళ్ళిచూపులు ఒకరోజు ముచ్చటే! కాని అది మంచిగనో, చెడుగనో జీవితబంధమే! దానిని భరించక తప్పదు... అలాగే పేరెంట్స్‌కు సంబంధించి ఏదైనా – కొన్నాళ్లే!... ఈవిచక్షణ లోపమే యీనాటి నీ సమస్యకు మూలకారణం! నీవన్నట్లు జన్మనిచ్చిన వారికి సేవచేయడం పుట్టినవారికి కర్తవ్యమే!

కాదనను... అయినా ఇది థీయరీ మాత్రమే! దాని ఆచరణలో విచక్షణ అవసరం! పేరెంట్స్‌కు సేవచేయడానికి పెళ్ళి మానుకోవాలా? పేరెంట్స్‌గా మారాలంటే పెళ్ళి జరగాలి, పిల్లలు పుట్టాలిగదా! అప్పుడే గదా పిల్లలతో సేవచేయించుకునే అవకాశం పేరెంట్స్‌కు వుండేది? మీరుండి మీపేరెంట్స్‌కు అన్నీ చేసారు. మీవృద్ధాప్యంలోను, అనారోగ్యంలోనూ మమ్మల్ని పేరెంట్స్‌గా భావించి, సేవచేసే పిల్లలేరి? మీకు మీ పేరెంట్స్ సేవపేర పెళ్ళి మానుకోవడం ఎంతటి తీవ్రమైన పొరపాటో గ్రహించారా?... అయినా యిందుకు మీపేరెంట్స్ ఎలా అంగీకరించారో అర్థం కావడం లేదు. తరాల వారసులను కోరుకోవడం ఎవరికైనా సహజమే కదా?"

"వాళ్ళు నిత్యం పోరుతూనే వుండేవాళ్ళు! మా చెల్లెలు మాత్రం వాడికి యిష్టంలేనపుడు వాణ్ణిలా బలవంతపెట్టడం ఎందుకనేది... దాని మీనింగ్ నాకు యిప్పటికి అర్థమైయింది..."

"బంధాలు, బంధుత్వాలు ఎలాంటివైనా స్వార్దం సర్వాన్నీ కప్పేస్తుంది. ఇది మనిషి రక్తంలోనే వుంది. అయినా, పేరెంట్స్ కోసం పెళ్ళిమానుకోవడం ఏవిటో నీమనస్థత్వం నాకు బోధపడడం లేదు..."

"దానికి కారణం వుంది. నా స్నేహితునికి పెళ్ళికాకముందు తన పేరెంట్స్ అంటే ఎంతో భక్తి, ప్రేమ, భయం వుండేది. వివాహం దరిమిలా భార్య ప్రభావంలో పడిపోయి వృద్ధాప్యదశలో... పైగా అనారోగ్యస్థితిలో వారిని పూర్తిగా

నిర్లక్ష్యంచేశాడు. కొడుకుతో కలసివుండాలని వారు ఎంతగా తపించినా, అతని భార్య అంగీకరించలేదు... అతనూ ఆమెతో పాటే! తిండికి గడవకా, చివరకు ఆ వృద్ధదంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆ దృశ్యం నామనసును కలచివేసింది. అయినా ఆ కొడుకుకు అదేమీ అనిపించలేదు. ఏదో లాంఛనంగా వారికి ఉత్తర క్రియలు జరిపి, మైల మాపుకున్నాడు. కారణం ఏదైనా ఆసంఘటన నామనసులో ముద్ర పడిపోయింది... నా పేరెంట్స్‌కు అలా జరగకూడదు... నిజానికి అతను మంచివాడే! కేవలం భార్యకారణంగానే అతను అలా మారిపోయాడు... నా స్థితి అలా కాకూడదనే వుద్దేశ్యంతో పెళ్ళి విషయంలో శ్రద్ధ తీసుకోలేదు... అయినా నాకు జన్మనిచ్చిన వారికి ఏలోటు రాకుండా చూచుకున్నాను... ఆ తృప్తి చాలు యీ జీవితానికి!"

"నిజమే! నీమనసు మంచిది! ఉదాత్తమైనది, ఉత్తమమైనదే! అయినా తననుమాలిన ధర్మం..., తగదు కదా! పేరెంట్స్‌గా వుంటేనేకదా పిల్లలు సేవచేసేది! కుటుంబమేలేని స్థితిలో 'తన'వారి 'సేవ'కు అవకాశం ఎక్కడిది? **కుటుంబ బంధం కారణంగానే వ్యక్తికి సమాజబాధ్యత ఏర్పడుతుంది.** బలవంతపు 'బాధ్యత' బాధాకరమే అయినా సమస్యకు కొంత పరిష్కారం వుంటుంది. బంధువులు కుటుంబసభ్యులు కాలేరు. కార్యక్రమాల హాజరువరకే వారి ఆనవాయితీ! కనుక, ఏవ్యక్తికైనా 'నా' అనే ఆధారం కుటుంబం ద్వారానే యేర్పడుతుంది. రక్తసంబంధాలు, దరిమిలా బంధుత్వాలుగా, దూరపు బంధువులుగా తరాల గమనంలో మారిపోయినా, కుటుంబ బంధం మనిషికి ఎంతో అవసరం.

నీచెల్లెలు దీనిని బాగా గుర్తించి, జాగ్రత్తపడుతోంది...తనవాళ్ళు అందరూ వుండి, ఆస్తి వున్నవారు కూడా వృద్ధాప్యంలో దిక్కుమాలిన జీవులుగా రాలిపోతున్నారంటే... 'నా' అనేవారు లేని స్థితిని ఊహిస్తేనే ఎంతో భయంకరంగా వుంటుంది... అందుకే సలహా యిస్తున్నాను... ఇప్పటికైనా ఫర్వాలేదు. వయస్సు అరవై లోపే గదా! జోడీకోసం ప్రయత్నించు... అందుకు నాహెల్ప్ కావాలంటే నేనురెడీ!"

"మీజోక్‌కు ఐలింక్స్! యాభై ప్లస్ పెళ్ళాంతో లాభమేమి? షష్టిపూర్తి మొగుడితో సుఖమేమి? దొందూ దొందే! కాళ్ళకు బంధాలే! రైటో రాంగో యింతకాలం జరిగిపోయింది. ఈ బ్రతుకు యిలాగే ముగిసిపోతే... ఎవరికీ భారముండదు..."

"అది సరేనయ్యా! పెళ్ళికాలేదు ఒప్పుకుంటాను. అయినా ప్రేమ మడుగులో పడలేదని చెప్పగలవా?"

"మడుగులో దిగలేదు, మెరక మీదనుండే మాట్లాడేను! ఆమె నేనంటే లైకింగ్ లైన్‌లోనే వుండేది... అయితే పేరెంట్స్ సేవా విషయంలో నాసిద్ధాంతం ఆమెకు చెప్పాను. నా వ్యక్తిగత ఆలోచనలు, ఆశయాలూ వగైరా పూర్తిగా వివరించాను. పేరెంట్స్ సేవలో కొడుకుల బాధ్యత గురించి వివరిస్తూ ఉపన్యాసం దంచాను. అంతే... మనసులో ఏమనుకుందో ఏమో! మళ్ళీ కలుస్తానని చెప్పి వెళ్ళిపోయింది... ఇది నాకు ముప్పయి సంవత్సరాల వయసులో ముచ్చట! ప్రస్తుతం అరవై సమీపం! నేటివరకు ఆమె తిరిగి వచ్చింది లేదు. నేను ఆమెను గూర్చి

ఆరా తీసిందీ లేదు... బహుశా, యిప్పటికి ఆమె అమ్మమ్మ/నాయనమ్మ కాకుండా వుంటుందా?... ఏమోలెండి... ఆ మాజీ వూసులెందుకుగాని... మనసులోమాట... యీ షష్ఠిపూర్తిగాడికి 'బ్రైడ్' లభిస్తుందంటారా?"

"భలేవాడివయ్యా! సెవెంటీ ప్లస్–ఎయిటీ ఎప్రోచింగ్‌వారే... 'ఉడ్‌బి'లుగా కళ్యాణమండపాలను అద్దెకు అడుగుతోంటే... అరవైవాడివి నీవేంటయ్యా బాబూ పల్స్ డ్రాప్‌గా మాట్లాడతావ్?"

"సరే'నంటే నీకు సరిజోడీని తెస్తాను..."

"మీ మేలు మర్చిపోను. అలాకాస్త కుదరెయ్యండి బాబూ మీకు పుణ్యముంటుంది."

"తీరా పీటేసింతరువాత కూర్చోలేనంటే... కుదరదు. ఆడపోలీసుల్ని పిలవాల్సస్తుంది" బాగా ఆలోచనచేసి, స్ట్రాంగ్ నిర్ణయం చెప్పండి!"

"మీరేంటండీ బాబూ! పెళ్ళిళ్ళ పేరయ్యల బ్యూరో సభ్యులుగా వున్నారు? మీసరదా జోక్‌కు నాడమ్మీ ఓకె!... అది అంతవరకే!... ఈజీవితం యిలాగా గడిచిపోతుంది. వృద్ధాప్యమంటారా? నిజమే అది మహా భయంకరమైంది. అయినా, సమాజంలో మానవత్వం పూర్తిగ మాసిపోలేదుకదా!" ఆధైర్యంతోనే, జీవితాన్ని గడిపేస్తాను."

"నాదొక సలహా! ఆస్తి విషయంలో మీచెల్లెలితో యిబ్బంది పడేకంటే... దానిని ఏదైనా అనాధశరణాలయానికో లేక

వృద్ధాశ్రమ స్థాపనకో వినియోగిస్తే నీకూ జీవితం 'సేవా' దృష్టితోనే గడిచిపోతుంది గదా! అలా చేస్తే బావుంటుందేమో ఆలోచన చెయ్యి!"

"మంచి ఆలోచన అలాగే చేస్తాను. మీసహకారం కావాలి."

"అలాగే ! మళ్ళీ కలుస్తాను... వస్తా... ప్రశాంతంగవుండు."